అనుదినం... జనస్వరం
www.navatelangana.com
# నవతెలంగాణ
శుక్రవారం 21-03-2025 సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 11 సంచిక : 79 Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar 14 పేజీలు వెల : 6.50

## గాజాపై భూతల దాడులు

**ఇదే చివరి హెచ్చరిక : ఇజ్రాయిల్**

గురువారం నాటి దాడుల్లో
85మంది మృతి
మూడు రోజుల్లో 200మంది
చిన్నారులు కన్నుమూత



వివరాలు 13లో..

## ఉభయ సభలకు తమిళ ఎంపీల టీషర్టుల సెగ

**డీలిమిటేషన్ అంశంపై నినాదాలు**

కొనసాగిన వాయిదాల పర్వం
తగ్గేదే లేదంటున్న డీఎంకే ఎంపీలు




నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

తమిళనాడు ఎంపీలు ధరించిన టీ షర్టులే పార్లమెంటు నిర్వహణకు అడ్డంకిగా మారాయి. వారు ధరించిన టీ షర్టులపై "న్యాయమైన డీలిమిటేషన్.. తమిళనాడు పోరాడుతుంది.. తమిళనాడు గెలుస్తుంది" అనే నినాదం ఉంది. ఆ నినాదాలున్న టీషర్టులతో వారు సభల్లో ఉంటే కార్యకలాపాలు కొనసాగవని, వాటిని తొలగిస్తేనే సభ నిర్వహిస్తామని లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మెన్ సభలు వాయిదా వేశారు.

గురువారం ఉభయ సభలకు చెందిన డీఎంకే ఎంపీలు డీలిమిటేషన్ అంశంపై నినాదం రాసి ఉన్న టీ-షర్టులు ధరించి పార్లమెంటుకు హాజరై, నిరసన వ్యక్తం చేశారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అభ్యంతరం తెలిపారు. కొంతమంది సభ్యులు సభా మర్యాదలు, నియమాలను ఉల్లంఘిస్తున్నారన్నారు. సభా సభ్యుల ప్రవర్తనకు సంబంధించి 349వ నియమాన్ని ఎత్తిచూపారు. టీ-షర్టులు మార్చిన తర్వాతే కార్యకలాపాలు ప్రారంభిస్తానని స్పీకర్ ఓం బిర్లా స్పష్టం చేస్తూ మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. సభ తిరిగి ప్రారంభమైనప్పుడూ వారు టీ-షర్టులతోనే సభకు వచ్చారు. మధ్యాహ్నం 2 గంటల వరకు మళ్లీ వాయిదా వేశారు. అనంతరం ప్రారంభమైన సభలోనూ డీఎంకే ఎంపీలు టీషర్టులతోనే హాజరయ్యారు. దీంతో సభను శుక్రవారానికి వాయిదా వేశారు. మూడు, నాలుగు నిమిషాల్లోనే సభ నేటికి వాయిదా పడింది. రాజ్యసభలోనూ ఇలాంటి పరిస్థితే నెలకొంది. డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో పాటు, తమిళనాడును అవమానించిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు రాసిన దుస్తులనూ కొంతమంది ఎంపీలు ధరించి వచ్చారు. వారిని గమనించిన రాజ్యసభ చైర్మెన్ జగదీప్ ధన్కర్ సభా కార్యకలాపాలను గంటసేపు వాయిదా వేస్తున్నట్టు ...13లో




# దండకారణ్యం రక్తసిక్తం

**125కు పైగా గ్రామాల్లో హిడ్మా కోసం సెర్చ్ ఆపరేషన్**



**ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో 30 మంది మావోయిస్టులు మృతి**

- డీఆర్‌జీ జవాన్ కూడా
- మూడు నెలల్లో 77 మంది హతం

నవతెలంగాణ- చర్ల

పచ్చటి అడవులు రక్తసిక్తమయ్యాయి. తాజాగా సరిహద్దు ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, కాంకేర్ జిల్లాల్లో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్‌లో 30 మంది మావోయిస్టులు మృతి చెందారు. కాల్పుల్లో ఓ డీఆర్ జీ జవాన్ ప్రాణాలు కోల్పోయారు. 2026 నాటికి మావోయిస్టుల్లేకుండా చేయాలనే కేంద్రహెూంశాఖ మంత్రి అమిత్‌షా ఆదేశాలతో.. దండకారణ్యంలోని ప్రజలకు కంటిమీద కునుకులేకుండా పోతోంది. ఇదిలా ఉండగా మావోయిస్టుల ఏరివేత పేరిట కొనసాగుతున్న ఎన్‌కౌంటర్లపై ప్రజాసంఘాలు, పౌరసమాజం నుంచి పలు అనుమానాలు వ్యక్తమవుతూనే ఉన్నాయి.

**ఏం జరిగింది..?**

బీజాపూర్, దంతెవాడ సరిహద్దు గంగలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్ కోసం ఓ ఉమ్మడి బృందం బయలుదేరింది. సమీపంలోని అటవీ ప్రాంతంలో నుంచి కాల్పుల మోత వినిపించగా.. భద్రతా దళాల ఎదురు కాల్పులతో ఆ పరిసర ప్రాంతం దద్దరిల్లింది. ఎన్‌కౌంటర్ జరిగిన స్థలంలో 26 మంది మావోయిస్టులు మృతి చెందారు. కాంకేర్ జిల్లా అడవుల్లో జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. మృతదేహాలను సైనికులు ...5లో

## ఉత్తరాదిలో ఉపాధి ఉంటే దక్షిణాదికి వలసలెందుకు?

**నిరుద్యోగం 6.1 శాతానికి తగ్గుదల**



సీఎం పదవి చేపట్టినప్పటికంటే
జెడ్పీటీసీ అయినప్పుడే ఎక్కువగా ఆనందించా
పదేండ్లలో చేయలేదు కాబట్టే మాకు అవకాశం
పదవి పోగానే కూతురుకు ఎమ్మెల్సీ,
బంధువుకు ప్రణాళిక సంఘం వైస్ చైర్మెన్
అప్పు పుట్టని విధంగా తెలంగాణను మార్చిపోయిండు
పెండింగ్‌లో రూ.8 వేల కోట్ల రిటైర్డ్ బెనిఫిట్స్
మేం ధర్నాలు, నిరసనలు తెలుపుకునే స్వేచ్ఛనిచ్చాం
బీఆర్ఎస్ పాలనలో ఇసుకపై రూ.7 వేల కోట్ల దోపిడీ
రోజూ సచివాలయానికి
వచ్చే మాకు పాలనపై పట్టులేదనడం సరిగాదు
నల్లధనాన్ని ఇం'ధనం'గా
మార్చి సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారాలు :
పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్ శాఖల్లో
922 మందికి కారుణ్య నియామక పత్రాల అందజేతలో
సీఎం రేవంత్‌రెడ్డి

వివరాలు 5లో..

## ఇండ్లు లేని నిరుపేదలు 30 లక్షల మంది

**రూ.8వేల కోట్లు ఏ మూలకూ సరిపోవు**



ఇతర రంగాలు, పథకాలకు తగిన బడ్జెట్ ఏదీ..?
మ్యానిఫెస్టో హామీలు ఎక్కడ! : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

నవ తెలంగాణ -వనపర్తి


రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేదలు 30 లక్షల మంది ఉన్నారని, ఈ బడ్జెట్లో వారికి రూ.8000 కోట్లు మాత్రమే కేటాయించారని, ఈ నిధులు ఏ మూలకూ సరిపోవని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో గురువారం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.బాల్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ విలేకరులతో మాట్లాడుతూ.. గత బడ్జెట్‌కు, ఈ బడ్జెట్‌కి ఏమీ తేడా లేదన్నారు. పెరుగుతున్న పెన్షన్లకు నిధులు కేటాయించలేదని, కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన ఎస్సీ, ఎస్టీలకు రూ.12 లక్షలకు సంబంధించి ...13లో

# మస్క్ గుప్పెట్లోకి టెలికాం?

**స్టార్‌లింక్ కోసం భారత్‌లో మారుతున్న సమీకరణాలు**

- ఇప్పటికీ అనేక ప్రశ్నలు, సందేహాలు
- కేంద్ర ప్రభుత్వంపై ఎలన్ 'ఎక్స్' దావా

**న్యూఢిల్లీ:** రెండు ప్రముఖ భారతీయ కంపెనీలైన రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్‌లతో స్టార్‌లింక్ ఒప్పంద ప్రకటనలు అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ఈ ఒప్పందం ద్వారా ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడైన ఎలన్‌మస్క్ టెలికాం రంగంలో గుత్తాధిపత్యం సాధించనున్నారా? వేలం లేకుండా స్టార్‌లింక్‌కు శాటిలైట్ స్పెక్ట్రమ్ దక్కుతుందా? దేశంలో కీలకమైన వనరు అయినటువంటి శాటిలైట్ స్పెక్ట్రమ్‌ను భారత ప్రభుత్వం ఈ విధంగా వాణిజ్య కార్యకలాపాల కోసం ఇవ్వనుందా? అనే సందేహాలు తీవ్రమవుతున్నాయి. జియో, ఎయిర్‌టెల్‌లతో ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత స్టార్‌లింక్‌కు స్పెక్ట్రమ్ కేటాయింపు జరగనున్నట్టు తెలుస్తున్నది. మోడీ సర్కారు ఇప్పటికీ అటువైపుగా చర్యలు తీసుకుంటున్నదనే వాదనలూ ఉన్నాయి. దేశంలోని టెలికాం రంగంలో ప్రస్తుతం జియో, ఎయిర్‌టెల్‌ల ఆధిపత్యం నడుస్తున్నది. ఆ తర్వాతి స్థానంలో వొడాఫోన్ ఐడియా, ప్రభుత్వ యాజమాన్యంలోని బీఎస్ఎన్ఎల్‌లు ఉన్నాయి. అయితే, వీటి మధ్య ఉన్న తేడా చాలా ఎక్కువే. వేలం లేకుండా ప్రభుత్వం ద్వారా నేరుగా శాటిలైట్ స్పెక్ట్రమ్ కేటాయింపులు జరిగితే.. మస్క్ ఆధిపత్యం పెరుగుతుందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. కీలకమైన కమ్యూనికేషన్ సేవల కోసం రెండు ప్రముఖ టెలికాం కంపెనీలు ఒక యూఎస్ కంపెనీపై ఆధారపడాల్సి ఉంటుందని అంటున్నారు. ఇది భారతదేశ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తికి విరుద్ధమని చెప్తున్నారు. ఒక స్వతంత్ర పాత్ర పోషించాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం.. దాని వ్యూహాత్మక టెలికాం వనరులను విదేశీ సంస్థ నియంత్రణలోకి వెళ్లేలా చేయటం ఎంతవరకు సబబు అని ప్రశ్నిస్తున్నారు. భారతదేశ ప్రధాన టెలికాం సంస్థలు, స్టార్‌లింక్ మధ్య అలాంటి భాగస్వామ్యాన్ని అనుమతిస్తే.. భారత టెలికాం సేవలను (ఉపగ్రహ ఫీడ్‌ను) మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ నియంత్రించే అవకాశాలే ఎక్కువని చెప్తున్నారు. జియో, ఎయిర్‌టెల్‌లు రెండూ గతంలో స్పేస్‌ఎక్స్ స్టార్‌లింక్ ఉపగ్రహ ఆధారిత కమ్యూనికేషన్ సేవల్లోకి ప్రవేశించటాన్ని వ్యతిరేకించాయి. అయితే, భారత ప్రధాని మోడీ యూఎస్ పర్యటన తర్వాత.. జియో, ఎయిర్‌టెల్‌లు పూర్తిగా తమ వైఖరిని మార్చుకున్నాయి. స్పేస్‌ఎక్స్ స్టార్‌లింక్‌తో ...6లో



**టాప్ ఫోర్ కంపెనీల మార్కెట్ షేర్**

| కంపెనీ | శాతం | వినియోగదారులు(మిలియన్లలో) |
|---|---|---|
| రిలయన్స్ | 40.4 | 465.1 |
| భారతీ ఎయిర్‌టెల్ | 33.5 | 385.3 |
| వోడాఫోన్, ఐడియా(వీఐ) | 18.0 | 207.3 |
| బీఎస్ఎన్ఎల్ | 8.0 | 91.7 |

## 13 నెలలు..ఏడు హామీలకోసం ఉద్యమం



కేంద్రమంత్రితో చర్చలకు పిలిచి..మరోవైపు అన్నదాతపై అరాచకం
శంభు, ఖనౌరీ సరిహద్దుల్లో రైతు శిబిరాల తొలగింపు
రోడ్లపై చెల్లాచెదురుగా వస్తువులు
పోలీసుల అదుపులో వందమంది రైతులు, రైతు నేతలు
సమర్థించుకున్న పంజాబ్ మంత్రి

వివరాలు 6లో..

## భారత్ సుంకాలు తగ్గిస్తుందనుకుంటున్నా



డొనాల్డ్ ట్రంప్

వాషింగ్టన్ : అమెరికా వస్తువులపై భారత్ విధించే సుంకాల పై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తాజాగా స్పందించారు. గతంలో ఓ సందర్భంలో ట్రంప్ మాట్లాడుతూ భారత్ పన్నులు తగ్గించేందుకు అంగీకరించిందని.. అదంతా తన ఘనతే అని చెప్పిన విషయం తెలిసిందే. అయితే, ఇప్పుడు మాత్రం తమ వస్తువులపై విధించే ...13లో

## బీఆర్ఎస్ ఓటమికి అసూయ, ద్వేషమే కారణం..



రేవంత్‌రెడ్డి జాక్‌పాట్ సీఎం
బడ్జెట్ అంతా బోగస్.. ఆరు గ్యారంటీలు గోవిందా..
కాంగ్రెస్‌తో కరువు వచ్చింది
రాష్ట్రం డబ్బుల మూటలు ఢిల్లీకి....
ఏప్రిల్ 27న వరంగల్ సభను విజయవంతం చేయాలి :
సూర్యాపేటలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

13లో..

# మూతపడుతున్న ఎంఎస్ఎంఈలు

**ఈ ఆర్థిక సంవత్సరంలోనే 35 వేలకుపైగా పరిశ్రమలకు తాళాలు**

మహారాష్ట్రలో 8,472 కంపెనీలు మూసివేత
ఆ తర్వాతి స్థానాల్లో తమిళనాడు, గుజరాత్, రాజస్థాన్, కర్నాటక

**న్యూఢిల్లీ :** దేశంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఫిబ్రవరి నెలాఖరు నాటికి 35,567 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు) మూతబడ్డాయి. ఇవన్నీ కేంద్ర ప్రభుత్వ ఉద్యమ్ పోర్టల్‌లో నమోదైనవే. ఎంఎస్ఎంఈల శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లజే రాజ్యసభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ఈ విషయాన్ని తెలియజేశారు. అయితే ఎంఎస్ఎంఈలు ఇంత పెద్ద సంఖ్యలో మూతపడడానికి కారణమేమిటో ఆమె వివరించలేదు. 2020 జులై 1వ తేదీన పోర్టల్ ప్రారంభం కాగా అప్పటి నుంచి 75,082 ఎంఎస్ఎంఈలు మూతపడ్డాయని మాత్రం ఆమె తెలిపారు. ఇప్పటి వరకూ మూతబడిన మొత్తం ఎంఎస్ఎంఈలలో 47.4 శాతం ఒక్క ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే మూతపడడం గమనార్హం. 2023-24తో పోలిస్తే ఈ ఏడాది దాదాపు రెట్టింపు పరిశ్రమలకు తాళం పడింది. గత సంవత్సరం 19,828 పరిశ్రమలు మూతబడ్డాయి. ఈ ఏడాది ఎంఎస్ఎంఈలు ఎక్కువ సంఖ్యలో మూతబడిన రాష్ట్రం మహారాష్ట్ర. ఆ రాష్ట్రంలో 8,472 పరిశ్రమలను మూసేశారు. తమిళనాడు (4,412), గుజరాత్ (3,148), రాజస్థాన్ (2,989), కర్నాటక (2,010) తర్వాతి స్థానాలలో నిలిచాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మార్చి నెలకు సంబంధించిన సమాచారం రావాల్సి ఉన్నందున మూతపడిన పరిశ్రమల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. వ్యాపారాన్ని సరళతరం చేసేందుకు ఉద్యమ్ పోర్టల్‌ను ప్రభుత్వం ప్రారంభించింది. ఇటీవలి కాలంలో సులభతర వ్యాపారాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ముఖ్యంగా ఎంఎస్ఎంఈ రంగానికి బడ్జెట్‌లో అనేక ప్రోత్సాహకాలు, రాయితీలు కల్పించారు. పెట్టుబడులు, టర్నోవర్ పరిమితులను పెంచారు. రుణ గ్యారంటీలను కూడా పెంచడం జరిగింది. అయినప్పటికీ వాటికి తాళాలు పడుతూనే ఉన్నాయి. ఫిబ్రవరి 28వ తేదీ వరకూ వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో రిజిస్ట్రరైన ఎంఎస్ఎంఈలు 6.05 కోట్లు. కోవిడ్-19 తర్వాత ఎంఎస్ఎంఈలు అధిక సంఖ్యలో తమ కార్యకలాపాలు నిలిపివేశాయి. అయితే ఈ మూసివేతల కారణంగా ఎంత మంది ఉపాధి కోల్పోయారన్న దానిపై ఎలాంటి గణాంకాలు అందుబాటులో లేవు. ఎంఎస్ఎంఈ శాఖ ...13లో




## బెట్టింగ్ యాప్ ప్రమోషన్స్..

**మియాపూర్ పీఎస్‌లో 25 మందిపై కేసు నమోదు**

వారిలో సినీ ప్రముఖులు కూడా..



నవతెలంగాణ-మియాపూర్

బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ చేసిన సినీ ప్రముఖులపై రంగారెడ్డి జిల్లా మియాపూర్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్ విషయంలో సెలబ్రిటీల పాత్ర సంచలనంగా మారిన విషయం తెలిసిందే. దీనిపై ఇప్పటికే చాలా మంది సెలబ్రిటీలపై కేసులు నమోదు కాగా.. విచారణను సైతం ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో తాజాగా ప్రమోద్‌శర్మ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుమారు 25 మంది సినీ సెలబ్రిటీలపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్ చేస్తున్న సెలబ్రిటీలపై చర్యలు తీసుకోవాలని ప్రమోద్ ...5లో

# రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అన్యాయం

- ఫీజు రీయింబర్స్‌మెంట్, మెస్ చార్జీలపై స్పష్టత కరువు
- వర్సిటీల అభివృద్ధికి నిధులు శూన్యం
- నేడు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు ఎస్ఎఫ్ఐ పిలుపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ విమర్శించింది. గతంలో పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వ ఆనవాయితీనే కాంగ్రెస్ కొనసాగించిందని తెలిపింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 7.57 శాతం నిధులను కేటాయించిందని వివరించారు. గతం కంటే స్వల్పంగా 0.2 శాతం నిధులను పెంచిందని తెలిపారు. గత బడ్జెట్లో విద్యారంగానికి రూ.21,292 కోట్లు కేటాయించిందనీ, ఈ బడ్జెట్‌లో రూ.23,108 కోట్లు కేటాయించిందని వివరించారు. ఈ నిధులతో ప్రస్తుతం ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధికి నోచుకోబోదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన మ్యానిఫెస్టోలో ప్రతి మండలంలో తెలంగాణ మోడల్ ఇంటర్నేషనల్ పాఠశాలలు ఏర్పాటు. చేస్తామని చెప్పిందని గుర్తు చేశారు. బడ్జెట్‌లో ఆ ఊసేలేదని తెలిపారు. ప్రతి రెండు గ్రామాలకు ఒక గురుకులం అని అన్నారనీ, దాని గురించి ప్రస్తావన లేదని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయాల అభివృద్ధి రాష్ట్రంలో రూ.450 కోట్లతో ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. పాఠశాల విద్యారంగంలో ఖాళీల భర్తీ, మధ్యాహ్న భోజనం నిధులు, ఏకోపాధ్యాయ పాఠశాలలు, నూతన భవనాలు, లైబ్రరీ, మూత్రశాలలు, మౌలిక సదుపాయాల కోసం ఈ నిధులు సరిపోవని తెలిపారు. గురుకులాల నిర్మాణం కోసం కూడా కనీస నిధుల్లేవని పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 662 పైగా గురుకులాలకు సొంత భవనాలు లేవని తెలిపారు. ఉన్న గురుకులాలు కూడా సరైన మౌలిక సదుపాయాల్లేవంటూ స్వయంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారని పేర్కొన్నారు. కానీ వాటి అభివృద్ధి కోసం ఎలాంటి నిధులను కేటాయించలేదని విమర్శించారు. 40 శాతం డైట్ చార్జీలను పెంచామంటూ ఘనంగా చెప్తున్న ప్రభుత్వం క్షేత్రస్థాయిలో మాత్రం అసలు ఈ మెనూ అమలు చేయడం లేదని తెలిపారు. ఆరేండ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్ మెంట్స్ బకాయిలు రూ.8,258 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. వాటి విడుదల కోసం నిధులను కేటాయించలేదని తెలిపారు. విద్యారంగానికి 15 శాతం నిధులను కేటాయిస్తామంటూ కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కానీ 7.57 శాతం నిధులు మాత్రమే కేటాయించిందని విమర్శించారు. బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి నిధులను పెంచి ప్రభుత్వ విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కేటాయింపులకు నిరసనగా శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టనున్నట్టు వారు పిలుపునిచ్చారు.

## ఓయూలో విధించిన
# ఆంక్షలు ఎత్తివేయాలి

కేవీపీఎస్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఉస్మానియా యూనివర్సిటీలో నిరసనలు, ధర్నాలు, రాస్తారోకోలను నిషేధిస్తూ వైస్ ఛాన్సలర్ జారీ చేసిన సర్క్యులర్‌ను తక్షణమే ఉపసంహరించుకొని యూనివర్సిటీ ప్రజాస్వామిక హక్కులను రక్షించాలని కేవీపీఎస్ రాష్ట్ర రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం ప్రదాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. వీసీ విడుదల చేసిన సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని విద్యార్థులు చేస్తున్న ఆందోళనలకు కేవీపీఎస్ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని పేర్కొన్నారు. ఉస్మానియాకు దేశంలోనే ఒక ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. వాటి సమస్యలపై నినదించే గొంతులు నొక్కేందుకే ఆ సర్క్యులర్ విడుదల చేశారని ఆరోపించారు.అది రాజ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని తెలిపారు. తెలంగాణ ఉద్యమం, వామపక్ష పోరాటాలు, విద్యార్థుల సమస్యలపై జరిగిన పోరాటాల పురిటిగడ్డగా ఆ యూనివర్సిటీ వెలుగొందిందని గుర్తు చేశారు. మహనీయుల జయంతులు, వర్ధంతులు సామాజిక న్యాయంకోసం, మతోన్మాదానికి వ్యతిరేకంగా అనేక భావాలపై చర్చలు జరుగుతున్న కేంద్రంగా ఉందని తెలిపారు. ప్రజలను చైతన్యం చేసే చరిత్ర కల్గిన యూనివర్సిటీగా ఉన్నదనీ, అక్కడ నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కునీ, విద్యార్థుల వాక్ స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛను హరించే విధంగా ఉన్న అప్రజాస్వామిక సర్క్యులర్‌ను తక్షణమే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు.

# పట్టణ ప్రాంతాల్లో ఉపాధికి నిధులేవి?

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఉపాధి పనిని పట్టణ ప్రాంతాల్లో అమలు చేసేందుకు కావాల్సిన నిధులను బడ్జెట్‌లో ఎందుకు కేటాయించలేదని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి నాగయ్య, ఆర్ వెంకట్రాములు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్భాటంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.3, 04, 965 కోట్ల రాష్ట్ర బడ్జెట్‌లో పట్టణ ప్రాంతాలకు ఉపాధి పనిని విస్తరింపజేసి, 180 రోజులు పని కల్పిస్తామని చెప్పిన మాట నీటి మూటగా మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక పింఛన్లు రూ. రెండు వేల నుంచి రూ. నాలుగు వేలకు పెంచుతామనీ, ఇండ్ల స్థలాలు లేని పేదలకు భూములు కొనిస్తామనీ, కౌలు రైతులకు రూ.15వేల రైతు భరోసా ఇస్తామంటూ కాంగ్రెస్ ఇచ్చిన ఎన్నికల హామీల అమలు గురించి బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం ప్రభుత్వ మోసకారి విధానానికి నిదర్శనమని విమర్శించారు. బడ్జెట్‌ను సవరించి ఆరు గ్యారెంటీల అమలుకు, పేదల సంక్షేమానికి తగిన ప్రతిపాదనలు పెట్టాలని డిమాండ్ చేశారు. భూమిలేని వ్యవసాయ కార్మికులకు నిధులు పెంచాలని కోరారు. గృహ నిర్మాణంకు తగినన్ని నిధులు కేటాయించలేదని వాపోయారు. రాష్ట్రంలో లక్ష మంది పేదలు గుడిసెలేసుకుని జీవిస్తున్నారనీ, వీరి ప్రస్తావన బడ్జెట్‌లో లేకపోవటమేంటని ప్రశ్నించారు. వీరికి పక్కా ఇండ్లు అవసరం లేదా? అని ప్రశ్నించారు. పౌర సరఫరాలకు కేటాయింపులు చేసినప్పటికీ, కో-ఆపరేటివ్ ద్వారా మీని సూపర్ మార్కెట్లు రేషన్ షాపులను నడిపి ప్రజా పంపిణీని బలోపేతం చేస్తామనే హామీ ఈ బడ్జెట్ ద్వారా సాధ్యం కాదని పేర్కొన్నారు. బడ్జెట్ రూపకల్పనే పేదలను, వ్యవసాయ కార్మికులను విస్మరించేదిగా ఉందని విమర్శించారు. దాన్ని తగిన విధంగా సవరించాలని డిమాండ్ చేశారు.

# 15 బెట్టింగ్స్ యాప్స్‌కు ప్రమోషన్ చేశా..!

## ఒక్కో వీడియోకు రూ.90 వేలు ఇచ్చారు..!

- పోలీసుల విచారణలో యాంకర్ విష్ణుప్రియ
- స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసిన పంజాగుట్ట పోలీసులు

నవతెలంగాణ-బంజారాహిల్స్

బెట్టింగ్ యాప్స్ కేసుపై పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. ఈ యాప్స్‌ను ప్రమోట్ చేసిన ఒక్కొక్క సెలబ్రిటీకి నోటీసులు పంపిస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే యాంకర్ విష్ణు ప్రియకు హైదరాబాద్ పంజాగుట్ట పోలీసులు నోటీసులు జారీ చేయగా, ఆమె గురువారం తన అడ్వకేట్‌తో కలిసి విచారణకు హాజరయ్యారు. నాలుగు గంటలకుపైగా జరిగిన విచారణలో ఆమె చేసిన బెట్టింగ్ యాప్స్ ప్రయోషన్ జాబితాను పోలీసులు అందజేసినట్టు సమాచారం. అలాగే, విచారణ సందర్భంగా విష్ణుప్రియ సంచలన విషయాలను వెల్లడించినట్టు తెలిసింది. ఆమె మొత్తం 15 బెట్టింగ్స్ యాప్స్‌కు భారీగా డబ్బులు తీసుకుని ప్రమోషన్ చేసినట్టుగా అంగీకరించినట్టు సమాచారం. ఒక్కో వీడియోకు బెట్టింగ్ యాప్ నిర్వాహకులు తనకు రూ.90 వేలు ఇచ్చినట్టుగా ఆమె వెల్లడించినట్టు తెలిసింది. ఈ మేరకు విష్ణుప్రియ స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసిన పంజాగుట్ట పోలీసులు ఆమె ఫోన్‌ను సీజ్ చేశారని సమాచారం.

# ముస్లింల విద్యకు నిధులేవి ?

## మదర్సాలు, వక్ఫ్ పథకాలకు కేటాయింపులు నాస్తి

## అక్షరాస్యతలో వెనుకబడినా ప్రభుత్వ ఆదరణకు నోచని మైనారిటీలు

కక్ష సాధింపు చర్యలకు దిగుతున్న బీజేపీ పాలిత రాష్ట్రాలు



**న్యూఢిల్లీ :** ముస్లిం విద్యార్థుల కోసం ఉద్దేశించిన పథకాలకు నరేంద్ర మోడీ ప్రభుత్వం గత నాలుగు సంవత్సరాలుగా బడ్జెట్ కేటాయింపులను పూర్తిగా తగ్గించి వేస్తోంది. ఇదేదో ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణ కాదు. మదర్సాలు, వక్ఫ్ పథకాలకు బడ్జెటరీ కేటాయింపులు, వ్యయంపై తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ డెరెక్ ఓ బ్రియాన్ అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం పార్లమెంటులో ఇచ్చిన సమాధానాన్ని పరిశీలిస్తే ఈ విషయం అర్థమవుతుంది. మదర్సాలు/మైనారిటీ సంస్థల్లో విద్యను అందించేందుకు ఉద్దేశించిన పథకానికి (ఎస్‌పీఈఎంఎం) 2021-22లో రూ.174 కోట్లు కేటాయించగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆ మొత్తం నామమాత్రంగా 0.01 కోట్లకు తగ్గిపోయింది. 2021-22లో మినహా మిగిలిన బడ్జెట్లలో కేటాయించిన అరకొర నిధులను సైతం ఖర్చు చేయలేదు.

### తగ్గుతున్న కేటాయింపులు

మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్ (సీడబ్ల్యూసీ) ద్వారా రెండు వక్ఫ్ పథకాలు...ఖ్వామీ వక్ఫ్ బోర్డ్ తరఖియాతీ పథకం (క్యూడబ్ల్యూబీటీఎస్), షహరీ వక్ఫ్ సంపత్తి వికాస్ యోజన (ఎస్‌డబ్ల్యూఎస్‌ఎస్‌వై)...అమలు చేస్తోంది. సీడబ్ల్యూసీని పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయనందున వ్యయం తక్కువగా ఉంది' అని కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తన లిఖితపూర్వక సమాధానంలో పార్లమెం టుకు తెలియజేశారు. ఎస్‌పీఈఎంఎంను 2021లో విద్యా శాఖ నుండి మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు బదిలీ చేశారు. ఈ పథకానికి 2021-22 వరకూ మాత్రమే ఆమోదం ఉన్నందున దానిని అప్పటి వరకే అమలు చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. 2021-22లో ఎస్‌పీఈఎంఎంకు రూ.174 కోట్లు కేటాయించగా అందులో రూ.161.53 కోట్లు ఖర్చు చేశారు. ఆ తర్వాతి సంవత్సరాలలో కేటాయింపులు గణ నీయంగా తగ్గిపోయాయి. 2022-23లో రూ.30 కోట్లు, 2023-24లో రూ.5 కోట్లు, 2024-25లో రూ.0.01 కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ నామమాత్రపు కేటాయింపుల్లో కూడా 2022-23లో 0.08 కోట్లు మాత్రమే ఖర్చయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఒక్క రూపాయిని కూడా ఖర్చు చేయలేదు.

### అక్షరాస్యతలో వెనుకంజ

ముస్లింలలో అక్షరాస్యత జాతీయ సగటు కంటే తక్కువగా ఉన్న సమయంలో వారి విద్యా పథకాలకు కేటాయింపులు తగ్గించడం విచారకరం. ఏడు సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయసున్న ముస్లింలలో అక్షరాస్యత రేటు 79.5 శాతం ఉండగా అదే వయసులో ఉన్న అన్ని మతాల వారి అక్షరాస్యత రేటు 80.9 శాతం. 2019-24 మధ్య కాలానికి సంబంధించి పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నివేదికలు చెబుతున్న దాని ప్రకారం ముస్లింలలో అక్షరాస్యత రేటు 75.9 శాతం నుండి 79.5 శాతానికి పెరిగింది. అయితే ఈ కాలంలో నమోదైన జాతీయ సగటు కంటే ఇది తక్కువే. గత రెండు దశాబ్దాలుగా ఇదే ధోరణి కొనసాగుతోంది. 2001 జనగణన ప్రకారం ఏడు సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయసున్న ముస్లింలలో అక్షరాస్యత రేటు 59.1 శాతం (జాతీయ రేటు 64.8 శాతం) కాగా 2011 జనగణనలో అది 68.5 శాతానికి (జాతీయ రేటు 73 శాతం) పెరిగింది.

2019-20తో పోలిస్తే ఉన్నత విద్యలో ముస్లింల ప్రవేశం 8 శాతం మేర తగ్గిందని 2020-21 సర్వే తెలిపింది. ఉన్నత విద్యలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల కంటే కూడా ముస్లింలు వెనుకబడి ఉన్నారు. ఉన్నత విద్యలో ముస్లిం మహిళల ప్రవేశం 2016-17, 2019-20 మధ్య పెరిగినప్పటికీ 2020-21లో పడిపోయింది. విద్యార్థుల్లో ముస్లింల శాతం ఆరవ తరగతి నుండే తగ్గుతూ వస్తోంది. 11, 12 తరగతులకు వచ్చే సరికి అది మరింతగా తగ్గుతోంది. బీహార్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ముస్లిం విద్యార్థుల సంఖ్య బాగా తక్కువగా ఉండగా అస్సాం, పశ్చిమ బెంగాల్‌లో డ్రాపవుట్లు అధికంగా ఉంటున్నాయి. పాఠశాల సెకండరీ స్థాయిలోనే 18.64 శాతం మంది ముస్లిం విద్యార్థులు చదువులకు స్వస్తి చెబుతున్నారు.

### ఎస్‌పీఈఎంఎం అంటే...

ముస్లింలకు ఉద్దేశించిన విద్యా పథకాలలో మరింత మంది మైనారిటీలను లబ్దిదారులుగా చేర్చేందుకు నరేంద్ర మోడీ ప్రభుత్వం 2014-15లో ఎస్‌పీఈఎంఎంను ప్రారంభించింది. మదర్సాలు కేవలం మతపరమైన విద్యను మాత్రమే అందిస్తున్నాయని భావించిన మోడీ ప్రభుత్వం ఎస్‌పీఈఎంఎం ద్వారా ముస్లిం విద్యార్థులకు ఆధునిక సబ్జెక్టులు కూడా బోధించాలని, వారికి ఉపాధ్యాయ శిక్షణ అందించాలని, మదర్సా బోర్డులను పటిష్టవంతం చేయాలని, మైనారిటీ విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాలని, విద్యా కార్యక్రమాల పట్ల ముస్లింలలో అవగాహన పెంచాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇతర కేంద్ర పథకాలకు నిధులు ఎలా అందజేస్తున్నారో ఎస్‌పీఈఎంఎంకు కూడా అలాగే ఇస్తున్నారు. గుర్తింపు పొందిన పాఠశాల విద్యా బోర్డుకు అనుబంధంగా ఉండే మదర్సాలకు ఆర్థిక సాయం లభిస్తోంది. ఆధునిక సబ్జెక్టులు బోధించే గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయులకు నెలకు రూ.6,000, పోస్ట్ గ్రాడ్యుయేట్లకు రూ.12,000 జీతం ఇస్తారు. ఎస్‌పీఈఎంఎంకు 2014-15 నుండే కేటాయింపులు మొదలయ్యాయి. ఆ ఏడాది రూ.194 కోట్లు కేటాయించారు. 2016-17, 2017-18లో రూ.120 కోట్ల చొప్పున కేటాయింపులు జరిగాయి. 2019-20లో కూడా అవే కేటాయింపులు. 2021-22లో బడ్జెటరీ కేటాయింపులు పెంచినప్పటికీ ఆ తర్వాత దారుణంగా తగ్గిపోయాయి.

### మదర్సాలే లక్ష్యంగా...

ముస్లింలలో విద్య పరిస్థితి ఇంత దారుణంగా ఉంటుంటే బీజేపీ పాలిత రాష్ట్రాలు మదర్సాలను లక్ష్యంగా చేసుకొంటున్నాయి. 2021లో హిమంత బిశ్వశర్మ నేతృత్వంలోని అస్సాం ప్రభుత్వం మదర్సా విద్యకు సంబంధించిన రెండు చట్టాలను రద్దు చేసింది. దీంతో ప్రభుత్వ నిధులతో నడిచే మదర్సాలు మూతపడ్డాయి. వీటిని జనరల్ పాఠశాలలుగా మార్చేశారు. ముస్లిం జనాభా అధికంగా ఉన్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం మదర్సా విద్యా బోర్డు చట్టాన్ని రద్దు చేయాలని చూస్తోంది. చట్టం రాజ్యాంగబద్ధంగానే ఉన్నదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పిన కొద్ది రోజులకే ప్రభుత్వం దానిని రద్దు చేయాలని ప్రతిపాదించింది. మదర్సాలలో చిన్నారులు సరైన విద్యను పొందలేరని బాలల హక్కుల రక్షణకు సంబంధించిన జాతీయ కమిషన్ సుప్రీంకోర్టుకు తెలియజేసింది. ఈ సంస్థల్లో బోధించే పాఠ్యపుస్తకాలు ఇస్లాంను కీర్తిస్తాయని చెప్పింది. బీహార్, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలలోని మదర్సాలలో చదువుకుంటున్న ఇతర మతాల విద్యార్థులు వాటిపై ఆరోపణలు చేస్తున్నారని వివరించింది. ఇవన్నీ ఇలా ఉంటే వక్ఫ్ (సవరణ) బిల్లును ఆమోదించేందుకు ఇప్పుడు పార్లమెంట్ సిద్ధపడుతోంది. ఈ బిల్లు ఆమోదం పొందితే వక్ఫ్ ఆస్తులపై సెంట్రల్ రెగ్యులేటరీ అథారిటీకి మరిన్ని అధికారాలు లభిస్తాయి. వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులు సభ్యులుగా చేరతారు. ప్రస్తుతం మత, ధార్మిక ట్రస్టుల ఆర్థిక సహకారంతో ఈ బోర్డులు నడుస్తున్నాయి. ఇవి దేశంలో మెజారిటీ మదర్సాలను నడుపుతున్నాయి. వక్ఫ్ బోర్డుల అధీనంలో మదర్సాలు సహా అనేక ఆస్తులు ఉన్నాయి. ఇప్పుడవి ఇస్లాం ట్రస్టులకు బదులు కేంద్ర నియంత్రణలోకి వెళ్లిపోతాయి.

---

# విదేశాలకు వెళ్లొద్దు

## అమెరికా ఇమ్మిగ్రేషన్ అధికారుల సూచన



**వాషింగ్టన్ :** హెచ్-1బీ వీసాలు ఉన్న వారు, వారి పిల్లలు, అంతర్జాతీయ విద్యార్థులు, చివరికి గ్రీన్‌కార్డులు ఉన్న వారు సైతం విదేశాలకు వెళ్లవద్దని అమెరికా ఇమ్మిగ్రేషన్ అటార్నీలు సలహా ఇచ్చారు. అమెరికా ప్ర0భుత్వం పర్యాటక నిషేధం విధించిన దేశాల జాబితాలో భారత్ లేనప్పటికీ భయాందోళనలు మాత్రం కొనసాగుతున్నాయి. గ్రీన్‌కార్డులు ఉన్న వారికి అటార్నీలు ఇప్పటికే సూచనలు చేయడం జరిగింది. స్వదేశంలోని అమెరికా కాన్సులేట్‌లో స్టాంపింగ్ ఆలస్యం కావడం, కఠినమైన పరిశీలనలు, సెకండరీ తనిఖీలు, స్వదేశం నుండి తిరిగి వచ్చే వారిని విమానాశ్రయాలలో నిర్బంధించడం వంటి పరిణామాలను ఇందుకు కారణాలుగా చెబుతున్నారు. హెచ్-1బీ వీసాలు లేదా ఎఫ్-1 వీసాలను రెన్యువల్ చేయించుకోవాల్సిన అవసరం ఉన్న వారు అమెరికాను వదిలి వెళ్లే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవాలని సియాటెల్‌కు చెందిన ఇమ్మిగ్రేషన్ అటార్నీ కృపా ఉపాధ్యాయ్ కోరారు. వ్యక్తిగత ఇంటర్వ్యూకు హాజరు కాకుండా సంబంధిత అప్లికేషన్ కేంద్రంలో అవసరమైన పత్రాలు సమర్పించి వీసాలు రెన్యువల్ చేయించుకోవాలని అనుకునే వారి కోసం (దీనినే డ్రాప్‌బాక్స్ అప్పాయింట్‌మెంట్ అంటారు) అమెరికా విదేశాంగ శాఖ నిబంధనలను కఠినతరం చేసింది. ఇదిలావుండగా హెచ్-1బీ వీసాల కోసం గతంలో సమర్పించిన దరఖాస్తులను ఫారిన్ లేబర్ యాక్సెస్ గేట్‌వే (ఫ్లాగ్) వ్యవస్థ నుండి తొలగించే ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. అర్హత కలిగిన ఉద్యోగులను అన్వేషించే అమెరికా కంపెనీలకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతోంది. ఇందులో తాత్కాలిక లేబర్ కండిషన్ దరఖాస్తులే కాకుండా శాశ్వత లేబర్ సర్టిఫికేషన్ దరఖాస్తులు కూడా ఉంటాయి. ఇప్పుడు వీటన్నింటినీ ఫ్లాగ్ వ్యవస్థ నుండి తొలగిస్తున్నారు.

---

## గాంధీ ఆస్పత్రిలో ఎమర్జెన్సీ కోసం

# అదనంగా 30 పడకలు

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

పెరుగుతున్న రోగులను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో అదనంగా 30 పడకలను ఏర్పాటు చేశారు. అత్యవసర విభాగంలో ఏర్పాటు చేసిన బెడ్లను సద్వినియోగం చేసుకుని మెరుగైన సేవలందించేందుకు వీలుగా గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి గురువారం మెడికల్, పారామెడికల్ విభాగాలతో సమావేశం నిర్వహించారు. రోగులకు మరింత మెరుగైన సేవలందించాలని ఆమె పలు సూచనలు చేశారు. అదనంగా ఏర్పాటు చేసిన 30 పడకల్లో 15 బెడ్లను శస్త్ర విభాగం కోసం, మరో 15 బెడ్లను వైద్య చికిత్స విభాగం కోసం కేటాయించినట్టు ఆమె తెలిపారు. ఈ సమావేశంలో ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కె.సునీల్, విభాగాధిపతులు డాక్టర్ ఎల్.సునీల్ కుమార్, డాక్టర్ రాజారామ్, డాక్టర్ వాల్యాతో పాటు పలువురు వైద్య అధికారులు, నర్సింగ్, సాంకేతి, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

---

## అమెరికాలో

# భారత స్కాలర్ నిర్బంధం

- పాలస్తీనాకు మద్దతు ఇచ్చారని ట్రంప్ ప్రభుత్వ ఆరోపణ
- భావ ప్రకటనా స్వేచ్ఛను హరిస్తున్నారు : విమర్శకులు



**వాషింగ్టన్ :** వాషింగ్టన్‌లోని జార్జ్ టౌన్ యూనివర్సిటీకి చెందిన భారతీయ స్కాలర్ బాదర్ ఖాన్ సూరిని ట్రంప్ ప్రభుత్వం నిర్బంధించింది. పాలస్తీనా లోని హమాస్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్నారంటూ ఆయనపై ఆరోపణలు మోపింది. సూరిని హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం అదుపులోకి తీసుకున్నదని, ప్రభుత్వం ఆయన వీసాను రద్దు చేసిందని యూనివర్సిటీ తాత్కాలిక అధ్యక్షుడు రాబర్ట్ గ్రోవ్స్ వర్సిటీ డైరెక్టర్ల బోర్డుకు తెలియజేశారు. సూరి చట్టవిరుద్ధ కార్యకలాపానికి పాల్పడినట్లు వర్సిటీకి తెలియదని, ఆయన నిర్బంధానికి కారణమేమిటో వివరించలేదని గ్రోవ్స్ తెలిపారు.

ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లో శాంతి స్థాపనపై సూరి డాక్టరేట్ పరిశోధనలు చేస్తున్నారు. దక్షిణాసియాలో మెజారిటీ వాదం, మైనారిటీ హక్కులపై ఆయన విశ్వవిద్యాలయంలో తరగతులు బోధిస్తున్నారు. ప్రస్తుతం సూరి లూసినియాలో ఉన్నారని, ఇమ్మిగ్రేషన్ కోర్టులో విచారణ కోసం ఎదురు చూస్తున్నారని ఆయన న్యాయవాది హస్సన్ అహ్మద్ తెలిపారు. వర్జీనియాలోని అర్లింగ్టన్ సమీపంలో ఉన్న రోస్లిన్‌లో ఇంటి వెలుపల ఉన్న సూరిని ముసుగులు ధరించిన ఏజెంట్లు 17వ తేదీ రాత్రి అరెస్ట్ చేశారు. ధిక్కార స్వరం వినిపిస్తున్న మరో అమాయకుడిని ట్రంప్ ప్రభుత్వం అపహరించి, జైలులో పెట్టిందని అహ్మద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్య ప్రభుత్వంలోనే ఉంది తప్ప స్కాలర్‌లో కాదని ఆయన వ్యాఖ్యానించారు.

సూరి హమాస్‌కు అనుకూలంగా ప్రచారం చేయడమే కాకుండా సామాజిక మాధ్యమాలలో యూదుల పట్ల ద్వేషాన్ని కనబరుస్తున్నారని హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం (డీహెచ్‌ఎస్) ప్రతినిధి ట్రిసియా మెక్లాలిన్ తెలిపారు. హమాస్‌కు సీనియర్ సలహాదారుగా వ్యవహరిస్తున్న అనుమానిత ఉగ్రవాది ఒకరితో సూరికి సన్నిహిత సంబంధాలు ఉన్నాయని చెప్పారు. సూరి భార్య అమెరికా పౌరురాలే. అయితే ఆమెకు పాలస్తీనా వారసత్వం ఉన్నదన్న కారణంతో సూరిని శిక్షిస్తున్నారని న్యాయవాది తన పిటిషన్‌లో తెలియజేశారు. సూరి దంపతులకు అరాఫత్ అనే కుమారుడు ఉన్నాడు. అమెరికా ప్రభుత్వం భావ ప్రకటనా స్వేచ్ఛను హరిస్తోందని సూరి అరెస్ట్ నిరూపిస్తోందని విమర్శకులు ఆందోళన వ్యక్తం చేశారు. పాలస్తీనా అనుకూల నిరసన ప్రదర్శనకు మద్దతు ఇచ్చిన కొలంబియా యూనివర్సిటీ విద్యార్థి మహమూద్ ఖలీల్‌ను కూడా ట్రంప్ ప్రభుత్వం కటకటాల వెనక్కి నెట్టింది. నిర్బంధ చర్యను ఎదుర్కొన్న భారతీయుల్లో సూరి రెండో వారు. ఈ నెల ప్రారంభంలో కొలంబియా యూనివర్సిటీ స్కాలర్ రంజని శ్రీనివాసన్ వీసాను అమెరికా విదేశాంగ శాఖ రద్దు చేయడంతో ఆమె ఆ దేశాన్ని వదిలేయాల్సి వచ్చింది. ట్రంప్ ప్రభుత్వం ఆమెపై 'ఉగ్రవాద సానుభూతిపరురాలు' అనే ముద్ర వేసింది. అయితే తన పాలస్తీనా అనుకూలత కేవలం సోషల్ మీడియాకే పరిమితమని ఆమె వివరించారు. నిరసనలకు పెట్టింది పేరైనా కొలంబియా వర్సిటీపై ట్రంప్ ఇప్పటికే అనేక ఆంక్షలు విధించారు. వర్సిటీకి 400 మిలియన్ డాలర్ల ఆర్థిక సాయాన్ని పునరుద్ధరించాలంటే తమ షరతులకు అంగీకరించాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు.

---

# ఓయూలో ఆంక్షలు ఎత్తేయాలి

## విద్యార్థి సంఘాల నాయకుల అరెస్టును ఖండిస్తున్నాం

- వీసీ ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించుకోవాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య డిమాండ్



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ)లో ఉన్న ఆంక్షలను ఎత్తేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్సిటీలో నిరసన కార్యక్రమాలను నిషేధిస్తూ వీసీ ఇచ్చిన ఆదేశాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఓయూలో ఉన్న వివిధ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమానికి సంపూర్ణమైన మద్దతును ప్రకటించారు. వివిధ విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం దీనికి పూర్తిగా బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఓయూ వీసీతో ఇలాంటి సర్క్యులర్ ఇప్పించింది ప్రభుత్వమేనని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా ఒక వర్సిటీ వీసీ ఇంతటి అప్రజాస్వామికమైన ఆదేశాలను జారీచేయడమనేది సాధ్యమయ్యే పని కాదని తెలిపారు. కచ్చితంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ పోకడల కిది నిదర్శనమే అవుతుందని విమర్శించారు. ముఖ్యమంత్రిగా ఆయన ప్రమాణస్వీకారం చేసే సమయంలో ప్రజాభవన్‌గా తాను మార్చిన ప్రగతిభవన్ ముందు ఉన్న ముండ్ల కంచెలను ధ్వంసం చేస్తూ ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించా మన్నారని గుర్తు చేశారు. వారు ఏడో గ్యారెంటీ ప్రజాస్వామ్య పునరుద్ధరణ అన్నారని తెలిపారు. ఓయూలో ఇప్పుడు జరుగుతున్నదేమిటని ప్రశ్నించారు. జవహర్‌లాల్ నెహ్రూ చెప్పిన మాటలను కాంగ్రెస్ నాయకత్వం మరచిపోయిందా?అని అడిగారు. వర్సిటీ కేంద్రాలు భావ సంఘర్షణ కేంద్రాలుగా విరసిల్లాలంటూ నెహ్రూ చెప్పారని గుర్తు చేశారు.రాజకీయలు, ప్రజాస్వామ్య విలువలుంటాయని తెలిపారు. ఇవన్నీ పక్కనపెట్టి ఓయూలో కనీస ప్రజాస్వామ్య విలువలకు అవకాశం లేకుండా ధర్నాలు చేయొద్దు, ప్రదర్శనలు చేయొద్దు, వినతిపత్రాలు ఇవ్వొద్దు, నిరసనలు తెలపొద్దని సర్క్యులర్ ఇవ్వడం సమంజసం కాదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఉన్నామా? ఆటవిక రాజ్యంలో ఉన్నామా? సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంమీద ఉన్నదని తెలిపారు. ఇది వీసీకి సంబంధించిన విషయం, తమకు సంబంధం లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తప్పించుకోవడానికి వీల్లేదని పేర్కొన్నారు. కచ్చితంగా రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ సర్క్యులర్‌ను తక్షణమే విరమించుకోవాలని కోరారు. లేకుంటే రానున్న రోజుల్లో ఉద్యమం మరింత విస్తరిస్తుందనీ, ఉధృతమవుతుందని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

---

# రోడ్డు రవాణా రంగాన్ని రక్షించాలి

- 24న రోడ్డు రవాణా కార్మికుల చలో ఢిల్లీ
- పోస్టర్ ఆవిష్కరించిన ఆర్.లక్ష్మయ్య



**నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో**

రోడ్డు రవాణా రంగాన్ని రక్షించాలని, కార్మికుల ఉపాధిని కాపాడాలని మార్చి 24న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐఆర్‌టీడబ్ల్యూ) ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య తెలిపారు. గురువారం నాడిక్కడ ఏపీ, తెలంగాణ భవన్‌లో '24న చలో ఢిల్లీ' పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర విధానాల వల్ల రవాణా రంగం సంక్షోభంలోకి నెట్టబడిందని అన్నారు. అసంఘటిత రోడ్డు రవాణా కార్మికుల సామాజిక భద్రతా చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీఎన్‌ఎస్‌లోని సెక్షన్ 106 (1), (2)లను ఉపసంహరించుకోవాలన్నారు. ఓలా, ఉబర్ వంటి ప్రయివేట్ సంస్థలకు ప్రత్యామ్నాయంగా కేంద్ర ప్రభుత్వం యాప్స్ రూపొందించి ప్రజలకు రవాణా సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఆర్‌టీసీలను బలోపేతం చేసి విస్తరింపజేయాలని, అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్‌టీసీలకు మూలధన పెట్టుబడిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. డీజిల్ ధరలు, బీమా ప్రీమియంలు, టోల్ చార్జీలు తగ్గించాలని, వాటిని హేతుబద్దీకరించాలని అన్నారు. మోటార్ వెహికల్ (ఎంవి) సవరణ చట్టం-2016లో తగిన సవరణలు చేయాలని, వెహికల్ స్కానింగ్ విధానం తప్పనిసరి కాకూడదని అన్నారు. 2019లో పెంచిన పెనాల్టీలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రవాణా రంగ కార్మికుల డిమాండ్లపై రవాణా శాఖ మంత్రి నితీన్ గడ్కరీని కలిసినా స్పందన లేకపోవడంతో ధర్నాకు సిద్ధమైనట్టు తెలిపారు. రవాణా రంగ కార్మికుల డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగుతుందని అన్నారు.

---

# సీతారామకు నిధులేవి..?

## ఎత్తిపోతల పథకంపై చిన్నచూపేలా..

## ఇలా అయితే ఎప్పటిలోగా పూర్తి చేస్తారు..

బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించకపోతే ఉద్యమం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని, నున్నా




**నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి**

రాష్ట్ర ప్రభుత్వం తరవున ఆర్థికమంత్రి మల్లు భట్టివిక్రమార్క రూ.3.04 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టినా వాటిలో ఎంత మొత్తం ఖర్చు చేస్తారనేది సందేహాస్పదంగా ఉందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, నున్నా నాగేశ్వరరావు అన్నారు. గురువారం ఖమ్మంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పోతినేని మాట్లాడారు. గతంలో రూ.2.91 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టగా దానిలో ఖర్చు చేసింది రూ.2.38 లక్షల కోట్లు మాత్రమేనని తెలిపారు. ప్రస్తుత తరుణంలో ఆదాయం వచ్చే పరిస్థితులు కూడా తగ్గాయన్నారు. ఇవన్నీ పరిగణలోకి తీసుకొని బడ్జెట్ ప్రవేశపెట్టారా? లేదా? అనే స్పష్టత లేకున్నా.. ఖమ్మం జిల్లా మంత్రి ఆర్థికశాఖ మంత్రిగా ఉండి కూడా బడ్జెట్‌లో జిల్లాకు తీరని అన్యాయం జరిగిందన్నారు. సీతారామ ప్రాజెక్టుకు రూ.643 కోట్లు కేటాయించటం అంటే.. ముగ్గురు మంత్రులు ఏమి ఆలోచిస్తున్నట్టు అని ప్రశ్నించారు. ఇలా బడ్జెట్ కేటాయించి ఎన్నేండ్లపాటు ఈ ఎత్తిపోతల పథకాన్ని కడతారని అన్నారు.

### సీపీఐ(ఎం) పోరాటాలతోనే 'సీతారామ'

సీతారామ ప్రాజెక్టు దయాదాక్షిణ్యాలతో కాదు.. పోరాటాలతో సాధించుకున్న ప్రాజెక్టు అని పోతినేని సుదర్శన్ అన్నారు. 2002లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో తమ్మినేని వీరభద్రం నాయకత్వంలో మహాప్రస్థానం పాదయాత్ర నిర్వహించామన్నారు. 2004లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి వద్ద సీపీఐ(ఎం) తరవున గెలిచిన నలుగురు ఎమ్మెల్యేలు పట్టుబడితే దుమ్ముగూడెం పేరుతో 2005 డిసెంబర్ 31న శంకుస్థాపన చేశారన్నారు. ఆ తర్వాత కాంగ్రెస్ ఎమ్మెల్యేల ప్రోద్భలంతో దుమ్ముగూడేన్ని రాజీవ్, ఇందిరాసాగర్ పేరుతో రెండు భాగాలు చేశారని చెప్పారు. బడ్జెట్‌లో తగిన కేటాయింపులు చేయకపోవడంతో ఖమ్మం నుంచి హైదరాబాద్ పాదయాత్ర మొదలు పెట్టామని, నకిరేకల్ వెళ్లేటప్పటికీ రూ.2వేల కోట్ల అంచనాతో కూడిన ప్రాజెక్టుకు వెంటనే రూ.300 కోట్లు కేటాయిస్తున్నట్టు నాటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి కబురు చేయడంతో పాదయాత్ర నిలిపివేశామన్నారు. ఆ నాటి పాదయాత్రలో నాడు టీడీపీ జిల్లా అధ్యక్షునిగా ఉన్న నేటి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సైతం పాల్గొన్నారని గుర్తుచేశారు. అయితే 2007 నుంచి 2012 దాకా తగిన నిధులు కేటాయించలేదన్నారు. 2012లో తన నాయకత్వంలో మళ్లీ పాదయాత్ర చేపట్టామన్నారు. విభజన అనంతరం 2016 ఫిబ్రవరిలో రూ.7,900 కోట్ల అంచనాతో అప్పటి తెలంగాణ సీఎం కేసీఆర్ సీతారామ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశారని, 2018 నాటికి రూ.13వేల కోట్లకు అంచనా వ్యయం పెరిగిందన్నారు. అయినా గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం పూర్తి విషయంలో నిర్లక్ష్యం వహించారని అన్నారు. 2023కు వచ్చేనాటికి రూ.18వేల కోట్లకు చేరిందన్నారు. ప్రస్తుతం సీతమ్మసాగర్, సీతారామ ప్రాజెక్టు రూ.19,800 కోట్లకు పెంచుకుంటూ వచ్చారన్నారు. గతేడాది మోటార్ల ద్వారా నీళ్లిచ్చి ప్రాజెక్టు ప్రారంభించినట్టు ప్రచారం చేసుకున్నారని చెప్పారు. ప్రస్తుతం రూ.443 కోట్లు ఎత్తిపోతలకు, రూ.53 కోట్లు డిస్ట్రిబ్యూటరీలకు కేటాయించారని అన్నారు. 72 పేజీల బడ్జెట్‌లో నీటిపారుదలకు కేటాయించిన నాలుగు పేజీల్లో సీతారామ ప్రాజెక్టు ఊసే లేదన్నారు. ఎండిపోయే భూములు భట్టి విక్రమార్క నియోజకవర్గంలోనే ఉన్నాయన్నారు.

రూ.19వేల కోట్ల అంచనా వ్యయంలో కేవలం రూ.8వేలు కోట్లు ఖర్చు పెడితే ఇంకా రూ.11,800 కోట్లు ఎప్పుడు వెచ్చిస్తారని ప్రశ్నించారు. సీతారామ ప్రాజెక్టుకు తగిన నిధులు కేటాయించకపోతే ఉద్యమం చేపట్టక తప్పని చర్యలను ప్రభుత్వం తీసుకొస్తోందన్నారు. ఈ బడ్జెట్ చర్చల్లో వచ్చే అంశాలను పరిగణనలోకి తీసుకుని తగిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయదారులకు అన్యాయం చేసేలా ప్రస్తుత బడ్జెట్‌లో కేటాయింపులు ఉన్నాయని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, బండి రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

అనివార్య యుద్ధం అంటూ వుండదు. యుద్ధం వచ్చిందంటే మానవ మేధస్సు విఫలమైందన్నమాట - బోనార్‌లా

శుక్రవారం 21 మార్చి 2025
www.navatelangana.com

సంపాదకీయం

# జమ్మి ఆకులతో విస్తర...




**బ**డ్జెట్.. పద్దు.. కేటాయింపులు.. నిధులు.. గ్రాంట్లు... గత కొద్ది రోజుల నుంచి పత్రికల్లో నానిన పదాలివి. ఆ రోజు రానే వచ్చింది. ఉప ముఖ్యమంత్రిగా ఉన్న విత్తమంత్రి బుధవారం శాసనసభలో పద్దును ప్రవేశపెట్టారు. దీనిపై ఓ ఆర్థిక నిపుణుడిని అభిప్రాయం అడగ్గా... 'నాకు రొట్టే లేదు గానీ, ఉంటే నెయ్యిలో అద్దుకు తినేవాణ్ని...' అన్నట్టుగా ఉందని సెటైరు వేశారు. నిజమే మరి... సంక్షేమానికి రికార్డు స్థాయిలో రూ.1.04 లక్షల కోట్లు కేటాయించాం, ఆరు గ్యారెంటీల అమలుకు రూ.56 వేల కోట్లను ప్రతిపాదించామంటూ ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంది. కానీ ఆ రూకలు ఎక్కడి నుంచి వస్తాయనే దానికి మాత్రం బడ్జెట్ పత్రాల్లో సమాధానమే లేదు. వ్యవసాయ కార్మికులకు ఆర్థిక సాయం కింద రూ.12 వేలు, ప్రతీ మహిళకు ఆర్థిక చేయూత కింద రూ.2,500, డిగ్రీ, ఆ పైన చదువుకునే అమ్మాయిలకు స్కూటీలు, కళ్యాణ లక్ష్మి పథకం కింద తులం బంగారం తదితరాంశాల ఊసే పద్దులో కనబడకపోవటం గమనార్హం. 'ఎవరూ నమ్మట్లేదు.. అప్పులివ్వట్లేదు...' అంటూ గురువారం సీఎం రేవంత్, బహుశా గత ప్రభుత్వాన్ని దృష్టిలో పెట్టుకుని వ్యాఖ్యానించిన నేపథ్యంలో ఈ హామీలు, వాగ్దానాల అమలెలా అని జనం జుట్టు పీక్కుంటున్నారు.

దళితులను అభివృద్ధి పరుస్తామంటూ చెప్పిన సర్కార్...వారికి సంబంధించిన కేటాయింపులకు మసిపూసి మారేడుకాయ చేసింది. ఆయా తరగతులకు మొత్తం రూ.40 వేల కోట్లు కేటాయించినట్టు బడ్జెట్‌లో చూపారు. వాస్తవానికి ఇందులో గతేడాది ఖర్చు పెట్టకుండా వదిలేసి, ఈసారి క్యారీ ఫార్వర్డ్ చేసినవే రూ.13 వేల కోట్లున్నాయి. అంటే ఎస్సీలకు నికరంగా కేటాయించింది రూ.27 వేలకోట్లే నన్నమాట. గత గులాబీ సర్కార్ కాళేశ్వరం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పేర్లతో కార్పొరేషన్లను ఏర్పాటు చేసుకుని, దండిగా అప్పులు తెచ్చుకుంది. హస్తం పార్టీ సైతం దానికి మినహాయింపేమీ కాదు.

గతేడాది 2.91 లక్షల కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సర్కారు.. ఈసారి అదనంగా రూ.13 వేల కోట్లు కలిపి రూ.3.04 లక్షల కోట్లతో పద్దును ప్రతిపాదించింది. ఆ మేరకు రాబడి పెరుగుతుందా? లేదా? అనేది శేష ప్రశ్నే. మరోవైపు మానవాభివృద్ధి సూచికల్లో విద్య, వైద్య రంగాలు కీలక పాత్ర పోషిస్తాయనేది అందరూ చెప్పే మాటే. ఈ రెండు రంగాలకు హస్తం పార్టీ ఈసారి రిక్తహస్తాన్నే మిగిల్చింది. గతేడాది విద్యా రంగానికి రూ.21 వేల కోట్లు కేటాయిస్తే, ఈసారి రూ.రెండు వేల కోట్లను అదనంగా పెంచారు. మొత్తంగా చూసినప్పుడు విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన కేటాయింపులు 8 శాతం దాటడం లేదు. జాతీయ సగటును పరిశీలించినప్పుడు ఈ రంగానికి 14.5 శాతం నిధులను కేటాయిస్తున్నారు. అంటే తెలంగాణ ఈ విషయంలో ఇంకా ఆరు శాతం వెనుకబడే ఉందన్నమాట. ఇక వైద్య రంగానికి గతేడాది రూ.11 వేల కోట్లు కేటాయిస్తే, ఈసారి రూ.12 వేల కోట్లను ప్రతిపాదించారు. పెంచిన ఈ వెయ్యి కోట్లతో 'ఆరోగ్య తెలంగాణ' సాధ్యమా?

దళితులను అభివృద్ధి పరుస్తామంటూ చెప్పిన సర్కార్... వారికి సంబంధించిన కేటాయింపులకు మసిపూసి మారేడుకాయ చేసింది. ఆయా తరగతులకు మొత్తం రూ.40 వేల కోట్లు కేటాయించినట్టు బడ్జెట్‌లో చూపారు. వాస్తవానికి ఇందులో గతేడాది ఖర్చు పెట్టకుండా వదిలేసి, ఈసారి క్యారీ ఫార్వర్డ్ చేసినవే రూ.13 వేల కోట్లున్నాయి. అంటే ఎస్సీలకు నికరంగా కేటాయించింది రూ.27 వేల కోట్లేనన్నమాట. గత గులాబీ సర్కార్ కాళేశ్వరం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పేర్లతో కార్పొరేషన్లను ఏర్పాటు చేసుకుని, దండిగా అప్పులు తెచ్చుకుంది. హస్తం పార్టీ సైతం దానికి మినహాయింపేమీ కాదు. ఆయా కార్పొరేషన్లకు పెట్టుబడి పెడుతున్నామంటూ సర్కారు వారు చంకలు గుద్దుకున్నా... వాటిని తిరిగి చెల్లించాల్సింది అదే సర్కారు అనే విషయాన్ని విస్మరించరాదు.

ఏతావాతా చూసినప్పుడు రూ.3.04 లక్షల కోట్లతో పద్దు బ్రహ్మాండంగా ఉన్నా... దానికి కావాల్సిన సూటూ బూటూ ఎక్కడి నుంచి తెస్తారనే ప్రశ్నకు సర్కారు వద్ద సమాధానమే లేదు. అయితే మద్యాన్ని విపరీతంగా తాగించటం, లేదంటే ఇసుక విక్రయాలు, భూముల అమ్మకాల మీద ఆధారపడటమే కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న ఏకైక మార్గంగా కనబడుతోంది. కొత్త సీసాలో పాత సారాలాగా గతంలో బీఆర్ఎస్ సర్కార్ చేసింది అదే.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నదీ అదే. అలాంటప్పుడు ప్రజల జీవన ప్రమాణాల్లో, అభివృద్ధిలో మార్పెలా సాధ్యం...? కేంద్రం నుంచి గ్రాంట్లు, ఆర్థిక సాయాలు రావటం లేదు మొర్రో...' అని ఒకవైపు దీనంగా మాట్లాడుతూనే... హస్తిన నుంచి వచ్చే డబ్బుల కోసం ఎదురు చూడటం ఎంతవరకు సమంజసం? సమాఖ్య స్ఫూర్తిని కొనసాగిస్తామని తాటాకు చప్పుళ్లు చేస్తే ఏం ప్రయోజనం? ఆ స్ఫూర్తిని ధ్వంసం చేస్తున్న కేంద్రంపై పోరాడకపోతే ఏం ప్రయోజనం?

ఈ నేపథ్యంలో సీపీఐ(ఎం) చెప్పినట్టు బడ్జెట్‌ను పున:సమీక్ష చేయాల్సిన అవసరముంది. విద్యా, వైద్య రంగాలకు, సంక్షేమానికి అధిక నిధులు కేటాయించటం ద్వారా రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు న్యాయం చేయాలి. అంతేతప్ప 'జమ్మి ఆకులతో విస్తరాకు'ను తయారు చేస్తే, దాంట్లో ఒక్క మెతుకు కూడా నిలవదనే సత్యాన్ని ప్రభుత్వం గుర్తించాలి. నేల విడిచి సాము చేయటం కాకుండా వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా, ఆదాయ, వ్యయాలను లెక్కలేసుకుని బడ్జెట్‌ను సవరించాలి.

---

సూర్యచంద్రుల సాక్షిగా
నా భారతావనిపై
ఇక్కడే ఈక్షణమే
రాజ్యమేలుతున్న
రాక్షసత్వం
మహారాష్ట్ర బీడ్ జిల్లా గ్రామం
సర్పంచ్‌పై ఇనుపరాడ్‌లతో దాడి
చివరిశ్వాస విడిచే జీవశ్ఛవంపై
మూత్రవిసర్జన..
వీడియో కన్నవారికి
విషయం విన్నవారికి
కడుపులో దేవిన ఏవగింపు..
ఇదికదా
మన ప్రజాస్వామ్యాన్ని
శాసించే నేర భారతం?

## దిక్కెవరు?

నిందితుడు
రాష్ట్ర మంత్రి కుడిభుజం
మూడ్నెల్లనంతరం
బయల్పడిన వైనం
రౌడీరాక్షసులు
షాడోపాలకులుగా
రాజ్యమేలుతున్నకాలం
అడ్డొస్తే గ్రామసర్పంచ్‌కు
పట్టినగతే ఎవరికైనా...
అప్పులు-కూలి-పేదరికం
విషవలయంలో నలుగుతున్న
నయా బానిసత్వం
అవునన్నా కాదన్నా
అదో కటిక చీకటిలోకం
ఇది యాదృశ్చికం కాదట!
సహజ పరిణామమేనట!
అధికార కులమతనాగులు
చిమ్ముతున్న అహంకార విషం
చట్టం-న్యాయం-ధర్మం ఇక్కడ
చేష్టలూడిన మూడుకోతులు
ఈ అంతంలేని
నేర భారతంలో
రక్తాశ్రువులు చిందించే
ఆ కూలి జీవులకు
ఇప్పుడు దిక్కెవరు?

- కె.శాంతారావు,
9959745723

---

# దుఃఖానికి చికిత్స చేసిన బైషజ్య గురువు



డాక్టర్ దేవరాజు మహారాజు

**తృ**ప్తి అనేది తెలియని వాళ్లకు స్వర్గతుల్య రాజభవనంలో ఉన్నప్పటికీ తృప్తి ఉండదు. తృప్తి అనేది తెలియని వాళ్లు, ధనవంతులైనా పేదవాళ్లే! ఆది తెలిసిన వాళ్లు పేదవాళ్లయినప్పటికీ ధనవంతులే అని చెపుతుంది బౌద్ధ ధమ్మం. ఇది వైదిక మతానికీ, బౌద్ధ ధమ్మానికీ ఉన్న తేడాను కూడా చెప్పినట్టుగా ఉంది. బౌద్ధ జైన ధర్మాలను అతి క్రూరంగా నాశనం చేసినప్పటికీ, ఈ దేశంలో బ్రాహ్మణిజానికి ఇంకా తృప్తి లేదు.నాశనమవుతూ వచ్చిన ధర్మాలు మాత్రం ప్రశాంతంగా సంతృప్తిగానే ఉన్నాయి.

భారతదేశంలోని శిల్పకళ, చిత్రలేఖనం బౌద్ధులనుండి అందుకున్న వారసత్వమేనని చరిత్ర పరి శోధకులు నిర్ధారించారు. చిత్రలేఖనం, శిల్పకళలతో పాటు విజ్ఞానశాస్త్రంలోనూ, ఇతర సాంస్కృతిక రంగాల్లో బౌద్ధులు చేసిన కృషికి ఆసియా దేశాలన్నీ రుణపడి ఉంటాయి. ప్రాచీన వైద్యశాస్త్రం అత్యున్నత దశ అంతా బౌద్ధులు సాధించిందే - అశోక చక్రవర్తి, తర్వాత వచ్చిన ఇతర బౌద్ధ చక్రవర్తులు స్థాపించిన వైద్య శాలల్లోనే చికిత్సా విధానాలు అభివృద్ధి చెందాయి. నాటి ప్రముఖ వైద్యశాస్త్ర గ్రంథం- 'చరక సం హిత' రచించిన చరకుడు బౌద్ధుడు. ఆయన బౌద్ధ చక్రవర్తి కనిష్కుడి ఆస్థాన వైద్యుడు. ఆచార్య నాగా ర్జునుడు ఆయుర్వేద వైద్యాన్ని కొత్తపుంతలు తొక్కించిన వాడు. ఆయనా బౌద్ధుడే కదా? ఆయుర్వేద వైద్య విద్యార్థులకు ఈ నాటికీ అత్యంత విలువైన పాఠ్య గ్రంథం-బౌద్ధ భిక్షువైన వాగ్భటుడు రాసిందే! బౌద్ధు డైన దిఙ్నాగుడు- అతని శిష్యుడు ధర్మకీర్తీ భారతీయ తర్కశాస్త్రానికి రూపురేఖలు దిద్ది, దాన్ని ఒక కొత్త మలుపు తిప్పిన వారు.

బౌద్ధులైన వరరుచి, జయాదిత్య, వామన, చంద్ర మొదలైన వారంతా వ్యాకరణ శాస్త్రంలో ఉద్దండులు. ఇన్నీ శాస్త్రాలు, కళలూ ఇక్కడ ఈ దేశంలో ఎలా అభివృద్ధి చెందాయీ అంటే, మన భారత దేశంలో ఏడెనిమిది వందల సంవత్సరాల పాటు, బౌద్ధ విశ్వవిద్యాలయాలు ప్రపంచానికి జ్ఞానాన్ని అం దించాయి. ఆ దశలో ఎన్నో కళలు, ఎన్నో శాస్త్రాలు ఇక్కడ వెల్లివిరిశాయి. ఆ రకంగా ఈ దేశం 'విశ్వ గురువు' ఎప్పుడో అయిపోయింది. ఆ స్థాయిని అలా నిలుపుకోలేక, దాన్ని ధ్వంసం చేసుకుంటూ వస్తున్నా మన్న సంగతి గుర్తుంచుకోవాలి! ఎలా ధ్వంసమవుతూ వచ్చిందో తెలుసుకుంటూ ఉండాలి. పునరు ద్ధరించుకునే పనిలో నిరంతరం మనం, నిమగ్నమవుతూ ఉండాలి కూడా!

ఇక వైద్యశాస్త్రం, చికిత్సా విధానానికి సంబంధించిన విషయాలు చెప్పుకోవాలంటే, మొదట బుద్ధుడి గురించే చెప్పుకోవాలి. ఆయన ప్రకృతి ప్రేమికుడు, పరిశీలకుడు గనక, చెట్ల గురించీ, వన మూలికల గురించీ కొంత అవగాహన పెంచుకున్నాడు. ఆయన కాలానికి అందుబాటులో ఉన్న వైద్యం తోనూ, చికిత్సా విధానాలతోనూ ఆయనకు పరిచయం ఏర్పడింది. బుద్ధుడు అనారోగ్యంతో ఉన్న ఒక వృద్ధ భిక్షువుకు సపర్యలు చేసి, స్నానం చేయించి స్వస్థత చేకూర్చాడని బౌద్ధ సాహిత్యం తెలియజేస్తూ ఉంది. ఆ వృద్ధ భిక్షువు విరేచనాలతో బాధపడుతూ, మల మూత్రాలలో నిస్సహాయంగా పడి ఉన్నప్పుడు బుద్ధుడు స్వయంగా అతనికి సేవలు చేశాడు. ఆ ఒక్కడికే కాదు, ఆ విధంగా ఎందరికో బైషజ్య గురు వుగా మారాడు. బైషజ్య గురువు అంటే వైద్యుడని అర్థం! ఆయన ఇతరులకు వైద్యసేవలు అందిస్తున్న ప్పుడు, శిష్యులు ఆయన్ను జాగ్రత్తగా గమనించే వారు. బుద్ధుణ్ణి ఆదర్శంగా తీసుకుని, ఆయన శిష్యులు కూడా ప్రజలకు వైద్య సేవలందించడం ప్రారంభించారు. రోగాలతో ఉన్నవారికి సేవలు అందించిన శిష్యులను బుద్ధుడు మెచ్చుకునేవాడు. పైగా, ప్రజలకు చేసిన సేవలన్నీ తనకు చేసినట్లే - భావిస్తానని చెప్పేవాడు. ఆ రకంగా శిష్యులందరూ ఉత్సాహంగా పని చేస్తుండేవారు.

"శరీరానికి మరణం ఒక్కసారే వస్తుంది. మనసుకు మాత్రం తప్పుచేసిన ప్రతిసారీ మరణం సంభవిస్తుంది-" అని చెప్పేవాడు బుద్ధుడు. సాటి మనిషి అనారోగ్యంతో విలవిలలాడుతున్నప్పుడు పట్టించుకోకుండా ఉండడమంటే - తప్పు చేస్తున్నట్టే కదా? తప్పుచేస్తూ నిత్యం మరణించడమెందుకూ? - అన్న భావాన్ని బుద్ధుడు తన శిష్యుల్లో కలిగించగలిగాడు.

బుద్ధుడు శ్రావస్తిలో అనాథపిండకుని జెతవన ఆరామంలో ఉన్నప్పుడు శరత్ అనే భిక్షువు జబ్బు పడితే, బుద్ధుడు స్వయంగా సేవచేశాడు. ఆ భిక్షువు ఏది తిన్నా వాంతి చేసుకునేవాడు. జావ కాచి ఇచ్చినా, అది కూడా వాంతి అయిపోయేది. భిక్షువు నీరసపడి పోయి, సన్నగా, పీలగా తయారైనప్పుడు- బుద్ధుడు తనకు తెలిసిన పరిజ్ఞానంతో మూలికల కషాయం తయారు చేసి మెల్లె మెల్లగా తాగించాడు. అది మంచి ఫలితం ఇచ్చింది. దాంతో వాంతులు తగ్గాయి. క్రమంగా ఆరోగ్యం పుంజుకున్నాడు. బతుకు తాడా లేదా అని అనుకున్నవాడు, బుద్ధుడి చికిత్స సేవలతో బతికి బయటపడ్డాడు. శిష్యగణమంతా అబ్బురపడి ఉత్సాహభరితులయ్యారు. ప్రకృతి పరిశీలనలో లోతైన అవగాహన పెంచుకున్న బుద్ధుడు, స్వీయ అనుభవాలతో మూలికల పరిజ్ఞానం సంపాదించాడు. అదే తన శిష్యులకు అందించాడు. ఆనాటి బౌద్ధ విహారాలకు సామాన్యజనం వచ్చి, వైద్య సేవలు అందుకునే వారు.

బైషజ్య గురువు (వైద్యుడు) అయిన బుద్ధుడి ప్రభావంతో తర్వాత కాలంలో అశోక చక్రవర్తి కూడా వైద్యశాలలు కట్టించాడు. కేవలం మనుషులకే కాకుండా పశువులకు కూడా వేరుగా పశు చికిత్సాలయాలు కట్టించాడు. మనుషులకు, పశువులకు వేరు వేరు వైద్యులు, వేర్వేరు వైద్యశాలలు అప్పటి నుండే దేశంలో ప్రారంభమయ్యాయి. విశ్వవిద్యాలయాలు, వైద్యశాలలు- చికిత్సాలయాలు బౌద్ధస్ఫూర్తితో ప్రపం చవ్యాప్తంగా ప్రారంభించబడ్డాయి. కాలం గడుస్తున్న కొద్దీ అవసరాన్ని బట్టి, విస్తరించబడ్డాయి కూడా!

ప్రపంచంలో విద్యాలయాలు, విశ్వవిద్యాలయాలు లేని కాలంలో ఈ దేశంలో అనేక బౌద్ధ విశ్వ విద్యాలయాలు వెల్లివిరిశాయి. ప్రపంచానికి జ్ఞానాన్నందించాయి. ఆరకంగా ఈదేశం బౌద్ధుల కాలంలోనే 'విశ్వ గురువు అయిపోయింది. ఆ విశ్వవిద్యాలయాల స్థాయి ఎలా ఉండేదన్న దానికి ఆ మధ్య లభ్యమైన ఒక తాళపత్ర గ్రంథం ఆధారాలు చూపింది. 1881లో తక్షశిలకు 70 మైళ్ల దూరంలో ఒక విలువైన తాళపత్ర గ్రంథం దొరికింది. అది 1700 నాటి అతి పురాతన గ్రంథం. దానిలో 70 పత్రాలు (అంటే 70పేజీలు) ఉన్నాయి. అది 'గాత' భాషలో ఉన్న 'బక్షాలి మాన్యుస్క్రిప్ట్'గా గుర్తించారు. గోత భాష అంటే, ఒకప్పటి ప్రాకృత భాషకు మారురూపం. ఈ తాళపత్ర గ్రంథం మూడవ శతాబ్దం నాటిదని చెపుతున్నారు. ఇందులో అంక గణిత, బీజగణిత, రేఖాగణితాలకు సంబంధించి కొన్ని ప్రాథమిక, ప్రామాణిక సూత్రీకరణలు ఉన్నాయి.



కూడికలు, తీసివేతలు, గుణితం, భాగహారం మాత్రమే కాదు, సాధారణ ఈక్వే షన్లు- ఇంకా సంక్లిష్టమైన రేషనల్ ఎప్రాక్సిమేషన్, స్క్వేర్ రూట్‌కు సంబంధించిన సమాచారం, సమ్మిషన్ ఆఫ్ కాంప్లెక్స్ సీరిస్, సైమల్ టేనియస్ లీనియర్ ఈక్వేషన్స్-వగైరా ఉన్నాయని గణిత శాస్త్ర నిపుణులు ధృవీకరించారు. మూడవ శతాబ్దంలోనే మన బౌద్ధ విశ్వవిద్యాలయాల్లో ఏస్థాయి విద్య అందుబాటులో ఉండేదో చెప్పడానికి దీన్ని ఒక ఉదాహరణగా తీసుకోవచ్చు-

దేవుడు, భక్తి, ఆధ్యాత్మికత, హిందుత్వ పేర్లతో దేశ గౌరవాన్ని పెంచుతున్నామని ప్రగల్భాలు పలికే మూర్ఖ శిఖామణులకు ఈ దేశ ఔన్నత్యమే తెలియదు. తెలుసుకునే ప్రయత్నమే చేయరు. ఎంత సేపటికి పురాణాల్లోని కట్టు కథలు వల్లె వేయడం తప్ప, ప్రాచీన విజ్ఞాన శాస్త్ర పరిజ్ఞానం గురించి గానీ, గ్రంథాల గురించి గానీ తెలియదు. "మార్స్ మీద వినాయకుడి విగ్రహం ఉంది"- లాంటి అబద్ధాల ప్రచారం మాత్రం చేస్తూ ఉంటారు. నీల్ ఆర్మ్ స్ట్రాంగ్ చంద్రుడి మీద కాలుమోపగానే, అక్కడికి హిందూ అర్చకుడు ఎదురుగా వచ్చి, అక్కడ ఉన్న హిందూ దేవాలయం గూర్చి చెప్పాడు- వంటి అభూత కల్పనలు వండి వార్చుతూ ఉంటారు. సమాజంలో నవ్వుల పాలు అవుతున్నామన్న స్పృహ కూడా ఈ భక్తులకు ఉండదు.

ఈ ప్రపంచంలో మొదటిసారి జ్ఞానోదయమైంది ఒక్క బుద్ధుడికే. అదీ సాధారణ శకానికి ముందు - ఇది వాస్తవం! కల్పించిన అభూత కల్పన కాదు. బుద్ధుడు అడవిలో ప్రశాంతంగా కూర్చుని సమాజం గురించి తపనపడ్డాడు. తీవ్రంగా ఆలోచించాడు తప్పితే ఏ దేవాలయానికీ వెళ్లలేదు. అసలు దేవుడున్నాడని, ఆయన అంగీకరించనే లేదు - స్వార్థ ప్రయోజనాల కోసం ఆర్య రుషులు చేసిన తపస్సు వేరు. వారు సాధించారన్న శక్తులతో మానవ వినాశనమే జరిగింది తప్ప, ప్రపంచ మానవాళికి మేలు జరగలేదు. ఇంతెందుకూ? మనచుట్టూ ఉన్న దైవ విశ్వాసకుల్ని గమనించండి. వారు ప్రకృతి విలువ తెలుసుకోరు. చిరుగాలి, లేత ఎండ, ఆత్మీయత, అనురాగం, కళ్లమెరుపూ వారికి అర్థం కాదు. మనిషైన వాడికి, తన మీద తనకు విశ్వాసం ఉన్నవాడికి మాత్రమే సృజనాత్మకత అంటే ఏమిటో తెలుస్తుంది. కవిత్వం అనుభవించాలన్నా, కళల్ని అనుభూతించాలన్నా, సైన్సును అందుకోవాలన్నావాడు మనిషై ఉండాలి. వాడిలో బుద్ధుడు చెప్పిన జాలి, కరుణ, ప్రేమ, నీతి, నిజాయితీ లాంటి లక్షణాలుండాలి. అప్పుడే వాడు మనిషైతాడు. తను మనిషినని గాఢంగా నమ్మినవాడే నూతన సృష్టిచేయగలడు. శోధించగలడు. సాధించగలడు. ఎక్కడో ఏదో శక్తి ఉందని, అది తనను చూస్తూ ఉందనీ భ్రమిస్తూ కళ్లు తేలేసే వాడికి ఇవన్నీ ఉండవు. ఇవన్నీ అందవు.

బౌద్ధంలో నుంచే శిల్పకళ, చిత్రలేఖనం, వైద్యశాస్త్రం,తర్కశాస్త్రం, వ్యాకరణ శాస్త్రం, భాషా శాస్త్రం ఇంకా ఇతర విజ్ఞాన శాస్త్రాలు ప్రారంభం కావడానికీ, ఉచ్చ స్థాయికి చేరుకోవడానికి ముఖ్య కారణం- మనిషి రుజువర్తనం, నైతిక జీవనం, హృదయ వైశాల్యం కారణాలు! ఇవి లోపించడం వల్లనే, మనిషి మనిషిగా ప్రవర్తించలేకపోతున్నాడు. యుద్ధోన్మాదం ఒకవైపు, నైతిక పతనం మరో వైపు ప్రపం చాన్ని కుదిపేస్తున్నాయి.ఇప్పుడు తక్షణమే చేపట్టాల్సిన కర్తవ్యం ఏమిటంటే- మనిషే కేంద్రంగా ఈ సమా జాన్ని పునర్నిర్మించుకోవాల్సి ఉంది.అందుకు మొట్టమొదట అన్ని మతాలకు చెందిన దైవ సంబంధిత పండుగలు, ఉత్సవాలు, ఆచారాలు, సంప్రదాయాలు రద్దుచేసుకుంటే మార్పు త్వరగా వస్తుంది. కులం, మతం లేకుండా కేవలం మనుషులుగా బతకాలనుకునే వారికి తగిన స్వేచ్ఛనివ్వాలి. అన్ని మతాల్ని, అన్ని మత గ్రంథాల్ని మ్యూజియంలలో భద్రపరచాలి. ఎదగని మానవ మేధస్సుకు ప్రతీకలుగా అవి అక్కడే ఉండాలి. సమకాలీన జీవితంపై వాటి ప్రభావం పడకుండా చూసుకోవాలి.మానవత్వం గురించి, సేవా భావం గురించి, మనిషి సాధించిన, సాధిస్తూ ఉన్న వైజ్ఞానిక ప్రగతి గురించి మాత్రమే వచ్చే తరాలకు చెప్పాలి. ఈ పని ఎంత త్వరగా జరిగితే అంత మంచిది!

దేవుడు, భక్తి, ఆధ్యాత్మికత, హిందుత్వ పేర్లతో దేశ గౌరవాన్ని పెంచుతున్నామని ప్రగల్భాలు పలికే మూర్ఖ శిఖామణులకు ఈ దేశ ఔన్నత్యమే తెలియదు. తెలుసుకునే ప్రయత్నమే చేయరు. ఎంత సేపటికి పురాణాల్లోని కట్టు కథలు వల్లె వేయడం తప్ప, ప్రాచీన విజ్ఞాన శాస్త్ర పరిజ్ఞానం గురించి గానీ, గ్రంథాల గురించి గానీ తెలియదు. "మార్స్ మీద వినాయకుడి విగ్రహం ఉంది"- లాంటి అబద్ధాల ప్రచారం మాత్రం చేస్తూ ఉంటారు. నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రుడి మీద కాలుమోపగానే, అక్కడికి హిందూ అర్చకుడు ఎదురుగా వచ్చి, అక్కడ ఉన్న హిందూ దేవాలయం గూర్చి చెప్పాడు- వంటి అభూత కల్పనలు వండి వార్చుతూ ఉంటారు. సమాజంలో నవ్వుల పాలు అవుతున్నామన్న స్పృహ కూడా ఈ భక్తులకు ఉండదు.

ఇప్పుడు తక్షణమే చేపట్టాల్సిన కర్తవ్యం ఏమిటంటే- మనిషే కేంద్రంగా ఈ సమా జాన్ని పునర్నిర్మించుకోవాల్సి ఉంది.అందుకు మొట్టమొదట అన్ని మతాలకు చెందిన దైవ సంబంధిత పండుగలు, ఉత్సవాలు, ఆచారాలు, సంప్రదాయాలు రద్దుచేసుకుంటే మార్పు త్వరగా వస్తుంది. కులం, మతం లేకుండా కేవలం మనుషులుగా బతకాలనుకునే వారికి తగిన స్వేచ్ఛనివ్వాలి. అన్ని మతాల్ని, అన్ని మత గ్రంథాల్ని మ్యూజియంలలో భద్రపరచాలి. ఎదగని మానవ మేధస్సుకు ప్రతీకలుగా అవి అక్కడే ఉండాలి. సమకాలీన జీవితంపై వాటి ప్రభావం పడకుండా చూసుకోవాలి.మానవత్వం గురించి, సేవా భావం గురించి, మనిషి సాధించిన, సాధిస్తూ ఉన్న వైజ్ఞానిక ప్రగతి గురించి మాత్రమే వచ్చే తరాలకు చెప్పాలి. ఈ పని ఎంత త్వరగా జరిగితే అంత మంచిది!

వ్యాసకర్త: త్రిపురనేని రామస్వామి
జాతీయ పురస్కార తొలి గ్రహీత

---

# భద్రతలేని 'అసంఘటిత' బతుకులు



వంగూరు రాములు
9490098247

**దే**శం మొత్తం కార్మికుల్లో 93శాతం మంది అసంఘటిత రంగంలో పనిచేస్తున్నారు. స్థూల జాతీయోత్పత్తిలో అరవై శాతం వాటా వీరిదే అయినా కార్మిక చట్టాల పరిధిలో లేరు. పనిగంటలు, కనీస వేతనాలు, సామాజిక భద్రతా ప్రయోజనాలు అంతకన్నా కనబడవు. ఉద్యోగ భద్రత కూడా మృగ్యమే. 1991 నుండి సరళీకరణ ఆర్థిక విధానాలు మొదలైన తర్వాత వ్యవసాయ రంగం సంక్షోభంలో పడటం, చేతివృత్తులు దెబ్బతినటం, ఫలితంగా అసంఘటిత కార్మికుల సంఖ్య వేగంగా పెరిగింది. అదే సమయంలో అన్ని రంగాల్లో రెగ్యులర్, పర్మినెంట్ కార్మికుల సంఖ్య తగ్గుతున్నది. ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు పని గంటలు వంటి సర్వీస్ కండీషన్స్ రూపొందిం చడంతో పాటు అసంఘటితరంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని, ట్రేడ్ యూనియన్ ఉద్యమం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చింది. ఫలితంగా 2008లో సామాజిక భద్రతా చట్టాన్ని రూపొందించింది. దీనిలో కార్మికుల వాటా ఎంత? యజమాని వాటా ఎంత?ఉండాలనే దాని నిర్ణయించకుండా రూల్స్ రూపొం దించకుండా చట్టం చేయడం మూలంగా అది చివరకు అసంఘటితరంగ కార్మికులను మోసం చేసేదని రుజువైంది. ప్రస్తుతం ఆ చట్టాన్ని రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్స్‌లో కలిపేసింది.

### పథకాలున్నా...ప్రయోజనం సున్నా

అసంఘటిత కార్మికులకు పెన్షన్ పథకం, ప్రధానమంత్రి శ్రమయోగి మాన్ ధన్ పథకం (పిఎం-ఎస్‌వైఎం), ఈశ్రమ్ పోర్టల్, అసంఘటిత కార్మికులకు బీమా పథకాలు ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పిఎంజెజెబివై), ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన (పిఎంఎస్‌బివై) వంటి స్కీమ్‌లు అసంఘటితరంగ కార్మికుల ప్రయోజనాల కోసమే తెస్తున్నామని ప్రకటించిన బీజేపీ ప్రభుత్వం ఆ స్కీమ్‌ల వలన అసంఘటిత రంగ కార్మికులకు ఎలాంటి మేలు జరగలేదు. వాటిని కాగితాలకే పరిమితం చేసి ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు చేయకుండా మోడీ ప్రభుత్వం మోసానికి పాల్పడింది. కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసింది. కార్మికులకు గొడ్డలిపెట్టు వంటి నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మికవర్గాన్ని తీవ్ర ప్రమాదంలోకి నెట్టింది. రేపు లేబర్ కోడ్స్ అమల్లోకి వస్తే భవన నిర్మాణ కార్మికుల కేంద్ర చట్టం-1996, వలస కార్మికుల చట్టం-1979 రద్దవుతాయి. రాష్ట్ర వెల్ఫేర్ బోర్డులు నిర్వీర్యమై ప్రస్తుతం కార్మికులకు అందుతున్న సంక్షేమ పథకాలూ అందకుండా పోతాయి. గ్రూప్‌హౌస్‌ల పేరుతో సెస్సు వసూలు జరగకుండా యజమానుల ఇష్టారాజ్యంగా మారుతుంది. బోర్డు నిధులు దుర్వినియోగమవు తాయి, పని గంటలు పెరుగుతాయి. మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యాక్ట్ రద్దయిపోతుంది. హిట్ అండ్ రన్ వంటి చట్టాలు అమల్లోకి వస్తాయి. పని పరిస్థితులు తీవ్రంగా దెబ్బతింటాయి. సామాజిక భద్రత ఉండదు. కార్మిక సంఘాలు ఏర్పాటు కూడా కష్టమవు తుంది. పోరాటం చేయలేని స్థితిని కల్పిస్తారు. బీడీ కార్మికుల వెల్ఫేర్ సెస్సు యాక్ట్ రద్దవడంతో ఉన్న కొద్దిపాటి సంక్షేమ పథకాలు కూడా నిలిపివేయబడ్డాయి. కనీస పెన్షన్, జీవిత బీమా, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా, మహిళా కార్మికులకు ప్రసూతి సౌకర్యాలు అందడం లేదు.



రేపు లేబర్ కోడ్స్ అమల్లోకి వస్తే భవన నిర్మాణ కార్మికుల కేంద్ర చట్టం-1996, వలస కార్మికుల చట్టం-1979 రద్దవుతాయి. రాష్ట్ర వెల్ఫేర్ బోర్డులు నిర్వీర్యమై ప్రస్తుతం కార్మికులకు అందుతున్న సంక్షేమ పథకాలూ అందకుండా పోతాయి. గ్రూప్‌హౌస్‌ల పేరుతో సెస్సు వసూలు జరగకుండా యజమానుల ఇష్టారాజ్యంగా మారుతుంది. బోర్డు నిధులు దుర్వినియోగమవుతాయి, పని గంటలు పెరుగుతాయి. మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యాక్ట్ రద్దయిపోతుంది. హిట్ అండ్ రన్ వంటి చట్టాలు అమల్లోకి వస్తాయి. పని పరిస్థితులు తీవ్రంగా దెబ్బతింటాయి. సామాజిక భద్రత ఉండదు. కార్మిక సంఘాలు ఏర్పాటు కూడా కష్టమవుతుంది. పోరాటం చేయలేని స్థితిని కల్పిస్తారు.

### వెల్ఫేర్‌బోర్డుపై పాలకుల నిర్లక్ష్యం

రాష్ట్ర వ్యాప్తంగా సుమారు కోటి మంది అసంఘటిత కార్మికులున్నారు. ప్రధానంగా భవన నిర్మాణం, హమాలీ, ట్రాన్స్‌పోర్ట్, బీడీ, తోపుడుబండ్లు, షాప్ ఎంప్లాయీస్ తదితర రంగాల్లో పనిచేస్తున్నారు.ఉత్పత్తిలో వీరిది కీలక పాత్ర. కానీ, ప్రభుత్వాల నుంచి భద్రతగానీ, సంక్షేమ పథకాలుగానీ కల్పించడంలేదు. కుటుంబ పోషణ భారంగా మారి అనేక ఒడిదుడుకుల మధ్య జీవనం కొన సాగిస్తున్న పరిస్థితి. ఈ రంగంలో పనిచేస్తున్న వారందరికీ వెల్ఫేర్‌బోర్డు ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఆ వైపు సర్కార్ దృష్టి కొరవడింది. 2009 నుండి 11.5 లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల కార్డులు అధికారుల నిర్లక్ష్యంతో రెన్యువల్ కాక, వారికి సంక్షేమ పథకాలందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారి కార్డులను వెల్ఫేర్ బోర్డే స్వయంగా రెన్యువల్ చేయాల్సి ఉన్నా ఆ దిశగా చర్యల్లేవు. నిలిపివేయబడ్డ (అబయన్స్‌లో పెట్టిన) బీడీ కార్మికుల కనీస వేతనాల జీఓ నెం.41ని అమలు చేయాలి. అసం ఘటిత కార్మికులందరికీ పెన్షన్, పిఎఫ్, ఈఎస్‌ఐ వంటి చట్టబద్ధ హక్కుల కల్పన కోసం దశాబ్దాలుగా పోరాడుతున్నా వీరి గోడు ప్రభుత్వాలకు పట్టడం లేదు. కార్మికులకు పని భద్రత, కనీస వేతనాలు, పని గంటలు, పిఎఫ్, ఈఎస్‌ఐ, పెన్షన్ వంటి చట్ట బద్ధ హక్కులు కల్పించడంలో పాలకులు ఏండ్లుగా విఫలమ వుతూనే ఉన్నారు.అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రత కల్పిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించి అధికారంలోకి వచ్చి పదిహేను నెలలు దాటినా నేటికీ అతీగతి లేదు. ఇప్పటికైనా సంక్షేమ పథకాల అమలు, భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని కార్మిక సంఘాల నాయకులతో నియమించాలి. తద్వారా బోర్డు నిధులు దుబారా చేయకుండా కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయాలి.

### మేనిఫెస్టోను మరిచారా?

'ఇందిరమ్మ రాజ్యం, ఇంటింటా సౌభాగ్యం, మేమిచ్చిన ప్రతి మాటను అమలు చేస్తాం, మాది ప్రజా ప్రభుత్వం, మేము పాలకులం కాదు, సేవకులమని' చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను అమలు చేయడం లేదు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రతి "ఆటో" డ్రైవర్‌కు ఏడాదికి రూ.12వేల ఆర్థిక సాయం అందజేస్తామని, ఆటోడ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి సామాజిక భద్రత కలిస్తామని, ప్రతి పట్టణంలో ఆటోనగర్‌లను ఏర్పాటు చేస్తామని చెప్పినప్పటికీ ఆచరణకు నోచుకోవడం లేదు. హమాలీలకు హెల్త్ కారులిస్తామని, ప్రతి మండల కేంద్రంలో హమాలీనగర్‌లను ఏర్పాటు చేసి ఇళ్లను కేటాయిస్తామని చెప్పి మొండిచేయినే చూపిస్తున్నది. బీడీ కార్మికులకు 2014 పిఎఫ్ కటాఫ్ తేదీని తొలగించి చేయూత పెన్షన్ అందిస్తామని చెప్పినప్పటికీ బీడీ కార్మికులను జీవిత బీమా, ఈఎస్‌ఐ పరిధిలోకి తెస్తా మని, అసంఘటితరంగ కార్మికుల సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేసామి, చిరు వ్యాపారులు ఫుట్‌పాత్ వ్యాపారస్తులకు తోపుడుబండ్ల వ్యాపారులకు గుర్తింపు కార్డులిచ్చి బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణ సదుపాయం కల్పిస్తామన్న హామీల్లో ఏ ఒక్కటి కూడా నెరవేరలేదు.

### వలస కార్మికులకు రక్షణేది?

అంతర్రాష్ట్ర వలస కార్మికుల చట్టం-1979ను అమలు చేయటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర వైఫల్యం చెందాయి. ఈ చట్టం ప్రకారం వలస కార్మికుల పేర్లు నమోదు చేయాలి. సొంత గ్రామం నుండి పనిచేసే ప్రాంతానికి రానూపోను ప్రయాణ ఛార్జీలు ఇవ్వాలి. కార్మికులకు కనీస వేతనాలు, చట్టబద్ధ హక్కులు, సమాన పనికి - సమాన వేతనం, పునరావాసం కల్పించాలి. పిల్లలకు మొబైల్ విద్యా వైద్య సౌకర్యం కల్పించాలి. పని ప్రదేశంలో రక్షణ కల్పించాలని చట్టం చెబుతున్నా, ఆ చట్టాన్ని అమలు చేయకుండా నిర్లక్ష్యం చేయడం ఫలితంగా వలస కార్మికుల బతుకులు అగమ్యగోచరంగా మారి అనేక ప్రమాదాలు జరిగి వారు దిక్కుతోచని స్థితిలో వలస కార్మికుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం, పెంటవెల్లి గ్రామ సమీపంలో ఎస్-ఎల్‌బిసి టన్నెల్‌లో జరిగిన ప్రమాదంలో జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, జమ్మూ-కాశ్మీర్ రాష్ట్రాలకు చెందిన ఎనిమిది మంది వలస కార్మికులు టన్నెల్‌లో మట్టి దిమ్మలు కూలి, నీరు నిండి సజీవ సమాధయ్యారు. టన్నెల్ పని కాంట్రాక్ట్‌కు తీసుకున్న కంపెనీ రక్షణ చర్యలు తీసుకోకపోవడం, పని ప్రదేశంలోకి కార్మికులను పంపే ముందు జియోలాజికల్ సర్వే చేయకపోవడం వలన ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న పని తెలుసుకోకపోవడం మూలంగా వలస కార్మికుల నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. వారి మృత దేహాలను కూడా వారి కుటుంబాలకు అందించలేని స్థితి గత ఇరవై ఐదురోజులుగా కొనసాగుతున్నది. వారి కుటుంబాల రోదన వర్ణనాతీతం. వీరంతా అసంఘటితరంగానికి చెందిన వలస కార్మికులే. ఈ నేపథ్యంలో కేంద్రం మతోన్మాద విధానాలు, కార్పొరేట్ శక్తుల ఆధిపత్యాన్ని వ్యతిరేకిస్తూ, రాష్ట్రంలో అసంఘటితరంగ కార్మికులకు సామాజిక భద్రత, వెల్ఫేర్ బోర్డు, సంక్షేమ పథకాల చేయాలని డిమాండ్ చేస్తూ నేడు(21 మార్చి 2025) హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద జరిగే మహాధర్నా తలపెట్టింది. అసంఘటితరంగ కార్మికులంతా అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలి.

## ఉగాది నుంచైనా కొత్త రేషన్ కార్డులిస్తారా..?

- కార్డుల జారీ నిరంతర ప్రక్రియగా జరగాలి : సీపీఐ(ఎం) నగర కార్యదర్శి ఎం.వెంకటేష్ డిమాండ్
- సీఆర్వో ఆఫీస్ ఎదుట ధర్నా
- ప్రభుత్వ ఆదేశాల మేరకు అందిస్తాం .. : సీఆర్వో



**నవతెలంగాణ-సిటీబ్యూరో**

కొత్త రేషన్ కార్డుల జారీకి సంబంధించి ప్రభుత్వం వాయిదాలకే పరిమితమవుతోందని, మళ్లీ ఇప్పుడు ఉగాది నుంచి తెల్లరేషన్ కార్డులు మంజూరు చేస్తామని చెబుతున్నా.. అప్పటి నుంచైనా ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారా..? అని సీపీఐ(ఎం) పార్టీ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్ ప్రశ్నించారు. అర్హులైన పేదలకు వెంటనే రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం సికింద్రాబాద్‌లోని చీఫ్ రేషనింగ్ ఆఫీసర్ కార్యాలయం వద్ద సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.వెంకటేష్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో కొత్త రేషన్ కార్డులు ప్రభుత్వం ఎప్పుడు ఇస్తుందా అని ప్రజానీకం ఎదురు చూస్తోందని అన్నారు. గత ప్రభుత్వం రేషన్ కార్డుల విషయంలో ప్రజలకు చాలా అన్యాయం చేసిందని, బైక్, కారు ఉన్నాయన్న కారణంతో పదేండ్ల కాలంలో రాష్ట్రంలో 4,76,282 రేషన్ కార్డులను, హైదరాబాద్‌లో 1,63,392 రేషన్ కార్డులను తొలగించిందన్నారు. రాష్ట్రంలో కొత్తగా 3,11,025, హైదరాబాద్‌లో 56,066 రేషన్ కార్డులు మాత్రమే ఇచ్చారని గుర్తుచేశారు. కొత్తగా ఇచ్చిన రేషన్ కార్డుల కంటే అదనంగా 1,65,257 కార్డులను తొలగించినట్టు వివరించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో కొత్తగా పెండ్లయిన కుటుంబాలు, పిల్లల పేర్లు నమోదు చేసుకోవాల్సిన కుటుంబాలు, రేషన్ కార్డులు లేని కుటుంబాలు సుమారు 7 లక్షల మంది వరకు ఉన్నారని, వీరంతా రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. ఆరోగ్యశ్రీతో పాటు ప్రభుత్వ పథకాలన్నింటికీ రేషన్ కార్డునే పరిగణలోకి తీసుకుంటున్నారని, అందువల్ల పాత రేషన్ కార్డులో పేరు కట్ అయిన వెంటనే కొత్త రేషన్ కార్డులో పేరు నమోదు చేయాలని కోరారు. రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం జరగాలన్నారు.

సీపీఐ(ఎం) నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.దశరథ్ మాట్లాడుతూ.. రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పులు లేక.. ఆరోగ్యశ్రీ, ప్రభుత్వ పథకాలు అందక పేదలు అవస్థలు పడుతున్నారన్నారు. పార్టీ నగర కార్యదర్శివర్గ సభ్యులు కె.నాగలక్ష్మి మాట్లాడుతూ.. కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో ఇస్తున్న విధంగా రేషన్‌లో 14 రకాల వస్తువులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్టీ నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.మహేందర్ మాట్లాడుతూ.. రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం ఇస్తామన్న వాగ్దానాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం సీఆర్వో జి.ఫణీంద్ర రెడ్డికి ప్రతినిధుల బృందం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా సీఆర్వో స్పందిస్తూ.. రేషన్ కార్డుల దరఖాస్తులు నగరంలో 1,50,000 వచ్చాయని, వాటిని సర్వే చేస్తున్నామని, ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్ కార్డులు ఇస్తామని, మిగతా అంశాలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని వివరించారు. ఈ ధర్నాలో సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు ఎం.శ్రీనివాస్, ఎం.శ్రీనివాసరావు, కెఎస్.రాజన్న, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.వెంకటేష్, ఎస్.మారన్న, ఎం.అజయ్‌బాబు, ఆర్.అశోక్, జి.నరేష్, నాయకులు పి.విమల, ఆర్.మల్లేష్, ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మీడియా అడ్వైజరీ కమిటీని ప్రకటించండి

- శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబుకు టీడబ్ల్యూజేఎఫ్ విజ్ఞప్తి



**నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్**

అసెంబ్లీ మీడియా అడ్వైజరీ కమిటీని వెంటనే ప్రకటించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ప్రభుత్వాన్ని కోరింది. శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబును బుధవారం అసెంబ్లీలోని ఆయన ఛాంబర్‌లో ఫెడరేషన్ ప్రతినిధి బందం కలిసి వినతిపత్రం సమర్పించింది. అసెంబ్లీ మీడియా పాసుల గడువు ముగిసి ఏడు నెలలు కావస్తున్నా ఇప్పటివరకూ కొత్త పాసులు ఇవ్వలేదని ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు బట్టిపాటి రాజశేఖర్ మంత్రి దష్టికి తీసుకెళ్లారు. పాత పాసుల కారణంగా అసెంబ్లీ ఎంట్రీ సమయంలో పోలీసులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామనీ, గడువు ముగిసిన పాస్‌ల వినియోగం జర్నలిస్టులకు ఇబ్బందిగా ఉన్నదని ఫెడరేషన్ బందం మంత్రికి ఫిర్యాదు చేసింది. అసెంబ్లీ మీడియా అడ్వైజరీ కమిటీ లేకపోవటం వల్ల మీడియా పాస్‌ల జారీలో తీవ్ర జాప్యం జరుగుతున్నదని గుర్తు చేశారు. మీడియా సలహా కమిటీని వెంటనే ప్రకటించి కొత్త పాసులు జారీ చేయాలని టీడబ్ల్యూజేఎఫ్ మంత్రికి విజ్ఞప్తి చేసింది. ఇందుకుగాను మంత్రి శ్రీధర్‌బాబు స్పందిస్తూ ఈ విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. ముఖ్యమంత్రితో సమావేశమై వెంటనే నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో హెచ్‌యూజే అధ్యక్షులు బి అరుణ్ కుమార్. రాష్ట్రకార్యవర్గ సభ్యులు రామకష్ణ, సీనియర్ జర్నలిస్టులు ప్రదీప్, వెంకన్న , పూర్ణచందర్‌రావు తదితరులు ఉన్నారు.

## వేసవిలో విద్యుత్ సరఫరాలో సమస్యలు ఉండొద్దు

- సందీప్ కుమార్ సుల్తానియా

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

వేసవిలో ఏ ఒక్క వినియోగదారుడికీ సరఫరా సమస్యలు ఉండొద్దని ప్రభుత్వ ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా అధికారులను ఆదేశించారు.వేసవిలో పెరుగుతున్న డిమాండ్‌కు తగ్గట్టు జీహెచ్ఎంసీ పరిధిలో తీసుకున్న చర్యలపై గురువారం హైదరాబాద్‌లో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రేటర్ హైదరాబాద్ నగరంలో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ డిమాండ్ వార్షిక పెరుగుదల 30 శాతనికి మించి నమోదవుతుందని తెలిపారు. గతేడాది వేసవి అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ట్రాన్స్ కో పరిధిలో బౌరంపేట్, ఆర్సీ పురం, మౌలా-అలీ, బండ్ల గూడా, గచ్చిబౌలి, కైతలాపుర్, బొల్లారం ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్లలో పవర్ ట్రాన్స్ ఫార్మర్ కెపాసిటీ లను పెంచినట్టు తెలిపారు. టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ మాట్లాడుతూ, గతేడాది జీహెచ్ఎంసీలో అత్యధిక డిమాండ్ 4,352 మెగావాట్లుగా రికార్డు అయినట్టు తెలిపారు. ఈ వేసవిలో 5,000 మెగా వాట్లకుపైగా ఉంటుందని చెప్పారు. ఈ డిమాండ్‌ను తగినట్టు ఏర్పాట్లు చేశామన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ట్రాన్స్ కో జేఎండీ సి.శ్రీనివాస రావు, డైరెక్టర్ జగత్ రెడ్డి, టీజీఎస్పీడీసీఎల్ డైరెక్టర్లు నంద కుమార్, సాయి బాబా, డాక్టర్ నర్సింహులు, సుధా మాధురి తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఉత్తరాదిలో ఉపాధి ఉంటే దక్షిణాదికి వలసలెందుకు?

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

యూపీ, బీహార్, జార్ఖండ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ లాంటి ఉత్తరాదిలో రాష్ట్రాల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి అద్భుతంగా ఉంటే అక్కడ నుంచి దక్షిణాది రాష్ట్రాల్లోని చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్ నగరాలకు వలసలెందుకు పెరుగుతున్నాయని బీజేపీ నేతలను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. అభివృద్ధి వాళ్లు సాధించినట్టా? మేం సాధించినట్టా అని అడిగారు. తెలంగాణలో నిరుద్యోగం 6.1 శాతానికి తగ్గిందనీ, నిత్యావసరాల ధరల పెరుగుదల అతి తక్కువగా 1.3 శాతం నమోదైందని కేంద్రమే చెబుతున్నదని వివరించారు. కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నా..విమర్శలొస్తున్నా పారదర్శకమైన పాలన అందించడం, తెలంగాణను దేశానికే మోడల్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మరోమారు స్పష్టం చేశారు. సీఎం పదవి చేపట్టినప్పటి కంటే జెడ్పీటీసీగా గెలిచినప్పుడే ఎక్కువ ఆనందం కలిగిందనీ, జీవితంలో తొలి అవకాశం ద్వారా వచ్చే అనుభూతి కలకాలం నిలిచిపోతుందని గుర్తు చేసుకున్నారు. గరం..నరం..బేషరం అనే నానుడికి భిన్నంగా ఉద్యోగంలో చేరినప్పటి నుంచి రిటైర్డ్ అయ్యే వరకూ స్వభావాన్ని మార్చుకోవద్దని కొత్తగా ఉద్యోగబాధ్యతలు చేపడుతున్న వారికి సూచించారు. తాను జెడ్పీటీసీగా ఉన్నప్పుడు ఏదైతే స్వభావంతో ఉన్నానో సీఎం అయినప్పటికీ దాన్నే కొనసాగిస్తున్నానని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్ శాఖల్లో కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు పొందిన 922 మందికి నియామక పత్రాలను మంత్రి సీతక్కతో కలిసి సీఎం అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మాణాలు చేపట్టే వారికి సులువుగా, పారదర్శకంగా అనుమతులిచ్చేలా రూపొందించిన బిల్డ్‌నౌ పోర్టల్‌ను సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దరఖాస్తు చేసుకున్న ముగ్గురికి అనుమతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సీఎస్ శాంతికుమారి, మున్సిపల్ శాఖ ప్రధాన కార్యదర్శి దానకిశోర్, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యేలు శంకర్, కాలెయాదయ్య, ప్రభుత్వ సలహాదారులు హర్కార వేణుగోపాల్, మాజీ ఎంపీ వేణుగోపాలచారీ, తదితరులు పాల్గొన్నారు.




### కాలగర్భంలో పదేండ్ల విలువైన సమయం

ప్రతి వ్యక్తి జీవితంలో పదేండ్ల సమయం ఎంతో విలువైనదనీ, గత ప్రభుత్వం కారుణ్య నియామకాలు చేపట్టకపోవడం వల్ల పదేండ్లు కాలగర్భంలో కలిసిపోయాయని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. జాబ్‌క్యాలెండర్‌తో పాటు కారుణ్య నియామకాలను క్రమం తప్పకుండా చేపట్టాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. గత ప్రభుత్వ వైఫల్యం, బాధ్యతారాహిత్యం వల్లనే 20 నుంచి 25 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలు గందరగోళంగా మారాయని వాపోయారు. తమ ప్రభుత్వం ఉద్యోగాల భర్తీని ప్రాధాన్యతగా తీసుకుని ఏడాదిలోనే 57,924 మందికి కొత్త ఉద్యోగాలిచ్చిందని చెప్పారు. గత ప్రభుత్వ నోటిఫికేషన్లకు నియామక పత్రాలు అందజేస్తున్నామని బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ప్రచారాన్ని తిప్పకొట్టారు. మీరేసిన నోటిఫికేషన్లు అయితే సక్రమంగా పరీక్షలు ఎందుకు నిర్వహించలేదు? పేపర్ల లీక్‌లను ఎందుకు అరికట్టలేదు? కోర్టు కేసులను ఎందుకు పరిష్కరించలేదు? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. నీళ్లు, నిధులు, నియామకాల ఆధారంగానే తెలంగాణ ఉద్యమం నడిచింది కదా.. పదేండ్లలో ఉద్యోగాలను ఎందుకు భర్తీ చేయలేదని నిలదీశారు. ఆ ఉద్యోగాలను భర్తీ చేసుకుంటే తమకు ఈ అవకాశం వచ్చి ఉండేది కాదన్నారు. విధినిర్వహణలోని ఉద్యోగి చనిపోతే ఆ కుటుంబం ఎంత బాధపడుతుందో తెల్వదా? అసలు వారికి కారుణ్య నియామకాలంటే అర్థం తెలుసా? అని ప్రశ్నించారు. తన కూతురు ఎంపీగా ఓడిపోతే ఎమ్మెల్సీగా, బంధువు ఓడిపోతే ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులుగా కారుణ్య నియామకాల కింద పదవులు ఇచ్చుకున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వం మాత్రం అలా చేయడం లేదన్నారు. ఉమ్మడి ఏపీ చరిత్రలోగానీ, గుజరాత్ చరిత్రలోగానీ ఒక్క ఏడాదిలో 59 వేల ఉద్యోగాల భర్తీ ఏనాడైనా చేపట్టారా? అని ప్రశ్నించారు. పారదర్శకంగా, ఒక క్రమ పద్ధతిలో పరీక్షలు నిర్వహణ, ఉద్యోగాల నియామకాలు చేపడుతూ ముందుకెళ్తున్నామన్నారు. నోటిఫికేషన్‌లన్నింటినీ ఒకేసారి విడుదల చేయొద్దని గతంలో ఎప్పుడైనా ఆందోళనలు జరిగాయా? అని అడిగారు. ఒకేసారి 563 గ్రూపు వన్ పోస్టులను ఎన్నడూ భర్తీ చేయలేదన్నారు. 30 నుంచి 40 రోజుల్లో గ్రూపు-1, గ్రూపు-2, గ్రూపు-3 అభ్యర్థులకు నియామకపత్రాలను అందజేస్తామన్నారు. తన కుటుంబ సభ్యులుగా భావించి వారి కండ్లలో ఆనందం చూడాలని ఎల్బీస్టేడియం, రవీంద్రభారతి వేదికలుగా కుటుంబ సభ్యుల సమక్షంలో నియామక పత్రాలు అందజేస్తున్నామన్నారు.

### సోషల్‌మీడియా వేదిక విష ప్రచారం..

'మీకు ఉద్యోగాలు ఇచ్చినందుకు నాపై కోపం ఉందా? 20,617 కోట్లతో రూ.2 లక్షల లోపు రుణమాఫీ చేసినందుకు రైతులు నాపై కోపంగా ఉన్నారా? ఉచిత బస్సు ప్రయాణం కల్పించినందుకు ఆడబిడ్డలు నా మీద కోపంగా ఉన్నారా? 1000 బస్సులకు ఓనర్లను చేసినందుకు..వెయ్యి మెగా వాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్లు పెట్టుకునే అవకాశం కల్పించినందుకు మహిళా సంఘాలు కోపంగా ఉన్నాయా? డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచినందుకు పిల్లలు నా మీద కోపంగా ఉన్నారా? 57 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగ నియామక పత్రాలు అందించినందుకు కోపంగా ఉన్నారా? ఇన్ని చేసిన తనపై ప్రజలు ఎందుకు కోపంగా ఉంటారు. కావాలనీ బీఆర్ఎస్ వాళ్లు సోషల్‌మీడియా వేదికగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. నిజం గడపదాటకముందే అబద్ధం ప్రపంచం చుట్టొచ్చినట్టు వారి తప్పుడు ప్రచారం ఎక్కువవుతున్నది. పదేండ్లలో పోగేసుకున్న నల్లధనాన్ని పెట్టుబడిగా, ఇంధనంగా మార్చుకుని విషప్రచారం చేస్తున్నారు. ఇది ఎల్లకాలం నడువదు. ఇలాగే అబద్ధాలు చెప్పుకుంటూ పోతే ప్రజలు మిమ్మల్ని పట్టించుకోవడం మానేస్తారు' అంటూ బీఆర్ఎస్‌నుద్దేశించి పరోక్షంగా హెచ్చరికలు జారీ చేశారు.

### గడీల్లో పెరగలేదు..నల్లమల అడవుల్లో పెరిగా

తాను గడీల్లో పెరగలేదనీ, నల్లమల బిడ్డగా పేదలు, చెంచుల మధ్య పెరిగానని సీఎం చెప్పారు. తనకు పాలనపై పట్టులేదని బీఆర్ఎస్ వాళ్లు చేస్తున్న ప్రచారాన్ని కొట్టిపడేశారు. ఎన్నడూ సచివాలయానికి రాకుండా ఫాంహౌజ్‌లో ఉండేవాళ్లకు పాలన మీద పట్టు ఉన్నట్టా? అని ప్రశ్నించారు. తాము ప్రతిరోజూ సచివాలయానికి వస్తున్నామనీ, రాష్ట్ర అభివృద్ధి కోసం తాను, తన క్యాబినెట్ 18 గంటల కష్టపడి పనిచేస్తున్నదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో నిరసనలు, ధర్నాచౌక్‌లో ఆందోళనలు జరిగితే పట్టులేనట్టా అని నిలదీశారు. అది పాలనపై పట్టు లేనట్టు కాదనీ, తమ సమస్యలను చెప్పుకునే హక్కును, స్వేచ్ఛను ఉద్యోగులకు, కార్మికులకు, ప్రజలకు ఇచ్చామని తెలిపారు. గతంలో కోదండరామ్ ఇంటికెళ్లి తలుపులను బద్దలు కొట్టినట్టుగానే..ఒక్కసారి పోలీసులను ఆదేశిస్తే కేటీఆర్‌ను తీసుకొచ్చి దంచుతరన్నారు. ఆ విధానానికి తమ ప్రభుత్వం వ్యతిరేకమన్నారు. తమ ప్రభుత్వం మానవత్వంతో రాజ విజ్ఞతను పాటిస్తున్నదని చెప్పారు. దీనిని బట్టే ఎవరు ఎలాంటి వాళ్లనేదాన్ని ప్రజలు విశ్లేషించుకోవాలని కోరారు. త్వరలో వైటీడీఏ బోర్డు కమిటీని వేయబోతున్నట్టు ప్రకటించారు.

### గత పాలకులు కమీషన్ల కోసం 11 శాతం వడ్డీకి అప్పు

ఒక వ్యక్తి, ఒక కుటుంబం కమీషన్ల కోసం చేసిన అప్పు నేడు తెలంగాణ ప్రజలకు భారంగా మారిందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. రిటైర్డ్ బెనిఫిట్స్ ఇవ్వలేక గత ప్రభుత్వం ఉద్యోగ విరమణ వయస్సును 57 ఏండ్ల నుంచి 61 ఏండ్లకు పెంచిందని విమర్శించారు. ఇప్పుడు రిటైర్డ్ ఉద్యోగులకు ఇచ్చే బెనిఫిట్స్ రూ.8 వేల కోట్ల మేర పేరుకుపోయాయని చెప్పారు. తమ ప్రభుత్వం ప్రతినెలా రెండు, మూడుదొందల కోట్ల రూపాయలను సర్దుబాటు చేస్తున్నదనీ, అత్యవసరం ఉన్నవారికి తొలి ప్రాధాన్యం ఇచ్చి క్లియర్ చేస్తున్నామని తెలిపారు. ప్రాజెక్టులకు సంబంధించిన డీపీఆర్‌లు ఇస్తే చాలా బ్యాంకులు నాలుగు నుంచి ఐదు శాతం వడ్డీకి రుణాలిస్తుంటే గత ప్రభుత్వం కమీషన్ల కోసం 11 శాతం వరకు వడ్డీ కింద అప్పులు చేసిందని ఎత్తిచూపారు. డీపీఆర్ ఇస్తే దొంగతనం బయటపడుతుందని కాళేశ్వరం ప్రాజెక్టు కోసం 10.50 శాతం వడ్డీ కింద అప్పు తెచ్చిందని వివరించారు. ఢిల్లీ చుట్టూ 32 సార్లు తిరిగి దాన్ని ఐదారు శాతానికి రీస్ట్రోర్‌మెంట్ చేయించేందుకు తిప్పలు పడుతున్నామన్నారు. గత పాలకులు చేసిన నిర్వాహకాన్ని చూసి ఇప్పుడెవ్వడూ మనల్ని నమ్మట్లేదనీ, అప్పు పుట్టట్లేదని చెప్పారు. చేసిన నిర్వాహకాలను ఇంకెన్నాళ్లు దాచిపెట్టాలని ప్రశ్నించారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు, వడ్డీలకు రూ.1,53,000 వేల కోట్లను కట్టామనీ, అవే డబ్బులుంటే దరఖాస్తు చేసుకున్నవారందరికీ ఆ డబ్బులతో ఇందిరమ్మ ఇండ్లు పూర్తయ్యేవనీ, రెండు లక్షలకుపైగా ఉన్న రుణమాఫీ కూడా పూర్తయ్యేదని చెప్పారు.

### గ్లోబల్ ల్యాండ్ మార్క్‌గా హైదరాబాద్

తెలంగాణలో మిస్‌వరల్డ్ పోటీలు నిర్వహిస్తే తప్పేంటని సీఎం ప్రశ్నించారు. దానిపై అవగాహన లేని వారే విమర్శిస్తున్నారని దెప్పిపొడిచారు. ఆ పోటీలకు 120 దేశాల నుంచి ప్రతినిధులు వస్తారనీ, ప్రపంచ నలుమూలల నుంచి 3 వేల మంది న్యూస్‌ఛానళ్ల, పేపర్ల జర్నలిస్టులు వస్తారని తెలిపారు. దీని ద్వారా గ్లోబల్‌లో హైదరాబాద్ ల్యాండ్ మార్క్‌గా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటివరకూ 72 సార్లు ఆ పోటీలు జరగ్గా..భారతదేశంలో ముంబయి నగరంలో ఒక్కసారే జరిగాయనీ, రెండోసారి హైదరాబాద్‌లో జరుగబోతున్నాయని గుర్తుచేశారు. ఆ పోటీల ద్వారా నెలపాటు హోటల్, ఫుడ్, ట్రాన్స్‌పోర్టు రంగాలకు వందల కోట్ల ఆదాయం వస్తుందని తెలిపారు. మెక్‌డొనాల్డ్ కంపెనీ హైదరాబాద్‌లో కార్పొరేట్ ఆఫీసు పెట్టడానికి ముందుకొచ్చిందని చెప్పారు. అమెజాన్ కంపెనీ కూడా తన కార్యాలయాన్ని ఏర్పాటు చేయబోతున్నదన్నారు.

### ఇసుకపై రూ. ఏడు వేల కోట్ల దోపిడీ

గత ప్రభుత్వ హయాంలో ఇసుక మాఫియా ఏడువేల కోట్ల రూపాయల దోపిడీకి పాల్పడిందని సీఎం ఆరోపించారు. ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన ఆదాయానికి పెద్ద ఎత్తున గండి కొట్టారని అధికారుల సమీక్షలో తేలిందన్నారు. రాష్ట్రంలో నిర్మాణదారులు వాడిన సీకు, సిమెంట్ వినియోగం లెక్కలు తీయిస్తే..1.25 మెట్రిక్ టన్నుల ఇసుక అక్రమ పద్ధతిలో తరలుతుందని బయటపడిందన్నారు. అందుకే నగరంలో శాండ్ బజారులను ఏర్పాటు చేపించామనీ, అక్కడ నుంచి నిర్మాణదారులకు సరఫరా చేస్తున్నామని చెప్పారు. టన్నుకు సన్న ఇసుకకు రూ.1800, దొడ్డు ఇసుకకు రూ.1600 ధర నిర్వహించామని తెలిపారు. ఆయన మందు డెలివరీ పథకం తీసుకొస్తే..తాను ఇసుక డెలివరీ పథకం తీసుకొచ్చానని చలోక్తులు విసిరారు. కొన్ని కొత్త పనులు చేసేటప్పుడు ఇబ్బందులు, విమర్శలు వస్తాయనీ, దీన్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలని విన్నవించారు.

### అన్నీ అడ్డుకునే ప్రయత్నం

మేము చేయలేదు కాబట్టి వారిని చేయనియ్యం అన్నట్టుగా తాము చేస్తున్న ప్రతి దాన్నీ అడ్డుకునే ప్రయత్నాన్ని బీఆర్ఎస్ వాళ్లు చేస్తున్నారని సీఎం విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో కుటుంబం కేంద్రంగా నిర్ణయాలు జరిగితే తమ ప్రభుత్వంలో ప్రజలు, విద్యార్థులు, రైతుల కోణంలో నిర్ణయాలు జరుగుతున్నాయని వివరించారు. డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచొద్దని మేము చెప్పామా? అని ప్రశ్నించారు. హాస్టళ్లలోని పేదల పిల్లలకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం 40 శాతం డైట్‌చార్జీలను, చిన్నచిన్న అవసరాలను తీర్చేందుకు కాస్మోటిక్ చార్జీలను 200 శాతానికి పెంచి గ్రీన్ ఛానల్ ద్వారా అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో గురుకులాలకు సొంత భవనాలున్నాయా? అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం 58 నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి పూర్తిచేయాలనే లక్ష్యంతో గ్రీన్‌ఛానల్ ద్వారా నిధులు విడుదల చేస్తున్నామని చెప్పారు.

రాష్ట్రంలో ఏటా 1.10 లక్షల ఇంజినీరింగ్ విద్యార్థులు బయటకు వస్తున్నారనీ, వారిలో సరైన స్కిల్స్ లేకపోవడం వల్ల కేవలం 10 వేల మందికే ఉద్యోగాలు దక్కుతున్నాయనీ, మిగతా వారంతా నిరుద్యోగులుగా మారుతున్నారని వివరించారు. వారిలో స్కిల్స్ పెంచేందుకే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు.

# కనీస వేతనాలను సవరించి, పెంచి గెజిట్ విడుదల చేయాలి

- సీఎస్ ఓఎస్‌డీకి కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల నేతల వినతి

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

రాష్ట్రంలోని 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాలను సవరించి పెంచాలనీ, ఫైనల్ గెజిట్లను విడుదల చేయాలని కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఓఎస్‌డీ విద్యాసాగర్‌కు కార్మిక సంఘాల ప్రతినిధులు వినతిపత్రాన్ని అందజేశారు. అందులో విజయ్‌కుమార్ యాదవ్ (ఐఎన్‌టియుసి), ఎస్. బాల్‌రాజ్, ఎండి. యూసఫ్ (ఏఐటియుసి), రెబ్బా రామారావు, అంజాద్ (హెచ్ఎంఎస్), పాలడుగు భాస్కర్, జె. వెంకటేష్, కూరపాటి రమేష్ (సిఐటియు), కె. సూర్యం, ఎస్ఎల్. పద్మ (ఐఎఫ్‌టియు), జి. రాంబాబు యాదవ్ (బిఆర్‌టియు), ఎంకె. బోస్, బాబాయ్ (టిఎస్‌టియుసి), బాబూరావు (ఏఐయుటియుసి) ఉన్నారు. పెరిగిన ధరలకనుగుణంగా కనీస వేతనాల చట్టం 1948 ప్రకారం ఐదేండ్లకోసారి కనీసవేతనాలను పెంచాలనే విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. 2006-2012 మధ్యకాలంలో ఉమ్మడి రాష్ట్రంలో మాత్రమే జీఓలకు సవరణలు చేశారనీ, మళ్ళీ ఇప్పటిదాకా షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్‌లలో కనీస వేతనాలు సవరించలేదని గుర్తుచేశారు. ఈ అంశంపై రాష్ట్రంలోని కార్మికులు, కార్మిక సంఘాలు ఆందోళన చెందుతున్నాయని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. 2021 జూన్ మాసంలో 5 రంగాల షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్ జీవోఎంఎస్ నెం.21 సెక్యూరిటీ సర్వీసెస్, జీఓ నెం.22 కన్‌స్ట్రక్షన్, మెయింటెనెన్స్ ఆఫ్ రోడ్స్ అండ్ బిల్డింగ్స్ ఆపరేషన్స్, జీఓ నెం.23 స్టోన్ బ్రేకింగ్, జీఓ నెం.24 ప్రాజెక్టులు, డ్యామ్స్ మొదలైనవి, జీఓ నెం.25 ప్రయివేటు మోటార్ ట్రాన్స్‌పోర్ట్ రంగాల్లో కనీస వేతనం అన్‌స్కిల్డ్ వర్కర్‌కు రూ.18,019, మాగ్జిమం హైలీస్కిల్డ్ వర్కర్‌కు రూ.39,837లుగా నిర్ణయించారని తెలిపారు. కరువుభత్యం పాయింట్ల రేట్లు కూడా అన్‌స్కిల్డ్ వర్కర్ రూ.12, హైలీస్కిల్డ్‌కు రూ.26.55 ప్రతిపాదించారని గుర్తుచేశారు. ఆ జీఓలను గెజిట్ చేయాలని కోరారు. 68 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్‌లలోని జీఓలను వెంటనే ఇచ్చి, గతంలో 2021లో ఇచ్చిన 5 జీఓలతో సహా మొత్తం 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లను వెంటనే గెజిట్‌లో ముద్రించాలని విజ్ఞప్తి చేశారు.



# ఓయూలో తరగతుల బహిష్కరణ



- వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన
- ర్యాలీ తీస్తుండగా నాయకులను అరెస్టు చేసిన పోలీసులు
- పోలీస్‌స్టేషన్‌లో వారిని పరామర్శించిన సీపీఐ(ఎం) నేతలు

**నవతెలంగాణ-ఓయూ**

ఉస్మానియా యూనివర్సిటీలో ఎలాంటి ఆందోళనలూ చేయకూడదని అధికారులు జారీ చేసిన సర్క్యులర్‌కు వ్యతిరేకంగా ఓయూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగుతున్నాయి. గురువారం వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బంద్‌కు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. విద్యార్థులు ఓయూ ఆర్ట్స్ కళాశాలలో క్లాస్‌లను బైకాట్ చేసి ర్యాలీకి బయలుదేరగా.. పోలీసులు ఆర్ట్స్ కళాశాలలోకి వెళ్లి విద్యార్థి నాయకులను అరెస్టు చేశారు. ఈ క్రమంలో విద్యార్థులకు పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. అనంతరం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్.మూర్తి మాట్లాడుతూ.. సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలని వారం రోజులుగా శాంతియుతంగా పోరాడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం, ఓయూ వీసీ, రిజిస్ట్రార్ స్పందించడం లేదన్నారు. వారు మౌనం వీడాలని డిమాండ్ చేస్తూ ఓయూ అడ్మినిస్ట్రేషన్ వైఖరిని నిరసిస్తూ బంద్ నిర్వహించామన్నారు. అధికారంలోకి రాకముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏడో గ్యారంటీగా ప్రజాస్వామ్యాన్ని అమలు చేస్తామని చెప్పి నేడు నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి, ప్రజా ఉద్యమాలపై ఆంక్షలు విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా పాలన అంటే ఇదేనా అని ప్రశ్నించారు. విద్యార్థి ఉద్యమాలపై ఆంక్షలు విధిస్తూ అణచివేస్తున్న సర్క్యులర్‌ను వెంటనే రద్దుచేసి యూనివర్సిటీలో స్వేచ్ఛా వాతావరణం నెలకొల్పాలని, క్యాంపస్ ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. విద్యా రంగానికి బడ్జెట్‌లో 7.5 శాతం నిధులు కేటాయించి అన్యాయం చేశారని, రూ.500 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా యూనివర్సిటీలను ఎలా బాగు చేస్తారో చెప్పాలని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఓయూ అధ్యక్షులు ఉదయ్, నాయకులు లెనిన్, నాగేందర్, శ్రీను, అజయ్, ఏఐఎస్ఎఫ్ ఓయు అధ్యక్ష కార్యదర్శులు లెనిన్, నెల్లి సత్య, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్, పీడీఎస్‌యూ విజృంభన రాష్ట్ర కార్యదర్శి అల్లూరి విజయ్, ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కోట ఆనందరావు, పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

### వామపక్ష విద్యార్థులను పరామర్శించిన ఎస్.వీరయ్య

అరెస్టయిన విద్యార్థి నాయకులను లాలాగూడ పోలీస్ స్టేషన్‌కు తరలించగా, సాయంత్రం వారిని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి ప్రజా ఉద్యమాలపై ఆంక్షలు విధించడం సరికాదన్నారు. సర్క్యులర్‌ను రద్దు చేసి యూనివర్సిటీలో స్వేచ్ఛా వాతావరణాన్ని నెలకొల్పాలన్నారు. ఆయన వెంట సీపీఐ(ఎం) హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి వెంకటేష్, డీవైఎఫ్ఐ మాజీ కార్యదర్శి మహేందర్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి అశోక్ రెడ్డి ఉన్నారు.

# దండకారణ్యం రక్తసిక్తం

(మొదటిపేజీ తరువాయి)

స్వాధీనం చేసుకున్నారు. గంగలూరు నుంచి సుమారు 30 కిలోమీటర్లు కాలినడకన వెళ్లిన సైనికులు ఘటనా స్థలం నుంచి తిరిగి రావడానికి నానా అవస్థలు పడ్డారని ఐజీ తెలిపారు. ఎన్‌కౌంటర్ ప్రదేశం నుంచి ఏకే 47, ఎస్ఎల్ఆర్, ఐఎన్ఎస్ఏఎస్ 303, 315 బోర్, 12 బోర్, బర్మార్ మొదలైన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాలను తీసుకొస్తున్న జవాన్లకు డీఐజీ కమలోచన్ కస్యప్, బీజాపూర్ ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ ఎదురెళ్లి అభినందనలు తెలిపారు. అంద్రి అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో డీఆర్జీ బలగాలకు చెందిన జవాను మృతి చెందినట్టు ఎస్పీ తెలిపారు. ఎదురుకాల్పుల్లో డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, మహిళా కమాండోలు పాల్గొన్నట్టు వివరించారు.

### హిడ్మా కోసం గాలింపు

రాబోయే రోజుల్లో మావోయిస్టులపై పెద్ద ఎత్తున దాడులు జరిపేందుకు కేంద్రం తన బలగాలను రంగంలోకి దింపింది. మావోయిస్టు కమాండర్ హిడ్మా కోసం భద్రతా దళాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. హిడ్మాను వెతకడానికి 125కు పైగా గ్రామాల సాంకేతిక మ్యాపింగ్ జరుగుతోంది. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో ఉన్న దాదాపు 125 గ్రామాల థర్మల్ ఇమేజింగ్‌ను భద్రతా దళాలు సిద్ధం చేసుకుని గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి.

మావోయిస్టులు దేశానికి ఒక పెద్ద సమస్య, ఈ సమస్యను పెకిలించడానికి అటు కేంద్రంలోని బీజేపీ, ఇటు రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాలు వివిధ వ్యూహాల కింద పనిచేస్తున్నాయి. ఇందులో భాగంగా గత మూడు నెలల వ్యవధిలో భద్రతా దళాలు 77 మంది మావోయిస్టులను హతమార్చాయి.

### హెూంమంత్రి హర్షం

మావోయిస్టులపై జరిగిన ఈ దాడి పట్ల హెూంమంత్రి అమిత్ షా సంతోషం వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది మార్చి 31 లోపు నక్సల్ ఉగ్రవాదం అంతమవుతుందని ప్రకటించారు. 'మావోయిస్టు రహిత భారతదేశం ప్రచారం' దిశలో ఈ రోజు మన సైనికులు మరో పెద్ద విజయాన్ని సాధించారని ఆయన ఎక్స్‌లో రాశారు. మోడీ ప్రభుత్వం మావోయిస్టులపై క్రూరమైన వైఖరితో ముందుకు సాగుతోంది. లొంగిపోయిన వారికి అండగా నిలుస్తామని, లొంగని వారిని వదిలే ప్రసక్తేలేదంటూ కేంద్రం సంకేతాలిస్తోంది.

### మావోయిస్టులను కట్టడి చేస్తే..

మావోయిస్టులను కట్టడి చేసినట్టయితే...కీలకమైన అటవీ సంపదను దోచుకోవచ్చని కేంద్రం ప్లాన్ చేస్తున్నదని పర్యావరణ వేత్తలు, గిరిజన సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇప్పటికే ప్రభుత్వం పర్యావరణానికి విఘాతం కలిగేలా పలు చట్టాలకు తూట్లు పొడుస్తోంది. కార్పొరేట్లకు అప్పగించేలా చర్యలు తీసుకుంటున్న మోడీ సర్కార్ మావోయిస్టుల ఏరివేతను శీఘ్రం చేసిందన్న విమర్శలూ వెల్లువెత్తుతున్నాయి.

# బెట్టింగ్ యాప్ ప్రమోషన్స్..

(మొదటిపేజీ తరువాయి)

శర్మ అనే వ్యక్తి మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో ఎఫ్ఐఆర్ నెంబర్ 393/2025 కింద కేసులు సెక్షన్లు 318 (4) 112, 49 బీఎన్ఎస్ 3,3(ఏ) 4, టీఎస్ జీఏ, 66-డీ ఐటీఏ2000-2008 సెక్షన్ల కింద పలువురు సినీ ప్రముఖులపై పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు నమోదైన వారిలో సినీ ప్రముఖులు రానా దగ్గుబాటి, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మి, ప్రకాశ్‌రాజ్, నిధి అగర్వాల్, యాంకర్ శ్యామలతోపాటు మరికొందరి పేర్లు ఉన్నాయి. తదుపరి విచారణ అనంతరం వివరాలను వెల్లడిస్తామని సీఐ తెలిపారు.

## కబ్జాకు పాల్పడితే చర్యలు

హైడ్రా కమిషనర్ రంగనాథ్

- పీఏసీ చైర్మెన్, ఎమ్మెల్యే గాంధీ ఆరోపణల నేపథ్యంలో గంగారం చెరువు పరిశీలన



**నవతెలంగాణ-చందానగర్**

గంగారం పెద్ద చెరువు కబ్జాలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కబ్జాకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్ పరిధిలోని గంగారం పెద్ద చెరువును జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు, హైడ్రా సిబ్బందితో కలిసి రంగనాథ్ గురువారం ఉదయం క్షేత్రస్థాయిలో పర్యటించారు. చెరువు చుట్టూ ఎక్కడెక్కడ కబ్జాలు జరుగుతున్నాయి.. ఎంతమేర మట్టి పోశారు.. చెరువులో మట్టి నింపింది ఎవరు.. అనే దానిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువు కబ్జాలకు గురవుతుంటే ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సిబ్బంది తీరుపై రంగనాథ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ.. గంగారం పెద్ద చెరువు ఆక్రమణకు గురవుతున్నదని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మెన్ ఆరేకపూడి గాంధీ ఆరోపణల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పరిశీలనకు వచ్చామని తెలిపారు. చెరువును కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇందుకు సంబంధించి గత మూడు నెలల్లో చెరువులో మట్టి పోస్తూ పూడుస్తున్న పలువురిపై చందానగర్ పోలీస్ స్టేషన్‌లో హైడ్రా సిబ్బంది ఫిర్యాదు చేశారని, కేసులు కూడా నమోదైనట్టు వివరించారు. కబ్జాలకు పాల్పడేందుకు ముందుగా చెరువులో మట్టిని పోస్తారని, అనంతరం అక్కడ నిర్మాణాలు మొదలవుతాయని అన్నారు. అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చందానగర్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



### నిమ్స్ అభివృద్ధిలో ప్రభుత్వ భాగస్వామ్యం కీలకం

నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

పేదల కార్పొరేట్ ఆస్పత్రిగా పేరున్న నిమ్స్ ఆస్పత్రి అభివృద్ధిలో ప్రభుత్వ భాగస్వామ్యం ఎంతో ఉందని ఆస్పత్రి డైరెక్టర్, ప్రొఫెసర్, డాక్టర్ నగరి బీరప్ప తెలిపారు. ఈ మేరకు గురువారం శాసనసభలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో ఆస్పత్రికి ప్రాధన్యత ఇవ్వడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఆస్పత్రి అందిస్తున్న సేవలను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా నిమ్స్‌కు రూ.402.73 కోట్లు కేటాయించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్యులు, ఉద్యోగులు శక్తి వంచన లేకుండా నిరంతరం శ్రమిస్తున్నారని చెప్పారు. కార్పొరేట్ ఆస్పత్రులకు భిన్నంగా ఎప్పటికప్పుడు ఆధునిక పరికరాలను కొనుగోలు చేస్తూ సేవల్ని విస్తరించడంతో పాటు వేగంగా వైద్యం అందేలా చేస్తున్నట్టు తెలిపారు. ఆస్పత్రి చైర్మెన్‌గా సీఎం రేవంత్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కూడా ఆస్పత్రి అభివృద్ధి కోసం ప్రత్యేక చొరవ చూపుతున్నారని తెలిపారు. భవిష్యత్తులో ఆస్పత్రి సేవలు ఎక్కువ మంది పేదలకు అందించేందుకు ప్రత్యేక కార్యచరణ చేపట్టినట్టు డైరెక్టర్ పేర్కొన్నారు. బడ్జెట్‌లో వేతనాలకు రూ.292.93 కోట్లు, ఇతర ప్రోత్సాహకాలకు రూ.24 కోట్లు, అత్యవసర పరికరాలకు రూ.16.50 కోట్లు, సహాయక గ్రాంట్‌కు రూ.11.40, బీపీఎల్‌కు రూ. 7.90 కోట్లు, నిమ్స్ విస్తరణకు రూ.50 కోట్లు కేటాయించినట్టు వెల్లడించారు.

## మస్క్ గుప్పెట్లోకి టెలికాం?

(మొదటిపేజీ తరువాయి)

జతకట్టటానికి అంగీకరించాయి. అలాగే, జియో లక్సెంబర్గ్ ఎస్ఈఎస్‌తో, ఎయిర్‌టెల్ యూటెల్‌సాట్ వన్‌వెబ్‌తో ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. అంతరిక్ష శాఖ కింద ఉన్న ఇన్-స్పేస్ఎక్స్ ఈ రెండు సందర్భాలలో అనుమతిచ్చింది. ఇక స్పెక్ట్రమ్ వినియోగ ఛార్జీలు, వీటిని ఎలా సెట్ చేస్తారనే దానిపైనా స్పష్టత లేదని మార్కెట్ నిపుణులు చెప్తున్నారు. ఉపగ్రహ సమాచార మార్పిడికి ఇతర సమస్యలూ ఉన్నాయి. ప్రస్తుతమున్న అంతరిక్ష ఆధారిత ఇంటర్నెట్ (శాట్‌కామ్)ను జియోస్టేషనరీ ఉపగ్రహాలు అందిస్తున్నాయి. స్టార్‌లింక్ ఏడువేల కంటే ఎక్కువ ఉపగ్రహాలను కక్ష్యలో కలిగి ఉన్నదని నిపుణులు గుర్తు చేస్తున్నారు. అయితే, కక్ష్యలో ఎవరు ఎంత స్థలాన్ని ఆక్రమించవచ్చునేదానిపై ఎలాంటి నియంత్రణ కానీ, అంతర్జాతీయ ఒప్పందం కానీ లేదని చెప్తున్నారు. ఇది స్టార్‌లింక్‌కు, అమెరికాకు బాగా కలిసి వచ్చే అంశమని అంటున్నారు.

**కేంద్ర ప్రభుత్వంపై ఎలన్ 'ఎక్స్' దావా**

ఎలన్ మస్క్ నేతత్వంలోని సోషల్ మీడియా 'ఎక్స్' కేంద్ర ప్రభుత్వంపై దావా వేసింది. ఈ మేరకు కర్నాటక హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. చట్టవిరుద్ధంగా కంటెంట్‌ను నియంత్రిస్తోందని, ఏకపక్షంగా సెన్సార్‌షిప్‌నకు పాల్పడుతోందని కేంద్రంపై ఆరోపణలు చేసింది.

ఐటీ చట్టం, సహెయ్యాగ్ పోర్టల్ నిబంధనలు తమకున్న చట్టబద్ధమైన రక్షణలను ఉల్లంఘించేలా ఉన్నాయని, ఇది తమపై అనధికారికంగా సెన్సార్ చేయడం కిందికే వస్తుందని ఎక్స్ సంస్థ తన పిటిషన్‌లో పేర్కొంది. ప్రభుత్వం ఐటీ చట్టంలోని సెక్షన్ 79(3)(ఎ)ని దుర్వినియోగం చేస్తోందని ఆరోపించింది. ఐటీ చట్టం ప్రకారం.. బ్లాక్ చేసిన కంటెంట్‌ను తొలగించకపోతే, ఎక్స్ తన చట్టబద్ధమైన రక్షణ కోల్పోయే అవకాశం ఉంటుంది. అయితే ఈ సెక్షన్ కింద కంటెంట్ బ్లాక్ చేసే అధికారాన్ని ప్రభుత్వానికి ఇవ్వలేదని ఎక్స్ వాదిస్తోంది. సెక్షన్ 69(ఎ)ని పక్కదారి పట్టించడానికి అధికారులు ఈ నిబంధనను దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొంది. దేశంలో అల్లర్లు, ఘర్షణలకు కారణమయ్యే పోస్టులు, పూర్తి వివరాలు లేకుండా సష్టించిన ఖాతాలపై నియంత్రణ విధించేందుకు సెక్షన్ 69-ఎ ప్రకారం కేంద్రానికి అధికారం ఉంటుంది. అదే సమయంలో సెక్షన్ 79(3)(ఎ) స్పష్టమైన నియమాలు, తనిఖీలు లేకుండా సమాచారాన్ని బ్లాక్ చేయడానికి అధికారులు అనుమతి ఇస్తు న్నారని తన పిటిషన్‌లో ప్రస్తావించిందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇది విస్తతమైన సెన్సార్‌షిప్‌నకు దారితీస్తోందని విమర్శలు చేసింది. ఈ దావాపై కేంద్ర ప్రభుత్వవర్గాల నుంచి స్పందన వచ్చింది. ప్రభుత్వం చట్టాన్ని అనుసరించి ముందుకెళు ందని, సోషల్ మీడియా సంస్థలు నిబంధనలు పాటించాల్సిందేనని ఆ వర్గాలు పేర్కొన్నాయి.

## రైతులపై అనాగరిక దాడి : కిసాన్ సభ

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

పంజాబ్‌లో ఆప్ ప్రభుత్వం రైతులపై అనాగరిక దాడికి పాల్పడిందనీ, జాతీయ ఆర్గనైజింగ్ కమిటీ, కిసాన్ సభ తీవ్రంగా ఖండించాయి. ఈ మేరకు ఆ సంఘాల నేతలు కిచ్చెల రంగారెడ్డి, వి ప్రభాకర్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రైతాంగ సమస్యలపై కేంద్ర ప్రభుత్వం చర్చలు జరిపిన అనంతరం తిరిగి వస్తున్న రైతు నాయకుడు డాలే వాల్ సహ తమ అనుచర బృందాన్ని అరెస్టు చేయటం అమానుషమని తెలిపారు. శంభు, ఖానారి శిభిరాలను పోలీసులు ధ్వంసం చేశారని తెలిపారు. ప్రభుత్వ దమన నీతిని ప్రజాస్వామిక వాదులు ఖండించాలని విజ్ఞప్తి చేశారు.

# 13 నెలలు.. ఏడు హామీల కోసం ఉద్యమం

- కేంద్రమంత్రితో చర్చలకు పిలిచి.. మరోవైపు అన్నదాతపై అరాచకం
- పోలీసుల అదుపులో వంద మంది రైతులు, రైతు నేతలు
- సమర్థించుకున్న పంజాబ్ మంత్రి




**న్యూఢిల్లీ :** 13 నెలల తర్వాత.. శంభు సరిహద్దు ప్రయాణికుల కోసం తెరిచారు. దాదాపు 404 రోజుల తర్వాత పంజాబ్, అంబాలా మార్గంలో వాహనాలు నడుస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. ఏడు హామీల కోసం రోడ్డెక్కిన అన్నదాతల్ని.. ఎలాగైనా దెబ్బకొట్టాలన్న కేంద్రం వ్యూహం ఫలించింది. ఓ వైపు రైతు నేతలతో చర్చలకు రమ్మని పిలిచి.. సరిగ్గా వారు లేని సమయం చూసుకుని జేసీబీలతో పోలీసులు రెచ్చిపోయారు. శంభు ,ఖనౌరి సరిహద్దుల నుంచి రైతులను తొలగించి, బుల్డోజర్ల సహాయంతో అక్కడి తాత్కాలిక నైట్ షెల్టర్లను కూల్చివేసారు. ఈ మార్గంలో రైతులు దాదాపు 13 నెలలుగా నిరసనలు చేస్తున్నారు.

గతేడాది నవంబరు 26 నుంచి నిరాహార దీక్ష చేస్తున్న రైతు నేత జగ్జీత్ సింగ్ దల్లేవాల్ ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు డాక్టర్ల బృందం పర్యవేక్షిస్తోంది. కాగా రైతు ఆందోళనల నేపథ్యంలో రైతు నేత జగ్జీత్‌సింగ్ దల్లేవాల్‌ను జలంధర్ లోని పిమ్స్ (పంజాబ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్)కి పంజాబ్ పోలీసులు తరలించారు. గురువారం తెల్లవారు జామున 2 గంటల సమయంలో ఆయనను ఆస్పత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు. ఈ ఆసుపత్రి వెలుపల భారీగా పోలీసు బలగాలు మోహరించాయి.

కాగా, బుధవారం రైతులు తమ డిమాండ్ల పరిష్కారం కోసం నిరసన బాట పట్టారు. శంభు, ఖనౌరీ సరిహద్దుల్లో నిరసనలు చేపట్టిన రైతులను పోలీసులు బలవంతంగా తరలించడాన్ని భారతీయ కిసాన్ యూనియన్ (బీకేయూ) రైతు సంఘం నేత రాకేశ్ తికాయత్ ఖండించారు. ఒకవైపు రైతు డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం రైతు సంఘాలతో చర్చలు జరుపుతోంది. మరోవైపు నిరసన చేస్తున్న రైతుల్ని అరెస్టు చేస్తోంది. ప్రభుత్వ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాను అని ఆయన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

మరోపక్క వందమందికి పైగా రైతులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారని రైతు సంఘాలు తెలిపాయి. ఇదిలావుండగా శంభు, ఖానౌరి ఏరియాల్లో మకాం వేసి ఏడాది కాలంగా ఆందోళనలు చేస్తున్న రైతులను పంజాబ్ పోలీసులు బలవంతంగా తరలించి, నిరసన ప్రాంతాల్లో రోడ్లను క్లియర్ చేస్తున్నారు. సరిహద్దులను తిరిగి తెరవడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను పంజాబ్ మంత్రి హర్పాల్ సింగ్ చీమా సమర్థించుకున్నారు. కాగా కాంగ్రెస్, అకాలీదళ్ నేతలు మాత్రం ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా విమర్శించాయి. కేంద్ర ప్రభుత్వంతో రైతు నేతల తదుపరి దఫా చర్చలు మే 4న జరగనున్నాయి.

**పోలీసుల అరాచకం, అణచివేత**

తాత్కాలికంగా ఏర్పాటు చేసిన నిర్మాణాలు, వేదికలను తొలగించిన వెంటనే రెండు హైవేలపైనా రాకపోకలకు మార్గం సుగమం చేస్తామని పోలీసులు చెప్పారు. రైతులు పెట్టుకున్న ట్రాలీలను, ఇతర వాహనాలను అక్కడ నుంచి తీసివేస్తున్నారు. పోలీసుల అణచివేత చర్యలతో శంభు సరిహద్దు ప్రాంతమంతా నిర్మానుష్యంగా మారింది. బుధవారం వరకు ఈ తాత్కాలిక నిర్మాణాలు, ట్రాలీలే రైతులకు ఆశ్రయం కల్పించాయి. కానీ గురువారం నాటికి ఒక్కసారిగా అవన్నీ నేలమట్టమయ్యాయి. ట్రాఫిక్‌ను పునరుద్ధరించేందుకు వీలుగా జెసిబి యంత్రాలతో వాటన్నింటినీ శిథిలాల గుట్టగా మార్చేశారు. వంటకు ఉపయోగించే పాత్రలు, గ్యాస్ సిలిండర్లు, టీ కెటిళ్ళు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషిన్లు, కుర్చీలు, టేబుళ్ళు, పరుపులు, బట్టలు ఇలా గతేడాది ఫిబ్రవరి నుండి రైతులు ఉపయోగించిన ప్రతీ వస్తువూ రోడ్లపై చెల్లాచెదురుగా పడి వున్నాయి. తమకు ముందుగా ఎలాంటి సమాచారం అందించలేదని, అకస్మాత్తుగా పోలీసులు వచ్చి విధ్వంసానికి దిగారని రైతు నేత ఒకరు చెప్పారు. పోలీసులు ఈ చర్యలకు దిగడానికి ముందుగా భారీ ఎత్తున భద్రతా బలగాలను మోహరించారు. అందులో అంబులెన్సులు, బస్సులు, అగ్నిమాపక యంత్రాలు, అల్లర్ల నిరోధక బృందాలు వున్నాయి. దాదాపు 3వేల మంది పోలీసులు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. అక్కడ నుండి ఖాళీ చేయడానికి రైతులకు కేవలం పది నిముషాలు సమయమిచ్చారు. లేనిపక్షంలో వారిని అదుపులోకి తీసుకుని బస్సుల్లో తరలిస్తామని హెచ్చరించారు.

**పార్లమెంట్ ఆవరణలో కాంగ్రెస్ నిరసన**

కాగా పోలీసుల అణచివేత చర్యలపై పార్లమెంట్ ఆవరణలో పంజాబ్ కాంగ్రెస్ ఎంపీలు నిరసన తెలియచేశారు. వారిని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కలిసి మాట్లాడారు. రైతు వ్యతిరేక పార్టీలు రెండూ చేతులు కలిపాయని కాంగ్రెస్ విమర్శించింది. ఈ మేరకు కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే ఎక్స్‌లో పోస్టు పెట్టారు. తొలుత పంజాబ్ ప్రభుత్వం చర్చల కోసం రైతులను పిలిచి తర్వాత వారిని నిరసన శిబిరాల నుంచి బలవంతంగా వెళ్ళగొట్టారని విమర్శించారు. కాగా, రైతులపై దాడులకు దిగారంటూ ఆప్, బిజెపి ప్రభుత్వాలపై తీవ్రంగా ధ్వజమెత్తింది. ఈ వెన్నుపోటు చర్యలకు పంజాబ్ ప్రజలు ప్రతీకారం తీర్చుకుంటారని కాంగ్రెస్ నేత సుప్రియ శ్రినెట్ హెచ్చరించారు.

పంజాబ్, హర్యానాల మధ్య శంభు (శంభు-అంబాలా), ఖానౌరి (సంగ్రూర్- జింద్) సరిహద్దు పాయింట్ల వద్ద రైతులు గత ఏడాది శిబిరాలు ఏర్పాటు చేసుకున్నారు. ఢిల్లీకి వారు చేపట్టిన ప్రదర్శనను భద్రతా బలగాలు భగ్నం చేయడంతో గతేడాది ఫిబ్రవరి 13న ఈ నిరసన ప్రారంభమైంది. పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీని కల్పించడంతో సహా పలు డిమాండ్లు నెరవేర్చాలని రైతులు కోరుతున్నారు.

**ధర్నాలకు పిలుపు**

పోలీసుల అణచివేత చర్యలను కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ (కేఎంఎస్‌సీ) నాయకుడు సత్నాం సింగ్ పన్నూ తీవ్రంగా ఖండించారు. కేంద్రంతో కుమ్మక్కైన పంజాబ్ ప్రభుత్వం రైతులపై అణచివేతకు పాల్పడుతోందని విమర్శించారు. వెంటనే సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చాల నేతృత్వంలో రైతులు ధర్నాలకు పిలుపిచ్చారు. పంజాబ్, ఇతర రాష్ట్రాల్లోని డిప్యూటీ కమిషనర్ కార్యాలయాల వెలుపల ధర్నాలు చేపట్టాలని రైతు సంఘాలు పిలుపిచ్చాయి. హర్యానా ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైని కర్నాల్ నివాసం వెలుపల రైతులు ధర్నా చేశారు. ఫిరోజ్‌పూర్‌లో డిసి కార్యాలయం వెలుపల కూడా రైతులు నిరసనలు చేపట్టారు. అయితే రైతుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం మాత్రమే పరిష్కరించగలదని ఆప్ నేత సందీప్ పాథక్ వ్యాఖ్యానించారు.



## కనీస పెన్షన్, పెన్షన్ విధానంలో మార్పు కోసం పోరాటం

- పాలడుగు భాస్కర్ పిలుపు

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

కనీస పెన్షన్, పెన్షన్ విధానంలో మార్పుల కోసం పోరాడాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్‌లో టీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ అండ్ ఏఐఆర్టీడబ్ల్యూఎఫ్) ఆధ్వర్యంలో టీఎస్‌ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర సదస్సు నిర్వహించారు. సదస్సును పాలడుగు భాస్కర్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు, పెన్షనర్ల సమస్యలకు-ప్రభుత్వ విధానాలకు ఉన్న సంబంధాన్ని వివరించారు. సదస్సులో తీర్మానాన్ని ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి వి.ఎస్.రావు ప్రవేశపెట్టారు. ఆర్టీసీ డిపో మాజీ మేనేజర్ చంద్రారెడ్డి, ఎస్‌డబ్ల్యూఎఫ్ మాజీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ పీ.ఎన్.మూర్తి, మాజీ ఏఓ సుబ్రహ్మణ్యం, సత్యనారాయణ, అశోక్ తదితరులు తీర్మానాన్ని బలపరుస్తూ మాట్లాడారు. రిటైర్డ్ కార్మికుల సమస్యలు పరిష్కారించాలని కోరుతూ ఏప్రిల్ 4న అన్ని డిపోల వద్ద ధర్నాలు జరపాలనీ, ఏప్రిల్ నెల చివరలో హైదరాబాద్‌లో ధర్నా నిర్వహించాలనీ, ఆర్టీసీ, ప్రభుత్వ అధికారులకు వినతిపత్రాలు ఇవ్వాలనీ, రిటైర్డ్ కార్మికుల సమస్యలపై బుక్‌లెట్ తీసుకురావాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ సదస్సుకు ఎస్‌డబ్ల్యూఎఫ్ ఉపాధ్యక్షులు ఎ.వి.రావు వేదికపైకి ఆహ్వానించగా, ఎస్‌డబ్ల్యూఎఫ్ అధ్యక్షులు వీరాంజనేయులు సదస్సుకు అధ్యక్షత వహించారు. ప్రచార కార్యదర్శి పి.ఆర్.రెడ్డి వందన సమర్పణ చేశారు.

## నకిలీ విత్తనాల పట్టివేత

కర్నాటక నుంచి మంచిర్యాలకు తరలిస్తుండగా..



**నవతెలంగాణ -శామీర్ పేట**

కర్నాటక నుంచి మంచిర్యాలకు డీసీఎంలో తరలిస్తున్న నకిలీ విత్తనాలను మేడ్చల్ ఎస్ఓటీ, శామీర్‌పేట పోలీసులు, వ్యవసాయ అధికారులు పట్టుకున్నారు. 37.50 కిలోల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. గురువారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో శామీర్‌పేట ఎస్‌హెచ్ఓ శ్రీనాథ్‌తో కలిసి డీసీపీ కోటిరెడ్డి వివరాలు వెల్లడించారు. మంచిర్యాలలోని లక్షెట్టిపేటకు చెందిన సొల్లు సురేష్ డ్రైవర్ నరేష్‌ను కిరాయికి మాట్లాడుకుని కర్నాటకలోని కుస్తగి దగ్గర గల రమణ అలియాస్ రామయ్య నుంచి నిషేధిత పత్తి విత్తనాలు తీసుకురావాలని ఒప్పందం కుదుర్చుకున్నాడు. 50 వేల రూపాయలు కిరాయి ఇస్తానని చెప్పాడు. ఎక్కువ డబ్బులు వస్తాయని ఆశపడి నరేశ్ తన డీసీఎంలో 150 బస్తాల నిషేధిత పత్తి విత్తనాలు తీసుకుని ఈనెల 19న మంచిర్యాలకు బయలుదేరాడు. విశ్వసనీయ సమాచారం మేరకు శామీర్‌పేట మండల వ్యవసాయ అధికారి, మేడ్చల్ ఎస్ఓటీ, శామీర్‌పేట పోలీసులు ఓఆర్ఆర్ ఎగ్జిట్ నెంబర్ 7 నుంచి తూముకుంట గ్రామం వైపు వెళ్లే రహదారిపై బ్రిడ్జి కింద డీసీఎంను ఆపి తనిఖీ చేశారు. వాహనంలో నకిలీ పత్తి విత్తనాలు కనిపించడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పేట్ బషీరాబాద్ ఏసీపీ శ్రీరాములు, మండల వ్యవసాయ అధికారి రమేష్, ఎస్ఓటి పోలీసులు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

### గర్భిణీలు, చిన్నారులకు నాణ్యమైన బాలామృతం

ఫుడ్స్ కార్పొరేషన్ చైర్మెన్ ఏంఏ ఫహీమ్

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణీలకు, చిన్నారులకు నాణ్యమైన బాలామృతం ఏర్పాటు చేయాలని తెలంగాణ ఫుడ్స్ కార్పొరేషన్ చైర్మెన్ ఏంఏ ఫహీమ్ సూచించారు. గురువారం హైదరాబాద్‌లో నాచారంలోని తన కార్యాలయంలో ఎమ్‌డీ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి ఆయన అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

ఆయా జిల్లాల్లోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన ఇటీవల పరిశీలించారు. అక్కడి పరిస్థితులను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బాలామృతాన్ని నాణ్యతాయుతంగా తయారీ చేయాలని సూచించారు. సమీక్ష సమావేశంలో ఫుడ్స్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.



## పెన్షన్ల పెంపునకు నిధులేవి..?

ఈసీఐఎల్‌లో బడ్జెట్ ప్రతుల దహనం

- రాష్ట్ర బడ్జెట్‌లో వికలాంగులకు మొండి చేయి : ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకట్

**నవతెలంగాణ-కాప్రా**

పెన్షన్‌ల పెంపునకు రాష్ట్ర బడ్జెట్‌లో నిధులెందుకు కేటాయించలేదని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకట్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎన్‌పీఆర్‌డీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఈసీఐఎల్ క్రాస్ రోడ్డు వద్ద బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేసిన అన్యాయాన్నే 2025-26 బడ్జెట్‌లో చేసిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.2,26,982 కోట్ల రెవెన్యూ వ్యయం బడ్జెట్‌లో 2016 ఆర్‌పీడీ చట్టం ప్రకారం బడ్జెట్‌లో వికలాంగులకు 5శాతం అంటే రూ.11,349.1కోట్ల నిధులు కేటాయించాలన్నారు. కానీ, వికలాంగుల అభివృద్ధి, సంక్షేమానికి పైసా కూడా కేటాయించలేదన్నారు. స్త్రీ, శిశుసంక్షేమ శాఖలో అంతర్భాగంగా వికలాంగుల సంక్షేమ శాఖను చూపి నిధులు కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర రంగాలకు నిధులు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం 12 శాతం జనాభా ఉన్న వికలాంగుల సంక్షేమానికి నిధులెందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఆసరా పెన్షన్స్ పెంచుతామని, కొత్తవి ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ బడ్జెట్‌లో మాత్రం అందుకు నిధులు కేటాయించలేదని తెలిపారు. ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగంలో 151 అంశాలను ప్రస్తావించారని, అందులో వికలాంగులకు సంబంధించిన ఒక్క అంశం కూడా లేదన్నారు. వికలాంగులకు స్వయం ఉపాధి రుణాలు, వివాహ ప్రోత్సాహకం, సహాయ పరికరాల కోసం నిధులు కేటాయించకుండా ఏవిధంగా న్యాయం జరుగుతుందని ప్రశ్నించారు. నిధుల కొరత వలన్ల వికలాంగుల కార్పొరేషన్ నిర్వీర్యమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌ను సవరించి ప్రత్యేకంగా వికలాంగుల సంక్షేమానికి, ఆసరా పెన్షన్స్ పెంపునకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షులు కె.చంద్రమోహన్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుల్తాన్ రమేష్, ఫైన్ బేగం, రమేష్, శివ, మోజీష్ నాగరాజు, నరసింహ, బుచ్చమ్మ, భాను, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

### సర్వేపై నిపుణుల కమిటీ భేటీ

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

తెలంగాణ సామాజిక, విద్యా, ఆర్థిక, రాజకీయ, కుల సర్వేను విశ్లేషించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్వతంత్ర నిపుణుల కమిటీ గురువారం భేటీ అయింది. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో కమిటీ కన్వీనర్ ప్రవీణ్ చక్రవర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో చైర్మెన్ రిటైర్డ్ జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, వైస్ చైర్మెన్ ప్రొఫెసర్ కంచ ఐలయ్య పాల్గొన్నారు. సర్వే నిర్వహించిన తీరు, అనుసరించిన పద్ధతులు, పాటించిన ప్రమాణాలను నోడల్ అధికారి అనుదీప్ దురిశెట్టి కమిటీకి వివరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేశారు. సర్వేపై మరింత లోతుగా చర్చించేందుకు ఏప్రిల్ 7న మధ్యాహ్నం 2 గంటలకు నిపుణుల కమిటీం తిరిగి సమావేశమవుతుందని కమిటీ కార్యదర్శి తెలిపారు.

# మే 7 నుంచి మిస్‌వరల్డ్ పోటీలు


- స్త్రీల ఆత్మగౌరవానికి ప్రతీక అందాల పోటీలు
- వాటిని రాజకీయ కోణంలో చూడకండి
- తెలంగాణ టూరిజంతో పాటు పెట్టుబడులకు దోహదపడుతాయి : పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

అందాల పోటీలు స్త్రీల ఆత్మగౌరవానికి ప్రతీకని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తెలంగాణ టూరిజం శాఖ భాగస్వామ్యంతో హైదరాబాద్‌లో నిర్వహించనున్న 72వ మిస్‌వరల్డ్ పోటీల ఏర్పాట్లపై టూరిజం ప్లాజాలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. 'మహిళల ఆత్మ సౌందర్యాన్ని వేడుకగా నిర్వహించడం మిస్ వరల్డ్ పోటీల ఉద్దేశం. సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర గొప్పది. రాష్ట్రంలో అన్ని రంగాల్లో వారికి ఎంతో ప్రాధాన్యత ఉంది. మే 7 నుంచి 31వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఈ పోటీల ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆహారం, పర్యాటక అందాలను ప్రపంచానికి తెలియజేసేందుకు ఎంతో ఉపయోగపడతాయి. దక్షిణ కొరియాలో స్క్విడ్ గేమ్, బీటీఎస్ బ్యాండ్ లాంటివి ఆ దేశానికి ఎంతో ఉపయోగపడ్డాయి. ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణకు పేరుప్రఖ్యాతులతో పాటు ఆర్థికంగా లబ్ది చేకూరుతుంది' అని జూపల్లి అన్నారు. అందాల పోటీలను రాజకీయ కోణంలో చూడకూడదని పేర్కొన్నారు. ఈ పోటీలకు రూ.50 కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనా వేశామనీ, అందులో నిర్వాహకులు రూ.25 కోట్లు భరిస్తున్నారని తెలిపారు. మిగతా రూ.25 కోట్లు మాత్రమే తెలంగాణ టూరిజం ఖర్చు చేయనుందని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు, ప్రపంచస్థాయి పెట్టుబడులు ఆకర్షించేందుకు ఈ పోటీలు ఎంతగానో ఉపయోగపడుతాయిని వివరించారు. 'ప్రపంచంలోని 140 దేశాల నుంచి పోటీదారులతో పాటు దేశవిదేశాలకు చెందిన వేలాది మంది వస్తారు. తెలంగాణ గురించి ప్రపంచానికి చెప్పేందుకు ఇది మంచి అవకాశం. ఈ వేదికతో రాష్ట్ర పర్యాటక రంగానికి రాబడి పెరుగుతుంది" అని జూపల్లి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం పెట్టుబడులను, పర్యాటకులను ఆకర్షించే లక్ష్యంగా మిస్ వరల్డ్ పోటీలను నిర్వహిస్తోందని వివరించారు. తెలంగాణ రాష్ట్ర వారసత్వ సంపద, చేనేత రంగం, జానపద నృత్యాలు, సంగీతం, వంటకాల వంటివి పోటీలు జరిగే ప్రాంతాల్లో ప్రదర్శించనున్నామని తెలిపారు.

**భారతీయ చీరకట్టు నచ్చింది:మిస్ వరల్డ్ క్రిస్టినా**

భారతీయ చీరకట్టు బాగా నచ్చిందని మిస్ వరల్డ్ క్రిస్టినా పిస్కోవా అన్నారు. ఇక్కడి కళలు, సంప్రదాయాలు మానవీయ విలువలను బోధిస్తాయని చెప్పారు. భిన్నత్వంలో ఏకత్వం ఎంతో గొప్ప భావన అని పేర్కొన్నారు. ఎన్నో భాషలున్నా అంతా ఒక్కటిగా ఉండటం భారత్‌కే సాధ్యమైందని గుర్తు చేశారు. మిస్ వరల్డ్ కూడా భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని క్రిస్టినా అన్నారు. ఈ దేశ ప్రజలు తనకు గొప్పగా స్వాగతం పలికారనీ, వారి అభిమానానికి రుణపడి ఉంటానని చెప్పారు. 72వ మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఈ పోటీలతో తెలంగాణ సంస్కృతి వారసత్వ సంపద, కళలు ప్రపంచానికి పరిచయమవుతాయని అన్నారు. ఇక్కడి ఆతిథ్యాన్ని ఆస్వాదించడానికి ప్రపంచం ఎదురు చూస్తోందని కొనియాడారు.



**తెలంగాణకు 2,500 ఏండ్ల చరిత్ర: స్మితా సభర్వాల్**

త్రిలింగ దేశంగా తెలంగాణకు 2,500 ఏండ్ల చరిత్ర ఉందని పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి స్మితా సభర్వాల్ అన్నారు. రాష్ట్రం ఏర్పడిన 11 ఏండ్లల్లో అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి సాధించిందని చెప్పారు. రామప్ప, వేయి స్తంభాల ఆలయం, చార్మినార్, గోల్కొండ కోట లాంటి ఎన్నో గొప్ప కట్టడాలు ఇక్కడ ఉన్నాయని వివరించారు. మిస్ వరల్డ్ పోటీలను తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. మెడికల్ , ఏకో, ఆద్యాత్మిక టూరిజంలో తెలంగాణకు ఎంతో ప్రాముఖ్యత ఉందని పేర్కొన్నారు.

**తెలగాణను ప్రమోట్ చేసే గొప్ప అవకాశం: పటేల్ రమేశ్‌రెడ్డి**

తెలంగాణను ప్రమోట్ చేసేందుకు అందాల పోటీలు గొప్ప అవకాశమని తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ పటేల్ రమేశ్‌రెడ్డి అన్నారు. వారసత్వ కట్టడాలు, ఆధ్యాత్మిక , పర్యావరణ, మెడికల్ టూరిజం అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఎల్బీనగర్ -మహేశ్వరం
శుక్రవారం | మార్చి 21, 2025 | www.navatelangana.com

## బోర్ వేసినందుకు రూ.10వేలు జరిమానా




**నవతెలంగాణ-హయత్‌నగర్**

అక్రమంగా బోర్ వేసినందుకు గాను ఓ యజమానికి రూ.10వేలు జరిమానా వేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. గురువారం బిగ్ బజార్ వెనుక ఉన్న ఓ హెూటల్ లో భవన యజమాని అయిన విద్యా సాగర్ రెడ్డి.. రెవెన్యూ అనుమతి లేకుండా బోర్ వేస్తున్నందున పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే సరూర్‌నగర్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సహదేవ రెడ్డి ఘటనాస్థలానికి చేరుకొని రూ.10వేలు జరిమానా వేసినట్టు తెలిపారు.

## చెరువు ప్రక్షాళనకు శ్రీకారం చుట్టిన 'హైడ్రా'



**నవతెలంగాణ-తుర్కయంజాల్**

తుర్కయంజాల్‌లోని మాసాబ్ చెరువు పరిరక్షణకు హైడ్రా చర్యలు మొదలు పెట్టింది. చెరువు ఎఫ్టీఎల్ పరిధి సర్వే నెంబర్ 137లో అక్రమంగా వేసిన రోడ్డును గురువారం హైడ్రా అధికారులు తొలగించారు. రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్ డిపార్ట్‌మెంట్ల పర్యవేక్షణలో జేసీబీల సాయంతో చెరువులో నింపిన మట్టిని తరలించారు. తుర్కయంజాల్‌లోని మాసాబ్‌చెరువు అన్యాక్రాంతమవుతోందని, చెరువు ఎఫ్టీఎల్, బఫర్‌జోన్‌లో అక్రమంగా మట్టిని నింపి చెరబడుతున్నారంటూ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అసెంబ్లీలో లేవనెత్తిన విషయం తెలిసిందే. దీంతో కదిలిన హైడ్రా యంత్రాంగం చెరువులో వేసిన రోడ్డును, మట్టిని తొలగించేందుకు చర్యలు చేపట్టారు. హైడ్రా చర్యల పట్ల స్థానిక ప్రజలు, చెరువు పరిరక్షణ సమితి నేతలు హర్షం వ్యక్తం చేశారు.

## 'చలో పార్లమెంట్, చలో ఇందిరా పార్క్‌ను విజయవంతం చేయండి'




**నవతెలంగాణ - దిల్‌సుఖ్‌నగర్**

రవాణా రంగం సమస్యల పరిష్కారానికి చేపట్టిన చలో పార్లమెంటు, చలో ఇందిరా పార్క్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రైవేటు రోడ్డు రవాణా ట్రాన్స్‌పోర్టు వర్కర్ ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కడారి రాములు విజ్ఞప్తి చేశారు. కొత్తపేట చౌరస్తా వద్ద గురువారం చలో పార్లమెంటు, చలో ఇందిరా పార్క్ కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాన్ని సరూర్ నగర్ సర్కిల్ సీఐటీయూ నేత మల్లెపాక వీరయ్యతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నేతలు కడారి రాములు, మల్లెపాక వీరయ్యలు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటాలే శరణ్యమని అన్నారు. ఈ నెల 24న దేశ వ్యాప్తంగా చేపట్టిన చలో పార్లమెంటును, ఈ నెల 21న చలో ఇందిరా పార్క్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా రవాణా రంగాన్ని రక్షించుకునేందుకు కార్మికులు వేల సంఖ్యలో కదిలి రావాలని విజ్ఞప్తి చేశారు. రవాణా రంగం కార్మికులు ఆటో, కారు, డీసీఎం, లారీ, ట్రాలీ, మినీ డీసీఎం, టాటా ఏసీ, ట్రాక్టర్, అంబులెన్స్, స్కూల్ బస్సులు, ట్రక్కు, వరికోత మిషన్లు, జేసీబీ, బోరు బండ్లు, టూరిస్ట్ బస్సులు, ఆర్టిసి అద్దె బస్సులు, క్లీనర్లు, డ్రైవర్‌లు, మెకానిక్‌లు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. నిత్యావసర సరుకుల ధరలు నింగిని తాకుతున్న కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గినా పెట్రోల్, డీజిల్ గ్యాస్ ధరలు మాత్రం తగ్గడం లేదన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న రవాణా రంగంపై కేంద్రం ప్రభుత్వ వైఖరి దారుణంగా ఉందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నేతలు సిఎచ్ వెంకన్న, జగదీష్, మహేష్ గౌడ్, శీను, ఇస్త్రాల్, వెంకటేష్ గౌడ్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఆర్టీసీ, రవాణా రంగాన్ని రక్షించుకుందాం : సీఐటీయు

**నవతెలంగాణ-హయత్‌నగర్**



ఆర్టీసీ, రవాణా రంగాన్ని రక్షించుకుందామని సీఐటీయు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ రవాణా రంగంలో ఆటో, టాక్సీ, లారీ, ప్రైవేట్ బస్సు, ఆర్టీసీ ఆర్టీసీలను తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది కేంద్ర ప్రభుత్వం అని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలే ఈ దుస్థితికి కారణం అని అన్నారు. పరిస్థితులు మారాలంటే ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి.. అందుకే ఈ నెల 24న చలో పార్లమెంటు పిలుపుని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం తదితర డిమాండ్లపై హయత్ నగర్ డిపో వద్ద చలో పార్లమెంటు పోస్టర్ ఆవిష్కరించి.. కరపత్రాలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో AIRTWF వర్కింగ్ కమిటీ మెంబెర్ రవీందర్ రెడ్డి, TSRTC SWF రాష్ట్ర కార్యదర్శి జి ఆర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'మున్సిపల్ కార్మికులకు రాజకీయ శిక్షణా తరగతులు'




**నవతెలంగాణ-చంపాపేట్**

జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ హైదరాబాద్ సౌత్ కమిటీ సీఐటీయూ ఆధ్వర్యంలో ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని సంతోష్ నగర్ ఆఫీస్‌లో మున్సిపల్ కార్మికులకు గురువారం రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు పద్మశ్రీ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి శోభన్ టీచర్లుగా వ్యవహరిస్తూ.. ప్రస్తుత రాజకీయాలు, శ్రమ దోపిడిపై బోధించారు. తర్వాత వారు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్మికులను శ్రమదోపిడికి గురి చేస్తుందని అన్నారు. అదేవిధంగా కొత్త కొత్త చట్టాలు తీసుకువచ్చి కార్మిక హక్కులను కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీలో పనిచేస్తున్న కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26వేలకు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈఎస్ఐలో జరుగుతున్న అవకతవకలను అరికట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నాయి తప్ప.. జీహెచ్ఎంసీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల జీవితాలు మాత్రం మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి ఎం. శ్రవణ్ కుమార్, అధ్యక్షులు మీనా, సహాయ కార్యదర్శి ఎస్. కిషన్, ఉపాధ్యక్షులు వి.రాంకుమార్ నాయక్, సీఐటీయూ సీనియర్ నాయకులు బాలు నాయక్, జీహెచ్ఎంసీ మున్సిపాల్ కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

**ట్రాన్స్‌పోర్టు కమిటీ అధ్యక్షులు కోటయ్య**

**నవతెలంగాణ-చంపాపేట్**

ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని ట్రాన్స్‌పోర్టు కమిటీ అధ్యక్షులు ఎల్ కోటయ్య అన్నారు. ఈ మేరకు గురువారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాకుత్‌పురా నియోజకవర్గం సైదాబాదులో ఉన్న ఆటో డ్రైవర్లకు న్యాయం చేయాలన్నారు. సైదాబాద్ మండలం పరిధిలో సైదాబాద్, సింగరేణి కాలనీల్లో తదితర బస్తీల్లో వేలాదిమంది ఆటోరంగంపై జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. డ్రైవర్లందరూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని, దానికి తోడు ఇంటి అద్దెలు, పిల్లల స్కూల్ ఫీజులు, కుటుంబ పోషణ, పెరిగిన పెట్రోలు, డీజిల్ ధరలతో వారు సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన చార్జీలకు అనుగుణంగా ప్రభుత్వం మీటర్ చార్జీలు పెంచలేదని అన్నారు. 11 సంవత్సరాల నుంచి ఆటో మీటర్ చార్జీలు పెరగకపోవడం ఒకవైపు అయితే..ఓలా, ఉబర్, రాపిడో లాంటి ప్రైవేటు సంస్థలు మరొకవైపు ఆటో డ్రైవర్లను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని అన్నారు. వీటికి తోడు మహాలక్ష్మి స్కీం కూడా ఆటో డ్రైవర్లను చాలా ఇబ్బందుల్లోకి నెట్టివేసిందని వెల్లడించారు. ఈ క్రమంలో ఆటో డ్రైవర్ల సమస్యలను గుర్తించి.. వాటిని పరిష్కరించేందుకు ఆర్థిక సహాయం, నిన్న పెట్టినటువంటి బడ్జెట్లో నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సైదాబాద్ ఆటో డ్రైవర్సు తిరుపతి, ప్రకాష్, బిక్షం రెడ్డి, కృష్ణ దేవయ్య తదితరులు పాల్గొన్నారు.



## పాసు బుక్కులు ఇవ్వాలని ధర్నా

**నవతెలంగాణ - అబ్దుల్లాపూర్‌మెట్**

అనాజ్‌పూర్ గ్రామ రైతులకు పట్టా పాస్ బుక్కులు ఇవ్వాలని గ్రామ పంచాయతీ ఎదుట సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పగుడాల యాదయ్య మాట్లాడుతూ అనాజ్‌పూర్ గ్రామ పంచాయతీకి చెందిన 125 మంది భూ బాధితులకు పాసు బుక్కులు ఇప్పించేందుకు గ్రామ సభలో తీర్మానం చేయించాలని గ్రామపంచాయతీ కార్యదర్శికి గురువారం వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. రైతులకు పాసు బుక్కులు ఇవ్వకపోతే ఇక ముందు పాసు బుక్కులు ఇచ్చేంత వరకు భూ బాధితులతో కలిసి ఆందోళన చే డుతామని హెచ్చరించారు. ఇక్కడికి వచ్చే అధికారులను, ప్రజా ప్రతినిధులను, వివిధ పార్టీల చెందిన నాయకులను ప్రజాస్వామ్య బద్ధంగా అడ్డుకొని న్యాయం కోసం పోరాడుతామన్నారు. గ్రామ రైతులకు న్యాయం చేయని నాయకులు గ్రామానికి రావద్దని హెచ్చరించారు. రైతులకు న్యాయం జరిగేందుకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించి పట్టా పాస్ బుక్కులు ఇప్పించడానికి ముందుకు రావాలన్నారు. ఈ ధర్నాలో స్థానిక నాయకులు బిక్షపతి గౌడ్, వర్కాల బాలరాజ్, ముత్యాలు, రాములు, వెంకటేష్, బాలరాజ్, జంగయ్య, భూ బాధితులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## ఇద్దరు యువకులు అదృశ్యం



**నవతెలంగాణ-హయత్‌నగర్**

ఇద్దరు యువకులు అదృశ్యమైన ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమాన్‌నగర్ కాలనీ, పెద్ద అంబర్‌పేటకు చెందిన షేక్ బాబా.. ఈ నెల 17న ఇంటి నుండి బయటకు వెళ్లాడు. తర్వాత అతని ఫోన్ స్విచాఫ్ వచ్చింది. వెంటనే షేక్ బాబా గురించి చుట్టుపక్కల ప్రాంతాలలో, తన స్నేహితుల దగ్గర, బంధువుల దగ్గర వెతికినా ఎటువంటి ఆచూకీ లభించలేదని అతని బంధువులు హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కాకినాడ జిల్లాకు చెందిన బిశెట్టి సుజయ్ నికేష్.. అన్నపూర్ణ లారీ సర్వీస్ ఆఫీస్, లక్ష్మారెడ్డి పాలెం, హయత్ నగర్‌లో బంధువుల ఇంటి వద్ద పడుకొని లేచి చూసేసరికి ఇంట్లో కనిపించలేదు. చుట్టుపక్కల ప్రాంతాలలో, తన సొంతూరు దగ్గర, బంధువుల దగ్గర వెతికినా ఎటువంటి ఆచూకీ లభించలేదని అతని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



## ఘనంగా ఈటల జన్మదిన వేడుకలు



**నవతెలంగాణ-నాగోల్**

మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ జన్మదిన వేడుకలను గురువారం నాగోల్ డివిజన్ పరిధిలోని రాక్ టౌన్ కాలనీలో కాలనీ సంక్షేమ సంఘం, ఉదయపు వాకర్స్ టీంల ఆధ్వర్యంలో రాక్ టౌన్ జిమ్ పార్క్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సురేంద్రనాథ్ యాదవ్..వాకర్స్ టీంలో సీనియర్ జనార్దన్‌తో కేకు కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో రాక్ టౌన్ అధ్యక్షులు ఎర్ర వినోద్ రెడ్డి, సెక్రటరీ జైపాల్ రెడ్డి, మోహన్ రెడ్డి, సంజీవ రెడ్డి, లక్ష్మణ్, భీమిడి వెంకట్ రెడ్డి, బద్దం భాస్కర్ రెడ్డి, పల్వాయి సంజీవ రెడ్డి, రమేష్ రెడ్డి, కొండల్ రెడ్డి, నాగరాజు, దినేష్ రెడ్డి, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

**నవతెలంగాణ-దిల్‌సుఖ్‌నగర్**



చైతన్యపురి డివిజన్‌లో మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మలిదశ ఉద్యమ నేత, బీజేపీ సీనియర్ నాయకుడు కుంట్లూరు వెంకటేష్ గౌడ్, డివిజన్ బీజేపీ నేతలు కృష్ణ, సుమన్, శ్రీనివాస్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మాతృదేవోభవ అనాథ ఆశ్రమాన్ని సందర్శించిన లేడీ అఘోరీ నాగసాధు



**3నవతెలంగాణ- బడంగ్‌పేట్**

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్‌గుల్ గ్రామంలోని మాతృదేవోభవ అనాథ ఆశ్రమంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను తెలుసుకొని లేడీ అఘోరి నాగసాధు గురువారం ఆ ఆశ్రమాన్ని సందర్శించారు. తర్వాత ఆశ్రమంలోని సహస్ర లింగేశ్వరస్వామి దివ్యక్షేత్రంలో పూజలు నిర్వహించి.. ఆశ్రమంలో మానసిక వికలాంగుల బాగోగులను తెలుసుకున్నారు. ఆశ్రమ వాసుల సహాయార్థం క్వింటా బియ్యం, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆశ్రమ వ్యవస్థాపకులు గట్టు గిరి మాట్లాడుతూ మానసిక వికలాంగులకు సేవ చేయడం భగవంతుని సేవతో సమానమన్నారు.



## పెన్షనర్లకు మెడ్ ఫ్లాష్ యాప్ వినియోగంపై అవగాహన



**నవతెలంగాణ-సిటీబ్యూరో**

జలమండలిలో హెల్త్ కార్డు కలిగిన ఉద్యోగులు, పెన్షనర్లకు సులభతరమైన ఆరోగ్య సేవలు అందించడానికి రూపొందించిన మెడ్ ఫ్లాష్ అప్లికేషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇప్పటికే ఉద్యోగులకు దీనిపై అవగాహన కల్పించగా.. తాజాగా పెన్షనర్లకు సైతం అప్లికేషన్ వినియోగం గురించి తెలియజేశారు. ఈడీ మయాంక్ మిట్టల్ మాట్లాడుతూ.. బోర్డు ఉద్యోగుల ఆరోగ్య సేవల కోసం ఈ యాప్ తీసుకొచ్చామన్నారు. వైద్య సేవల కోసం ఆస్పత్రుల చుట్టూ తిరగకుండా యాప్ ద్వారా సేవలు పొందే అవకాశం కల్పించామని చెప్పారు. ఎమర్జెన్సీ సమయంలో యాప్‌ను ఉపయోగించి అంబులెన్స్ సేవలు సైతం పొందవచ్చన్నారు. ఈ యాప్ రూపొందించిన వారిని ఈడీ ప్రశంసించారు. దాదాపు వంద మందికిపైగా పెన్షనర్లు పాల్గొన్నారు. వారందరి ఫోన్లలో యాప్ ఇన్ స్టాల్ చేసి ఎలా వినియోగించాలో తెలిపారు. ఈ యాప్‌ను ఎండీ అశోక్ రెడ్డి ఈ నెల 10వ తేదీన లాంఛనంగా ప్రారంభించారు. హెల్త్ కార్డులు ఉన్న ఉద్యోగులకు ఇలాంటి క్యాష్ లెస్ సర్వీస్ అందించడం దేశంలోనే మొదటి సారి కావడం విశేషం. జలమండలిలో ఉద్యోగులు, పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్స్ దాదాపు 6685 మంది ఉన్నారు. వీరితో పాటు వీరి మీద ఆధారపడిన వారందరు.. దీని ద్వారా సంవత్సరానికి రూ.3లక్షల వరకు ఉచిత సేవలను పొందవచ్చు. ఈ కార్యక్రమంలో పీ అండ్ ఏ సీజీఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, ప్రావిడెన్స్ ఇండియా ఇన్సూరెన్స్ బ్రోకింగ్ కంపెనీ అసోసియేట్ వైస్ ప్రెసిడెండ్ జ్యోతి బాల, పెన్షనర్లు పాల్గొన్నారు.

## పరీక్షల నిర్వహణ ఏర్పాట్లను సక్రమంగా చేపట్టాలి

- 10వ తరగతి పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కమిషనర్ సరస్వతి



**నవతెలంగాణ-బడంగ్‌పేట్**

ప్రభుత్వ ఆదేశాల మేరకు పదవ తరగతి పరీక్షా కేంద్రాలను బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సరస్వతి గురువారం సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పరీక్షలకు వచ్చే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగవద్దని పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి సూచించారు. అదేవిధంగా అన్ని పరీక్షా కేంద్రాలలో ప్రభుత్వ పాఠశాలలో ఫాగింగ్, బ్లీచింగ్ ఫౌడర్ చల్లాలని సిబ్బందికి ఆదేశించారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న ప్రజలకు తమ ఇంటి పన్ను సకాలంలో చెల్లించి.. అభివృద్ధికి సహకరించాలని కోరారు. ప్రత్యేక టీము ద్వారా మీ ఇంటి వద్దకే రావడం జరుగుతుందని తెలిపారు. మీరు ఆన్లైన్ ద్వారా గాని మీ ఇంటికి వద్దకు వచ్చే టీం ద్వారా గాని మీ యొక్క ఇంటి పనులను చెల్లించవలసిందిగా కోరారు. ఏబీసీ.యానిమల్ బర్త్ కేర్ సెంటర్‌ని కూడా కమిషనర్ పరివేక్షించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వి.యాదగిరి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఠానూ నాయక్ స్ఫూర్తితో పోరాడుదాం



- గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు

**నవతెలంగాణ-చంపాపేట్**

తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో హైదరాబాదులోని రవీంద్ర నాయక్ నగర్‌లో గురువారం ఎం. బాలు నాయక్ అధ్యక్షతన ఠానూ నాయక్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. తర్వాత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మనం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.ధర్మ నాయక్, ఆర్. శ్రీరాం నాయక్‌లు మాట్లాడుతూ.. భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం మహెూన్నతంగా జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వీరోచితంగా పోరాడిన యోధుడు కామ్రేడ్ ఠానూ నాయక్ అని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల డిక్లరేషన్ మేనిఫెస్టో పేరుతో గిరిజనులకు ఇచ్చిన 15 హామీల అమలు కోసం ఠానూ నాయక్ స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. సమ్మక్క, సారక్క పేరుతో ప్రతి గిరిజన గూడెం, తండాల గ్రామపంచాయతీలకు 25 లక్షల రూపాయలు ప్రత్యేక నిధులు ఇస్తామని, అంబేద్కర్ అభయ హస్తం కింద ప్రతి గిరిజన కుటుంబానికి 12 లక్షల ఉచిత రుణం, మైదాన ప్రాంత గిరిజనుల అభివృద్ధికి ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన 5 ఐటిడిఏ లను ఏర్పాటు చేస్తామన్న హామీలు ఇచ్చారు కానీ..ఇంతవరకు నెరవేర్చలేదని ఆరోపించారు. ట్రై కార్ సంస్థ ద్వారా రాష్ట్రంలో 30 వేల మంది గిరిజన యువకులకు 219 కోట్ల రూపాయల రుణాలను చెల్లించకుండా రద్దు చేసేందుకు కుట్రలు చేస్తోందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గిరిజనుల జనాభా నిష్పత్తి ప్రకారం సబ్ ప్లాన్‌కు నిధులు కేటాయించకుండా మోసం చేశాయన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అటవీ, పోడు భూములను సాగు చేస్తున్న గిరిజనుల భూములను అంబానీ, ఆదానీ లాంటి కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు రాజ్యాంగంలో గిరిజనులకు కల్పించిన హక్కులను సైతం కాలరాస్తూ అటవీ సంరక్షణ నియమాలు 2023పేరుతో చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. దీనివలన దేశంలో లక్షలాదిమంది గిరిజన కుటుంబాలు బలవంతంగా అడవుల నుండి గెంటివేయబడతారని ఆందోళన వ్యక్తం చేశారు. కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాతాన్ని అవమానపరిచే విధంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్ లు చరిత్రను వక్రీకరిస్తూ రెండు మతాలకు మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరించడం అమరవీరులను, సాయుధ పోరాటాన్ని అవమానపరచడమేనని అన్నారు.

కామ్రేడ్ ఠానూ నాయక్ లాంటి పోరాట యోధుని చరిత్ర భావితరాలకు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాదులో మ్యూజియంతో పాటు ట్యాంక్ బండ్ పై విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సంఘం హైదరాబాద్ సౌత్ జిల్లా అధ్యక్షులు రామ్ కుమార్ నాయక్, రవీంద్ర నాయక్ నగర్ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షులు అంగోత్ కృష్ణా నాయక్, శంకర్ నాయక్, చిన్నా శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్‌లో నేతన్నలకు మొండి చెయ్యి

**గాంధీ విగ్రహానికి వినతి**



**నవతెలంగాణ-హయత్‌నగర్**

చేనేత, పవర్లూమ్ పరిశ్రమకు, కార్మికుల అభివృద్ధి కోసం 2025- 26 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేవలం 371 కోట్లు కేటాయించి.. చేనేతకు కాంగ్రెస్ ప్రభుత్వం మొండి చేయి చూపించిందని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు వనం శాంతి కుమార్ రాష్ట్ర వ్యాప్తంగా నిరీక్షణకు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం మన్సూరాబాద్ డిజన్ పరిధిలోని సహారా స్టేట్స్ మొదటి గేటు వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. తదనంతరం ఆయన మాట్లాడుతూ చేనేత, పవర్లూమ్ కార్పొరేషన్లను ఏర్పాటు చేసి వాటికి నిధులను కేటాయిస్తామని, రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న సిరిసిల్ల, వరంగల్, మల్కాపూర్, గుండ్ల పోచంపల్లి టెక్స్టైల్ పార్కుల అభివృద్ధితోపాటు కొత్తగా జగిత్యాల, నారాయణపేట, భువనగిరిలో మెగా పవర్లూమ్ క్లస్టర్ ఏర్పాటు, ప్రభుత్వ రంగ సంస్థలకు కావలసిన వస్త్రాలను మన రాష్ట్రంలోని కార్మిక ద్వారా ఉత్పత్తి చేయిస్తామని, చేనేత, పవర్ లూమ్ పరికరాలను 90 శాతం సబ్సిడీపై అందిస్తామని, చేనేత ఉత్పత్తులను ఈ కామర్స్ లతో అనుసంధానం చేస్తామని, కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చేర్చి నేతన్నలకు హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ఇచ్చిన అన్ని హామీలు అమలు కావాలంటే 2000 కోట్ల రూపాయలు కేటాయించాల్సిన ప్రభుత్వం.. ఈ బడ్జెట్లో 371 కోట్ల రూపాయలను మాత్రమే కేటాయించి ప్రభుత్వం చేతులు దులుపుకుందన్నారు. 371 కోట్ల రూపాయల కొద్దిపాటి బడ్జెట్తో ఏ విధంగా ఇచ్చిన హామీలను అమలు చేస్తారో కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ చేనేత కార్మిక సంఘం వైపు నుండి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన పోరాట కార్యక్రమాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో రాష్ట్ర కార్యదర్శి ముషం నరహరి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వర్కాల చంద్ర శేఖర్, సహారా నాయకులు పెంటయ్య, శేఖరయ్య, గజం శ్రీశైలం, వల్లకాటి వెంకటేష్, గుండు గోవర్దన్, చెరుపల్లి రవి కుమార్, తీరందాస్ జయ వర్దన్ తదితరులు పాల్గొన్నారు.

## టీబీపై అవగాహన కార్యక్రమం : డాక్టర్ కరుణాకర్ రెడ్డి

**నవతెలంగాణ-సిటీబ్యూరో**

ప్రపంచ టీబి దినోత్సవ సందర్భంగా గ్లేనిగర్ల్స్ అవేర్ హాస్పిటల్‌లో గురువారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు హాస్పిటల్ సీఓఓ డాక్టర్ కరుణాకర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ దరుపల్లి రాజశేఖర్ రెడ్డి మరియు చీఫ్ ఫాల్మోనాలజిస్ట్ డాక్టర్ సుధీర్ ప్రసాద్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం టీబీ రహిత దేశంగా మారాలంటే 2025 టీబినీ అంతం చేయగలం అనే నినాదంతో మనం అందరం కలిసి టీబిని నిర్మూలించగలమని తెలిపారు. టీబి అనేది ప్రపంచంలో అత్యంత భయంకరమైన వ్యాధి అని, ప్రపంచ వ్యాప్తంగా టీబి కేసులో ఎక్కువగా నమోదు అవుతున్నాయన్నారు. దీనికి చాలా జాగ్రత్తలు వహించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం డాక్టర్ సుధీర్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత ప్రాణాంతకమైన ఇన్ఫెక్షన్ వ్యాధిగా తయారైందని, 2023లో 1.25 మిలియన్లు టీబితో మరణించారని గుర్తుచేశారు. 2023లో 10.8 మిలియన్లు మంది టీబి భారినపడ్డారని చెప్పారు. భారతదేశంలో టీబి కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని తెలిపారు. వ్యాధి గురించి ప్రజలకు అవగాహన లేక రోగ నిర్ధారణ లేట్ అవుతుందన్నారు. చికిత్సలో ఆలస్యం జరుగుతుందని, ఇది దేశానికి అనారోగ్యం, మరణాలు మరియు ఆర్థిక భారాన్ని కలిగిస్తుందని తెలిపారు. ముందస్తుగా రోగనిర్ధారణ చేస్తే చికిత్సతో వ్యాధిని నయం చేయొచ్చని, ఈ వ్యాధి ముందస్తు చర్యలతో నివారించవచ్చని తెలిపారు. భారత క్షయ వ్యాధి సంఘం కలంకానికి వ్యతిరేకంగా చర్యనే ప్రచారాన్ని ప్రారంభించింది ఐఎంఏ మరియు టిఏఐ ఈ కలంకానికి ఎదుర్కోవడానికి మరియు మన దేశం నుండి టీబి ని తొలగించడానికి భాగస్వామ్యం కలిగి ఉన్నాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ డాక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
శుక్రవారం | మార్చి 21, 2025 | www.navatelangana.com

## ఫ్లై ఓవర్ పనులను పూర్తి చేయాలని సీపీఐ(ఎం) పాదయాత్ర



**నవతెలంగాణ-కాప్రా**

ఉప్పల్ నారాపల్లి ఫ్లైఓవర్ పనులను త్వరగా పూర్తి చేయాలని సీపీఐ(ఎం) మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 22న చెంగిచెర్ల నుండి ఉప్పల్ చౌరస్తా వరకు పాదయాత్ర చేపట్టనున్నట్లు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి. సత్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పాదయాత్రను సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ప్రారంభిస్తారని తెలిపారు. ఫ్లైఓవర్ నిర్మాణానికి శంకుస్థాన చేసి ఏడేండ్లు గడుస్తున్నా ఫ్లై ఓవర్ పనులకు మోక్షం లభించడం లేదని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. తక్షణమే ఫ్లై ఓవర్ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పాదయాత్ర చేపడుతున్నట్టు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్మాణ సంస్థపై ఒత్తిడి తెచ్చి ఫ్లై ఓవర్ పనులను పూర్తి చేయాలని కోరారు. ఈ పాదయాత్రలో ప్రజలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## ఎలివేటెడ్ కారిడార్ భూ నిర్వాసితులతో గ్రామసభ



**నవతెలంగాణ-అల్వాల్**

అల్వాల్‌లోని పాత ఐటీఐ గ్రౌండ్‌లో సిద్ధార్థ వినాయక విద్యా నికేతన్ కళాశాలలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం, భూ సేకరణ, పునరావాస, పునర్ ఉపాధి కల్పన కోసం అల్వాల్, లోతుకుంట వాసులతో స్థానిక కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ మనోహర్, అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి, ఎస్డీసీ శంకర్, ఎమ్మార్వో రాములు, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, స్వామి గ్రామసభ నిర్వహించారు.తాము కోల్పోతున్న భూమి వివరాలు, వారి ఫిర్యాదులను ప్రభుత్వానికి తెలియజేయాలని అధికారులు సూచించారు. నిర్వాసితులకు న్యాయం చేసే బాధ్యత ప్రభుత్వానికి ఉంటుందని, భయపడాల్సిన అవసరం లేదని అధికారులు తెలిపారు. నిర్వాసితులకు న్యాయం చేసేందుకు అధికారులు తోడుంటారని భరోసానిచ్చారు.

## సీఎంఆర్ఎఫ్‌ను వినియోగించుకోవాలి



- మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి
- లబ్దిదారులకు చెక్కులు పంపిణీ

**నవతెలంగాణ-నేరేడ్‌మెట్**

ముఖ్యమంత్రి సహాయ నిధిని అర్హులైన అందరూ సద్వినియోగం చేసుకోవాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. బోయిన్ పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం గౌతమ్ నగర్ డివిజన్ కు చెందిన నలుగురు లబ్దిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. వైష్ణవ దేవికి రూ. 14వేలు, కిరణ్ లోయకు రూ.60 వేలు, శ్రీదేవికి రూ.6 వేలు, ఎలోన్‌కు రూ.36 వేల చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, బైరు అనీల్, తదితరులున్నారు.

# అభివృద్ధికి మారుపేరు చిల్కానగర్ డివిజన్

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత
- కోటి రూపాయాలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**నవతెలంగాణ-ఉప్పల్**

చిల్కానగర్ డివిజన్ అభివృద్ధికి మారుపేరుగా నిలుస్తుందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత అన్నారు. గురవవారం చిల్కానగర్ డివిజన్‌లో కోటి రూపాయలతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. బ్యాంక్ కాలనీలో సుమారు రూ.80 లక్షలతో స్ట్రాం వాటర్ డ్రైన్ పైప్లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. కల్యాణపురి, ఇందిరా నగర్ కాలనీలో నూతన బోరు మోటార్ పనులకు, హైకోర్టు కాలనీ నుండి కావేరి నగర్ కల్వర్టు వరకు మేజర్ నాలా డిసిల్టింగ్ పనులను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చిల్కానగర్ డివిజన్‌లో అటు బస్తీలలో కాలనీలలో అన్ని ప్రాంతాల అభివృద్ధి సమానంగా జరుపుతున్నామని తెలిపారు.

డివిజన్‌లో మౌలిక సదుపాయాలు, స్ట్రాం వాటర్ డ్రైన్ పైప్ లైన్లు, సీసీ రోడ్లు, ఓపెన్ జిమ్‌లు, సీవరేజ్ లైన్లు ప్రణాళిక బద్ధంగా పూర్తి చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ ప్రతినిత్యం కాలనీల్లో, బస్తీలలో అధికారులతో కలిసి పర్యటిస్తూ డివిజన్‌లోని 80 శాతం పనులను పూర్తి చేశారని అభినందించారు. కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ డివిజన్‌లో ఎమ్మెల్యే సహకారంతో పెద్ద ఎత్తున నిధులు వెచ్చించి అన్ని ప్రాంతాలకు సమానంగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఎన్నికలలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని ఒక్కొక్కటిగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. డివిజన్ అభివృద్ధికి సహకరిస్తున్న బండారి లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ వెన్నెల గౌడ్, ఏఈ రాధిక, బీఆర్ఎస్ నాయకులు, వివిధ కాలనీల అధ్యక్ష కార్యదర్శులు, తదితరులున్నారు.



## దాబాను ప్రారంభించిన మైనంపల్లి



**నవతెలంగాణ-నేరేడ్‌మెట్**

మల్కాజిగిరి సర్కిల్ ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని బండ చెరువు సాయిబాబా టెంపుల్ ఎదురుగా టీపీసీగల్లి దాబాను బుధవారం రాత్రి మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు దినేష్ రెడ్డి, మహేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, కందాడి అంజిరెడ్డి, ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్ కుమార్, కాంగ్రెస్ మల్కాజిగిరి బీ బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, బీకే శ్రీనివాస్, వినోద్ యాదవ్, సంపత్ గౌడ్, ఉమేష్ సింగ్, రాందాస్ సంతోష్ ముదిరాజ్, ఆగమయ్య, రామచందర్, బాబు, సత్యనారాయణ, ఫరీద్, తదితరులున్నారు.

# పేదలను ఆదుకోవడంలో ముందుండాలి

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**నవతెలంగాణ-ఉప్పల్**



ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో ముందుండాలని, సేవే లక్ష్యంగా నాయకులు నడవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం చిల్కానగర్ డివిజన్ కుమ్మరి కుంటకి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త విజయ కుమారుడికి ఇంజనీరింగ్ చదువు నిమిత్తం బీఆర్ఎస్ నాయకులు గుడి మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చేతుల మీదుగా ల్యాప్‌టాప్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద ప్రజలకు సేవ చేయాలని, మానవసేవే- మాధవసేవా అని, నిత్యం చిల్కానగర్ డివిజను ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజలకు సేవ చేసే గుణం మంచి మనసున్న నాయకుడు అని గుడి మధుసూధన్ రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో చిలుకనగర్ డివిజన్ టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఉద్యమకారులు మహిళలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## రేపు సీపీఐ(ఎం) పాదయాత్ర

**నవతెలంగాణ - పోచారం**



పోచారం మున్సిపల్ పరిధిలో నారపల్లి మేడిపల్లి ఉప్పల్ ఫ్లైఓవర్ పనులు పూర్తి చేయాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో చెంగిచెర్ల చౌరస్తా నుండి ఉప్పల్ రింగ్ రోడ్ వరకు 22వ తేదీన 9 గంటలకు పాదయాత్ర చేస్తున్నట్టు సీపీఐ(ఎం) ఘట్కేసర్ మండల నాయకులు చింతల యాదయ్య, మండల కార్యదర్శి ఎన్.సబిత గురువారం తెలిపారు. పాదయాత్రను సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జాన్ వెస్లీ ప్రారంభిస్తారని తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. నారపల్లి మేడిపల్లి ఉప్పల్ ఫ్లై ఓవర్ పనులు 2018 జూలైలో ప్రారంభించారని, 2020 జూలై నాటికి పూర్తి చేయాల్సిన పనులు ఏండ్లు గడిచినా 40శాతం పనులే పూర్తయ్యాయని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతో పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# సర్వే ఎన్యుమరేటర్లకు ఇన్సెంటివ్ చెల్లించండి

**నవతెలంగాణ-ఉప్పల్**



సమగ్ర కుటుంబ సర్వేలో పని చేసిన ఎన్యూమరేటర్లకు ఇన్సెంటివ్ ఇవ్వాలని గురువారం అంగన్వాడీ ఉద్యోగులు ఉప్పల్ జీహెచ్ఎంసీ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ ఆందోళనకు సీఐటీయూ ఉప్పల్ కార్యదర్శి జె. వెంకన్న మద్దతు తెలిపారు. అనంతరం అంగన్వాడీ కార్యకర్తలు కృష్ణ ప్రియ, నాగమణితో కలిసి మాట్లాడుతూ.. పని చేయించుకొని డబ్బులు ఇవ్వకుంటే తమ కుటుంబ పోషణ ఎలా గడువాలని ప్రశ్నించారు. ఇన్సెంటివ్ ఇవ్వకపోతే పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. సమగ్ర కుటుంబ సర్వే చేసి మూడు నెలలు పూర్తయినా నేటికీ ఇన్సెంటివ్ ఎన్యూమరేటర్ల ఖాతాలో పడలేదన్నారు. పగలు, రాత్రి అని తేడా లేకుండా పని చేయించుకున్న అధికారులు ఇన్సెంటివ్ అడిగితే తమకు తెలియదని, పైనుంచి రాలేదని మభ్యపెట్టే మాటలు చెబుతున్నారని మండిపడ్డారు. సర్వే చేయించుకున్నప్పుడు ఇన్సెంటివ్ ఇప్పించాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. ఇప్పటికైనా అధికారులు ఇన్సెంటివ్ ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఫర్జాన, ప్రేమలత, నీరజ, కవిత, చంద్రకళ, సంతోష్, వాణి, వనజ, వసంత, పెద్ద ఎత్తున అంగన్వాడీలు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన



**నవతెలంగాణ-కాప్రా**

మీర్‌పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్ పరిధిలోని ఇంద్రానగర్ కాలనీలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డిలు గురువారం పరిశీలించారు. అనంతరం ప్రభుదాస్ మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ కాలనీ ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈ రూప, ఏఈ లింగరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, కాలనీవాసులు దుర్గారెడ్డి, పూస రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు సేఫ్టీ కిట్లు అందజేయాలి



**నవతెలంగాణ-చర్లపల్లి**

పారిశుధ్య కార్మికులకు త్వరగా సేఫ్టీ కిట్లును అందజేయాలని నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ అధికారులను ఆదేశించారు. గురువారం పారిశుధ్యంపై నాచారం వార్డు కార్యాలయం అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. రంజాన్ పండుగను పురస్కరించుకొని నాచారం డివిజన్‌లోని తొమ్మిది మసీదుల వద్ద రంజాన్ మాసం అంతా పరిశుభ్రంగా ఉండేలా చూడాలని శానిటేషన్ సిబ్బందికి సూచించారు. ఎర్రగుంటలోని ఈద్గా, శ్మశాన వాటికలు పండుగలోపు శుభ్రపరచాలని ఆదేశించారు. కార్మికుల సేఫ్టీ కిట్టు ఇప్పటివరకు ఇవ్వలేదని తెలియజే యడంతో తొందరలో సేఫ్టీ కిట్టు అందజేయాలన్నారు. పర్మినెంట్ కార్మికులు ఎక్కడా పనిచేయడం లేదని, వారు పని చేయని పక్షంలో వారిని వేరే ప్రాంతానికి ట్రాన్స్‌ఫర్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో కాప్రా సర్కిల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సుదర్శన్, జవాన్లు, ఎస్ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



**నవతెలంగాణ-కాప్రా**

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు అసెంబ్లీ ఆమోదం తెలిపిన సందర్భంగా టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ గౌడ్, డీసీసీ అధ్యక్షులు హరివర్ధన్‌రెడ్డి పిలుపు మేరకు ఉప్పల్ నియోజకవర్గంలోని ఏఎస్‌రావునగర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు గురువారం ఈసీఐఎల్ చౌరస్తాలో సంబురాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. బీసీలకు విద్య, ఉద్యోగ రంగాలలో 42శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ, బీసీ రిజర్వేషన్లు పెంపు చారిత్రాత్మకమైనదని తెలిపారు. అంతకుముందు బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి, మహాత్మా జ్యోతిరావు పూలే చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేసి, బాణా సంచా కాల్చారు.

## కాంగ్రెస్‌తోనే 30 ఏండ్ల కల నెరవేరింది



- కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

**నవతెలంగాణ - చర్లపల్లి**

30 ఏండ్ల ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పెంపు రేవంత్ రెడ్డితోనే సాధ్యమైందని కార్పొరేటర్ బొంతు శ్రీదేవియాదవ్ అన్నారు. సీఎం బడుగు, బలహీన వర్గాల ఆత్మబంధువు అని అన్నారు. అసెంబ్లీలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ, బీసీ రిజర్వేషన్ల 42 శాతం పెంపు బిల్లులకు ఆమోదం తెలుపడాన్ని హర్షిస్తూ గురువారం చర్లపల్లి డివిజన్ కుషాయిగూడ బస్టాండ్ దగ్గర అరుంధతి కాలనీలో డా.బిఆర్.అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు. తర్వాత మిఠాయిలు పంపిణీ చేసి, బాణా సంచ పేల్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. బీసీలకు విద్య, ఉద్యోగ రంగాలలో 42శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసిన ఘనత రేవంత్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సింగిరెడ్డి వెంకట్ రెడ్డితో సహా నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, విద్యార్థి నాయకులు, ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

## ఆలోచనలు ఆత్మపరిశీలన చేసుకొని ముందుకు సాగితే ఆరోగ్యకరమైన జీవితం

**నవతెలంగాణ - పోచారం**



మన ఆలోచనలను నిత్యం ఆత్మ పరిశీలన చేసుకొని ముందుకు సాగినప్పుడే ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందగలమని క్లీనికల్ సైకాలజిస్ట్ శిల్పా పన్నాల అన్నారు. గురువారం పోచారం మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో అడ్వాన్స్డ్ సైకాలజీకల్ సర్వీసెస్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో అంతర్జాతీయ హాప్పినెస్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా ఆమె హాజరై మాట్లాడుతూ ఆనందంగా ఉండడం అనేది ఒక సైన్స్ అని, భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ దానిని అంగీకరించకపోయినా సమాజంలో కలిసి ఉండాలని సూచించారు. మనతో పాటు చుట్టూ ఉన్నవాళ్ళు ఆనందంగా ఉన్నప్పుడే మనం ఆనందంగా ఉండగలమన్నారు. మనకు నచ్చిన విషయమైనా, నచ్చని విషయమైనా స్పష్టంగా చెప్పగలగాలని పేర్కొన్నారు. అంతకుముందు మానసిక వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ మహిపతీ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ మానసిక ఆరోగ్యమే విజయానికి తోడ్పాటునిస్తుందని, ఆనందం మన చేతిలోనే ఉంటుందన్నారు. అనంతరం హెచ్ఓడీ విష్ణు వందన మాట్లాడుతూ మేనేజ్మెంట్ విద్యార్థులు నైపుణ్యత పెంపొందించుకోవడానికి సైకాలజీ ఎంతో ఉపయోగపడుతుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అడ్వాన్స్డ్ సైకాలజీ కల్ సర్వీసెస్ ఆఫ్ ఇండియా సభ్యులు మహిపతీ గాయత్రీ, కె. ప్రీతం, ఫ్యాకల్టీ కల్పన తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ ఈటలకు శుభాకాంక్షల వెల్లువ



**నవతెలంగాణ - చర్లపల్లి**

మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ జన్మదిన సందర్భంగా నాచారం డివిజన్ బీజేపీ శ్రేణులు శామీర్‌పేట్‌లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు రాగిరి మోహన్ రెడ్డి, ఉప్పల్ మహిళ కన్వీనర్ అనితపద్మారెడ్డి, నాయకులు మల్కా ప్రకాష్, డివిజన్ అధ్యక్షులు నవీన్ కుమార్, రవికాంత్, ప్రతాప్ రెడ్డి, ఉదయ్ కిరణ్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, బాలు, వరలక్ష్మి ఆనంద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం ప్రారంభం



**నవతెలంగాణ-నేరేడ్‌మెట్**

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పుట్టినరోజు సందర్భంగా నేరేడ్‌మెట్ డివిజన్ యాప్రాల్‌లో నాయకులు సత్యనారాయణ, బాబు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని నేరేడ్‌మెట్ డివిజన్ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం నేరేడ్ మెట్, ఆర్‌కేపురంలోని ఆర్.ఎస్.ఎస్. సంచారి స్కూల్, ఆశా కిరణ్ అనాథ పిల్లల ఆశ్రమంలోని పిల్లలకు బిర్యానీ ప్యాకెట్లు, పండ్లను పంచి పెట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఈటల నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉండాలని, రానున్న కాలంలో రాజకీయంగా ఉన్నత శిఖరాలను ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి, బీజేపీ నేరేడ్ మెట్ డివిజన్ అధ్యక్షులు ఆదిత్య, సత్యనారాయణ, పరమేష్, సుధాకర్, శ్యామ్, శర్మ, అకారం సాయి, తపస్ జైన్, కిట్టు, పాల్గొన్నారు.



## మురుగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

**నవతెలంగాణ-అల్వాల్**

అల్వాల్‌లోని మచ్చ బొల్లారం డివిజన్‌లోని ప్రేమ్ నగర్ కాలనీ, సూర్య కాలనీ, హరిజన బస్తీలలో మురుగునీటి సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించడానికి కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, జలమండలి డీజీఎం సాంబయ్య, డీఈ రఘు విగ్నేష్, ఇతర అధికారులతో కలిసి ప్రేమ్ నగర్ కాలనీలో సందర్శించారు. అనంతరం కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ మాట్లాడుతూ.. కాలనీలో మురుగునీరు నిల్వ ఉండటం వల్ల దుర్గంధం, దోమల బెడద తీవ్రంగా ఉందని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రైల్వే ట్రాక్ పక్కన మురుగునీరు తొలగించేందుకు రైల్వే అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీ శ్రీనివాస్ రెడ్డి, స్థానిక నాయకులు బొబ్బిలి సురేందర్ రెడ్డి, వెంకటేష్, దేవేందర్, రాములు, షేక్ గౌస్, ఇసాక్, అక్రమ్, షఫీ, మహమూద్, శ్రీనివాస్, చోటా గౌస్ తదితరులు పాల్గొన్నారు.



## మహిళలకు కుట్టు మెషిన్లు పంపిణీ



**నవతెలంగాణ-కాప్రా**

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ జన్మదినం సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గం మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్‌కు చెందిన మహిళలకు ఎంపీ ఈటల చేతుల మీదగా నాలుగో డివిజన్ అధ్యక్షు లు రామ్ ప్రదీప్ ఇప్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బ్రహ్మాచారి, వెంకన్న గౌడ్, నర్సింగ్, బాలరాజ్, సాయి పవన్, డివిజన్ నాయకులు మురళీచారి, చంద్రశేఖర్, మురళి, క్రాంతి, ప్రవీణ్ గౌడ్, యాదగిరి, జాన్, అజయ్, భాను, పాల్గొన్నారు.



ఎంపీ ఈటల రాజేందర్ పుట్టినరోజు సందర్భంగా డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్ ఈసీఐఎల్ క్రాస్‌రోడ్డు సాయిబాబా దేవాలయం దగ్గర బీజేపీ నాయకులు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం మర్రి మోహన్ రెడ్డి, కె.రమేష్ యాదవ్, రజనీకాంత్ రెడ్డి, రాంసాగర్ కిషోర్‌చారి, సీతారామరెడ్డి, పుష్పలత, పృథ్వీ శ్రీహరి, నందు, తదితరులున్నారు. -నవతెలంగాణ,కాప్రా

## భవనం పైనుంచి దూకి మహిళ ఆత్మహత్య



నవతెలంగాణ-పేట్ బషీరాబాద్

భవనం పైనుంచి దూకి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన పేట్ బషీరాబాద్ చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పేట్ బాషీరాబాద్ పరిధిలోని పైప్ లైన్ రోడ్ లోని అంబుష్ బర్గ్ అపార్ట్‌మెంట్ బిల్డింగ్ పైనుంచి దూకి శాంత కుమారి వయస్సు (40) సం॥ రాలు అనే మహిళ అనారోగ్య సమస్యలను తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంది. అదే అపార్ట్‌మెంట్‌లో ఆమె భర్త శ్రీనివాస్ వాచ్మెన్‌గా పనిచేస్తున్నాడు. శాంత కుమారి ఇండ్లల్లో పనిచేసుకుంటూ జీవనం సాగిం చేవారు. ఈ దంపతులు ఐదు సంవత్సరాల క్రితం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రావులపల్లికి చెందిన వారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోలన్ హన్మంత్ రెడ్డి కుమారుడు కోలన్ వెంకట్ రామ్ రెడ్డి వివాహ విందు బుధవారం రాత్రి జేఆర్‌సీ కన్వెన్షన్ జూబ్లీహిల్స్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో నూతన వధూవరులను తెలంగాణ రాష్ట్రముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీ నాయకులు ఎమ్మెల్యేలు, ఎంపీలు,ఎమ్మెల్సీలు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

## మధ్యాహ్న భోజన కార్మికులకు
# రూ.10 వేల వేతనం అమలు చేయాలి

- 24న ఇందిరా పార్కు వద్ద ధర్నా
- తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కోశాధికారి కె.ఉన్ని కృష్ణ



నవతెలంగాన-సిటీబ్యూరో

మధ్యాహ్న భోజన కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీ ప్రకారం రూ.10 వేలు అమలు చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ ) మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కోశాధికారి కె.ఉన్ని కృష్ణ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం యూనియన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి ప్రేమలత అధ్య క్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికులకు 10 నెలల వేతనం అమలు చేస్తామని హామీ ఇచ్చారని, హామీ అమలు చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 8 నెలల నుంచి కోడిగుడ్ల బిల్లులు, 3 నెలల వేతన బకాయిలు ఉన్నాయని, బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. వంటకు అవసరమైన గ్యాస్‌ను ప్రతి పాఠశాలకు ఉచితంగా సరఫరా చేయాలని, గుర్తింపు కార్డులు ప్రభుత్వమే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24న ఇందిరా పార్క్ (హైదరాబాద్) వద్ద ధర్నాల్లో కార్మికులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10 వేల వేతనం అమలు చేస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి 15 నెలలు కావస్తు న్నా నేటికీ అమలు లేదన్నారు. మధ్యాహ్న భోజన నిర్వహణలో పనిచేస్తున్న మహిళ లంతా అట్టడుగు వర్గాలకు చెందినవారు అని, వారి కిచ్చే వేతనం చాలా తక్కువ అని, అది కూడా నెలల తరబడి పెండింగ్‌లో ఉంటుంది అని తెలిపారు. 2025 మార్చి బడ్జెట్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా కార్మికుల వేతనం పెంపు కోసం బడ్జెట్ కేటా యించి ఎన్నికల హామీ ప్రకారం ప్రతి కార్మికురాలికి రూ.10 వెలు వారి వ్యక్తిగత ఖాతాలో వేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 8 నెలల నుంచి కోడిగుడ్ల బిల్లులు, 3 నెలల నుంచి వేతనాలు బకాయిలున్నాయని తెలిపారు. ఒకపక్క వారానికి 3 కోడిగుడ్లు పెట్టాలని కార్మికులను అధికారులు ఒత్తిడి చేస్తున్నారని, ప్రభుత్వం గుడ్డుకిచ్చే బడ్జెట్‌తో రెండు గుడ్లు కూడా రావు అని, 3 గుడ్లు పెట్టాలని, గతంలో పెట్టిన వాటికి 8 నెలల నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉంటే కార్మికులు ఎంతకాలం అప్పులు చేసి పెడతారు అని ప్రశ్నించారు. గుడ్లను అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్నట్టుగా ప్రభుత్వమే నేరుగా పాఠశాలలకు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏ ఓ రామ్మోహన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నాలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్. శ్రీనివాస్, మధ్యాహ్న భోజన యూనియన్ జిల్లా నాయకులు విజయ లక్ష్మి, భాగ్య, మంజుల, మధ్యాహ్న భోజన కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# నేటీ నుంచి పది పరీక్షలు

- బాలానగర్ మండల పరిధిలో 11పరీక్షా కేంద్రాలు
- పరీక్షలు రాయనున్న 2340 మంది విద్యార్థులు
- 3 ప్రభుత్వ పాఠశాలలు, 8 ప్రయివేటు పాఠశాలలు, 130 మంది ఇన్విజిలేటర్స్



నవతెలంగాణ-బాలానగర్

బాలానగర్ మండల పరిధిలోని జిలా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలో ఆయా పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు వేసవిలో ఎలాంటి ఇబ్బందులు పడకుండా తాగునీటి సౌకర్యంతో పాటు ఇతరత్రా పరిస్థితులు, సదుపాయాలను అధికారులు పర్యవేక్షించారు. ఉత్తీర్ణతతో పాటు మెరుగైన ఫలితాలు రాబట్టేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో జరిగిన ప్రత్యేక కార్యాచరణ ముగియడంతో చివరగా విద్యార్థులకు సూచనలు చేశారు. స్ట్రాంగ్ రూమ్‌లో నుంచి ప్రశ్నాపత్రాలు పరీక్షా కేంద్రాలకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రధానంగా బాలానగర్ మండల పరిధిలో పదవ తరగతి పరీక్షలకు జరుగుతున్న ఏర్పాట్లను మండల విద్యాధికారి హరిచంద్ పర్యవేక్షించారు. నేటీ నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. బాలానగర్ మండల పరిధిలో 11 పరీక్షా కేంద్రాలు, 2340 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. అందులో 3 ప్రభుత్వ పాఠశాలలు, 8 ప్రయివేటు పాఠశాలు, 130 మంది ఇన్విజిలేటర్స్ ఉన్నారు.

### బాలానగర్ పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశాం..



బాలానగర్ మండలంలో పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి, ఆందోళనకు గురికా కుండా పరీ క్ష కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలి. ఎక్కడైనా ఏదైనా ఇబ్బంది ఉంటే మా దృష్టికి తీసుకురండి. వెంటనే ఆ సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

-బాలానగర్ మండల విద్యాధికారి హరిచందర్

## ఇంటి తాళాలు పగలగొట్టి చోరీ..



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలోని గాజుల రామారం వీనస్ ఎన్ క్లేవ్ లోనే ఓ ఇంట్లో భారీ చోరీ జరిగింది. జాఫర్ మియ్య రంజాన్ మాసం సం దర్భంగా కుటుంబ సభ్యులతో కర్నూలులోని బంధువుల ఇంటికి వెళ్లి వచ్చా డు. ఇంటి తాళం పగలగొట్టి సుమారు 25 తులాల బంగారం, 80 తులాల వెండి, రూ.15 వేల నగదు దొంగలించినట్టు సూరారం పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పొంగి పొర్లుతున్న మురుగు నీరు

- ఫిర్యాదులపై స్పందించని అధికారులు
- అధికారుల అలసత్వంపై దీనబంధు కాలనీ వాసుల అసహనం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని, దీనబంధు కాలనీ రోడ్ నంబర్ 17 ఆనుకుని దీనబంధు కాలనీ, హనుమాన్ నగర్, ప్రగతి నగర్, పాపిరెడ్డి నగర్, వెళ్లే ప్రధాన రహదారిలో డ్రయినేజీ సమస్యలతో స్థానికులు వాహన దారులు, తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కాలనీ రోడ్లపై మురుగు నీరు ప్రవహిస్తుండటంతో, ప్రజలు అనారోగ్యాల బారీన పడి ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొంది. కాలనీ వాసులు ఈ సమస్య గురించి హైదరాబాద్ మెట్రో పాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు అధికారులకు పలుమార్లు తెలియజేశారు. ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో కాలనీవాసులు అధికారుల నిర్లక్ష్యంపై ఆవేదన వ్యక్తం చేశారు. డ్రయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో నివాసితులు పందులు, దోమలు, ఈగలతో సహవాసం చేయాల్సిన దుస్థితి నెలకొంది. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు ప్రతి ఇంట్లో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలుతున్నాయి. అదే రోడ్డులో ఉన్న పాఠశాల ముందు ఈ డ్రయినేజీ నీరు ప్రవహిస్తూ ఉండడం వలన విద్యార్థులకు విషజ్వరాలు సోకి వారి ఆరోగ్య పరిస్థితి విషమించే ప్రమాదం ఉంది. కావున, సంబం ధిత అధికారులు తక్షణం స్పందించి, డ్రయినేజీ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరారు.

## ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం

- సీపీఐ(ఎం) బాచుపల్లి మండల కార్యదర్శి బి.వెంకటరామయ్య



నవతెలంగాణ-నిజాంపేట్

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించడం ద్వారా మాత్రమే మల్లు స్వరాజ్యంకి ఘన నివాళులు అని బాచుపల్లి మండల సీపీఐ(ఎం) కార్యదర్శి బి.వెంకటరామయ్య అన్నారు. శుక్రవారం ఆయన తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం మూడవ వర్ధంతిని పురస్కరించుకొని బాచుపల్లి మండలం ప్రగతి నగర్‌లోని సుందరయ్య భవన్‌లో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ నైజాం పాలన అంతం కోసం, భూమి కోసం, భుక్తి,విముక్తి కోసం ఆనాడు జరిగిన సాయిధ పోరాటంలో మల్లు స్వరాజ్యం పాత్ర అమోఘమని ఆయన కొనియాడారు. ఆమె స్ఫూర్తితో మహిళలు ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల నాయకులు బాల వెంకటేశ్వరరావు, కృష్ణయ్య, ఎస్.బాలాపూర్, గోవింద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

నేటి నుంచి జరగబోయే పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కుత్బుల్లాపూర్ ఎంఈఓ ఒక ప్రకటనలో తెలిపారు. కుత్బుల్లాపూర్‌లో 53 సెంటర్లు ఏర్పాటు చేశామని , మొత్తం 12672 మంది 10వ తరగతి విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. ఎగ్జామ్స్ సెంటర్‌కు గంట ముందు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. పరీక్ష ప్రారంభమైన తర్వాత 5 నిమిషాల వరకు సడలింపు ఉంటుందన్నారు. 5 నిమిషాలు దాటితే ఎట్టి పరిస్థితిలో లోనికి అనుమతించమని సూచించారు.

## సీసీ రోడ్డు వేయడంలో ఎందుకు నిర్లక్ష్యం



- స్థానికుల నిరసన

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని శివనగర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభమై నెలలు అవుతున్న వేయడంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ అధికారుల పనితీరుపై ధ్వజం ఎత్తారు. పనులను త్వరగా పూర్తి చేయాలని నాలుగైదు పర్యాయాలు సంబంధిత అధికారులు డీప్యూటీ కమిషనర్ మల్లారెడ్డికి, ఈఈ, డిఈ, ఏఈలకు సూచించారు. జరిగే అభివృద్ధి పనుల్లో భాగంగా రోడ్డు పనులను జరగకుండా ఆపాలని కొంతమంది అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫోన్‌లు చేసి నిలిపివేయాలని ఒత్తిడి చేస్తున్నారని అధికారులు, కార్పొరేటర్‌కు తెలిపారు. సంబంధిత అధికారులు అధికార పార్టీ నాయకుల మాటలు కాకుండా స్థానిక ప్రజల సౌకర్యార్థం తక్షణమే స్పందించి సీసీ రోడ్డు పనులు ప్రారంభించాలని ఆదేశించారు. లేనిపక్షంలో జోనల్ కమిషనర్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శివనగర్ అధ్యక్షులు నాగరాజు, స్థానికులు డాక్టర్ విట్టల్, భాస్కర్ రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

## చలివేంద్రాలు ప్రజల దాహార్తిని తీరుస్తాయి

- విద్యార్థి నాయకులు రాహుల్ నాయక్, దుర్గా ప్రసాద్



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

చలి వేంద్రాలు ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎంతగానో దోహదపడుతాయని విద్యార్థి నాయకులు రాహుల్ నాయక్, దుర్గా ప్రసాద్‌లు అన్నారు. జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయంలోస్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరమ్ ఆధ్వర్యంలో పెరుగుతున్న ఎండల తీవ్రత దృష్ట్యా, విద్యార్థులకు, ఉద్యోగులకు, తాగు నీటి కోసం ఇబ్బందులు కలగకుండా రెండు స్థలాల్లో చలివేంద్రాలు ఎర్పాటు చేశారు. జెఎన్‌టీయూ ప్రధాన ద్వారం దగ్గరలో ఒకటి, స్పందన బ్లాక్ వద్ద మరొక చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే ఎండలు విపరీతంగా పెరిగినందువల్ల విద్యార్థులు మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. విశ్వవిద్యాలయంలో చాలా భవనాల్లో మంచినీటి సదుపాయం లేకపోవడం కారణంగా విద్యార్థులు ఉద్యోగులు తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటిని దృష్టిలో ఉంచుకొని మరియు విశ్వవిద్యాలయానికి వివిధ పనులకు వస్తున్న వారికి సైతం తాగునీరు లేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయ అధికారులు సైతం గత కొద్ది సంవత్సరాలుగా మరమ్మత్తులకు నోచుకోని తాగునీటి ప్లాంటును రిపేర్ చేయించాలన్నారు. ప్రతి బిల్డింగ్‌లో ప్రతి ఫ్లోర్లో తాగు నీటి సదుపాయం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు దుర్గాప్రసాద్, సాగర్ నాయక్, నితిన్ కుమార్, సంతోష్ కుమార్, భాను ప్రకాష్ నాయక్, హరినాథ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## భవిత విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ..

- కూకట్‌పల్లి భవిత ఐఈఆర్‌పీ దేదీప్య



నవతెలంగాణ-కూకట్‌పల్లి

భవిత విద్యార్థులకు సహాయ ఉపకరణాల పంపిణీ అభినందనీయమని కూకట్‌పల్లి భవిత ఐఈఆర్‌పీ దేదీప్య అన్నారు. వికలాంగుల సేవ విశ్వమానవ సేవ అంటూ సమగ్ర శిక్ష తెలంగాణ, జిల్లా విద్యా శాఖ మేడ్చల్ మల్కాజిగిరి, ఏఎల్ఎంసీఓ వారి ఆధ్వర్యంలో గురువారం జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాల మల్కాజిగిరిలో, వికలాంగ విద్యార్థు లకు సహాయ ఉపకరణాలు, వినికిడి యంత్రం, వీల్ చైర్, రోలేటర్ వంటి పరికరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాధికారి విజయ కుమారి పాల్గొన్నారు. ఈ శిబిరానికి, కూకట్‌పల్లి భవిత కేంద్రం నుంచి సైతం 18 మంది వికలాంగ విద్యార్థులు పాల్గొన్నారని ఐఈఆర్‌పీ ఉపాధ్యాయురాలు దేదీప్య తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వికలాంగ విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని, జిల్లా సమగ్ర శిక్ష తెలంగాణ విద్యా శాఖ, అలాగే ఆర్టిఫీషియల్ లింబ్స్ మానుఫాక్చరర్స్ కార్పొ రేషన్ ఆఫ్ ఇండియా వారు సహృదయంతో భవిత విద్యార్థులకు సహాయ ఉపకరణాలు పంపిణీ చేయడం అభినందించదగ్గ విషయమని తెలిపారు. అనంతరం కూకట్‌పల్లి మండలం నుంచి 18 మంది పిల్లలు ఈ అవకాశాన్ని విని యోగించుకున్నందుకు కూకట్‌పల్లి మండల విద్యాధికారి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ రవీందర్ రాజు, ఐఎస్ఓ అయ్యన్న, మల్కాజిగిరి ఎంఈఓ సురేష్, వివిధ మండలాల ఐఈఆర్‌పీలు ప్రత్యేక అప్షయాయులు పాల్గొన్నారు.

## కాగితాల్లో అంకెలు పెంచుడు ఖర్చుల్లో తుంచుడు

- చేవెళ్ల డిక్లరేషన్‌కు చెల్లు చీటీ
- అటకెక్కిన అంబేద్కర్ అభయ హస్తం
- కేవీపీఎస్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి నాగనిగళ్ళ బాలపీర్



నవతెలంగాణ-నిజాంపేట

రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెలు పెంచుడు ఖర్చులు తుంచుడు లాగా తయారైందని కేవీపీఎస్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి నాగనిగళ్ళ బాలాపీరు విమర్శించారు. 2025-2026 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం మూడు లక్షల 4,965 కోట్ల రూపాయలతో ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ప్రవేశపెట్టిన బడ్జెట్లో రూ.40, 231,61,80 కోట్ల తో ఎస్సీ.ఎస్.డి.ఎఫ్ కింద కేటాయించారని కాగితాల్లో అంకెలు పెంచుతూ ఖర్చులు తుంచుతున్నారని, ప్రభుత్వం ప్రకటించిన చేవెళ్ల డిక్లరేషన్ అమలుకు కేటాయింపు జరగ లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల డిక్లరేషన్ లో అంబేద్కర్ అభయ హస్తానికి ఏటా 750 కోట్ల రూపాయలు కేటాయి స్తామన్న వాగ్దానం నిలబెట్టుకోలేక పోయిందని విమర్శించారు. ప్రకటించిన బడ్జెట్‌ను సవరించి దళితుల జనాభా దామా షా ప్రకారం నిధులు కేటాయించి వారి ప్రత్యక్ష ప్రయోజనాల కోసం ఖర్చు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం




- కార్పొరేటర్ బి.విజయ్ శేఖర్ గౌడ్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మండు వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడం కోసం దాతలు స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని రంగారెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ బి.విజయ్ శేఖర్ గౌడ్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని సౌభాగ్యనగర్‌లోని అలవి హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ముఖ్య అతిధిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలివేంద్రాల ఏర్పాటుతో ప్రజల దాహార్తిని తీర్చడం ఎంతో పుణ్యఫలమని,చలివేంద్రాల ఏర్పాటుకు పలు స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావాలన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు, ఆదర్శ్ నగర్ కోపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు ఏర్వ శంకరయ్య, సౌభాగ్య సంక్షేమ సంఘం అధ్యక్షులు సురేందర్ రెడ్డి, నాయకులు రవీందర్ గుప్తా, మహిళ నాయకురాలు అరుణ పాల్, నిర్వాహకులు డాక్టర్ చంద్రశేఖర్, అలవి హాస్పిటల్ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ నాయకుల సంబరాలు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లు ఆమోదించిన సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు నియోజకవర్గ మున్సిపల్ సర్కిల్ అంబేద్కర్ ప్రాంగణం ముందు బాణాసంచా పేల్చి మిఠాయిలు తిని సంబరాలు జరు పుకున్నారు. అలాగే అమరవీరులకు పూలమాలలు వేసి, వారి ప్రాణ త్యాగాలు వృధా కాలేవని కొనియాడారు. ఈ ఉద్య మంలో ఎందరో అమరులయ్యారని వారికి ఈ రిజర్వేషన్లు అంకితం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీ ఎస్ మేడ్చల్ జిల్లా అధికార ప్రతినిధి సిలువేరు శ్రీనివాస్ మాదిగ, జిల్లా ఉపాధ్యక్షులు రాస మల్ల యాదగిరి మాదిగ, జిల్లా యువసేన ప్రధాన కార్యదర్శి ఇసురం రమేష్ మాదిగ, జిల్లా మాదిగ మహిళా సమాఖ్య నడిమి దొడ్డి సలోమి ఉన్నారు.

## సైబర్ నేరాలపై పుస్తకావిష్కరణ..

నవతెలంగాణ-పేట్ బషీరాబాద్

పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో సైబర్ ఆర్థిక నేరాలపై, మోసాల తీరు అని ఆదర్శ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు వారు 20 రకాల ఆర్థిక నేరాలు చేసే విధానము, తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ పుస్తకాన్ని ముద్రించి గురువారం పేట్ బషీరాబాద్ సీఐ విజయవర్ధన్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకాలన్ని పోలీస్ స్టేషన్‌లో రిసెప్షన్‌లో ఉంచి పిటీషనర్లకు అవగాహన కల్పించే విధంగా పంపిణీ చేయనున్నట్టు సీఐ విజయవర్ధన్ తెలిపారు.

## సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి

- జీడిమెట్ల ఎస్‌హెచ్‌ఓ గడ్డం మల్లేష్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జీడిమెట్ల ఎస్‌హెచ్‌ఓ గడ్డం మల్లేష్ అన్నారు. గురువారం ది ఆదర్శ్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఆర్థిక నేరగాల విధానం తీసుకోవలసిన జాగ్రత్తల గురించి " సైబర్ ఆర్థిక నేరగాళ్ల మోసాల తీరు "అనే పుస్తకాన్ని మల్లేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... గతంలో దొంగలు ఇండ్లలో చొరబడి ధనం దోచుకొని వెళ్లేవారని, ప్రస్తుతం మోసగాళ్లు సైబర్ నేరాలు ద్వారా ప్రజల ధనాన్ని దోచుకుంటున్నారని చెప్పారు.

## రామ్ గోపాల్‌పేట్‌లో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-బేగంపేట్

సనత్‌నగర్ నియోజకవర్గం ఏ బ్లాక్ అధ్యక్షుడు త్రికాల మనోజ్ కుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో 42శాతం బీసీ డిక్లరేషన్ చేసినందుకు గురువారం రామ్ గోపాల్‌పేట్ డివిజన్ విక్టోరియా రాణిగంజ్ సర్కిల్ వద్ద రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సనత్ నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ కోట నీలిమ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో రాంగోపాల్ పే డివిజన్ కాంగ్రెస్ నాయకులు రహీం భాయ్, సాదిక్ బాయ్, రఘు ముదిరాజ్, రఘు యాదవ్, అఖిల్, యాసీన్ కురేసియా, ఎల్లేష, ఈశ్వర్, పాండు గౌడ్, జై కృష్ణ, కాంగ్రెస్ అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మహిళలు హక్కుల కోసం పోరాడాలి




నవతెలంగాణ-బేగంపేట్

మహిళా సాధికారత, మహిళలు తమ హక్కులు సాధించుకోవడం కోసం పోరాడాలి. దీని కోసం కాంగ్రెస్ పార్టీ ఇందిరా ఫెలోషిప్ అనే స్కీం ప్రారంభించింది. ముఖ్యంగా మహిళల శక్తివంతతను పెంపొందించి, కాంగ్రెస్ పార్టీ రాజకీయ నాయకత్వంలో వారి భాగస్వామ్యాన్ని పెంచేందుకు కృషిచేస్తోందని సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి డా.కోట నీలిమ అన్నారు. బేగంపేట్ శ్యాంలాల్ బిల్డింగ్స్ వద్ద ఒక మహిళా కార్యక్రంలో ఆమె మాట్లాడారు. ఇందిరమ్మ దేశానికందించిన సేవలను నాడు, నేడు, ముందుతరాల వారు కూడా గుర్తుచేసుకుంటూనే ఉంటారని ఈ సందర్భంగా అన్నారు. మహిళ అంటే ఒక శక్తిస్వరూపిణి అని, తమ హక్కుల సాధనకై పోరాటంలో ఎల్లప్పుడూ ముందుండాలని, వారికి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా సహకరిస్తుందని చెప్పారు. ఈ సమావేశంలో ఇందు శ్రీరంగం, విజయలక్ష్మి రమణి రెడ్డి, అంజలి యాదవ్, రమాదేవి పాల్గొన్నారు.

## ఓయూలో భారీ ర్యాలీ



● పరిపాలన భవన్ ఎదుట సర్క్యూలర్ ప్రతులు చించివేత, ధర్నా

నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీలో ఎలాంటి ఆందోళనలు చేయకూడదని అధికారులు జారీ చేసిన సర్క్యులర్‌కు వ్యతిరేకంగా గురువారం ఓయూ ఐక్య విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో యూనివర్సిటీలో భారీ విద్యార్థి ర్యాలీ నిర్వహించారు. అనంతరం పరిపాలన భవన్ ఎదుట సర్క్యులర్ ప్రతులు చించివేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగానికి విరుద్ధంగా సర్క్యులర్ విడుదల చేసి విద్యార్థుల గొంతు నొక్కుతుంటే ప్రభుత్వ పెద్దలు మౌనంగా ఉండటం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఓయూ విద్యార్థుల సమస్యలను పరిష్కరించే బాధ్యత నుంచి తప్పించుకోవడానికి ఓయూ వీసీ ఎం. కుమార్ దొడ్డి దారిన సర్క్యులర్ తెచ్చారని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమానికి, మార్పు కోసం జరిగిన ఉద్యమానికి ఓయూ వేదికైందన్నారు. దీని కారణంగానే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని చెప్పారు. కానీ కాంగ్రెస్ ఏడో గ్యారెంటీ భావ ప్రకటన స్వేచ్ఛను అణిచివేస్తున్నదని అన్నారు. ఓయూ విద్యార్థులు గత వారం రోజులుగా ఉద్యమాలను నిర్వహిస్తున్నారని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఓయూలో అలజడికి కారణమైన సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తమ పోరాటానికి మేధావులు, జర్నలిస్టులు, ప్రజాస్వామిక వాదులు, రాజకీయ పార్టీలు మద్దతు తెలపాలని కోరారు. ఓయూ ఐక్య విద్యార్థి సంఘాల జేఏసీ నేతలు సుమంత్, జార్జిరెడ్డి (పీడీఎస్‌యూ), జంగిలీ దర్శన్ (డి.బి.ఎస్.ఏ), పెద్దమ రమేష్ ముదిరాజ్ (జీడీ), అనిల్, జంగయ్య, కాటం శివ, బొల్లు నాగరాజు,(బీ.ఆర్.ఎస్.వీ) ఎంఎస్ఎఫ్ నాయకులు మంద రాజు, అజయ్ సామ్రాట్, ఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చాగంటి రాజేష్, ఏఎస్ఏ రాష్ట్ర అధ్యక్షులు సొంపంగి అఖిల్, ఎస్ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు నవీన్ కుమార్, డీఎస్‌పీ విద్యార్థి విభాగం ఓ యూ శివ , జేవీఎస్ వంశీ, ఓయూ జేఏసీ నేత జోగు నరేందర్, జార్జి రెడ్డి పీడీ ఎస్‌యూ నేతలు , రుక్మత్ పాషా, వెంకటేష్, అంజి, కోటేశ్వర్,సతీష్, విద్యార్థి నేతలు పాల్గొన్నారు.

# పది పరీక్షలకు వేళాయే..

- ఏప్రిల్ 4వరకు పరీక్షల నిర్వహణ
- జిల్లావ్యాప్తంగా 358 ఎగ్జామ్స్ సెంటర్స్ ఏర్పాటు
- హాజరు కానున్న 77,701 విద్యార్థులు
- గంట ముందుగానే కేంద్రాల్లోకి అనుమతి
- మాసీకాఫీంగ్ తావులేకుండా సీసీ కెమెరాలు





**ఆర్.రోహిణి, డీఈవో, హైదరాబాద్**

**పకడ్బందీగా ఏర్పాట్లు చేశాం**

జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశాం. విద్యార్థులను ఉదయం 8.30 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి ఇస్తాం. 9.35 తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ సెంటర్‌లోకి అనుమతి ఉండదు. స్మార్ట్ ఫోన్లు, వాచ్‌లు, ఇతర పరికరాలను పరీక్షా కేంద్రంలోకి అనుమతించం. పరీక్షా కేంద్రానికి వచ్చే ముందు ప్రత్యేకంగా హాల్ టికెట్‌తో పాటు పెన్, పెన్సిల్ వంటి ఉన్నాయో లేదో చూసుకోవాలి. ఉదయం అల్పాహారం తీసుకోవాలి. జవాబు పత్రంలో ప్రతి పేజీపై వారి హాల్ టికెట్ సంఖ్యను తప్పనిసరిగా వేయాలి. విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ధైర్యంగా ప్రశాంతంగా పరీక్షలు రాయాలి.

నవతెలంగాణ-సిటీబ్యూరో

1.Vilash Chandrasekharan, S/o. Late P.K.Chandra Sekharan, Aged about: 44 Years, Occ: Pvt Employee R/o. Plot No.27A, H.No.42-272/27A, Shramik Nagar, Moula-Ali, Malakajgiri Circle, Medchal-Malkajgiri District.
2.Smt.Vineetha Reju Prabhakaran, W/o.Reju Prabhakaran, D/o.Late P.K.Chandra Sekharan, Aged about: 47 Years, Occ: Pvt Employee, R/o.Permanent Resident of H.No:42-471, Gayathri Nagar Moula Ali, PO Malkajgiri, Medchal-Malkagiri Dist, Telangana State, Presently residing at Flat No.801, 8th Floor , Al Tawaash Building, Fire Station Roundabout, Behind Nesto Supermarket , Al Nabaa Area Sharjah,UAE.
3.Sri Vinod Chandrasekhar, S/o. Late P.K.Chandra Sekharan, Aged about:46Yrs, Occ: R/o. Permanent Resident of Plot No.27A, H.No. 42-272/27A, Shramik Nagar, Moula-Ali, Malakajgiri Circle Circle, Medchal-Malkajgiri District, Presently residing at 13, Cromwell Drive, Chester, New Jersey 07930, USA. Plaintiff No. 2 & 3 is represented by its GPA Holder Plaintiff No.1 ie.. Vilash Chandrasekharan
..Plaintiff's
AND
1.The Talsidar,Malkajgiri
2.All Concerned ..Defendant's

To:
All Concerned.
Please take notice that the Plaintiffs above named filed the above suit for Declaration, to declare the Plaintiffs Nos. 1, 2 and 3 herein, are the sole and surviving legal heirs of their deceased parents Sri P.K.Chandra Sekharan, S/o. Late P. Vasudevan, ( who expired on 22.12.2023) and mother Smt. Syamala Chandra Sekharan W/o Late. P.K.Chandra Sekharan (who also expired on 10.07.2024), respectively. The said case is posted to 17.03.2025. If any person/s claiming to be the legal heirs or successors of the above deceased persons, may appear before the above said court on the said date at 10.30 a.m. and submit your contentions with documentary evidence, failing which, the matter will be heard and decided exparte.

**SUIT SCHEDULE PROPERTY**

All that Flat No.101, in First Floor, of S.R's Balaji Nilayam ad measuring 1500 sq.ft of plinth area(including common area) and one car parking area ad measuring 100 sft, together with undivided share of land ad measuring 66.66 sq.yds or 55.73 sq.mts , out of total land ad measuring 533.32 sq.yds or 445.5 sq.mts , premises bearing No.1-8-27/7/1, constructed on Plot Nos.99 & 100 in Sy.Nos.319 & 320 part, Kushaiguda Kapra under GHMC, Kapra Circle, Keesara Mandal, Ranga Reddy District under S.R.O Kapra and total premises bounded on:North:Plot No.107 & Neighbours property, South:30' wide, East: Plot No.101, West:Plot No.98
Finished Flat No.101, in First Floor bounded on ,
North: Open to Sky, South: Open to sky, East: Staircase and corrider
West: Open to sky

**(By order of the Court)**
**M/s Smt. CHANDRA SUPRIYA,**
**K.PRAVEENA REDDY,**
**R.SANJAY, Advocates,**
Plot No.65,Krishna Reddy
Colony,New Bowenpally
Secunderabad-500011
Cell: 9948333560, 9848924687,
9704314147

## బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లుల ఆమోదం హర్షనీయం



**నవతెలంగాణ-అంబర్‌పేట**

బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లులకు ఆమోదం తెలుపుతూ అసెంబ్లీ సమావేశంలో క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని లేబర్ బోర్డ్ మాజీ వైస్ చైర్మెన్ నాగభూషణం, కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణ గౌడ్ అన్నారు. గురువారం బీసీ బిల్లు ఎస్సీ వర్గీకరణ అసెంబ్లీలో ప్రవేశపెట్టినందుకు పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. లేబర్ బోర్డ్ మాజీ వైస్ చైర్మెన్ నాగభూషణం, కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణ గౌడ్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు బిల్లులు శాసనసభలో ఆమోదం పొందిన నేపథ్యంలో హర్షనీయమని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## దోమల నివారణకు పౌరులు అభ్యర్థించండి..

**నవతెలంగాణ-సిటీబ్యూరో**

జీహెచ్‌ఎంసీలో నివారణకు చేసే ఫాగింగ్ ఇప్పుడు డిజిటలైజ్ చేశారు. ఫాగింగ్ జరిగే ప్రాంతాలు, సమయం వృథా కాకుండా సమస్యల ఆధారంగా పరిష్కరించడానికి వీలుగా పౌరులే ఫాగింగ్ కొరకు అభ్యర్థించే విధంగా 'మై జీహెచ్‌ఎంసీ' మొబైల్ యాప్‌లో ఫాగింగ్ రిక్వెస్ట్ పెట్టేందుకు వీలుగా వెసులుబాటు కల్పించారు. ఎక్కడైతే ప్రధానంగా దోమల బెడద ఉంటుందో అక్కడ ఏ పౌరుడైన మై జీహెచ్‌ఎంసీ యాప్ లాగిన్ చేసి రిక్వెస్ట్ చేయవచ్చు. వారి లొకేషన్, రిక్వెస్ట్ ఆటోమేటిక్‌గా ఆఫీసర్‌కి చేరుతుంది. ఎంటమాలజిస్ట్ దాన్ని ఫాగింగ్ వర్కర్‌కి అసైన్ చేస్తారు. ఫాగింగ్ చేస్తున్న ఫోటో లాటిట్యూడ్ లాంగిట్యూడ్‌తో సహా అప్ లోడ్ చేసి పరిష్కారం అయిపోయిందని అప్డేట్ చేస్తారు. జీహెచ్‌ఎంసీలో ఉన్న ఫాగింగ్ వర్కర్స్‌కు తగినన్ని స్లాట్స్ అందుబాటులో ఉంటాయి. ఒకసారి రిక్వెస్ట్ చేసిన తర్వాత 100 మీటర్ల ప్రాంతం వరకు, వారం వరకు ఆ ప్రాంతం నుంచి రిక్వెస్ట్ రాకుండా నిరోధించబడుతుంది. ఈ ఫాగింగ్ ఆన్ రిక్వెస్ట్ ఫీచర్‌ని మైజీహెచ్‌ఎంసీ యాప్‌లో మొదటగా ప్రయోగాత్మకంగా జూబ్లీహిల్స్ సర్కిల్‌లో మొదటగా వాడి ఫలితాలను బట్టి తర్వాత మొత్తం జీహెచ్‌ఎంసీకి విస్తరించనున్నారు.

**రంజాన్ వేళలు**
ఇఫ్తార్: శుక్రవారం సాయంత్రం :06.27 గం.
సహర్: శనివారం ఉదయం :05.06 గం.

# స్వచ్ఛ.. పరిశుభ్రత పాటించాలి

- ఎప్పటికప్పుడు చెత్త తొలగింపు..
- ప్రధాన కేంద్రాలలో డస్ట్ బిన్‌లు..
- స్థానిక ప్రజలు స్వచ్ఛ ఆటోలలోనే చెత్త వేయాలి
- ఏఎంహెచ్‌ఓ డాక్టర్ జ్యోతి







**నవతెలంగాణ-ధూల్‌పేట్**

పాతబస్తీలోని చార్మినార్ పరిసర ప్రాంతాలలో స్వచ్ఛ.. పరిశుభ్రత పాటించటం లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. పర్యాటక ప్రాంతాలు, పరిసర ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు చెత్త లేకుండా శుభ్రంగా ఉంచుతున్నారు. రంజాన్ సందర్భంగా ఆయా ప్రాంతాల ప్రధాన కేంద్రాల్లో సిబ్బందితో శుభ్ర పరుస్తున్నారు.

**ఆటోమేటిక్ డస్ట్ బిన్‌లు..**

చెత్తను చార్మినార్ సర్కిల్ పరిసర ప్రాంతాలలో నిల్వ ఉంచకుండా ఆటోమేటిక్ డస్ట్ బిన్‌లు, ట్రాలీ డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేశారు. రోడ్లపై కాకుండా స్థానిక ప్రాంతాల వ్యాపారస్తులు, స్థానికులు వాటిలో వేయడంతో వెంటనే తొలగిస్తున్నారు. దీంతో చెత్త రోడ్లపై వేయకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అధికారులు సిబ్బందితో తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పర్యాటక ప్రాంతాలు చార్మినార్, మక్క మసీద్, మ్యూజియం, ఖిల్వత్ చార్ మహల్ తదితర ప్రాంతాల్లో నిరంతర ప్రక్రియగా చెత్త తొలగిస్తూ క్లీన్ చేస్తున్నామని అధికారులు పేర్కొంటున్నారు. స్థానికులు చెత్తను డస్ట్ బిన్‌లలో వేయాలని అవగాహన కల్పిస్తు న్నారు. ఆయా ప్రాంతాలలో స్వచ్ఛత పాటిస్తుం డటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**స్వచ్ఛ ఆటోలలోనే..**

స్థానికులు చెత్తను వేసేందుకు రోడ్లపై, బస్తీల అంతర్గత దారులలో వేసిన ఆ దుర్వాసనతో మనకే రోగాలు వస్తాయని అధికారులు స్థానికులకు అవగాహన కల్పిస్తున్నారు. చెత్తను తడి, పొడి వేరే వేరేగా చేసి ఇంటి ముందుకు వచ్చే స్వచ్ఛ ఆటోలోనే వేయాలి. ప్రభుత్వం ప్రజల కనుగుణంగా ఇంటి వద్ద కే చెత్త సేకరించి స్వచ్ఛ ఆటోలను ఏర్పాటు చేశారు. దీంతో చెత్త కుళ్లి పోవడం, దుర్వాసన లేకుండా పరిశుభ్రంగా ఉంటూ ఆరోగ్యంగా ఉండేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

**ప్రజలు సహకరించాలి..**

**ఏఎంహెచ్‌ఓ డాక్టర్ జ్యోతి**



ప్రజలు సహకరించాలి.. స్వచ్ఛత పాటించాలని జీహెచ్‌ఎంసీ చార్మినార్ సర్కిల్-9 ఏఎంహెచ్‌ఓ డాక్టర్ జ్యోతి తెలిపారు. చార్మినార్, ఘాన్సీబజార్, పత్తర్ గట్టి, మీర్ చౌక్, మొగల్‌పుర, ఖిల్వత్ తదితర ప్రధాన ప్రాంతాలలో డస్ట్ బిన్ లు ఏర్పాటు చేసి క్లీన్ చేస్తున్నాం. రాత్రి సమయంలో రోడ్ల పై చెత్త వేయకుండా డస్ట్ బిన్ లలో, స్వచ్ఛ ఆటోలలో వేయాలని అవగాహన కల్పిస్తున్నాం. అదే క్రమంలో పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని తెలిపారు.

## ఆశాలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలి

**సీఐటీయూ సౌత్ జిల్లా అధ్యక్షురాలు మీనా కలెక్టర్‌కు వినతి పత్రం**



**నవతెలంగాణ-ధూల్ పేట్**

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని సీఐటీయూ సౌత్ జిల్లా అధ్యక్షురాలు మీనా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ సౌత్ కమిటీ ఆధ్వర్యంలో ఆశాలతో కలిసి హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆశా వర్కర్లకు ప్రభుత్వం ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయం చేసి జాబ్ చార్ట్ ప్రకటించాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రత తదితర సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో ఆశాల సమస్యల పైన రాష్ట్ర ప్రభుత్వం చర్చించి వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. గతంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ఆశాలకు రూ.50 లక్షల ఇన్సూరెన్స్, మట్టి ఖర్చులు రూ.50 వేలు చెల్లిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. డిసెంబర్ 10న ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి ఆదివారం పండుగలకు సెలవులు నిర్ణయిస్తూ వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని, ఆశాలకు పని భారం తగ్గించాలన్నారు. పారితోషకం లేని పనులు చేయించకూడదని ఆశాలకు ఆస్పత్రుల్లో రెస్ట్ రూమ్‌లో ఏర్పాటు చేయాలన్నారు. ప్రసూతి సెలవులను వెంటనే అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5లక్షలు చెల్లించాలన్నారు. పారితోషికాలలో సగం పెన్షన్ నిర్ణయించాలని, ఆశాలకు ప్రతి ఏడాది 20 రోజులు వేతనంతో కూడిన క్యాజువల్స్ సెలవులు ఆరు నెలల మెడికల్ సెలవులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులతో పాటు ఆశాలు సువర్ణ, వై మీన, రీటా, సలోమి, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

## ఛేలాపురలో కనీస సౌకర్యాలు కల్పించాలి



- సీపీఐ(ఎం) జోన్ కార్యదర్శి అబ్దుల్ సత్తార్..

**నవతెలంగాణ-ధూల్‌పేట్**

చార్మినార్ ఛేలాపుర లో ప్రజల కనీస సౌకర్యాలు కల్పించాలని చార్మినార్ సీపీఐ(ఎం) జోన్ కార్యదర్శి అబ్దుల్ సత్తార్ అన్నారు. సీపీఐ(ఎం) చార్మినార్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో చార్మినార్ ఛేలాపుర ప్రాంతంలో ఇంటింటీ సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో గుర్తించిన సమస్యలు, ముఖ్యంగా ప్రభుత్వం పథకాలు రాలేవని దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్తీలో డ్రయినేజీ సమస్యని పరిష్కరించకపోవడంతో దుర్వాసనతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం వాగ్దానం చేసిన ఆరు పథకాలు ఏవి అందడం లేదని బస్తీ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే పింఛన్లు నేటికీ అందడం లేదని వృద్ధులు, వికలాంగులు, వితంతులు ఆందోళన చెందుతున్నారు. రేషన్ కార్డుల కోసం అనేకసార్లు తిరుగుతున్నా రాలేదని వాపోతున్నారన్నారు. పై సమస్యలు పరిష్కారం చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జోన్ కార్యదర్శి అబ్దుల్ సత్తార్, గులాం నసీర్, తదితరులు పాల్గొన్నారు.

**నవతెలంగాణ-సుల్తాన్‌బజార్**



24న వరల్డ్ టీబీ డే సందర్భంగా మలక్ పేట్ నియోజకవర్గంలో మలక్‌పేట్ ఏరియా ఆస్పత్రి ఎమ్మెల్యే బలాల టీబీ కిట్టు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నరేష్, సూపరింటెండెంట్ కిషన్ రెడ్డి, గోపీనాథ్, ల్యాబ్ టెక్నీషియన్ రమేష్ తదితరులు

## నేడు జరిగే రవాణారంగ కార్మికుల ధర్నాను జయప్రదం చేయాలి



- ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ (సీఐటీయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.శ్రీకాంత్

**నవతెలంగాణ-ముషీరాబాద్**

నేడు ఇందిరా పార్క్ వద్ద జరిగే రవాణారంగ కార్మికుల ధర్నాను జయప్రదం చేయాలని ఏఐ ఆర్‌టీడబ్ల్యూఎఫ్ (సీఐటీయు)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.శ్రీకాంత్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రవాణా రంగ కార్మికుల సమస్యల పట్ల నిర్లక్ష్యం చూపుతున్నాయని, పోరాటాల ద్వారా మాత్రమే వారి నిర్లక్ష్యాన్ని వదిలించవచ్చునన్నారు. కేంద్ర ప్రభుత్వం ట్రాన్స్‌పోర్టు రంగంలో దేశ వ్యాప్తంగా అనుసరిస్తున్న విధానాలకు నిరసన తెలియజేస్తూ గురువారం ఏఐ ఆర్‌టీడబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో సీఐటీయు జోన్ కార్యదర్శి మహేందర్ అధ్యక్షత వహించారు. ఆర్‌టీసీ కల్యాణ మండపం వద్దనున్న డీసీమ్ స్టాండ్ వద్ద డ్రైవర్స్ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీఐటీయు రాష్ట్ర కార్యదర్శి ఏఐఆర్టీడబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.శ్రీకాంత్ హాజరై మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రవాణా రంగ కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని దాని ద్వారా వెల్ఫేర్ స్కీమ్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. 24న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని ఏఐఆర్‌టీడబ్ల్యూ ఎఫ్ నిర్వహి స్తుందని ఆల్ ఇండియా కమిటీ పిలుపుని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాంపల్లి జోన్ కన్వీనర్ సి.మల్లేష్. ఏఐఆర్ టీడబ్ల్యూఎఫ్ నాయకులు ఫాజిల్, ఖయ్యూమ్, తదితరులు పాల్గొన్నారు.

## జియాగూడ కమేళాను ప్రభుత్వం ఆధునీకరించాలి

**కమేళా ఆటో, ట్రాలీ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు జి.విటల్**



**నవతెలంగాణ-ధూల్‌పేట్**

జియాగూడ కమేళాను ప్రభుత్వం వెంటనే ఆధునీకరించాలని కమెల ఆటో, ట్రాలీ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు జి.విటల్ డిమాండ్ చేశారు. కమెల ఆటో, ట్రాలీ వర్కర్స్, కార్మికులతో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కమెలలో జనరల్ బాడీ సమావేశాన్ని ఏర్పా టు చేశారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లా డుతూ జియాగూడ కమేలపై 5వేల కుటుంబాలు, వివిధ వృత్తులు చేసుకుంటూ లక్షలాది మంది దీనిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. ఆధునీకరించడంలో ప్రభు త్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసౌకర్యాలతో తమ వృత్తులు కొనసాగిస్తూ కా లం గడుపుతున్నారన్నారు. ఈ మధ్యకాలంలో జీహెచ్ ఎంసీ వెటర్నరీ డిపార్టుమెంట్ అధికారులు నోటీసులు ఇచ్చి కమేళాలో ఎలాంటి వృత్తి పనులు జరగకూడదని ఆయా వృత్తిదారులను, పేద ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని దీనిపై వెంటనే సీఐటీయూ స్పందించి ఆటో యూనియన్ ఆరెకటిక సంఘం, చర్మకారి సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన ధర్నా కార్యక్రమం చేయటంతో అధికారులు వెనక్కి తగ్గారని గుర్తు చేశారు. దీంతో జీహెచ్‌ఎంసీ కమిషనర్ పేద వృత్తిదారుల పట్ల సానుకూలంగా స్పందించి, తన వంతు కృషిగా ప్రభు త్వంతో మాట్లాడి ఆధునీకరణకు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం అసెంబ్లీలో జియాగూడ కమేళాను ఆధునీకరించటానికి ఈ అసెంబ్లీ సమావేశంలో బడ్జెట్ కేటాయించి ఆధునీకరించే విధంగా తగు చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేశారు. ఈ జనరల్ బాడీ సమావేశం లో కమేళా ఆటో యూనియన్ నాయకులు ఎం.రవీందర్, మల్లేష్, శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ కార్పొరేటర్ జన్మదిన వేడుకలు

**నవతెలంగాణ-హయత్‌నగర్**

మాజీ కార్పొరేటర్ కొప్పుల విటల్ రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని కెబీఆర్ కన్వెన్షన్ హాల్‌లో కార్యకర్తల నడుమ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఆయనకు కార్యకర్తలు, నాయకులు శాలువాలు కప్పి బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## బీజేపీ విధానాలతో శ్రమదోపిడికి గురవుతున్న కార్మికులు

- రాజకీయ శిక్షణ తరగతుల్లో సీఐటీయూ..



**నవతెలంగాణ-ధూల్‌పేట్**

కేంద్రంలో బీజేపీ విధానాలతో కార్మికులు శ్రమదోపిడికి గుర వుతున్నారని సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు పద్మశ్రీ, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి శోభన్‌లు అన్నారు. జీహెచ్‌ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ హైదరాబాద్ సౌత్ కమిటీ సీఐటీయూ ఆధ్వర్యంలో ఐఎస్ సదన్ సంతోష్‌నగర్ ఆఫీస్‌లో మున్సిపల్ కార్మికులకి రాజకీయ శిక్షణ తరగతులు ఉత్సా హంగా నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులను ముఖ్యఅతిథిగా, టీచర్లుగా వారు వ్యవహరిస్తూ ప్రస్తుత రాజకీయాలు, శ్రమదోపిడీ పై శిక్షణ తరగతులు బోధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్మికులను శ్రమ దోపిడికి గురి చేస్తుందన్నారు. అదేవిధంగా కొత్త కొత్త చట్టాలు తీసుకువచ్చి కార్మిక హక్కులను కాలరాస్తున్నారని సూచించారు. జీహెచ్‌ఎంసీలో పనిచేస్తున్న కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26వేలకు పెంచాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈఎస్ఐలో జరుగుతున్న అవకతవకలను అరికట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నాయి తప్ప జీహెచ్‌ఎంసీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల జీవితాలు మాత్రం మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు, కార్మిక నాయకులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచుతూ జీవో జారీ చేయాలి

- నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ చైర్మెన్ వీజీఆర్.నారగోని



**నవతెలంగాణ-హిమాయత్‌నగర్**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ జీవో జారీ చేయాలని నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ (ఎన్పీజేఎఫ్) చైర్మెన్ వీజీఆర్.నారగోని డిమాండ్ చేశారు. గురువారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నారగోని మాట్లాడుతూ బీసీ బిల్లుపై కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నెల 17న చట్టం చేసిన నేపథ్యంలో విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతూ జీవో జారీ చేయాలన్నారు. పలు డిమాండ్ల సాధన కోసం ఏప్రిల్ 14, 15, 16వ తేదీల్లో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ధర్నా, ఎన్పీజేఎఫ్ ప్రతినిధుల సమావేశాలు, పలువురి మంత్రులకు వినతి పత్రాలు అందజేత వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పరిపాలనలో బడుగు బలహీన వర్గాలకు, మహిళలకు, ఎంబీసీ కులాలకు ప్రాతినిధ్యం లేకుండా పోయిందన్నారు. బీసీల జనాభా 46 శాతం తగ్గించి చూపారన్నారు. బీసీల సబ్ ప్లాన్ ఊసేలేదన్నారు. బడ్జెట్‌లో బీసీలకు నామమాత్రంగా నిధులు కేటాయించలేదన్నారు. రాహుల్ సామాజిక న్యాయం అంటూ రాజ్యాంగాన్ని పట్టుకొని తిరుగుతున్నారని, అగ్రకులాలకు అధికారాన్ని కట్టబెట్టారన్నారు. ఈ సమావేశంలో ఫ్రంట్ నేతలు మీనగ గోపీ, ఆనందలక్ష్మి, పంమేశ్వరి, కె.మహేశ్వర్ రావు, సత్యనారాయణ, మామిడాల రాజు, గుండు అంజయ్య జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి..



- సీఐటీయు ట్రాన్స్ పోర్ట్ రంగం కార్యదర్శి ఎల్.కోటయ్య

**నవతెలంగాణ-ధూల్‌పేట్**

నగరంలో ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయు ట్రాన్స్‌పోర్ట్ రంగం సౌత్ జిల్లా కార్యదర్శి ఎల్. కోటయ్య డిమాండ్ చేశారు. ఎంజీబీఎస్ బస్ స్టేషన్‌లో ఆటో స్టాండ్, సాలార్జంగ్ మ్యూజియం, అఫ్జల్ గంజ్ పలు ఆటో స్టాండ్ లలో సీఐటీయు ట్రాన్స్ పోర్ట్ రంగం ఆధ్వర్యంలో మార్చి 21న చలో ఇందిరా పార్కు మహాధర్నాను ఉద్దేశించి కార్మికులకు కర పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంజీబీఎస్ బస్‌స్టేషన్ లో గత 30 ఏండ్ల నుంచి ఆటోలు ఫైనాన్స్ మీద కొనుక్కొని నడుపుకుంటు జీవనం సాగి స్తున్నార న్నారు. వాళ్ళందరూ హైదరాబాదుకు వలసలుగా వచ్చి బ్రతుకు తున్నారన్నారు. ఎక్కడో అప్పుసొప్పు చేసి ఆటోలు కొను క్కున్న ఆటోలను నడుపుతున్నారన్నారు. తగిన కష్టార్జితం రాక పోవడంతో ఫైనాన్స్ ఇచ్చినవాళ్లు ఆటోలని మూడు నెలలకి సీజ్ చేస్తున్నారన్నారు. నిత్యం.. దినదినం గడపటం గగనంగా మారిం దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డ్రైవర్ల అందరికీ మహా లక్ష్మి స్కిన్ తీసుకురావడంతో ఇబ్బందులు తొలగిపోతాయని ఎదురుచూస్తున్నారన్నారు. ఆటో డ్రైవర్స్‌ను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంజీబీఎస్ బస్టాండు ఆటో డ్రైవర్స్ యూని యన్ నాయకులు రాంసింగ్, సంతోష్, మల్లయ్య, కృష్ణ, శ్రీరాము లు, నాగేశ్వర్, సీఐటీయు జిల్లా నాయకులు తదితరులున్నారు.

## రవీంద్ర నాయక్‌నగర్ కాలనీలో స్ట్రీట్ లైట్ పోల్స్ ఏర్పాటు చేయాలి



**నవతెలంగాణ-ధూల్‌పేట్**

రవీంద్రనాయక్ నగర్ కాలనీలో స్ట్రీట్ లైట్లు పోల్స్ ఏర్పాటు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కృష్ణ నాయక్ అన్నారు. డీవైఎఫ్ఐ హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ చాంద్రాయణ గుట్ట సర్కిల్-8 డిప్యూటీ కమిషనర్ సురేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్ట్రీట్ లైట్లు లేక స్థానిక ప్రాంతాల్లో చీకటిగా మారుతుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో యువకులు సెల్ ఫోన్లలో సోషల్ మీడియాలో టైం కేటాయించడంతో మానసికంగా బెట్టింగ్ యాప్‌లతో మోసపోతున్నారన్నారు. వాటితో పాటు అనేక ఒత్తిడిలకు గురి అవుతున్నారన్నారు. మానసికంగా ఇబ్బంది లేకుండా ప్లే గ్రౌండ్లో స్పోర్ట్స్ వైపు మొగ్గు చూపడానికి స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. యువకులకు క్రీడల్లో ఉత్సాహంగా ఉన్నవారికి ప్లేగ్రౌండ్స్ లో సౌకర్యాల కోసం డీవైఎఫ్ఐ కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రవీంద్ర నాయక్ నగర్ కాలనీ యువకులు రాజా, శ్రీకాంత్ డాక్టర్ బాబు, నవీన్, బీచ్యా శ్రీనాయక్, దీపక్, సాయి మురళి తదితరులు పాల్గొన్నారు.

## దుర్గాబాయి దేశ్‌ముఖ్‌లో ఘనంగా లాంప్ లైటింగ్ సెరిమనేని



**నవతెలంగాణ-అంబర్‌పేట:**

దుర్గాబాయి దేశ్‌ముఖ్ నర్సింగ్ యూనిట్స్ వారు 34వ బ్యాచ్ జీఎన్ఎమ్ 21వ బ్యాచ్ బీ.ఎస్.సీ నర్సింగ్ విద్యార్థులు లాంప్ లైటింగ్ సెరిమనేని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథి ప్రొఫెసర్ డీబీ. విద్యులత, నర్సింగ్ డిప్యూటీ డైరెక్టర్ ఉషా కందా ప్రెసిడెంట్, డా.జి.ఎల్.కె. దుర్గా నర్సింగ్ యూనిట్లు అధ్యక్షురాలు, డా.ఎ.రమాదేవి కార్యదర్శి, నర్సింగ్ కె. శ్రావ్య స్పందన ప్రిన్సిపాల్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, .బి.సింపుల్గారు పాల్గొని ఈ సందర్భంగా ప్రొఫెసర్ డీబీ. విద్యులత మాట్లాడుతూ దుర్గాబాయి దేశ్‌ముఖ్‌లో చదివిన విద్యార్థులు దేశ విదేశాలలో పనిచేస్తున్నారని అంటూ విద్యార్థులకు ప్రేరణను కలిగించారు. ప్రెసిడెంట్ ఉషా కందా మాట్లాడుతూ నర్సింగ్ విద్యార్థులకు ఉండాల్సిన ఓర్పు, త్యాగం పట్టుదల క్రమశిక్షణ ఉండాలని అలాంటి వారికి భవిష్యత్తు ఉంటుందని విద్యార్థులతో తన అనుభవాలను పంచుకున్నారు.

**IN THE COURT OF HON'BLE III ADDL. JUNIOR CIVIL JUDGE: MEDCHAL - MALKAJGIRI DISTRICT, AT: KUSHAIGUDA**
**O.S. No. 138 OF 2025**

Between:
**1. Kodali Mallikarjuna Rao,** S/o. Late. K. Venkata Subbaiah, Aged about 82 years, Occ: Senior Citizen
**2. Kodali Padmaja,** D/o. Kodali Mallikarjuna Rao, Aged about 57 years, Occ: Kotak Bank Employee
**3. Kodali Srinath,** S/o. Kodali Mallikarjuna Rao, Aged about 55 years, Occ: Sr. Software Emgineer,
**4. Kodali Ajai Kumar,** S/o. Kodali Mallikarjuna Rao, Aged about 53 years, Occ: Software Engineer, (All are residents of H. No. 1-114, Near Sai Baba Temple, Sai Nagar, Malkajgiri, Medchal-Malkajgiri District. ) ...Plaintiff No. 1 to 4

**AND**

**1. The Mandal Revenue Officer,** Medchal-Malkajgiri District.
**2. All Concerned**
...Defendant No. 1 & 2

To,
**ALL CONCERNED (D2)**

Please take notice that the above suit is filed by the Plaintiffs to declare them as legal heirs of Late Joya Kumari, W/o. Kodali Mallikarjuna Rao and the same is posted on **24-03-2025**, if any person/s having any objections / claims kindly appear either in person or through an advocate in the above said court at 10-30 A.M. on the above said date, as otherwise the matter will be decided accordingly.

**// By Order of Court //**
Sd/- **Shaikh Chand Ahmed, Naveen Prasad,**
Advocate and Associates
4-211, Geetha Nagar, Malkajgiri, Hyderabad. Ph # 9985247267

**IN THE COURT OF THE CHAIRMAN: MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL-CUM-XXVII ADDITIONAL CHIEF JUDGE: CITY CIVIL COURT AT: SECUNDERABAD**
**M V O P NO: 658 of 2024**

**Between:**
Arya Katike Narsingh and Others ...Petitioner

AND

Arene Life Sciences Limited Rep by T Yadaiah Goud and others ...Respondents

To,
1.Arene Life Sciences Limited Rep by T Yadaiah Goud Age: Major, Occupation: Owner of the crime vehicle R/o: Plot no 49, 50 Pashamilaram, Sangareddy, Medak, Telangana -502307

Please take notice that the above named Petitioner filed a MV OP for Compensation against you and the said case stands posted to 24-4-2025 for your appearance. Therefore you are hereby directed to appear before The HON'BLE XXVII ADDL CHIEF JUDGE, CITY CIVIL COURT, SECUNDERABAD on dated: 24-4-2025 at 10.30 AM either in person or through an Advocate failing which the matter will be decided Ex -Party .

**( By the Order of the Court )**
**M/S.CH T V L NARASIMHA REDDY**
**M SUMALATHA**
**Advocates**
10-1-5/5-001,Nehru Nagar,West Maredpally,Secunderabad-5000 56
COUNSEL FOR THE PETITIONER

**IN THE HON'BLE COURT OF IV SENIOR CIVIL JUDGE AT: CHARMINAR, HYDERABAD**
**O.S. No. 231 OF 2025**

**BETWEEN:**
Vivek Sekar S/o Mani Sekar ... Plaintiff

AND

1. Raavi Satyanarayana S/o Raavi Panduranga Rao
2. All Concerned (General Public) ...Defendants

**PUBLIC NOTICE**

The Plaintiff has filed the above suit for declaration of legal heir of deceased Late Ms. Revathi Ramachandran D/o Late R. Ramachandran who died on 15.10.2020. The deceased Late Ms. Revathi Ramachandran had purchased the Suit Schedule Property i.e. Flat No. 102, Ground Floor, admeasuring 1778 Sq. Ft., plinth area 76.8 Sq. Yards, 8-2-269/19/S/G&H/102 Srirama Mountview Apartment, Road No. 2, Banjara Hills, Hyderabad, Telangana, 500034 vide Sale Deed No. 626/1996 on 07-03-1996. The deceased Late Ms. Revathi Ramachandran bequeathed the Suit Schedule Property to her nephew i.e. Plaintiff herein vide Will Deed dated 22-11-2019. If anybody has objections over declaration of Plaintiff as legal heir of deceased Late Ms. Revathi Ramachandran, he/she may appear before this Hon'ble Court on 25-04-2025 at 10:30 AM failing which the matter will be decided on merits.

**// BY ORDER OF THE COURT //**
**By Advocate**
**Jagriti Sanghi, JSL Advocates, 7207817736**

**IN THE COURT OF THE HON'BLE III ADDL. JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT AT: L. B. NAGAR**
**O.S.NO. 1046 OF 2021**

**Between:**
Smt. Tirupathamma & others ...Plaintiffs

AND

1.Vemulakonda Apparao
2.All concerned ..Defendants

To,
Vemulakonda Apparao, S/o. V. Sriramachandrudu, Aged about 57 years, H.NO.12-1-392, INdraprastha Colony, Nagole, Bandlaguda.

**NOTICE**

Whereas the above named plaintiffs have filed above suit for declaration to declare the plaintiffs as legal heirs of Late Venkatesh who died on 14-12-1996 in respect of the suit schedule property i.e. Open plot bearing no.53, admeasuring 267 Sq. yards in Sy. No.54, situated at Pathullaguda Village, Uppal Revenue Mandal, Ranga Reddy District and bounded by; North: Plot no.56, South: 25' wide road, East: 30' wide road, West: 25'wide road, and the matter is posted for any claims or objections from any concerned. Hence, if any person is/are having any claims or objections they may be appear before this Hon'ble court on 10-04-2025 at 10:30AM, either in person are through on advocate duly instructed by you, with all relevant documents, failing which the matter will be decided on merits in ex-parte.

**// BY ORDER OF THE COURT //**
**A. RADHA KRISHNA, D. SHOBHA RANI. Advocates**
Office: shop no. 17, Annapurna Shopping complex Dilsukhnagar, Hyderabad
Mobile no. 9848086058.

## పనీర్‌తో ప్రయోజనాలు...



మనం వాడే ప్రతీ ఆహార పదార్థానికీ రకరకాల ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయి. ఎంతో టేస్టీగా ఉండే పనీరు మన ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇది మన రెగ్యులర్ డైట్‌లో చేర్చుకుంటే ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయో తెలుసుకుందాం.

ఎక్కువ మందికి సోకుతున్న రొమ్ము కాన్సర్ నుంచి మనల్ని కాపాడుతుంది. పాల ఉత్పత్తి అయిన పనీర్‌లో ఉండే కాల్షియం, విటమిన్ డి క్యాన్సర్ బారిన పడకుండా కాపడతాయి. బాడీలోని వివిధ రకాల ఎంజైమ్‌లను యాక్టివేట్ చేస్తుంది. కండరాలు, నాడుల పనితీరు నిర్వహిస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది.

ఇది మన గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుందనటంలో ఎలాంటి సందేహం లేదు. రక్తంలోని షుగర్ లెవెల్స్‌ని కంట్రోల్ చేస్తుంది. ఇందులో ఉండే జింక్ రోగనిరోధక శక్తిని మెరుగుపరచడానికీ, జీర్ణక్రియకు ఉపయోగపడుతుంది.

పనీరులో కాల్షియం మోతాదు కూడా ఎక్కువే. ఇది పిల్లలు, పెద్దల్లో ఎముకలు పటిష్టంగా ఉండేలా చేస్తుంది. గర్భవతులకు అత్యుత్తమైన ఆహారమని చెప్పొచ్చు.

పనీర్‌లో ఎక్కువగా ఉండే ప్రోటీన్‌లు శాఖాహారులకు శక్తినిస్తాయి. ఇందులోని ఫాస్ఫరస్, ఫాస్ఫేట్‌లు జీర్ణక్రియను మెరుగుపరచి... మలబద్ధకాన్ని తగ్గిస్తాయి. కణాల్లో శక్తిని ఉత్పత్తి చేసి, వాటిని వెలికి తీయడానికి సహాయపడతాయి.

పనీర్‌లో ఉండే వే ప్రోటీన్.. ఎంతో ఆరోగ్యవంతమైనది. ప్లేయర్లు, ఎక్సర్‌సైజ్‌లు చేసేవారికి ఇది మేలు చేస్తుంది. ఇది చాలా నెమ్మదిగా జీర్ణం అవుతూ, నెమ్మదిగా శక్తిని ఇస్తుంది. అందువల్ల అథ్లెటిక్స్, బాడీ బిల్డర్‌లు, స్ప్రింటర్‌లు, ఆటలు ఆడేవారికి ఇది ఎంతో మేలైన ప్రోటీన్.

రేచీకటిని నిరోధిస్తుంది. కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఆకలి లేకపోవడాన్ని నిరోధిస్తుంది. అలాగే ప్రొస్టేట్ రుగ్మతలను పోగొట్టి, వివిధ రకాల అంటువ్యాధులకు విరుద్ధంగా పోరాడుతుంది. సెలీనియం ఎక్కువగా ఉండే పనీరును తినడం వల్ల... మన శరీరంలోకి విష వ్యర్థాలు రాకుండా ఉంటాయి. అలాగే రకరకాల వ్యాధుల నుంచీ తప్పించుకోవచ్చు.

ఇందులో పొటాషియం కూడా ఉంటుంది. ఇది బాడీలో ద్రవ నియంత్రణ పదార్థంగా పని చేస్తుంది. రెగ్యులర్‌గా పనీరు తింటే బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే ప్రమాదం తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు.

ఆ కండ్లు వెన్నెల వాకిళ్లు. ఎలాంటి భావాన్నైనా చిటికెలో వ్యక్తపరుస్తాయి. అంతటి సుందర, సుమధుర నయనాలు ఆమెవి. అందం, అభినయం, నాట్యం ఈ మూడు ఆమె సొంతం. గొప్ప నాట్య కళాకారిణిగా కళకు సేవలు అందిస్తూ.. సినిమాల్లో నటించినా ఎక్కడ తన హుందాతనాన్ని కోల్పోలేదు. ప్రతి నర్తకి నటి కాకపోవచ్చు. ప్రతి నటి నర్తకి కాకపోవచ్చు. కానీ ఈమె మాత్రం ముందు బాలనటిగా, ఆ తర్వాత నర్తకిగా, ఆపై అనేక భాషా చిత్రాల్లో నటించారు. క్లాసికల్ డ్యాన్సర్‌గా లెక్కలేనన్ని ప్రదర్శనలు ఇచ్చారు. తన నటనతో ప్రేక్షకుల మనసులను దోచుకొని 2006లో పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ ఏడాది పద్మభూషణ్ కూడా అందుకున్నారు. ఆమే ప్రముఖ నటి, కళాకారిణి శోభన. ఈ రోజు ఆమె పుట్టినరోజు సందర్భంగా మానవిలో ఆమె పరిచయం...



# అభినయ తారక

1970, మార్చి 21న శోభన జన్మించారు. బాలనటిగా 1972లోనే కెమెరా ముందుకు వచ్చారు. అమ్మ ప్రేమ ఆమె తొలి చిత్రం. పెద్దయిన తర్వాత ఆమె హీరోయిన్‌గా నటించిన తొలి చిత్రం ఏప్రిల్ 18. ఇది ఒక మలయాళ చిత్రం. ఆ చిత్రంలో తన సహజమైన నటనతో పక్కింటి అమ్మాయిలా కనిపించడం ఆమెకు ప్లస్ అయ్యింది. ఆ తర్వాత ఆమెకు వరుసగా అనేక సినిమాల్లో నటించే అవకాశం వచ్చింది. అతి తక్కువ సమయంలోనే తీరిక లేనంతగా షూటింగ్‌లలో బిజీ అయిపోయారు.

### తెలుగు పరిశ్రమలో...

శోభన సుమారు 230 సినిమాల్లో నటించారు. తెలుగులోనూ అగ్ర హీరోలు అందరితో తెర పంచుకున్నారు. భక్త ధ్రువ మార్కండేయ చిత్రంతో ఆమె తెలుగు పరిశ్రమంలోకి అడుగుపెట్టారు. ఆ తర్వాత నాగార్జునతో కలిసి విక్రమ్ సినిమాలో నటించారు. అలాగే హెచ్చరిక, అభినందన, రుద్రవీణ, రౌడీ అల్లుడు, అల్లుడుగారు, అసాధ్యుడు, రక్షణలో నటించి తెలుగు సినీ పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. చంద్రముఖి(రజనీకాంత్) చిత్రానికి మూలమైన మలయాళ చిత్రం 'మణిచిత్రతాఝు'లో అద్భుతంగా నటించి ఉత్తమ నటిగా జాతీయ స్థాయిలో నిలిచారు.

### కళకే అంకితం

శోభనకు నాట్యం అంటే ప్రాణం. నటన కంటే ఆమె నాట్యానికే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. 1994లో కళార్పణ అనే సంస్థను ఆమె ప్రారంభించారు. ఈ సంస్థ ముఖ్య ఉద్దేశం భరతనాట్యంలో శిక్షణ, భారతదేశమంతటా నృత్యవార్షికోత్సవాలు నిర్వహించడం. అదే విధంగా పలువురు పేద విద్యార్థులకు ఉచితంగా నాట్యంలో శిక్షణ ఇస్తున్నారు. నేటి తరానికి చెందిన ఎందరో కళాకారిణులు ఈమె వద్ద నటనలోనూ, నాట్యంలోనూ శిక్షణ తీసుకుంటున్నారు. ఈమె సేవలకు గాను 2006లో అబ్దుల్ కలాం చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డును సైతం అందుకున్నారు. ఎంతో ఇష్టపడి నేర్చుకున్న శాస్త్రీయ నృత్యమే ఆమెకు సర్వస్వం. ఆమె మనసంతా, తనువంతా భరతనాట్యమే. ప్రస్తుతం ఆమె సినిమాలకు దూరంగా ఉంటూ తన మనసుకు నచ్చిన నాట్యాన్ని తన జీవితానికి మరింత దగ్గర చేసుకున్నారు. శోభనను భారతదేశ అభినయ తారకగా చెప్పుకోవచ్చు.

### బహుముఖ ప్రజ్ఞాశాలి

శోభన నటి, నర్తకి, కొరియోగ్రాఫర్. తాను ప్రదర్శించే నృత్య ప్రదర్శనలకు ఆవిడే కర్త, కర్మ, క్రియ. అంటే స్క్రిప్ట్ రైటర్, క్రియేటర్, కంపోజర్. రంగస్థలం రూపకర్త కూడా. అన్ని విభాగాలలో ఆవిష్కరించే కళను ప్రేమిస్తూ, ఆరాధిస్తూ, అర్పిస్తూ దేశ విదేశాల్లో తన నాట్య ప్రదర్శనలు ఇస్తూ తన జీవితమంతా కళామతల్లి సేవకు అంకితం చేశారు. శోభన చెన్నైలోని చిదంబరం అకాడమీలో చిత్ర విశ్వేశ్వర్ ఆధ్వర్యంలో శిక్షణ పొందారు. ఆమె మలేషియా రాజు, రాణి ముందు తన నృత్య నైపుణ్యాన్ని ప్రదర్శించారు. శోభనను చాలా మంది వంపులు తిరిగిన భారతీయ శిల్పాల అందంతో పోలుస్తారు.

### పాఠశాలలు స్థాపించి

సినీ పరిశ్రమకు ఆమె చేసిన సేవలతో పాటు చెన్నైలో శాస్త్రీయ భరతనాట్య నృత్యం కోసం ప్రధాన పాఠశాలలు స్థాపించారు. అలాగే భారతదేశం అంతటా వార్షిక ఉత్సవాలను ప్రారంభించారు. ప్రముఖ నర్తకీ మణులు, నటీమణులు అయినా లలిత, పద్మిని, రాగిణీలు ఈమెకు మేనత్తలవుతారు. వీరందరూ భారతీయ శాస్త్రీయ నృత్య నైపుణ్యానికి ప్రసిద్ధి చెందినవారు. శోభన సినిమాలో నటించిన ఎక్కడ హుందాతనాన్ని కోల్పోలేదు. సంప్రదాయ చీరకట్టులో మెరిసిన, మోడ్రన్ డ్రెస్‌లో మాయ చేసినా ఆమెకు ఆమే సాటి. శోభన వినయశీలి అని ఆమె ఆత్మీయులు తెగ మెచ్చుకుంటారు. తన అందం, అభినయంతో సినిమాలకు గ్లామర్ అద్దారు. క్లిష్టమైన సన్నివేశాల్లో అభినయాన్ని జోడించారు. ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించిన శోభన ప్రతిభకు గుర్తింపుగా అనేక సాంస్కృతిక సంస్థలు ఎన్నో అవార్డులు, రివార్డులు, పురస్కారాలతో గౌరవించాయి. కేవలం సినిమా, నాట్యంలోనే కాకుండా పలు టీవీ షోలలో ఆమె న్యాయమూర్తిగా వ్యవహరించారు.







### ఆమెకు ఆమే సాటి

అభినందన చిత్రంలో ఆమె నటన అద్భుతం. ప్రేమించిన వ్యక్తిని పెండ్లి చేసుకోలేక, చనిపోయిన తన అక్క పిల్లల కోసం, తండ్రి కోరిక కాదనలేక అక్క భర్తను వివాహంచేసుకుని, ప్రేమించిన వ్యక్తిని మర్చిపోలేక, ఇటు భర్తకు దగ్గర కాలేక ఆమె పడిన మానసిక వేదన వర్ణనాతీతం. అద్భుతమైన నటనతో తక్కువ డైలాగులతో, కేవలం హవ భావాలతోనే తనలోని సంఘర్షణను నటన ద్వారా వ్యక్తపరచడంలో ఆమెకు ఆమె సాటి అనిపించుకున్నారు. ఇలా ఆమె ఎన్నో చిత్రాలు ప్రేక్షకుల మనసులో అజరామరంగా నిలిచిపోయాయి. ఆమె మరెన్నో పురస్కారాలు అందుకోవాలని, తన నాట్య క్షేత్రం ద్వారా ఎందరో కళాకారులను తీర్చి దిద్దాలని ఆకాంక్షిస్తూ...

- పాలపర్తి సంధ్యారాణి

---

## ఇండ్లు లేని నిరుపేదలు 30 లక్షల మంది

(మొదటిపేజి తరువాయి)

అమలుకు నోచుకోలేదని అన్నారు. బీసీ సంక్షేమానికి రూ.11,400 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. ఎస్సీ, ఎస్టీ జనాభా ప్రాతిపదికన బడ్జెట్లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. విద్యారంగానికి 7.6 శాతం మాత్రమే నిధులు కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్ అమలుకు కృషి చేయాలన్నారు. ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుల్లో కోత విధించారన్నారు. ఆరు గ్యారంటీల అమలు కోసం, స్థానిక సమస్యలపై సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఈ నెల మొత్తం సర్వేలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గుర్తించిన సమస్యలపై పెద్దఎత్తున పోరాటాలను ఉధృతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎండి జబ్బార్, మండ్ల రాజు, జీఎస్ గోపి, ఏ.లక్ష్మి, నాయకులు ఆర్ఎస్ రమేష్, ఎస్.రాజు, పరమేశ్వర చారి, బి.వెంకటేష్, జి.వెంకటయ్య, వెంకట్, రాములు పాల్గొన్నారు.

**మల్లు స్వరాజ్యం, ధాను నాయక్‌కు నివాళులు**

వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట నాయకులు మల్లు స్వరాజ్యం, ధానునాయక్ వర్ధంతుల సందర్భంగా వారి చిత్రపటాలకు జాన్‌వెస్లీ పూలమాలలేసి నివాళులర్పించారు. మల్లు స్వరాజ్యం, ధాను నాయక్ ఆశయ సాధన కోసం దున్నేవానికి భూమి పంచేవరకు పోరాటాలు చేయడమే వారికిచ్చే నిజమైన నివాళి అన్నారు.

## మూతపడుతున్న ఎంఎస్ఎంఈలు

(మొదటిపేజి తరువాయి)

మంత్రి జితన్ రామ్ మఝీ లోక్‌సభకు ఇచ్చిన వివరాల ప్రకారం గత పది సంవత్సరాలలో యాభై వేల చిన్న చిన్న వ్యాపారాలు మూతపడడంతో మూడు లక్షల మంది రోడ్డున పడ్డారు. పోర్టల్‌లో రిజిస్టరైన పది లక్షల ఎంఎస్ఎంఈ లలో 49,342 మూతపడ్డాయని, ఫలితంగా 3,17,641 మంది ఉద్యోగాలు కోల్పోయారని మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. కంపెనీ యాజమాన్యంలో మార్పులు, అవసరం లేని సర్టిఫికెట్లు, డూప్లికేట్ రిజిస్ట్రేషన్లు వంటి పలు కారణాల వల్ల చిన్న పరిశ్రమలను మూసివేస్తున్నారని మంత్రి తెలిపారు.

## అంగన్‌వాడీ, ఆశాల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

### సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్రంలోని అంగన్‌వాడీలు, ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్, ఇన్స్యూరెన్స్, వీఆర్ఎస్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం పెద్దఎత్తున ఉద్యమాలు, పోరాటాలను చేశారని పేర్కొన్నారు. వారి సమస్యలు పరిష్కరిస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం అనేక సందర్భాల్లో హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అయినప్పటికీ అవి అపరిష్కృతంగానే ఉన్నాయని తెలిపారు. వారి న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఐసీడీఎస్ ప్రయివేటీకరణతోపాటు, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నదని విమర్శించారు. పీఎంశ్రీ పథకాన్ని రాష్ట్రంలోని 28 జిల్లాల్లోని 56 కేంద్రాల్లో ప్రారంభించిందనీ, మొబైల్ అంగన్‌వాడీల పేరుతో కొత్త విధానాన్ని తెస్తున్నదని వివరించారు. దీంతో పేదలు అంగన్‌వాడీ కేంద్రం అందిస్తున్న సేవలకు దూరమవుతారని తెలిపారు. ఫలితంగా ఐసీడీఎస్ బలహీనపడి మూతపడే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. పీఎంశ్రీ పథకంతోపాటు, మొబైల్ అంగన్‌వాడీ సెంటర్లను రాష్ట్రంలో పూర్తిగా రద్దుచేయాలని ఆయన డిమాండ్ చేశారు. వారికి రావాల్సిన 10 నెలల వేతనాలను తక్షణమే చెల్లించాలని కోరారు.

ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలతోపాటు, టార్గెట్ రద్దు లాంటి అనేక సమస్యలపై ఉద్యమాలు నిర్వహించారని జాన్‌వెస్లీ తెలిపారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం వారితో చర్చలు జరిపి, పరిష్కారానికి ఐఏఎస్ అధికారితో కమిటీ వేసి, ఆ ప్రతిపాదనల ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారని పేర్కొన్నారు. ఆశా వర్కర్లకు వేతనాలను పెంచుతామనీ, ఉద్యోగ భద్రత కల్పిస్తామనీ ఎన్నికల సందర్భంగా హామీనిచ్చిందని తెలిపారు. కానీ వారి సమస్యలు పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. సెలవులు, ఏఎన్సీ, పీఎన్సీ తదితర టార్గెట్ల రద్దు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.ఐదు లక్షలు, అన్ని ఆస్పత్రుల్లో ఆశాలకు విశ్రాంతి గదుల ఏర్పాటు, పారితోషికాల్లో సగం పెన్షన్ తదితర న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## భారత్ సుంకాలు తగ్గిస్తుందనుకుంటున్నా

(మొదటిపేజి తరువాయి)

వాణిజ్య సుంకాలను న్యూ ఢిల్లీ తగ్గిస్తుందని విశ్వసిస్తున్నట్లు చెప్పారు.తాజాగా ఆయన బ్రెయిట్‌బార్ట్ న్యూస్‌తో ట్రంప్ మాట్లాడుతూ.. 'నాకు భారత్‌తో మంచి సంబంధం ఉంది. కానీ ఏకైక సమస్య ఏంటంటే.. ప్రపంచంలోనే అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో భారత్ ఒకటి. భారత్ టారిఫ్‌లను గణనీయంగా తగ్గించే అవకాశం ఉన్నట్లు నేను నమ్ముతున్నాను. కానీ, ఏప్రిల్ 2 నుంచి వారెంత విధిస్తే.. మేమూ అంతే వసూలు చేస్తాం' అని ట్రంప్ అన్నారు.

**అమెరికాకు ఎలాంటి హామీ ఇవ్వలేదు : భారత్**

కాగా, అమెరికా ఉత్పత్తులపై సుంకాల తగ్గింపునకు ఆ దేశానికి భారత్ ఎలాంటి హామీ ఇవ్వలేదని కేంద్ర వాణిజ్య కార్యదర్శి సునీల్ బార్త్వాల్ పార్లమెంటరీ ప్యానెల్‌కు స్పష్టం చేసిన విషయం తెలిసిందే. 'టారిఫ్‌లను తగ్గించడానికి భారత్ అంగీకరించింది' అంటూ ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటనపై ఆయన పార్లమెంటరీ కమిటీకి వివరణ ఇచ్చారు. సుంకాల విషయంపై ఇరు దేశాల మధ్య ఇంకా చర్చలు కొనసాగుతున్నాయని, ఆ దేశానికి ఎలాంటి హామీ ఇవ్వలేదని ఆయన తెలిపారు.

## గాజాపై భూతల దాడులు

**దేర్ అల్ బాలాహ్ :** కాల్పుల విరమణ ఒప్పందానికి మధ్యలోనే తూట్లు పొడిచి విచక్షణారహితంగా దాడులు చేపట్టిన ఇజ్రాయిల్ మిలటరీ గురువారం నుంచి గాజాపై భూతల దాడులను తిరిగి ప్రారంభించింది. ఉత్తర ప్రాంతమైన బెయిట్ లాహియా ఏరియాలో దాడులు జరుగుతున్నాయి. బందీలను వెనక్కి పంపడానికి, అధికారం నుంచి హమాస్‌ను తొలగించడానికి పాలస్తీనియన్లకు ఇదే చివరి హెచ్చరిక అని స్పష్టం చేసింది. ఈ మేరకు ఇజ్రాయిల్ రక్షణ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్ గాజావాసులను ఉద్దేశించి మాట్లాడుతున్న వీడియోను విడుదల చేశారు. "అమెరికా అధ్యక్షుని సలహాను గమనంలోకి తీసుకోండి, బందీలను అప్పగించండి, హమాస్‌ను అధికారం నుండి తొలగించండి, ప్రపంచంలోని ఇతర ప్రాంతాలకు వెళ్ళే అవకాశంతో సహా మీకు ఇతరత్రా మార్గాలు కూడా తెరుచుకుంటాయి." అని ఆయన స్పష్టం చేశారు.

ఇదిలా వుండగా, గురువారం తెల్లవారుజాము నుంచి జరిగిన దాడుల్లో 85మంది మరణించారు. 133మంది గాయపడ్డారుని గాజా ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. ఖాన్ యూనిస్ సమీపంలో జరిగిన బాంబు దాడుల్లో పది మంది మరణించారని పాలస్తీనా సహాయక బృందాలు వెల్లడించాయి. గత మూడు రోజుల దాడుల్లో మొత్తంగా 200మంది వరకు చిన్నారులు మరణించారని మొత్తంగా 506మంది ప్రాణాలు కోల్పోయారని ఆ వర్గాలు తెలిపాయి. జనవరి మధ్య నుండి కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి రావడంతో నెలకొన్న నిశ్శబ్ద వాతావరణం ఒక్కసారిగా ఈ దాడులతో చెదిరిపోయింది. దీంతో పాలస్తీనియన్ల ఆశలు కల్లలయ్యాయి. సెంట్రల్, దక్షిణ గాజా ప్రాంతాల్లో భద్రతా వలయాన్ని విస్తరించేందుకు, ఉత్తర, దక్షిణ గాజాల మధ్య పాక్షిక బఫర్ జోన్‌ను ఏర్పాటు చేసేందుకు తాము భూతల ఆపరేషన్లు తిరిగి ప్రారంభిస్తామని బుధవారమే ఇజ్రాయిల్ మిలటరీ ప్రకటించింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని కాపాడాలని అంతర్జాతీయ సమాజం ఎన్ని విజ్ఞప్తులు చేసినా ఇజ్రాయిల్ వాటిని పట్టించుకోవడం లేదు. దీంతో మళ్ళీ అమానుష దాడులకు గురవడం తప్ప పాలస్తీనియన్లకు మరో మార్గం లేకపోయింది. కాగా, ఇప్పటికీ తాము చర్చలకు సిద్ధంగానే వున్నామని హమాస్ ప్రకటిస్తోంది. దాడులను ఆపేందుకు అంతర్జాతీయ సమాజం చొరవ తీసుకోవాలని కోరుతోంది. మార్చి మొదటివారంలో మొదటి దశ ముగిసిన తర్వాత కాల్పుల విరమణ విషయంలో ఎలా ముందుకు వెళ్ళాలనే అంశంపై చర్చలు స్తంభించిపోయాయి. కాల్పుల విరమణ మూడు దశలను అమలు చేయడానికి మరింతగా కృషి జరగాల్సి వుందని ఖతార్, ఈజిప్ట్‌లు పేర్కొన్నాయి.

**యెమెన్ క్షిపణి దాడులు**

గురువారం తెల్లవారు జామున యెమెన్ క్షిపణి దాడి జరపడంతో ఇజ్రాయిల్‌లో పలు చోట్ల సైరన్లు మోగాయి. ఆ వెంటనే జెరూసలేంలో అనేక చోట్ల పేలుళ్ళ శబ్దాలు వినిపించాయి. అయితే ఎవరూ గాయపడినట్లు వార్తలందలేదు. హమాస్‌తో కాల్పుల విరమణ ఒప్పందం కుప్పకూలిన నేపథ్యంలో తాము క్షిపణి దాడులను పునరుద్ధరిస్తున్నామని ఈ వారంలో యెమెన్ హౌతి గ్రూపు ప్రకటించింది.

# బీఆర్ఎస్ ఓటమికి అసూయ, ద్వేషమే కారణం..

## రేవంత్‌రెడ్డి జాక్‌పాట్ సీఎం

బడ్జెట్ అంతా బోగస్..ఆరు గ్యారంటీలు గోవిందా..
కాంగ్రెస్‌తో కరువు వచ్చింది
ఢిల్లీకి రాష్ట్రం డబ్బుల మూటలు
ఏప్రిల్ 27న వరంగల్ సభను విజయవంతం చేయాలి
సూర్యాపేటలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**నవతెలంగాణ-సూర్యాపేట**

తమ పార్టీలో నేతల మధ్య అసూయ, ద్వేషంతోపాటు కాంగ్రెస్ చెప్పిన హామీల ఆశ వల్ల బీఆర్ఎస్ అధికారం కోల్పోయిందని, రేవంత్‌రెడ్డి జాక్‌పాట్‌లో రాష్ట్రానికి సీఎం అయ్యారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాల ఏర్పాట్లలో భాగంగా గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అధ్యక్షతన నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. యూట్యూబర్లను అడ్డం పెట్టుకుని సీఎం అయిన రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక అదే యూట్యూబర్లను బట్టలూడదీసి కొడతానని అంటున్నారని విమర్శించారు. కేసీఆర్‌ను, బీఆర్ఎస్ నేతల్ని సోషల్ మీడియాలో ఎంతగా తిట్టారో అందరికీ తెలుసని, ఇప్పుడు తన వరకు వచ్చే సరికి యూట్యూబర్లపై కేసులు పెడుతున్నారని, బెదిరిస్తున్నారని అన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను చూస్తే నవ్వాలో ఏడ్వాలో తెలియని పరిస్థితి ఉందన్నారు.

రాష్ట్రంలో సగం మంది రైతులకు కూడా రుణమాఫీ జరగలేదని కేటీఆర్ విమర్శించారు. రుణమాఫీ పథకం అమలు కోసం రూ.49,500 కోట్లు కావాలని నిర్ణయించి.. మూడో రోజు అది రూ.40 వేల కోట్లకు చేరిందని విమర్శించారు. క్యాబినెట్‌లో రుణమాఫీకి రూ.31 వేల కోట్లు మంజూరు చేస్తామని చెప్పిన ప్రభుత్వం అనంతరం కేవలం రూ.26,500 కోట్లు మంజూరు చేస్తున్నామని చెప్పిందని తెలిపారు. ఇందులో రూ.20 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్టు స్వయంగా ఆర్థిక మంత్రి ప్రకటించారని, ఇలాంటప్పుడు రైతులందరికీ రుణమాఫీ చేసినట్టు ఎలా అవుతుందని ప్రశ్నించారు. రేవంత్ అనేటోడు వికృతమెంటాల్టీ కలిగిన వాడని, పర్సంటేజ్‌లు తప్ప వేరే ధ్యాస లేదని ఆరోపించారు. బడ్జెట్ అంతా బోగస్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు గ్యారంటీలు.. గోవిందా.. అని ఎద్దేవా చేశారు. తెలంగాణ డబ్బులన్నీ ఢిల్లీకి తీసుకెళ్లి రాహుల్ గాంధీ ఖాతాల్లో వేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ సొమ్ముతో ఢిల్లీకి కప్పం కడుతున్నారని, కాంగ్రెస్ వచ్చింది కరువు వచ్చిందని ఎద్దేవా చేశారు. ఎస్సారెస్పీ కింద కాళేశ్వరం ద్వారా పొలాలను కేసీఆర్ సస్యశ్యామలం చేశారని, ప్రస్తుత సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఉన్నా వేస్ట్ అని, ఆయన వల్ల ఏం కాదని జిల్లాలో నీళ్లు ఇవ్వలేని ఉత్తమంత్రిగా మిగిలారని వ్యాఖ్యానించారు. కేసీఆర్‌పై కోపంతో రైతులను ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ హయాంలో కృష్ణా నీటిని 36శాతం వినియోగిస్తే.. ఇప్పుడు 24 శాతం కూడా వాడలేదన్నారు. బడే బాయ్ చోటే బాయ్ ఇద్దరూ ఒక్కటే అని, రేవంత్‌ను బీజేపీ కాపాడుతుందని చెప్పారు. వరంగల్‌లో ఏప్రిల్ 27న నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ 25 సంవత్సరాల వేడుకలకు భారీ సంఖ్యలో కార్యకర్తలు తరలి రావాలని పిలుపునిచ్చారు.

**వచ్చే ఏడాది పాదయాత్ర : కేటీఆర్**

అనంతరం కేటీఆర్ మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ప్రస్తుతం జిల్లాల పర్యటనలు ప్రారంభించానని, వచ్చే ఏడాది తాను పాదయాత్ర చేస్తానని, రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకురావడమే తన లక్ష్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యులు బడుగుల లింగ యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్ కుమార్, కంచర్ల భూపాల్ రెడ్డి, నల్లమోతు భాస్కరరావు, రామావత్ రవీంద్ర కుమార్, బొల్లం మల్లయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉభయ సభలకు తమిళ ఎంపీల టీషర్టుల సెగ

(మొదటిపేజి తరువాయి)

తెలిపారు. టీ షర్టులను తీసివేసి వారు సభకు వస్తే వివిధ పార్టీల నాయకులతో చర్చించాల్సిన కొన్ని విషయాలున్నాయన్నారు. చైర్మెన్ పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో టీ-షర్టులు తొలగించే ప్రసక్తే లేదని డీఎంకే ఎంపీలు స్పష్టం చేశారు. వాయిదా అనంతరం మధ్యాహ్నం సభ ప్రారంభమైనపుడు టీ-షర్టు అంశంపై వాదనలు చోటుచేసుకున్నాయి. అనంతరం డిప్యూటీ స్పీకర్ సభను శుక్రవారం ఉదయం 11 గంటల వరకు వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. కనిమొళి నేతృత్వంలోని డీఎంకే ఎంపీలు పార్లమెంటు వెలుపల డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా తీవ్రంగా నిరసన తెలిపారు. తమిళనాడు న్యాయమైన డీలిమిటేషన్‌కు పట్టుబడుతోందని, కేంద్రం అవలంభించాలన్న విధానం వల్ల దాదాపు 7 రాష్ట్రాలు ప్రభావితమవుతాయని వారు తెలిపారు. కేంద్రం నుంచి ఈ అంశంపై స్పష్టత రాలేదని, న్యాయమైన డీలిమిటేషన్ వచ్చే వరకు నిరసనను కొనసాగిస్తుంటామన డీఎంకే ఎంపీ తిరుచ్చి శివ స్పష్టం చేశారు.

కెప్టెన్ల సమావేశం అనంతరం ఐపీఎల్ 2025 ట్రోఫీతో పది జట్ల సారథులు



# ఇక ఉమ్మి వాడొచ్చు!

- ఐపీఎల్‌లో ఉమ్మిపై నిషేధం ఎత్తివేత
- రెండో ఇన్నింగ్స్‌లో రెండు కొత్త బంతులు

**2025 ఇండియన్ ప్రీమియర్ లీగ్**

**ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2025 హంగామా శనివారం నుంచి షురూ కానుండగా.. సరికొత్త నిబంధనలు లీగ్ బరిలో నిలిచిన బౌలర్లలో జోష్ తీసుకొచ్చింది. పేసర్లు రివర్స్ స్వింగ్ రాబట్టేందుకు అడ్డుగా ఉన్న ఉమ్మి వాడకంపై నిషేధాన్ని ఐపీఎల్ నిర్వాహకులు ఎత్తివేశారు. మంచు ప్రభావంలో లక్ష్యాలను కాపాడుకునే బౌలింగ్ జట్లకు సైతం భారీ ఉపశమనం లభించింది. రెండో ఇన్నింగ్స్‌లో బౌలింగ్ చేసే జట్టుకు ఇక నుంచి రెండు కొత్త బంతులు అందించనున్నారు. ఐపీఎల్, పది జట్ల కెప్టెన్ల సమావేశంలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నారు.**

నవతెలంగాణ-ముంబయి

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ సీజన్ సరికొత్త నిబంధనలతో ముందుకొస్తుంది. నెట్టింట చర్చనీయాంశంగా మారిన ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌ను కొనసాగిస్తూనే.. ధనాధన్ సమరంలో బౌలర్లకు సైతం ఊతం అందించేందుకు కీలక మార్పులు చేశారు. ముంబయిలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో ఐపీఎల్ పది జట్ల కెప్టెన్లతో టెక్నికల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బంతిపై మెరుపు పోగొట్టేందుకు 'ఉమ్మి' వాడకంపై కొనసాగుతున్న నిషేధాన్ని ఏకగ్రీవంగా ఎత్తివేశారు. మంచు ప్రభావం ఎక్కువగా కనిపించే నైట్ మ్యాచుల్లో రెండో ఇన్నింగ్స్‌లో బౌలింగ్ చేసే జట్టుకు రెండు కొత్త బంతులు అందించనున్నారు. తొలి పది ఓవర్లు, చివరి పది ఓవర్లు కొత్త బంతితో బౌలర్లు దాడి చేసేందుకు అవకాశం ఇవ్వనున్నారు. ఈ మేరకు భారత క్రికెట్ బోర్డు వర్గాలు తెలుపగా.. ఫ్రాంచైజీలకు అధికారికంగా సమాచారం అందించనున్నారు.

**రివర్స్ స్వింగ్‌కు చాన్స్!**

కరోనా మహమ్మారి సమయంలో ఆటగాళ్ల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని బంతిపై ఉమ్మి వాడకాన్ని ఐసీసీ నిషేధించింది. కోవిడ్-19 ప్రభావం ముగిసినా.. 2022 ఐసీసీ సమావేశంలో ఉమ్మిపై శాశ్వత నిషేధం కొనసాగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఉమ్మి వాడకంపై ఆంక్షలతో పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో బౌలర్లకు రివర్స్ స్వింగ్ అసాధ్యంగా మారిందని పేసర్లు గళమెత్తారు. ఇటీవల చాంపియన్స్ ట్రోఫీ విజయానంతరం భారత పేసర్ మహ్మద్ షమి ఉమ్మి వాడకంపై నిషేధం తొలగించాలని ఐసీసీని కోరాడు. ఇతర దేశాలకు చెందిన పేస్ బౌలర్లు సైతం షమికి మద్దతుగా నిలిచారు. ఉమ్మి వాడకంతో వన్డేల్లో రివర్స్ స్వింగ్‌కు అవకాశం ఉన్నప్పటికీ.. టీ20ల్లో ఆ ప్రభావం స్వల్పమేనని చెప్పవచ్చు. నాణ్యమైన ప్రపంచ శ్రేణి పేసర్లు మాత్రమే తక్కువ సమయంలో బ్యాటర్లను ఇరకాటంలో పడేయగల రివర్స్ స్వింగ్ మాయజాలం ప్రదర్శించగలరు.

**టాస్ ప్రాధాన్యత లేనట్టే!**

ఐపీఎల్ 2025లో అమలు చేయనున్న మరో కీలక నిబంధన రెండో ఇన్నింగ్స్‌లో బౌలింగ్ చేసే జట్టుకు రెండు కొత్త బంతులు అందుబాటులో ఉంచటం. ఐపీఎల్ మ్యాచ్‌లకు మంచు ప్రభావం ఎక్కువ. కొన్ని స్టేడియాల్లో టాస్‌తోనే ఫలితాన్ని అంచనా వేయవచ్చు. ఇరు జట్లకు సమాన అవకాశాలు కల్పించేందుకు రెండో ఇన్నింగ్స్‌లో బౌలింగ్ చేసే జట్టుకు రెండు కొత్త బంతులు ఇవ్వనున్నారు. 1-10 ఓవర్లకు, 11-20 ఓవర్లకు కొత్త బంతులను అందుబాటులో ఉంచుతారు. దీంతో మంచు ప్రభావంతో బంతి మెత్తబడి బౌలర్లకు పట్టుచిక్కదనే సమస్య ఉత్పన్నం కాబోదు. ఈ నిబంధన మధ్యాహ్నం జరిగే మ్యాచులకు వర్తించదు. మధ్యాహ్నం 3.30 గంటలకు జరిగే మ్యాచులకు గతంలో మాదిరిగానే ఒక్క బంతినే ఇస్తారు.

**కెప్టెన్లకు ఉపశమనం**

స్లో ఓవర్ రేట్ అంశంలో కెప్టెన్ల మెడపై కత్తి తొలగింది. ఐపీఎల్‌లో స్లో ఓవర్ రేట్‌కు మ్యాచ్ ఫీజులో కోతతో పాటు మ్యాచ్ నిషేధం సైతం విధిస్తున్నారు. ఈ రూల్ కారణంగానే ముంబయి ఇండియన్స్ తొలి మ్యాచ్‌కు కెప్టెన్ హార్దిక్ పాండ్య దూరమయ్యాడు. ప్రస్తుత మ్యాచ్ నిషేధం రూల్ స్థానంలో ఐసీసీ తరహా డీ మెరిట్ పాయింట్ల పద్ధతిని ప్రవేశపెట్టారు. స్లో ఓవర్ రేట్‌తో పాటు క్రమశిక్షణ ఉల్లంఘనలకు సైతం డీ మెరిట్ పాయింట్లు ఇస్తారు. డీ మెరిట్ పాయింట్ల కాల వ్యవధి మూడేండ్ల పాటు ఉంటుంది. లెవల్ 1 పొరపాట్లకు మ్యాచ్ ఫీజులో 25 నుంచి 75 శాతం జరిమానా సహా డీ మెరిట్ పాయింట్లు విధిస్తారు. లెవల్ 2 అఫెన్స్‌కు వంద శాతం జరిమానాతో పాటు నాలుగు డీ మెరిట్ పాయింట్లు వేస్తారు. దీనికి తోడు హైట్ నో బాల్‌కు సైతం డీఆర్ఎస్ సమీక్షను తీసుకునే వెసులుబాటు కల్పించారు.



## ఐఓసీ అధ్యక్ష పీఠంపై ఆఫ్రికా మహిళ

**ప్రెసిడెంట్‌గా ఎన్నికైన కిర్‌స్టీ లీ కోవెంట్రీ సెవార్డ్**

**కోస్టా నవారినో (గ్రీస్) :** అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) అధ్యక్ష పీఠంపై తొలిసారి ఓ మహిళ కూర్చోనుంది. జింబాబ్వే క్రీడా శాఖ మంత్రి, ఒలింపిక్ స్విమ్మర్ కిర్‌స్టీ లీ కోవెంట్రీ (41) 134 ఐఓసీ చరిత్రలో తొలి ఆఫ్రికా, తొలి మహిళా ప్రెసిడెంట్ కానుంది. గ్రీసులోని కోస్టా నవారినోలో జరుగుతున్న ఐఓసీ సెషన్లో అధ్యక్ష పదవి కోసం ఏడుగురు పోటీపడగా.. రహస్య బ్యాలెట్ విధానంలో జరిగిన ఎన్నికలో కిర్‌స్టీ ఎన్నికయ్యారు. ఐఓసీలో 109 మంది ఓటర్లు ఉండగా.. 97 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. తొలి రౌండ్లో 47 ఓట్లు సాధించిన కిర్‌స్టీ స్పష్టమైన మెజారిటీతో ఐఓసీ పదో ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. ఐఓసీ ప్రస్తుత ప్రెసిడెంట్ థామస్ బాచ్ 12 ఏండ్ల తర్వాత పదవి నుంచి తప్పుకోనున్నాడు. జూన్ 23న ఒలింపిక్ డే సందర్భంగా కొత్త అధ్యక్షురాలు పదవి బాధ్యతలు చేపట్టనున్నారు. థామస్ బాచ్ గౌరవ అధ్యక్షులుగా కొనసాగనున్నారు.

అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీలో కిర్‌స్టీ ప్రస్థానం 2012లో మొదలైంది. తొలుత ఐఓసీ అథ్లెట్స్ కమిషన్‌కు ఎన్నికైన కిర్‌స్టీ.. ఐఓసీ సభ్యురాలిగా ఎనిమిదేండ్లు పని చేశారు. 2023లో ఐఓసీ ఎగ్జిక్యూటివ్ కమిటీకి ఎన్నికయ్యారు. 2024 సెప్టెంబర్‌లో అధ్యక్ష రేసులో మరో ఆరుగురితో కలిసి బరిలో నిలిచారు. అథ్లెట్‌గా కిర్‌స్టీ ఆఫ్రికా నుంచి అత్యంత విజయవంతమైన స్విమ్మర్. 2000-2016 సమయంలో ఐదు ఒలింపిక్స్‌లో పోటీపడిన కిర్‌స్టీ ఈత కొలనులో ఏడు పతకాలు సాధించింది.

## లాస్‌ఏంజిల్స్‌లో బాక్సింగ్

**వరల్డ్ బాక్సింగ్‌కు ఐఓసీ గుర్తింపు**

**న్యూఢిల్లీ :** ఒలింపిక్స్‌లో బాక్సింగ్‌పై కొనసాగుతున్న అనిశ్చితికి తెరపడింది. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) నూతనంగా ఏర్పడిన వరల్డ్ బాక్సింగ్ (డబ్ల్యూబీ) సంఘానికి గుర్తింపు ఇస్తూ సోమవారం నిర్ణయం తీసుకోగా... 2028 లాస్ ఏంజిల్స్‌లో బాక్సింగ్ క్రీడ ఉంటుందని అధికారికంగా సమాచారం అందించింది. రియో ఒలింపిక్స్ తర్వాత ప్రపంచ బాక్సింగ్ సమాఖ్యతో విభేదాలు రావటంతో టోక్యో పారిస్ ఒలింపిక్స్‌లో బాక్సింగ్ మ్యాచులను స్వయంగా ఐఓసీ నిర్వహించింది. తాజాగా థామస్ బాచ్ అధ్యక్షతన జరిగిన ఐఓసీ సెషన్లో 2028 ఒలింపిక్స్‌లో బాక్సింగ్‌కు చేరుస్తూ నిర్ణయం తీసుకున్నారు.

## ఉప ముఖ్యమంత్రికి శాట్ చైర్మెన్ సత్కారం

**క్రీడలకు భారీ కేటాయింపులపై భట్టికి శివసేనారెడ్డి ధన్యవాదాలు**



**హైదరాబాద్ :** రాష్ట్ర బడ్జెట్‌లో క్రీడలకు భారీ కేటాయింపులు చేయటం పట్ల తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (శాట్) చైర్మెన్ కే. శివసేనా రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చివరి బడ్జెట్‌లో క్రీడలకు రూ.134.8 కోట్లు మాత్రమే కేటాయించగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం క్రీడా రంగానికి రూ.465 కోట్లు కేటాయింపులు చేయటం చరిత్రాత్మకమని శివసేనారెడ్డి తెలిపారు. ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను గురువారం కలిసిన శివసేనారెడ్డి క్రీడా సమాజం తరపున శాలువాతో ఘనంగా సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. పదేండ్లలో కుంటుపడిన క్రీడారంగాన్ని చక్కదిద్ది, దేశంలోనే తెలంగాణను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దటంతో పాటు యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్శిటీని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో సిద్ధం చేయాలని ఈ సందర్భంగా శివసేనతో భట్టి విక్రమార్క అన్నారు. తొలి ఏడాదే రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు అంచెల్లో సీఎం కప్ పోటీలను విజయవంతంగా నిర్వహించిన శాట్ యంత్రాంగాన్ని డిప్యూటీ ముఖ్యమంత్రి అభినందించారు. గత ఏడాది బడ్జెట్‌తో పోల్చితే ఈ సారి క్రీడలకు రూ.100 కోట్లు అదనంగా కేటాయింపులు చేసిన సంగతి తెలిసిందే.

## 24 నుంచి ఏవైసీఏ, టీడీసీఏ క్రికెట్ టోర్నీ

**ట్రోఫీ, జెర్సీలు ఆవిష్కరించిన డీజీపీ జితేందర్**



**హైదరాబాద్ :** ఈ నెల 24 నుంచి అమెరికన్ యూత్ క్రికెట్ అకాడమి (ఏవైసీఏ), తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ రూరల్) అండర్-17 క్రికెట్ టోర్నమెంట్ ఆరంభం కానుంది. ఏవైసీఏ జట్టుతో టీడీసీఏ రూరల్ వారియర్స్, రూరల్ రైజర్స్, రూరల్ పాంథర్స్ జట్లు రౌండ్ రాబిన్ పద్ధతిలో పోటీపడనున్నాయి. 50 ఓవర్ల ఫార్మాట్‌లో జరుగనున్న ఈ టోర్నమెంట్ ట్రోఫీలు, జెర్సీలను తెలంగాణ డిజిపి జితేందర్ గురువారం ఆవిష్కరించారు. 'తెలంగాణ రూరల్ క్రికెటర్లకు అంతర్జాతీయ స్థాయి పోటీతత్వం అందించేందుకు అమెరికన్ యూత్ క్రికెట్ అకాడమీతో టోర్నమెంట్ నిర్వహించటం అభినందనీయం. గ్రామీణ క్రికెటర్లు సత్తా, సామర్థ్యం నిరూపించుకునేందుకు ఈ టోర్నమెంట్ ఓ మంచి వేదిక. క్షేత్రస్థాయిలో క్రికెట్ అభివద్ధికి పాటుపడుతున్న టీడీసీఏకు అభినందనలు' అని ట్రోఫీ ఆవిష్కరణ సందర్భంగా డిజిపి జితేందర్ అన్నారు. కార్యక్రమంలో టీడీసీఏ వ్యవస్థాపక అధ్యక్షులు, శాట్ మాజీ చైర్మెన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి, అమెరికన్ యూత్ క్రికెట్ అకాడమీ ప్రెసిడెంట్ అరుణ్ కొలిపాక, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ చైర్మెన్ రామిరెడ్డి, టీడీసీఏ కన్వీనర్లు ఉస్మాన్ అలీ, సయ్యద్ నవాజ్ షా, సుధీర్ రెడ్డి, మనీశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాయల్స్ కెప్టెన్‌గా పరాగ్

**గాయం నుంచి కోలుకోని సంజు శాంసన్**

**ధర్మశాల :** ఐపీఎల్ తొలి సీజన్ చాంపియన్ రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ సంజు శాంసన్ తొలి మూడు మ్యాచులకు దూరం అయ్యాడు. చేతి వేలి గాయానికి గురైన సంజు శాంసన్‌కు గత నెలలో శస్త్రచికిత్స జరిగింది. బెంగళూర్‌లోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో రిహాబిలిటేషన్ ముగించుకుని సోమవారమే రాయల్స్ శిబిరంలో చేరాడు. దీంతో రియాన్ పరాగ్ తొలి మూడు మ్యాచులకు కెప్టెన్‌గా వ్యవహరిస్తాడని ఆ ఫ్రాంచైజీ వెల్లడించింది. వేలి గాయంతో వికెట్ కీపింగ్ శాంసన్‌కు కష్టంగా మారనుంది. ధ్రువ్ జురెల్ వికెట్ కీపర్‌గా తుది జట్టులో నిలువనుండగా.. సంజు శాంసన్ ఇంపాక్ట్ ప్లేయర్‌గా బ్యాటర్‌గా మెరిసే అవకాశాలు ఉన్నాయి. కెరీర్‌లో తొలిసారి కెప్టెన్సీ వహించనున్న రియాన్.. ఐపీఎల్‌లో సారథ్య పగ్గాలు అందుకున్న ఐదో పిన్న వయస్కుడిగా నిలువనున్నాడు. రాజస్థాన్ రాయల్స్ తొలి మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్ ఆదివారం ఉప్పల్ స్టేడియంలో జరుగనుంది.

# నవచిత్రం

## 'ప్రేమ వెల్లువ..'తో పాటల సందడి షురూ



శ్రీనిధి శెట్టి, నాని

'హిట్' సిరీస్‌లో భాగంగా ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం 'హిట్ : ది థర్డ్ కేస్'. నాని, శ్రీనిధి శెట్టి జంటగా నటిస్తున్న ఈ చిత్రంలోని ఫస్ట్ సింగిల్ 'ప్రేమ వెల్లువ..'
ఈనెల 24న విడుదల కానుంది. ఈ రొమాంటిక్ ట్రాక్ నాని, శ్రీనిధి శెట్టి మధ్య బ్యూటీఫుల్ కెమిస్ట్రీని ప్రజెంట్ చేయనుంది. ఇది అభిమానులకు సినిమా ఇంటెన్స్, క్రైమ్ థ్రిల్లర్ నెరేటివ్‌కి రిఫ్రెషింగ్‌ని అందిస్తుంది. అలాగే ఈ ఫస్ట్ సింగిల్ బ్యూటీఫుల్ మెలోడీగా ఉండనుంది. మిక్కీజెమేయర్ కంపోజిషన్ శ్రోతలను మంత్రముగ్ధుల్ని చేయనుంది. శైలేష్ కొలను దర్శకత్వం వహించిన ఈ చిత్రం అత్యంత విజయవంతమైన 'హిట్' ఫ్రాంచైజీలో మూడవ భాగం. టీజర్, పోస్టర్‌లు సినిమాపై భారీ బజ్‌ని క్రియేట్ చేశాయి. వాల్ పోస్టర్ సినిమా, నాని యునానిమస్ ప్రొడక్షన్స్ పతాకంపై ప్రశాంతి తిపిర్నేని నిర్మిస్తున్న ఈ సినిమా మే 1న విడుదల కానుంది.

## ప్రభుత్వానికి కృతజ్ఞతలు

కళాకారులను, సాంకేతిక నిపుణులను తద్వారా చిత్ర పరిశ్రమను ప్రోత్సహిస్తూ గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డులను ప్రదానం చేసే కార్యక్రమాన్ని తలపెట్టిన ముఖ్యమంత్రి రేవంతిరెడ్డికి తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ కృతజ్ఞతలు తెలిపింది. 2024 ఏడాదిగాను ఉత్తమ చలన చిత్రాలకు, ఉత్తమ కళాకారులు, సాంకేతిక నిపుణులకు తెలుగు చలన చిత్ర పరిశ్రమలోని ప్రముఖులు, గొప్ప వ్యక్తుల (1) ఎన్టీఆర్ జాతీయ చలనచిత్ర అవార్డు (2) పైడి జైరాజ్ చలనచిత్ర అవార్డు (3) బి.ఎన్. రెడ్డి చలనచిత్ర అవార్డు (4) నాగి రెడ్డి మరియు చక్రపాణి చలనచిత్ర అవార్డు (5) కాంతారావు చలనచిత్ర అవార్డు (6) రఘుపతి వెంకయ్య చలనచిత్ర అవార్డు... పేర్లు మీద 'గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్'ను ప్రదానం చేయటం అభినందనీయం.
ఈ నేపథ్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, టిఎఫ్‌డీసి చైర్మన్ వి.వెంకటరమణ రెడ్డి (దిల్‌రాజు)కి తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది. తెలంగాణ ప్రభుత్వం చలనచిత్ర అవార్డులను పునరుద్ధరించడం పట్ల తెలుగు చలనచిత్ర పరిశ్రమ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ, ఇది తెలంగాణలో చలనచిత్ర నిర్మాణాన్ని మరింతగా ప్రోత్సహిస్తుంది అని టీఎఫ్‌పీసీ కార్యదర్శి టి.ప్రసన్నకుమార్ అన్నారు.

## రాజమండ్రి షెడ్యూల్ పూర్తి



రామ్ పోతినేని కథానాయకుడిగా మైత్రీ మూవీ మేకర్స్ ఓ సినిమాను నిర్మిస్తోంది.
'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' విజయం తర్వాత మహేష్ బాబు పి దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మాతలు. హీరోగా రామ్ 22వ చిత్రమిది.
రాజమండ్రిలో సెకండ్ షెడ్యూల్ ముగించుకుని చిత్ర బృందం హైదరాబాద్ వచ్చింది.
రాజమండ్రిలో 34 రోజుల పాటు నాన్ స్టాప్‌గా డే అండ్ నైట్ షూటింగ్ చేశారు. ఈ షెడ్యూల్‌లో రెండు పాటలతో పాటు ఒక యాక్షన్ సీక్వెన్స్, ఇంకా ఇంపార్టెంట్ టాకీ సీన్స్ చిత్రీకరణ చేశారు. రాజమండ్రి పరిసర ప్రాంతాల్లోని అందమైన లొకేషన్లను, అంతే అందంగా క్యాప్చర్ చేశామని చిత్ర బృందం తెలిపింది.
రాజమండ్రిలో జరిగిన చిత్రీకరణలో హీరో రామ్ పోతినేని, హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే సహా రావు రమేష్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, వీటీవీ గణేష్ తదితర తారాగణం మీద చిత్రీకరించారు. ఈనెల 28వ తేదీ నుంచి హైదరాబాద్ షెడ్యూల్ మొదలవుతుందని నిర్మాతలు తెలిపారు.

## 'సింగిల్' రిలీజ్ డేట్ ఫిక్స్



శ్రీ విష్ణు, కేతిక శర్మ

హీరో శ్రీ విష్ణు ఈ వేసవిలో తన మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'సింగిల్'తో ప్రేక్షకులను అలరించబోతున్నారు. 'నిను వీడని నీడను నేనే' మూవీ ఫేమ్ కార్తీక్ రాజు దర్శకత్వం వహించారు.
గీతా ఆర్ట్స్ అల్లు అరవింద్ సమర్పణలో కళ్యా ఫిల్మ్స్‌తో కలిసి చిత్రాన్ని విద్యా కొప్పినీడి, భాను ప్రతాప, రియాజ్ చౌదరి నిర్మిస్తున్నారు.
మేకర్స్ అధికారికంగా ప్రకటించినట్లుగా మే 9న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా థియేటర్లలోకి రానుంది. రిలీజ్ పోస్టర్ మూవీ హ్యూమర్ నేచర్‌ని సూచిస్తుంది. శ్రీ విష్ణు పాత్రను పగటిపూట కేర్ ఫ్రీ ఫ్రెండ్‌గా, నైట్ రొమాంటిక్ పర్సన్‌గా.. ఇలా రెండు డిఫరెంట్ వేరియేషన్స్‌లో ప్రజెంట్ చేస్తోంది. శ్రీ విష్ణు సరసన కేతిక శర్మ ఇవాన హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రం యూత్, ఫ్యామిలీ ఆడియన్స్ అలరించే వినోదాత్మక చిత్రంగా ఉండనుంది అని చిత్ర యూనిట్ తెలిపింది.



వైష్ణవి చైతన్య, సిద్ధు జొన్నలగడ్డ

## ప్రేక్షకుల్ని నవ్వించే 'జాక్'

సిద్ధు జొన్నలగడ్డ హీరోగా బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'జాక్ - కొంచెం క్రాక్'. వైష్ణవి చైతన్య హీరోయిన్‌గా నటించారు. ఈ మూవీ ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతోంది. తాజాగా ఈ చిత్రం నుంచి 'కిస్..' అంటూ సాగే రొమాంటిక్ సాంగ్‌ను మేకర్స్ గురువారం రోజు విడుదల చేశారు.
ఈ సందర్భంగా నిర్మాత బివిఎస్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ, 'సిద్ధు యూత్‌లోనే కాదు.. అన్నీ ఏజ్‌ల వారికి స్టార్ బాయ్‌గా మారారు. ఈ సినిమాను భాస్కర్ చాలా చక్కగా హ్యాండిల్ చేశాడు. గ్యారంటీగా మంచి సినిమా అవుతుందని భావిస్తున్నాను' అని అన్నారు.
'ఇంత మంచి పాటను రాసిన సనారెకి థాంక్స్. యూత్‌కి కనెక్ట్ అయ్యేలా పాట రాశారు. ఇంత మంచి ట్యూన్ ను అందించిన సురేష్ గారికి. మీకు సినిమా నచ్చుతుందని ఆశిస్తున్నాను' అని హీరోయిన్ వైష్ణవి చైతన్య చెప్పారు. హీరో సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ, 'ఓ పనిని ఇలానే ఎందుకు చేయాలి.. మరోలా నేను చేస్తానని కొందరు అంటుంటారు. అలాంటి వాడిని చూస్తే మనం క్రాక్ అంటుంటాం. అందుకనే ఈ టైటిల్ పెట్టాం. అందర్నీ నవ్విస్తూనే రెస్పాన్సిబుల్‌తో ఉండే పాత్రలో కనిపిస్తా' అని తెలిపారు.

## ఈ సినిమాలో ఓ మ్యాజిక్ ఉంది: మోహన్ లాల్



మోహన్‌లాల్, పృథ్వీరాజ్ సుకుమార్ కాంబోలో తెరకెక్కిన భారీ చిత్రం 'ఎల్ 2 ఎంపురాన్'.
ఆశీర్వాద్ సినిమాస్, శ్రీ గోకులం మూవీస్ బ్యానర్లపై ఆంటోనీ పెరుంబవూర్, గోకులం గోపాలన్ నిర్మించారు. మురళీ గోపి కథ అందించారు. ఈ మూవీ ప్రపంచ వ్యాప్తంగా ఈనెల 27న మలయాళంతో పాటు తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ అవుతుంది. ఈ క్రమంలో గురువారం ఈ సినిమా ట్రైలర్‌ను ఐమ్యాక్స్ ఫార్మేట్‌లో విడుదల చేశారు.
ఈ సందర్భంగా మోహన్ లాల్ మాట్లాడుతూ, 'ఈ సినిమా జర్నీ మరచిపోలేని అనుభవం. ఇలాంటి పాన్ ఇండియా సినిమాను రూపొందించటానికి మా ప్రయాణం ఏడేళ్లుగా కొనసాగుతోంది. ఇలాంటి భారీ చిత్రాన్ని గొప్పగా తెరకెక్కించార పృథ్వీరాజ్. దీన్ని సినిమా అని చెప్పటం కంటే మా చెమట, రక్తం అని చెప్పొచ్చు. ఇదొక ట్రయాలజీ మూవీ. అందులో ఇప్పటికే లూసిఫర్ సినిమా వచ్చింది. ఈనెల 27న ఈ సినిమా రానుంది. మరో సినిమాను రూపొందించాల్సి ఉంది. మలయాళ సినీ ఇండస్ట్రీ నుంచి వస్తోన్న తొలి ఐమ్యాక్స్ ఫార్మేట్ మూవీ ఇది. సినిమాకు వస్తోన్న రెస్పాన్స్ చూస్తుంటే ఆశ్చర్యమేస్తుంది. ఈ మూవీలో మ్యాజిక్ ఉంది. ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా సినిమాను చూడటానికి ఎదురు చూస్తున్నారు. ఈ సినిమాను ఆడియెన్స్‌తో కలిసి చూడాలనుకుంటున్నాను' అని అన్నారు.



## అమ్మాయిలు జాగ్రత్త పడతారు

దర్శకుడు రామ్ గోపాల్ వర్మ కొత్త సినిమా 'శారీ'. సత్య యాదు, ఆరాధ్య దేవి ప్రధాన పాత్రల్లో నటించారు. సైకలాజికల్ థ్రిల్లర్ కథతో దర్శకుడు గిరి కృష్ణ కమల్ రూపొందించారు. ఆర్జీవీ, ఆర్వీ ప్రొడక్షన్స్ ఎల్ఎల్‌పీ బ్యానర్‌పై రవిశంకర్ వర్మ నిర్మించారు.
ఈ సినిమా ఏప్రిల్ 4న తెలుగు, హిందీ, తమిళం, మలయాళ భాషలలో పాన్-ఇండియా స్థాయిలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు. డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ,' సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో పర్సనల్ విషయాలు షేర్ చేసుకోవడం వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఈ సినిమా నేపథ్యమిదే. నేను ఈ చిత్రానికి మూల కథ రాశాను. గిరి కృష్ణకమల్ దర్శకత్వం వహించాడు. ఆరాధ్య చీరకట్టులో చేసిన ఒక రీల్ చూసి ఆమెను కాస్ట్ చేశాం. ఆమె చేసిన పర్‌ఫార్మెన్స్ సూపర్బ్‌గా అనిపించింది. సత్య ట్రెండ్ యాక్టర్. తను బాగా నటించాడు. 'శారీ' సినిమాలో మెసేజ్ ఉంటుందని చెప్పను. కానీ ఈ సినిమా చూశాక అమ్మాయిలు జాగ్రత్తపడతారు' అని అన్నారు.



ప్రదీప్ మాచిరాజు, దీపికా పిల్లి

## బ్యూటీఫుల్ మెలోడీగా 'మొదటి చినుకు..'

హీరో ప్రదీప్ మాచిరాజు మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'. ఈ వేసవి కానుకగా ఏప్రిల్ 11న థియేటర్లలోకి రావడానికి సిద్ధంగా ఉంది.
డైరెక్టర్స్ ద్వయం నితిన్, భరత్ దర్శకత్వం వహిస్తున్న ఈచిత్రాన్ని మాంక్స్, మంకీస్ బ్యానర్ నిర్మిస్తోంది. దీపికా పిల్లి కథానాయికగా నటిస్తోంది.
గురువారం మేకర్స్ థర్డ్ సింగిల్ 'మొదటి చినుకు..' సాంగ్‌ను రిలీజ్ చేశారు. రథన్ స్వరపరిచిన ఈ రొమాంటిక్ మెలోడీ అద్భుతమైన గ్రామీణ నేపథ్యంలో తొలి ప్రేమలోని అమాయకత్వ మ్యాజిక్‌ని అందంగా చిత్రీకరిస్తుంది. చంద్రబోస్ రాసిన సాహిత్యం అద్భుతంగా ఉంది. సిద్ శ్రీరామ్ తన మెస్మరైజింగ్ వోకల్స్‌తో ట్రాక్‌ని నెక్స్ట్ లెవల్‌కి తీసుకెళ్ళారు. ప్రదీప్, దీపికల కెమిస్ట్రీ, ఆన్-స్క్రీన్ ప్రేమకథ అద్భుతంగా ప్రజెంట్ చేసింది. కొరియోగ్రాఫర్ విశ్వ రఘు వారి ప్రేమకథను బ్యూటీఫుల్ డ్యాన్స్ మూమెంట్స్ చిత్రీకరించారు అని చిత్ర యూనిట్ తెలిపింది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

# గ్రీన్‌కార్డు హోల్డర్లలో గుబులు

## ముమ్మరంగా తనిఖీలు...ప్రశ్నలు

### కార్డులు తీసుకొని వెనక్కి పంపుతున్నారని ఆందోళన

### హక్కులు, బాధ్యతలు తెలుసుకోవాలంటున్న నిపుణులు




**వాషింగ్టన్ :** భారతీయులు సహా అమెరికాలో గ్రీన్‌కార్డులు కలిగిన వారు గతంలో ఎన్నడూ లేని విధంగా తనిఖీలకు గురవుతున్నారు. ట్రంప్ ప్రభుత్వం నోట పౌరసత్వం, ఇమ్మిగ్రేషన్, వెనక్కి పంపడం...వంటి పదాలే తరచూ విన్పిస్తున్నాయి. వాస్తవానికి డొనాల్డ్ ట్రంప్ శ్వేతసౌధంలో ప్రవేశించకముందే అమెరికాలో నివసిస్తున్న విదేశీయులకు భయం పట్టుకుంది. అక్రమ వలసలకు ఆయన కళ్లెం వేస్తారని, తాత్కాలిక ఉద్యోగాలు చేసే వారి పైన, విద్యార్థి వీసాల పైన ఆంక్షలు పెడతారని వారు ఊహించారు. అయితే గ్రీన్‌కార్డులు కలిగిన వారిని తనిఖీ చేస్తారని, ప్రశ్నల వర్షం కురిపిస్తారని చాలా మంది అనుకొని ఉండరు. అమెరికా పౌరసత్వం పొందడానికి గ్రీన్‌కార్డు అనేది ఎంతగానో ఉపయోగపడుతుంది. అయితే ఇటీవలి కాలంలో గ్రీన్‌కార్డులు ఉన్న వారిని తనిఖీ చేయడం, స్వదేశాలకు తిప్పి పంపడం వంటి చర్యలు చేపడుతుండడంతో అమెరికాలో తమ హక్కులపై భారతీయులు సహా విదేశీయులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

గ్రీన్‌కార్డుల తనిఖీలు భారతీయులనే ఎక్కువ ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఎందుకంటే 2023-24లో అమెరికా పౌరసత్వం లేదా గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో భారతీయులది రెండో స్థానం. కొత్తగా అమెరికా పౌరసత్వం పొందిన వారిలో 6.1 శాతం మంది (49,700) మన దేశానికి చెందిన వారే. అయితే ప్రస్తుత అనిశ్చిత పరిస్థితుల నడుమ భారతీయులు బహిష్కరణ ముప్పును ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో అమెరికాలో గ్రీన్‌కార్డులు ఉన్న భారతీయుల హక్కులేమిటో తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

#### ఈ హక్కులు ఉంటాయి

గ్రీన్‌కార్డులు ఉన్న వారిని చట్టబద్ధమైన శాశ్వత నివాసితులు (ఎల్‌పీఆర్‌లు)గా పరిగణిస్తారు. విదేశీ ప్రయాణాల అనంతరం తిరిగి అమెరికాకు వచ్చేందుకు వారికి చట్టపరమైన హక్కు ఉంటుంది. అయితే గ్రీన్‌కార్డ్ అర్హతను కస్టమ్స్-సరిహద్దు రక్షణ (సీబీపీ) అధికారులు పరిశీలించవచ్చు. అందుకోసం తనిఖీలు చేయవచ్చు. ప్రశ్నించవచ్చు. అమెరికా పౌరసత్వ-ఇమ్మిగ్రేషన్ సర్వీసుల (యూఎస్‌సీఐఎస్) పేజీ శాశ్వత నివాసితుల హక్కులను స్పష్టంగా తెలియజేసింది. 'ఎలాంటి చర్యలకు పాల్పడకుండా అమెరికాలో శాశ్వతంగా నివసించవచ్చు. ఒకవేళ ఏవైనా చర్యలకు పాల్పడితే ఇమ్మిగ్రేషన్ చట్టం ప్రకారం మిమ్మల్ని తొలగించవచ్చు' అని అందులో విపులంగా తెలిపారు. గ్రీన్‌కార్డు ఉన్న వారు తమ అర్హతను బట్టి చట్ట ప్రకారం ఏ పనైనా చేసుకోవచ్చు. అయితే భద్రతా కారణాల దృష్ట్యా కొన్ని ఉద్యోగాలను అమెరికా రిజర్వ్ చేసింది. గ్రీన్‌కార్డులు ఉన్న వారికి అమెరికా చట్టాల ప్రకారం రక్షణ కూడా లభిస్తుంది.

#### బాధ్యతలూ తప్పవు

అయితే యూఎస్‌సీఐఎస్ పేజీలో హక్కులను మాత్రమే ప్రస్తావించలేదు. గ్రీన్‌కార్డు ఉన్న వారి బాధ్యతలను కూడా అది తెలియజేసింది. గ్రీన్‌కార్డులు కలిగి ఉన్న వారు అమెరికా చట్టాలకు కట్టుబడి ఉండాలి. వారు తమ ఆదాయపన్ను రిటర్న్‌లు సమర్పించాలి. తమ ఆదాయ వివరాలను అమెరికా అంతరంగిక రెవెన్యూ సర్వీస్ (ఐఆర్ఎస్), ప్రభుత్వ పన్ను అధికారులకు అందజేయాలి. వారు ప్రజాస్వామ్య తరహా ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలి. అంటే దానర్థం ఓటు వేయడం కాదు. ఎందుకంటే వారు సమాఖ్య ఎన్నికలలో కానీ లేదా స్థానిక ఎన్నికలలో కానీ ఓటు వేయలేరు. 18-25 సంవత్సరాల మధ్య వయస్కులైన పురుషులైతే సెలక్టివ్ సర్వీసులకు పేరు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. వీసాను పొరబాటున రద్దు చేస్తే పున్షపరిశీలనను కోరవచ్చు. లేదా న్యాయస్థానంలో సవాలు చేయవచ్చు.

#### ఎందుకు రద్దు చేస్తారు?

గ్రీన్‌కార్డు లేదా శాశ్వత నివాస కార్డు ఉంటే అమెరికా పౌరులు కాని వారు అక్కడ నివసించవచ్చు. శాశ్వతంగా ఉద్యోగం చేసుకోవచ్చు. గ్రీన్‌కార్డులను చాలా వరకూ పది సంవత్సరాలకు నవీకరణ చేస్తారు. కార్డు కాలపరిమితి ముగిసినప్పటికీ నివాసానికి ఢోకా ఉండదు. అయితే గ్రీన్‌కార్డును రద్దు చేసి, స్వదేశానికి తిప్పిపంపడానికి అనేక కారణాలు ఉంటాయి. మోసం చేసి వివాహం చేసుకోవడం, నేరాలకు పాల్పడడం, దుర్వినియోగం వంటి చర్యలకు పాల్పడితే గ్రీన్‌కార్డును రద్దు చేసి వెనక్కి పంపుతారు. శిక్ష విధించబడిన పక్షంలో దానిని అమెరికాలోనే అనుభవించాల్సి ఉంటుంది. ఇమ్మిగ్రేషన్ ప్రక్రియలో మోసానికి పాల్పడినప్పుడు కూడా గ్రీన్‌కార్డును కోల్పోవాల్సి ఉంటుంది. ఉగ్రవాదానికి పాల్పడినట్లు లేదా ఉగ్రవాద సంస్థకు మద్దతు ఇస్తున్నట్లు అధికారులు భావిస్తే గ్రీన్‌కార్డును రద్దు చేస్తారు.

#### అధికారుల ఒత్తిడి

వృద్ధులైన భారతీయులను అమెరికా విమానాశ్రయాలలో తనిఖీలు చేయడం ఇటీవల ఎక్కువగా జరుగుతోంది. అమెరికా వెలుపల బంధువుల వద్ద దీర్ఘ కాలం గడిపి తిరిగి చేరుకుంటున్న భారతీయ వృద్ధులను ఫారం ఐ-407పై సంతకం చేయాలని అధికారులు ఒత్తిడి తెస్తున్నారని, గ్రీన్‌కార్డును స్వచ్ఛందంగా అప్పగించాలని బలవంతపెడుతున్నారని ఫ్లోరిడాకు చెందిన ఇమ్మిగ్రేషన్ అటార్నీ అశ్విన్ శర్మ తెలిపారు. ప్రస్తుతానికి గ్రీన్‌కార్డు ఉన్న వారిని తిప్పి పంపుతున్న ఉదంతాలు తక్కువే అయినప్పటికీ భారతీయులు తమ హక్కులు, బాధ్యతల గురించి తెలుసుకోవడం మంచిదని నిపుణులు సూచించారు.

---

## బిజినెస్



# ప్రపంచ వృద్ధికి అమెరికా పోటు

### ఈ ఏడాది 2.2 శాతమే పెరుగుదల

### వాణిజ్య యుద్ధంతో నష్టమే : ఫిచ్ రేటింగ్ అంచనా

**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అనుసరిస్తోన్న అనిశ్చితి ఆర్థిక విధానాలు, టారీఫ్‌ల పెంపు ప్రపంచ దేశాల వృద్ధి రేటును దెబ్బతీస్తున్నాయి. ఇదే విషయాన్ని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ ఫిచ్ వెల్లడించింది. అమెరికా వాణిజ్య యుద్ధంతో 2025లో ప్రపంచ వృద్ధి రేటు 2.3 శాతానికి పడిపోనుందని విశ్లేషించింది. ఇంతక్రితం ఏడాదితో పోల్చితే 0.3 శాతం తగ్గనుందని అంచనా వేసింది. అమెరికా వేగంగా పెంచుతోన్న సుంకాలు ప్రపంచ వృద్ధి రేటుపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని ఫిచ్ తన 'గ్లోబల్ ఎకనామిక్ అవుట్‌లుక్'లో తెలిపింది. 2024లో గ్లోబల్ ఆర్థిక వ్యవస్థ 2.9 శాతం పెరిగనుందని తొలుత అంచనా వేసిన ఈ సంస్థ.. డిసెంబర్‌లో 2.6 శాతానికి కుదించింది. అమెరికా వాణిజ్య యుద్ధం ఎంత వరకు తీసుకెళ్లేది ఇప్పుడే చెప్పలేమని పేర్కొంది. యూరప్ సహా ఇతర దేశాలపై యుఎస్ వేస్తోన్న సుంకాలు దెబ్బకొస్తున్నాయని తెలిపింది. 2026లో గ్లోబల్ వృద్ధి మరింత తగ్గి 2.2 శాతానికి పరిమితం కావొచ్చని హెచ్చరించింది. ఈ ఏడాది అమెరికా జీడీపీ రేటుకు 1.1 శాతం కోత పెట్టి.. 1.7 శాతానికి పరిమితం చేసింది. 2024లో 2.8 శాతం వృద్ధిని నమోదు చేసిన విషయాన్ని గుర్తు చేసింది. చైనా, యూరోపియన్ యూనియన్ దేశాల వృద్ధి తగ్గనుందని ఫిచ్ పేర్కొంది. అయితే జపాన్ మాత్రం 2024లో 0.1 శాతం వృద్ధిని నమోదు చేయగా.. 2025లో 1.1 శాతం వృద్ధి సాధించనుందని తెలిపింది. భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత 2024-25లో 6.3 శాతంగా ఉండొచ్చని పేర్కొంది. 2025-26లో 6.5 శాతానికి తగ్గొచ్చని విశ్లేషించింది. ఇది ఆర్‌బీఐ అంచనా 6.7 శాతం కంటే తక్కువ కావడం గమనార్హం. అమెరికా వాణిజ్య విధానాలు ప్రధాన సవాళ్లుగా నిలువనున్నాయని పేర్కొంది. వినియోగదారుల విశ్వాసం తగ్గిందని పేర్కొంది. దీంతో వాహన అమ్మకాల్లో తగ్గుదల చోటు చేసుకుంటున్న విషయాన్ని ఫిచ్ గుర్తు చేసింది. 2024-25లో భారత జీడీపీ 6.4 శాతానికి పరిమితం కావొచ్చని ఇటీవల ఎన్ఎస్ఓ అంచనా వేసింది. ఇది నాలుగేండ్లలోనే అత్యంత కనిష్ట స్థాయి. ఇంతక్రితం 2023-24లో జీడీపీ 8.2 శాతం పెరిగింది. 2024-25లో 6.6 శాతం వృద్ధి ఉండొచ్చని ఆర్‌బీఐ ఇటీవల అంచనా వేసింది. దీంతో పోల్చితే ఫిచ్ తాజా అంచనాలు మరింత ఆందోళన కలిగించే అంశం.

## కేబుల్స్ వ్యాపారంలోకి అదానీ గ్రూపు

**న్యూఢిల్లీ :** అదానీ గ్రూపు కొత్తగా కేబుల్స్, వైర్ల రంగంలోకి ప్రవేశించింది. ఇందుకోసం అదానీ గ్రూప్ అనుబంధ సంస్థ కచ్ కాపర్ లిమిటెడ్, ప్రణీత వెంచర్స్‌తో కలిసి ప్రణీత ఎకోకేబుల్స్ పేరిట సంయుక్త భాగస్వామ్య కంపెనీని ఏర్పాటు చేశాయి. ఇందులో అదానీ గ్రూపు 50 శాతం వాటాను కలిగి ఉన్నట్టు గురువారం ఆ సంస్థ స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇచ్చింది. దీంతో మార్కెట్‌లో ఇప్పటికే ఈ రంగంలో ఉన్న పాలీక్యాబ్ ఇండియా లిమిటెడ్, కెఇఐ ఇండస్ట్రీస్ లిమిటెడ్, ఆర్ఆర్ కేబుల్ లిమిటెడ్, ఫినోలాక్స్ కేబుల్స్, హావెల్స్ ఇండియా లిమిటెడ్ తదితర కంపెనీల షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఇటీవల ఆదిత్యా బిర్లా గ్రూపునకు చెందిన అల్ట్రాటెక్ కేబుల్స్ రంగంలోకి ప్రవేశించింది.

## ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో 'ఎస్' ఫీచర్

**ముంబయి :** మ్యూచువల్ ఫండ్లలో స్మార్ట్ ఇన్వెస్ట్‌మెంట్‌లతో ఇన్వెస్టర్లకు మద్దతును ఇవ్వడానికి తమ మొబైల్ బ్యాంకింగ్ యాప్‌లో ఎస్ ఫీచర్‌ను జోడించినట్లు ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ తెలిపింది. ఇది పెట్టుబడిదారులుకు తగిన సమాచారంతో, మ్యూచువల్ ఫండ్ పెట్టుబడి నిర్ణయం తీసుకోవడానికి వీలు కల్పించే సంబంధిత పరిజ్ఞానము, సాధనాలను అందిస్తుందని పేర్కొంది.

## ఏప్రిల్‌లో బీమాపై జీఎస్టీ కోత..!




**న్యూఢిల్లీ :** వచ్చే ఏప్రిల్‌లో జరగనున్న జీఎస్టీ కౌన్సిల్ భేటీలో ఆరోగ్య, జీవిత బీమాపై వస్తు సేవల పన్నును తగ్గించే అవకాశం ఉందని తెలుస్తోంది. జీఎస్టీ తగ్గింపునపై తాజాగా బీమా రెగ్యూలేటరీ ఐఆర్‌డీఏఐ తన అభిప్రాయాలను, ప్రతిపాదనలను వెల్లడించింది. దీనిపై జీఎస్టీ మంత్రుల బృందం ఏప్రిల్ నెల సమావేశంలో చర్చించనుందని ఓ అధికారి తెలిపారు. బీహార్ డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరి నేతృత్వంలోని మంత్రుల బృందం వైద్య, జీవిత బీమాలపై కొత్త పన్ను రేట్లను ప్రతిపాదించింది. దీనిపై రాష్ట్రాల అభిప్రాయాలను సేకరిస్తోంది.

## నాలుగో రోజూ మార్కెట్లకు లాభాలు

**ముంబయి :** కొనుగోళ్ల మద్దతుతో వరుసగా నాలుగో రోజూ మార్కెట్లు పరుగులు పెట్టాయి. గురువారం బీఎస్ఈ సెన్సెక్స్ 899 పాయింట్లు పెరిగి 76,348కు చేరింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 283 పాయింట్ల లాభంతో 22,191 వద్ద ముగిసింది. ముఖ్యంగా బ్యాంకింగ్, ఐటి రంగాల షేర్లు మార్కెట్లకు ప్రధాన మద్దతును అందించాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఈ ఏడాదిలో రెండు సార్లు వడ్డీ రేట్లను తగ్గించనుందన్న రిపోర్టులు ఇన్వెస్టర్లలో విశ్వాసాన్ని పెంచింది. బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.3 లక్షల కోట్ల మేర పెరిగి రూ.408 లక్షల కోట్లకు చేరింది.

#### సిగ్నేచర్ గ్లోబల్ షేర్లకు సిఫారసు

రియాల్టీ సంస్థ సిగ్నేచర్ గ్లోబల్ (ఇండియా) లిమిటెడ్ షేర్లను కొనుగోలుకు బ్రోకరేజ్ సంస్థ నువామా సిఫారసు చేసింది. ప్రస్తుత మార్కెట్ ధర కంటే 35 శాతం పెరిగి రూ.1,436 లక్ష్యానికి చేరొచ్చని అంచనా వేసింది. గురువారం ఈ సూచీ 0.49 శాతం పెరిగి రూ.1,110 వద్ద ముగిసింది. వారం రోజుల్లో 3 శాతం లాభపడింది.

## భాగస్వాముల కోసం పిబి పార్ట్‌నర్స్ సంవాద్

**హైదరాబాద్ :** పాలసీబజార్ పాయింట్ ఆఫ్ సేల్స్ పర్సన్ విభాగానికి చెందిన పిబి పార్ట్‌నర్స్ హైదరాబాద్‌లో సంవాద్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వెల్లడించింది. ఏజెంట్ భాగస్వాములు, ఉద్యోగుల మధ్య అర్థవంతమైన సంబంధాలను పెంపొందించేందుకు దీనిని ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. ఈ కార్యక్రమానికి అన్ని వ్యాపార విభాగాల నుంచి సుమారు 60 మంది టాప్ ఏజెంట్ భాగస్వాములు, ఉద్యోగులు పాల్గొన్నట్లు పిబి పార్ట్‌నర్స్ సహ వ్యవస్థాపకుడు ధ్రువ్ సరిన్ పేర్కొన్నారు.

## రెనో, బీఎండబ్ల్యూ కార్లు ప్రియం

**న్యూఢిల్లీ :** ఉత్పత్తి వ్యయాలు పెరగడంతో కార్ల కంపెనీలు వరుసగా ధరలను పెంచుతున్నాయి. ఇప్పటికే మారుతి సుజుకి, టాటా మోటార్స్, హ్యుందాయ్ తదితర కంపెనీలు ధరలను పెంచగా.. అదే బాటలో రెనో, బీఎండబ్ల్యూ తమ వాహన ధరలను హెచ్చించాయి. ఏప్రిల్ నుంచి కొత్త ధరలు అమల్లోకి వస్తాయని వెల్లడించాయి. తయారీ వ్యయం, ముడి సరకు ధరలు, నిర్వహణ ఖర్చులు పెరిగిన కారణంగా కార్ల ధరలను రెండు శాతం మేర పెంచుతున్నట్లు రెనో ఇండియా సీఈఓ ఎండీ వెంకట్రామ్ తెలిపారు. 2023 ఫిబ్రవరి తర్వాత తొలిసారి ధరలను పెంచింది. బీఎండబ్ల్యూ మోటార్ ఇండియా తన వాహన ధరలను 3 శాతం వరకు పెంచుతున్నట్టు స్పష్టం చేసింది.

## మధుమేహ చికిత్స కోసం యూఎస్‌వీ 'జెనియా'

**హైదరాబాద్ :** భారత్‌లో మధుమేహ చికిత్స కోసం జెనియాను ఔషధాన్ని విడుదల చేసినట్టు యూఎస్‌వీ తెలిపింది. నోటి ద్వారా తీసుకునే ఈ మాత్ర 10ఎంజి, 25 ఎంజిల్లో లభిస్తుందని యూఎస్‌వీ ఎండీ ప్రశాంత్ తివారీ పేర్కొన్నారు. భారత్‌లో 10.1 కోట్ల పైగా మంది టైప్ 2 డయాబెటిస్‌తో బాధపడుతున్నారన్నారు.

---

# ఎన్నికల కమిషనర్ల నియామకంపై ఏప్రిల్ 16న విచారణ

### ఇది ప్రజాస్వామ్య వ్యవస్థ పునాదికి సంబంధించిన విషయం : ప్రశాంత్ భూషన్

**నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో**

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తొలగించడంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన ఎన్నికల కమిషనర్ల నియామకంపై చట్టం రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు ఏప్రిల్ 16న విచారించనుంది. ఈ నిర్ణయం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కె. సింగ్‌లతో కూడిన ధర్మాసనం వెల్లడించింది. సుప్రీంకోర్టు తీర్పును దాటవేసే రాజ్యాంగ విరుద్ధమైన చట్టాన్ని కేంద్రం తొందరపడి రూపొందించిందని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్)తో సహా పిటిషనర్లు పేర్కొన్నారు. బుధవారం లిస్ట్ చేయబడినప్పటికీ, సుప్రీంకోర్టుకు ఈ కేసును పరిశీలించడానికి తగినంత సమయం లేదు. ఏడీఆర్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనకు కనీసం



రెండు నుంచి మూడు గంటల సమయం ఇవ్వాలని పట్టుబట్టడంతో కేసును ఏప్రిల్ 16వ తేదీకి వాయిదా వేశారు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థ పునాదికి సంబంధించిన విషయమని ఆయన అన్నారు. డిసెంబర్ 2023లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల (నియామకం, సేవా కాలం,సేవా నిబంధనలు) చట్టం చెల్లుబాటును పిటిషనర్లు ప్రశ్నించారు. ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన ఎంపిక కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని చేర్చాలని అనూప్ భరన్వాల్ కేసులో రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును తప్పించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం హడావిడిగా కొత్త చట్టాన్ని ప్రవేశపెట్టింది. ఈ చట్టం ప్రకారం, ఎంపిక కమిటీలో ప్రధాన న్యాయమూర్తిని చేర్చాలనే కీలకమైన నిబంధనను తొలగించారు. కొత్త చట్టం ప్రకారం ఎంపిక కమిటీలో ప్రధానమంత్రి, ఆయన నామినేట్ చేసిన కేంద్ర మంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు ఉండాలి. సీపీఐ(ఎం)తో సహా రాజకీయ పార్టీలు ఈ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశాయి.

---

# ఆశా వర్కర్లకు ప్రోత్సాహకాలు పెంచే ఉద్దేశం లేదు

- రాజ్యసభలో కేంద్ర మంత్రి జెపి నడ్డా

**నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో**



ఆశా వర్కర్లకు ప్రోత్సాహకాల అంశంపై రాజ్యసభను పదే పదే తప్పుదారి పట్టించే ఆరోగ్య మంత్రి జె.పి. నడ్డా చర్యలు చర్చనీయాంశమవుతున్నాయి. గురువారం రాజ్యసభలో నడ్డా సమాధానమిస్తూ ఆశా కార్యకర్తలకు ప్రోత్సాహకాలను పెంచే ఉద్దేశం ప్రస్తుతానికి లేదని అన్నారు. వారం క్రితం నడ్డా సభలో మాట్లాడుతూ త్వరలో ప్రోత్సాహకాన్ని పెంచే విషయాన్ని పరిశీలిస్తానని చెప్పారు. అయితే, దీనికి విరుద్ధంగా మంత్రి గురువారం రోజు ఒక ప్రకటన చేశారు. ఇప్పుడు ఇస్తున్నది మంచి ప్రోత్సాహకమని అన్నారు. ఆరోగ్య మంత్రిత్వ శాఖపై చర్చలో సీపీఐ(ఎం) ఎంపీ వి. శివదాసన్ మాట్లాడుతూ ఆశా వర్కర్ల అంశంపై బీజేపీ, కాంగ్రెస్ ద్వంద్వ ప్రమాణాలను బయటపెట్టారు. "కేంద్ర ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు ప్రోత్సాహకంగా రూ. 1,200 మాత్రమే ఇస్తోంది. ప్రోత్సాహకాలను పెంచాలని చాలా కాలంగా డిమాండ్లు ఉన్నప్పటికీ, కేంద్రం అలా చేయడానికి సిద్ధంగా లేదు. కేరళలో జరుగుతున్న ఆశా వర్కర్ల సమ్మెలో ఒక కేంద్ర మంత్రి పాల్గొని వారిని మోసం చేశారు. కేరళ ఆశా కార్యకర్తలకు అధిక గౌరవ వేతనం చెల్లిస్తుంది. అయితే, కేరళలోని కాంగ్రెస్ నాయకులకు ఈ నిజం చెప్పే ధైర్యం లేదు. కొంతమంది ప్రముఖ కాంగ్రెస్ నాయకులు తమ నాయకులలో కొందరు బీజేపీ కోసం పనిచేస్తున్నారని బహిరంగంగా ప్రకటించారు. కేరళ విషయంలో ఇది చాలా నిజం. వారు బీజేపీకి తోకలా వ్యవహరిస్తున్నారు" అని విమర్శించారు. ఎంపీ శివదాసన్‌కు ఇచ్చిన సమాధానంలో మోడీ ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు అద్భుతమైన ప్రోత్సాహకాలను అందిస్తోందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ఆశా వర్కర్లు, వారి కుటుంబ సభ్యులు సామాజిక భద్రతా పథకాలలో చేర్చామని తెలిపారు. దానితో, వారి సామాజిక భద్రతకు భరోసా లభించిందన్నారు. "ప్రయోజనాలను పెంచడం గురించి మేము తరువాత పరిశీలిస్తాం" అని మంత్రి తన వైఖరిని స్పష్టం చేశారు.

---

## అమిత్‌షా, నడ్డాను కలిసిన బీజేపీ ఎమ్మెల్సీలు కొమరయ్య, అంజిరెడ్డి

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**



ఇటీవల నూతనంగా ఎన్నికైన బీజేపీ ఎమ్మెల్సీలు మల్క కొమరయ్య అంజిరెడ్డిలు గురువారం ఢిల్లీలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను, బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డాను మర్యాదపూర్వకంగా కలిశారు. అమిత్‌షా, నడ్డాలకు వారు శాలువాలు కప్పి సత్కరించారు. నూతన ఎమ్మెల్సీలను వారు అభినందించారు. రాష్ట్రంలో పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లేలా కష్టపడి పనిచేయాలని సూచించారు. వారి వెంట కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కుమార్, రాజ్యసభ సభ్యులు కె.లక్ష్మణ్, ఎంపీలు డి.అర్వింద్‌కుమార్, రఘునందన్‌రావు, డీకే అరుణ, జి.నగేశ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు, తదితరులున్నారు.

## బడ్జెట్‌లో విద్యారంగానికి అన్యాయం : డీటీఎఫ్

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌లో విద్యారంగానికి తక్కువ నిధులను కేటాయించడం అన్యాయమని డీటీఎఫ్ విమర్శించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం సోమయ్య, ప్రధాన కార్యదర్శి టి లింగారెడ్డి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 15 శాతం నిధులను కేటాయిస్తామంటూ కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కానీ బడ్జెట్‌లో 7.57 శాతం నిధులనే ప్రతిపాదించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కొఠారి కమిషన్ సిఫారసుల ప్రకారం రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులను కేటాయించాలని సూచించారు. విద్యావేత్తలు, విద్యారంగ నిపుణులు సూచించినట్టు కనీసం 20 శాతం నిధులను కూడా కేటాయించకపోవడం శోచనీయమని విమర్శించారు. తక్కువ నిధులను కేటాయించడంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అన్యాయం చేసినట్టే అవుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచించాలనీ, విద్యకు 15 శాతం నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యారంగాన్ని మరింత పటిష్టం చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.

---

# ఎమ్మెల్సీ వ్యవహారంలో రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయండి

- గవర్నర్ ఆఫీస్, రాష్ట్ర ప్రభుత్వం, ప్రతివాదులకు సుప్రీం ఆదేశం
- ఎమ్మెల్సీల కేసులో ఏప్రిల్ 24న తుది వాదనలు

**నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో**

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ ఎన్నిక వ్యవహారంలో రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని గవర్నర్ ఆఫీస్, రాష్ట్ర ప్రభుత్వం, ఇతర ప్రతివాదులను సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా దాసోజు శ్రవణ్‌కుమార్, కుర్రా సత్యనారాయణ పేర్లను ప్రతిపాదిస్తూ రాష్ట్ర మంత్రివర్గం గవర్నర్‌కు సిఫారసు చేయగా... ఆ ఇద్దరి పేర్లను అప్పటి గవర్నర్ తమిళిసై తిరస్కరించారు. దీంతో వారిద్దరూ వేర్వేరుగా హైకోర్టులో సవాల్ చేశారు. ఇదిలా ఉండగానే రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్... గతేడాది జనవరి 13న కోదండరాం, ఆమీర్ అలీఖాన్ పేర్లను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా సిఫారసు చేయడం, గవర్నర్ ఆమోదించడం చకచకా జరిగిపోయాయి. అయితే, హైకోర్టులో కేసు విచారణ దశలో ఉండగా తమ కోటాలో మరో ఇద్దరిని ఎమ్మెల్సీలుగా ఎలా నియమిస్తారని దాసోజు, సత్యనారాయణ మరోసారి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

ఈ పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం... దాసోజు, సత్యనారాయణల నామినేషన్లను తిరసరిస్తూ గవర్నర్ జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్టు గతేడాది మార్చి 17న తీర్పులో స్పష్టం చేసింది. అలాగే, కాంగ్రెస్ సర్కార్ గెజిట్ నోటిఫికేషన్‌నూ రద్దు చేసింది. ఆ తర్వాత ఎమ్మెల్సీ అభ్యర్థులుగా కోదండరాం, అలీఖాన్ల పేర్లను మరోసారి ప్రభుత్వం సిఫారసు చేయగా గవర్నర్ ఆమోదం తెలిపారు. ఈ నేపథ్యంలో గతేడాది ఆగస్టు 4న తమకు న్యాయం చేయాలని కోరుతూ దాసోజు, సత్యనారాయణ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై గురువారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ దాసోజు శ్రవణ్ ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారని తెలంగాణ ప్రభుత్వం తరపున సీనియర్ అడ్వొకేట్ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. అయితే, ఆయన ఇంకా ఎమ్మెల్సీగా ప్రమాణం చేయలేదని శ్రవణ్ తరపు అడ్వకేట్ బదులిచ్చారు. అయినా.. ఇది గవర్నర్ అధికారాలకు సంబంధించిన కేసు అని వాదనలు వినిపించారు. ఇందులో మరో పిటిషనర్ కుర్రా సత్యనారాయణ కూడా ఉన్నారని గుర్తు చేశారు. ఇరుపక్షాల వాదనలను పరిగణనలోకి తీసుకొన్న ధర్మాసనం... గవర్నర్ ఆఫీసు, తెలంగాణ ప్రభుత్వం, ఎమ్మెల్సీలు కోదండరాం, అమీర్ అలీఖాన్‌లు రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. కౌంటర్ దాఖలుకు గడువును పొడిగించేది లేదని స్పష్టం చేసింది. తదుపరి విచారణ ఏప్రిల్ 24న చేపడతామని పేర్కొంది.

---



## దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థకు జాతీయ స్థాయిలో మూడో ర్యాంక్

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తున్న దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థకు జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు లభించింది. కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ విడుదల చేసిన డిస్ట్రిబ్యూషన్ యుటిలిటీస్ ర్యాంకింగ్ (డీయుఆర్) రిపోర్ట్-కన్జ్యూమర్ సర్వీస్ రేటింగ్ ఆఫ్ డిస్కమ్స్ (సీఎస్ఆర్డీ) రిపోర్ట్ 2023-24లో క్యాటగిరీపరంగా మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నది. ఈ క్యాటగిరీలో మొత్తం 41 విద్యుత్ పంపిణి సంస్థలకు ర్యాంకులు కేటాయింపబడ్డాయి. దక్షిణ డిస్కం తన పరిధిలోని వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పాటు, ఇతర డిస్కంలతో పోల్చుకుంటే అతి తక్కువ సమయంలో విద్యుత్ కనెక్షన్ల మంజూరు, అతి కొద్ది పత్రాలతో వివిధ సేవలు పొందేలా నియమ నిబంధలను సరళతరం చేయడం, ఖచ్చితమైన బిల్లింగ్, సరైన మీటరింగ్ కోసం ఐర్ పోర్ట్ ఆధారిత మీటర్లను అమర్చడం, వినియోగదారుల ఫిర్యాదులు వెంటనే పరిష్కరించడం, విద్యుత్ కార్యాలయాలను సందర్శించకుండానే నేరుగా ఆన్‌లైన్‌లో సంస్థ వెబ్‌సైట్ ద్వారా/ మొబైల్ యాప్ ద్వారా దాదాపు 99 శాతం విద్యుత్ సంబంధిత సేవలు పొందేలా ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ, తమ వినియోగదారులకు, అధికారులకు, సిబ్బందికి అభినందలు తెలిపారు. భవిష్యత్ లోనూ సంస్థను మరింత ఉన్నత స్థానాలకు చేరేలా కృషి చేయాలని సూచించారు.

## మంత్రి తుమ్మలతో జర్మనీ ప్రతినిధుల భేటీ



**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

నూతన సాంకేతికత, మార్కెటింగ్, డిజిటల్ తదితరాంశాలపై చర్చించేందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో జర్మనీ ప్రతినిధులు భేటీ అయ్యారు. గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో రేబెక్కా రిడ్డర్, డివిజన్ హెడ్- ఆసియా, బీఎంఈఎల్ నేతృత్వంలో జర్మనీ ప్రతినిధుల బృందం మంత్రిని కలిసి పలు అంశాలపై చర్చించారు. వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి, డైరెక్టర్, మార్కెటింగ్ డైరెక్టర్, ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు. హెచ్‌హెచ్‌ఐ, జర్మనీ సంస్థ సహకారంతో సిరిసిల్ల జిల్లా వేములవాడలో పైలట్ చేపట్టిన పరిశోధనలపై మంత్రికి వివరించారు. ఉత్పత్తి ఖర్చులను తగ్గించడం, సాంకేతికత ద్వారా కూలీ ఖర్చు తగ్గించడం, డిజిటల్ వ్యవసాయం ద్వారా దిగుబడులను పెంచడం, డ్రోన్ల ద్వారా నేల సారాన్ని పరీక్షించడం, ఎప్పటికప్పుడు అంచనా వేసేందుకు వాతావరణ స్టేషన్‌ను నిర్వహిస్తూ, రైతులకు ఎప్పటికప్పుడు వాతావరణ సంబంధిత సమాచారాన్ని చేస్తున్నట్టు వివరించారు. ప్రస్తుతం దేశంలో జర్మన్ సహకారంతో రాజస్థాన్, ఒడిశా, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల్లో వివిధ ప్రాజెక్టులు ప్రగతిలో ఉన్నాయని వారు వివరించారు.

## ఏప్రిల్ రెండోవారంలో ఇంటర్ ఫలితాలు!

- ముగిసిన ప్రధాన సబ్జెక్టుల పరీక్షలు

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్రంలో ఇంటర్ ప్రధాన సబ్జెక్టుల పరీక్షలు గురువారంతో ముగిశాయి. ఈనెల ఐదో తేదీన ఈ పరీక్షలు ప్రారంభమైన విషయం తెలిసిందే. శుక్రవారం నుంచి ఈనెల 25 వరకు బ్రిడ్జికోర్సు, మోడ్రన్ లాంగ్వేజ్ పరీక్షలు జరుగుతాయి. ఈనెల పదో తేదీ నుంచి ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియ రాష్ట్రంలో 19 కేంద్రాల్లో ప్రారంభమైంది. ఈనెల 29 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. వచ్చేనెల రెండోవారంలో ఇంటర్ ఫలితాలను విడుదల చేసేందుకు అధికారులు భావిస్తున్నట్టు తెలిసింది. గురువారం ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్మీడియెట్ ద్వితీయ కెమిస్ట్రీ, కామర్స్ పేపర్-2 పరీక్షను నిర్వహించామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 4,44,697 మంది విద్యార్థులు దరఖాస్తు చేశారని పేర్కొన్నారు. వారిలో 4,31,964 (97.13 శాతం) మంది హాజరయ్యారని తెలిపారు. 12,733 (2.87 శాతం) మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కరీంనగర్‌లో ఒకరు, నిజామాబాద్‌లో ఒకరు, సిద్ధిపేటలో ఒకరు, సూర్యాపేటలో 11 మంది కలిపి మొత్తం 14 మందిపై మాల్‌ప్రాక్టీస్ కేసులను నమోదు చేశామని వివరించారు. ఇంటర్ బోర్డు నుంచి పరిశీలకులు సూర్యాపేట, మెదక్, కరీంనగర్, సంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో పరీక్షలను పరిశీలించారని తెలిపారు. ఈ పరీక్షలు ప్రశాంతంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలో చోటుచేసుకోకుండా జరిగాయని పేర్కొన్నారు.

## టన్నెల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు

- జియోలాజికల్ సర్వే అధికారుల సూచనలతో పనులు



నవ తెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధికారుల సూచనలను పాటిస్తూ ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాద ప్రదేశంలో సహాయక చర్యలను కొనసాగిస్తున్నారు. ఆర్మీ జనరల్ కమాండింగ్ ఆఫీసర్ మేజర్ అజయ్ మిశ్రా, డిజాస్టర్ అండ్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ గురువారం సమీక్ష నిర్వహించారు. జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, ఆర్మీ ఉన్నతాధికారులు, సహాయక బృందాల ఉన్నతాధికారులతో టన్నెల్ లోపల జరుగుతున్న సహాయక చర్యలపై, తీసుకోవాల్సిన భద్రత ప్రమాణాలను విశ్లేషించారు. సహాయక పనులకు ఆటంకంగా ఉన్న ఊట నీటిని అధిక సామర్థ్యం గల పంపుల ద్వారా బయటకు తరలిస్తున్నట్టు తెలిపారు. స్టీలును, మట్టిని పూర్తిస్థాయిలో తొలగించేందుకు చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. పెద్ద పెద్ద బండ రాళ్లను ఎస్కవేటర్ ద్వారా తొలగిస్తూ లోకో ట్రైన్ ద్వారా బయటకు తరలిస్తున్నట్టు తెలిపారు.నీటి ఊటలు, మట్టి ఎక్కువగా ఉండటం వంటి సవాళ్లను అధిగమించేందుకు యంత్రాలు, ప్రత్యేక నిపుణులను రంగంలోకి దించినట్టు వివరించారు. సహాయక చర్యలు ప్రతి రోజూ 5 షిఫ్టులుగా కొనసాగుతున్నాయని, ఉదయం 7 గంటలకు, 11 గంటలకు, మధ్యాహ్నం 3 గంటలకు, రాత్రి 7 గంటలకు, 11 గంటల షిఫ్టుల్లో, ప్రత్యేక సహాయక బృందాలు నిరంతరాయంగా పనిచేయిస్తున్నారని వివరించారు. టన్నెల్ లోపల జరిగే సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు ప్రత్యేక కమ్యూనికేషన్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. 26 రోజులుగా రాత్రి పగలు తేడా లేకుండా 5 షిఫ్టులుగా పనిచేస్తున్నారని తెలిపారు.

## పదో తరగతి విద్యార్థులకు సీఎం శుభాకాంక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా నేటి నుంచి 10వ తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్న సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ఆత్మవిశ్వాసంతో, ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవడానికి లక్ష్యంపైనే గురిపెట్టాలని పేర్కొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమి లేదు :బీఆర్ఎస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం 15 నెలల్లో చేసిందేమి లేదనీ, అదే విధంగా రాబోయే కాలంలో చేసే దానిపై అసలు స్పష్టతే లేదని బీఆర్ఎస్ పార్టీ విప్ కె.పి.వివేకానంద విమర్శించారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అవాస్తవాలతో కూడిన బడ్జెట్‌లో ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కనిపించలేదని తెలిపారు. రాష్ట్రం ఏర్పడ్డాక 11 బడ్జెట్లు ప్రవేశపెట్టారనీ, ప్రస్తుత బడ్జెట్ అంత ఘోరంగా ఏ బడ్జెట్ లేదన్నారు. గత బడ్జెట్ లో కేటాయించి ఖర్చు చేయకుండా అవే నిధులను మళ్లీ ప్రస్తుత బడ్జెట్ లో చూపించారని తప్పుపట్టారు. రాష్ట్ర రాబడిలో 60 శాతం రాబడి తెస్తున్న హైదరాబాద్‌ను పూర్తిగా విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరానికి నాలుగు వైపులా బీఆర్ఎస్ ప్రారంభించిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణంలో ఎలాంటి పురోగతి లేదని చెప్పారు. మెట్రో రైల్-2,3 ఫేస్‌లో గతంలో కేటాయించిన నిధులనే విడుదల చేయలేదని తెలిపారు. ఫోర్త్ సిటీలో స్పోర్ట్స్ సిటీ, స్కిల్ ఇండియా పేరుతో ప్రభుత్వం చేస్తున్న హైరానాకు గ్రేటర్ హైదరాబాద్ వాసులు గందరగోళానికి గురవుతున్నారని తెలిపారు. ఫోర్త్ సిటీ అభివృద్ధి పేరుతో ప్రభుత్వం ఇన్సైడ్ ట్రేడింగ్, భూదందా చేస్తున్నారని ఆరోపించారు. గత బడ్జెట్‌లో నియోజకవర్గానికి 3,000 ఇళ్లు ఇస్తామని చెప్పి రూ.22,500 కోట్లు కేటాయించిన ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా అరచి పెట్టిన దాఖలాలు లేవని తెలిపారు. గ్రేటర్ హైదరాబాదులో దాదాపు 40 శాతం వీధిలైట్లు లేదనీ, వాటి నిర్వహణ కూడా ప్రభుత్వానికి చేతనవడంలేదని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో శాంతి భద్రతలకై నగరంలో 10 లక్షల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. కానీ వాటి నిర్వహణ లేక రోజురోజుకు నగరంలో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని వివరించారు. దీంతో నేరాల సంఖ్య పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తట్టెడు మన్ను కూడా తీయకుండా హైదరాబాద్ నగరంలో 31 ఫ్లైఓవర్‌ల పనులు, 17 అండర్ పాస్‌ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయని ప్రభుత్వం చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. గత బీఆర్ఎస్ సర్కారు 2022-23 సంవత్సరానికిగాను రూ.2,41,275 కోట్ల ఐటీ ఎగమతలను సాధించిందని గుర్తుచేశారు. హైదరాబాద్ నగర అభివృద్ధిపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనీ, హెచ్ఆర్డీసీఎల్, ఎస్ఎన్డీపీ, ఎస్ఆర్డీపీ పనులపై బడ్జెట్లో ప్రస్తావించలేదని చెప్పారు. హైదరాబాదు నగరంపై ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరిస్తామనీ, ప్రభుత్వాన్ని నిలదీస్తామనీ, అప్పటికి ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన, ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

## విద్యుత్ కేటాయింపులు భేష్....

- 1104 యూనియన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

విద్యుత్ శాఖకు ఈ ఏడాది రాష్ట్ర బడ్జెట్ లో రూ.21,221 కోట్లు కేటాయించడంపై 1104 యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.సాయిబాబు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖకు కేటాయింపులు పెంచడం ద్వారా ఈ రంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్టు భావిస్తున్నామని తెలిపారు.

## విద్యుత్ శాఖకు రూ.21,221 కోట్లు

- పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

విద్యుత్ శాఖకు బడ్జెట్‌లో రూ.21,221 కోట్లు కేటాయించటం హర్షణీయమని పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ తెలిపింది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రత్నాకర్‌రావు, సదానందం గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతేడాది కంటే రూ.4,815 కోట్లు అధికంగా కేటాయించారని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి, డిప్యూటీ సీఎం భట్టికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో రోజురోజుకి పెరుగుతున్న డిమాండ్‌కి అనుగుణంగా కొత్త పవర్ ప్లాంట్లు. సోలార్ విండ్, రివర్స్ పంపింగ్ ద్వారా విద్యుత్ ఉత్పత్తిని జెన్‌కో ద్వారానే నిర్మించారని తెలిపారు. ట్రాన్స్‌కో, డిస్కంలలో నెట్‌వర్క్‌ను వేసవికనుగుణంగా చర్యలు ప్రభుత్వం చేపట్టం హర్షణీయమని పేర్కొన్నారు.

## అసభ్యకరమైన డ్యాన్స్ స్టెప్స్‌ను తొలగించాలి

- సంబంధికులకు నేరెళ్ల శారద హెచ్చరిక

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మహిళలను తక్కువ చేసి చూపించడంతోపాటు అసభ్యకరమైన డ్యాన్స్ స్టెప్స్‌ను వేయించిన ఆ చిత్రాన్ని వెంటనే నిలిపివేయాలని మహిళా కమిషన్ చైర్మెన్ నేరెళ్ల శారద సంబంధికులను హెచ్చరించారు. తమ సూచనలను పాటించకపోయినట్టైయితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సినిమా పాటల్లో డ్యాన్స్ స్టెప్స్ అసభ్యంగా, మహిళలను కించపరిచే విధంగా ఉన్నాయంటూ కమిషన్‌కు పలు ఫిర్యాదులు అందాయని తెలిపారు. సమాజంపై తీవ్ర ప్రభావం చూపే శక్తివంతమైన మాధ్యమం కావడంతో, ఇందులో మహిళలను అవమానించేలా ప్రదర్శించడం సరైందికాదని పేర్కొన్నారు. దర్శకులు, నిర్మాతలు, కొరియోగ్రాఫర్లు, సంబంధిత వర్గాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హెచ్చరించారు. సినిమా రంగం సమాజానికి సానుకూల సందేశాలను అందించడం, మహిళల గౌరవాన్ని కాపాడటం వారిని నైతిక బాధ్యత అన్నారు. యువత, పిల్లలపై సినిమాలు చూపించే ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని సినిమా పరిశ్రమ స్వీయ నియంత్రణ పాటించాలని ఆమె గుర్తు చేశారు.

# అక్రమ నిర్మాణాన్ని ఆపాలని ట్యాంకెక్కిన దళితులు



- ఆర్డీవో, ఏసీపీ బుజ్జగింపు.. బెదిరింపు..
- ససేమిరా అనడంతో నిర్మాణ పనుల నిలిపివేత

నవతెలంగాణ-నర్సంపేట

వరంగల్ జిల్లా నర్సంపేటలోని సర్వే నెంబర్-121లోని ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణ పనులను అడ్డుకోవడంలో నిర్లక్ష్యం చేస్తున్న అధికారుల తీరును నిరసిస్తూ గురువారం దళితులు ఆత్మహత్యాయత్నం చేసుకుంటామంటూ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపిన ఘటన ఉత్కంఠ రేకెత్తించింది. పట్టణంలోని మోడల్ హైస్కూల్ ఆవరణలోని భూపోరాట కమిటీ నాయకులు మంద ప్రకాష్, వేల్పుగొండ రాజు, పలువురు మహిళలు ఓహెచ్ఆర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్యాయత్నం చేసుకుంటామని బెదిరించారు. సమాచారం తెలుసుకున్న ఆర్డీవో పి.ఉమారాణి, తహసీల్దార్ రాజేష్, ఏసీపీ కిరణ్‌కుమార్, పలువురు ఎస్ఐలు అక్కడకు చేరుకొని వారిని కిందికి దించే ప్రయత్నం చేశారు. అక్రమ నిర్మాణ పనులను తొలగించే వరకూ ట్యాంకు దిగేదిలేదని, పరిష్కరించకుంటే పెట్రోల్ మీద పోసుకోవాల్సి వస్తుందని భీష్మించుకుకూర్చున్నారు. ఆందోళనకారులకు మద్దతుగా సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి హన్మకొండ శ్రీధర్, సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల రమేష్ అధికారులను నిలదీశారు. ప్రభుత్వ స్థలాన్ని రక్షించాలని కోరితే ఎస్ఐ అరుణ్‌కుమార్ దళిత నాయకులను బెదిరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దీనిపై స్పందించిన ఆర్డీవో చివరకు మున్సిపాలిటీ, రెవెన్యూ అధికారులను పిలిపించారు. వెంటనే నిర్మాణ పనులు నిలిపివేయాలని ఆర్డీవో ఆదేశించారు. ప్రభుత్వ స్థలం వద్దకు చేరుకున్న అధికారులు జేసీబీతో పిల్లర్ నిర్మాణ పనులను ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారు. నిర్మాణం చేస్తున్న వ్యక్తులు, వారికి మద్దతుగా కాంగ్రెస్ మండలాధ్యక్షులు భానోతు లక్ష్మణ్ నాయక్ అడ్డుకున్నారు. అధికారులతో వాగ్వివాదానికి దిగారు. నిర్మాణం చేయడానికి ఎలాంటి అనుమతులూ లేవని, ప్రభుత్వ భూమిలో నిర్మాణం చేయడం చట్ట ప్రకారం నేరమని తహసీల్దార్ రాజేష్, టౌన్ ప్లానింగ్ అధికారి వీరస్వామి చెప్పినా వారు వినిపించుకోలేదు. చివరకు కూల్చేయకతప్పదని హెచ్చరించడంతో నిర్మాణం కూల్చకండి తామే తీసేసుకుంటామని చెప్పారు. నిర్మాణ పనులు చేపడితే కూల్చక తప్పదని తహసీల్దార్ హెచ్చరించారు. అనంతరం ట్యాంకు వద్దకు ఎస్ఐ రవికుమార్ చేరుకొని పనులను నిలిపివేశామని, కిందికి దిగమని చెప్పడంతో ఎట్టకేలకు దళితులను కిందకు దింపారు.

**పనుల సామగ్రిని పూర్తిగా తొలగించాలి : భూపోరాట కమిటీ**

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాన్ని పూర్తిగా తొలగించాలని భూపోరాట కమిటీ నాయకులు మంద ప్రకాష్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని అనేక దఫాలుగా ఫిర్యాదులు చేసినా మున్సిపల్, రెవిన్యూ అధికారులు పట్టించుకోలేదన్నారు. కేవలం పిల్లర్‌లను పక్కకు నెట్టి చేతులు దులుపుకుంటే చాలదని పూర్తి స్థాయిలో కూల్చాలని డిమాండ్ చేశారు.

# 5,6,7 తరగతుల్లో పేద విద్యార్థులకు ఉచిత విద్య

- ఏప్రిల్ 18 వరకు దరఖాస్తుల ఆహ్వానం
- వచ్చేనెల 24న రాతపరీక్ష : పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్ కార్యదర్శి దయాకర్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఐదు, ఆరు, ఏడు తరగతుల్లో పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించాలని నిర్ణయించింది. ఇందు కోసం అర్హులైన పేద విద్యార్థుల నుంచి వచ్చేనెల 18 వరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్ కార్యదర్శి డి దయాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేనెల 24న రాతపరీక్షను నిర్వహిస్తామనీ, అందులో అర్హత సాధించిన విద్యార్థులకు ప్రవేశాలను కల్పిస్తామని పేర్కొన్నారు. 14 ఏండ్ల నుంచి పేద, బలహీనవర్గాల విద్యార్థులకు ఉచితంగా ఇంగ్లీష్ మాధ్యమంలో పాఠశాలను స్థాపించి మెరుగైన విద్యనందిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం 800 మంది విద్యార్థులు ఐదో తరగతి నుంచి ఇంజినీరింగ్, పీజీ వరకు వివిధ కోర్సుల్లో చదువుతున్నారని పేర్కొన్నారు. నిపుణులైన ఉత్తమ ఉపాధ్యాయులు బోధిస్తారని వివరించారు. హాస్టల్‌లో విద్యార్థులు ఎవరి పనులు వారే చేసుకుంటారని తెలిపారు. హాస్టల్ వసతి, భోజనం కోసం వంటశాలలను విద్యార్థులే నిర్వహిస్తారని పేర్కొన్నారు. శ్రమ పట్ల గౌరవం, పని సంస్కృతిని విద్యతోపాటు నేర్చుకుంటారని వివరించారు. విద్యార్థులకు శారీరక, మానసిక అభివృద్ధికి తోడ్పడేలా గుడ్లు, మాంసాహారంతోపాటు తగిన పోషకాహారాన్ని అందిస్తామని తెలిపారు. ప్రగతినగర్ పీపుల్స్ హాస్పిటల్ సహకారంతో వైద్యసేవలను కూడా అందిస్తామని పేర్కొన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహనను పెంపొందించే శాస్త్ర, సాంకేతిక, అభ్యుదయ, సాంస్కృతిక అంశాలకు చెందిన పుస్తకాలతో గ్రంథాలయం అందుబాటులో ఉందని వివరించారు. విద్యార్థుల్లో విషయ శక్తి, జ్ఞాన సముపార్జన కోసం చారిత్రక, పర్యాటక ప్రదేశాల సందర్శన ఉంటుందని తెలిపారు. కుల, మత, లింగ, ప్రాంతీయ భేదం లేకుండా అందరూ సమానులూ అన్న భావం విద్యార్థుల్లో నెలకొల్పడమే పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్ లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని వివిధ మండలాల్లో చదువుపై బాగా ఆసక్తి ఉన్న ప్రభుత్వ, ప్రైమరీ, హైస్కూల్ నుంచి ఒకరు చొప్పున దాదాపు వెయ్యి మంది వరకు ఎంపిక ఉంటుందని స్పష్టం చేశారు. విద్యార్థుల ఎంపికలో తల్లిదండ్రుల్లేని పేద, అనాథ పిల్లలు, తల్లి లేదా తండ్రి ఒకరున్న నిరుపేద పిల్లలు, నిరుపేద బలహీనవర్గాల పిల్లలకు ప్రాధన్యత ఇస్తామని తెలిపారు. రాష్ట్రంలో నియోజకవర్గాల వారీ ఎంపిక చేసిన పిల్లలు పేద కుటుంబాల నుంచి వచ్చిన వారు కాదని ఆ తర్వాత నిర్ధారణ అయితే వారిని తిరిగి పంపించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఉమ్మడి పది జిల్లా కేంద్రాల్లో పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. పరీక్షలో అర్హత మార్కులను సాధించిన వారికి ప్రవేశాలు అర్హత ఉంటుందని స్పష్టం చేశారు. ఒక కుటుంబం నుంచి ఒకరికే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. తెలుగు, ఇంగ్లీష్, మ్యాథమెటిక్స్ సబ్జెక్టులపై పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఆధార్, బోనఫైడ్ జిరాక్స్‌ను తేవాలని సూచించారు. ఇతర వివరాల కోసం సి సూర్యప్రకాశ్-9348581045, నరేశ్-9885446299 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

## ఓయూలో ఆంక్షలు ఎత్తేయాలి

- మహేష్‌కుమార్‌గౌడ్‌కు ఓయూ జేఏసీ నేతల వినతి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ధర్నాలు, నిరసనలు, ప్రదర్శనలు చేయకుండా విధించిన ఆంక్షలను ఎత్తేయాలని కోరుతూ టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్‌కు ఓయూ జేఏసీ నేతలు కోరారు. ఓయూ రిజిస్ట్రార్ విడుదల చేసిన ఉత్తర్వులను ఉపసంహరించుకునేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ చైర్మెన్ మానవతారాయ్, ఓయూ నేతలు కొప్పుల ప్రతాపరెడ్డి, అనిల్ కామ్డే, హేమంత్ చౌదరి, మల్యాల కార్తిక్‌రెడ్డి, వంగూరి శివ, దోటి శ్రీనివాస్, విజయ్ తదిరులు ఉన్నారు.

**టెన్త్ విద్యార్థులకు ఆల్ ది బెస్ట్**

పదవతరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థులకు టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ 'ఆల్ ది బెస్ట్' చెప్పారు. విద్యార్థులందరూ సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఎలాంటి ఒత్తిడి, ఆందోళనకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని కోరారు. తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చే దిశగా ముందుకెళ్లాలని ఆయన సూచించారు.

**డిలిమిటేషన్ సమావేశానికి మహేష్‌కుమార్**

ఈనెల 22న చెన్నైలో జరగనున్న డిలిమిటేషన్ దక్షిణాది రాష్ట్రాల నాయకుల సమావేశంలో పాల్గొనేందుకు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ వెళ్లనున్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో జరగనున్న డిలిమిటేషన్ అఖిలపక్ష సమావేశానికి ఆయన హాజరుకానున్నారు.

# కేసీఆర్ బయటకు రావాలంటూ కాంగ్రెస్ పోరుబాట

- గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో పాదయాత్ర
- సిద్దిపేట కలెక్టరేట్ నుంచి గవర్నర్ కార్యాలయం వరకు నడక



నవతెలంగాణ-గజ్వేల్

అసెంబ్లీ సమావేశాల్లో మాజీ సీఎం, గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్.. పాల్గొనాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో పోరుబాట చేపట్టారు. గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఓట్లు వేసి మూడుసార్లు గెలిపించామని, ఇందులో రెండుసార్లు ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ ఉండటంతో తాము పట్టించుకోలేదని అన్నారు. ప్రస్తుతం మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచి 15 నెలలు గడుస్తున్నా అసెంబ్లీకి వెళ్లకపోవడం, ప్రజలు తమ సమస్యలు చెప్పుకోవడానికి ఎమ్మెల్యే అందుబాటులో ఉండకపోవడంతో గవర్నర్‌కు తమ బాధను చెప్పుకునేందుకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం పాదయాత్ర చేపట్టారు. సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ నుంచి గవర్నర్ కార్యాలయం వరకు రాజీవ్ రహదారి మీదుగా సోమవారం గవర్నర్ కార్యాలయానికి చేరుకొని వినతిపత్రం అందించనున్నారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్.. ఎమ్మెల్యేగా మూడుసార్లు గెలవగా, 2014, 2018లో సీఎంగా ఉన్న సమయంలో రెండు మూడుసార్లు మాత్రమే పర్యటించినట్టు చెప్పారు. శంకుస్థాపనలకు, ప్రారంభోత్సవాలకు మాత్రమే వచ్చిన కేసీఆర్.. మూడోసారి గెలిచిన తర్వాత మొత్తానికే ముఖం చాటేసినట్టు ఆరోపించారు. నియోజకవర్గంలో నెలకొన్న పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు వ్యవసాయ క్షేత్రం నుంచి బయటకు రావాలని అన్నారు. వ్యవసాయ క్షేత్రం నుంచి బయటకు వస్తారా, శాసనసభకు రాజీనామా చేస్తారో కేసీఆర్ తేల్చువాలని డిమాండ్ చేస్తూ గవర్నర్ వద్దకు పాదయాత్ర చేపట్టినట్టు తెలిపారు. నియోజకవర్గంలోని తొమ్మిది మండలాలకాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు యాత్రలో పాల్గొన్నారు.

# నేటినుంచి టెన్త్ పరీక్షలు

- హాజరుకానున్న 5,09,403 మంది విద్యార్థులు
- 2,650 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- విద్యార్థులకు ఐదు నిమిషాల వరకు గ్రేస్ పీరియెడ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పదోతరగతి వార్షిక పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ నాలుగో తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. ఈ పరీక్షల నిర్వహణ కోసం పాఠశాల విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. పదోతరగతి పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయి. ఫస్ట్ లాంగ్వేజ్ కాంపొజిట్ కోర్సు సబ్జెక్టు పరీక్ష ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు నిర్వహిస్తారు. సైన్స్ సబ్జెక్టును రెండు విభాగాలుగా పార్ట్-1 ఫిజికల్ సైన్స్, పార్ట్-2 బయలాజికల్ సైన్స్‌గా వేర్వేరు రోజుల్లో ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు జరుగుతుంది. పదో తరగతి పరీక్షలకు 11,547 పాఠశాలల నుంచి 5,09,403 మంది విద్యార్థులు హాజరవుతారు. వారిలో అబ్బాయిలు 2,58,895 మంది, అమ్మాయిలు 2,50,508 మంది ఉన్నారు. ఈ పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,650 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 2,650 మంది చీఫ్ సూపరింటెండెంట్ (సీఎస్), 2,650 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ (డీవో)లతోపాటు 28,100 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ఈ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడం కోసం ప్రభుత్వ పరీక్షల విభాగం కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేసింది. విద్యార్థులకు ఏమైనా సందేహాలు, సమస్యలుంటే 040-23230942 నెంబర్‌ను సంప్రదించాల్సి ఉంటుంది. పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. పరీక్షలు జరిగే సమయంలో ఆ చుట్టుపక్కల జిరాక్స్ సెంటర్లు మూసేయాలి. పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులకు ఉదయం 9.35 గంటల వరకు అనుమతి ఉంటుంది. అంటే విద్యార్థులకు ఐదు నిమిషాలు గ్రేస్ పీరియెడ్ ఉంటుంది. ట్రాఫిక్, ఇతర సమస్యలను దృష్టిలో ఉంచుకుని ముందుగానే పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు చేరుకోవాలని అధికారులు సూచించారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడం కోసం పాఠశాల విద్యాశాఖ సంచాలకులు సీనియర్ అధికారులను జిల్లా స్థాయిలో పరిశీలకులుగా నియమించారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మాల్ ప్రాక్టీస్ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు రాష్ట్రవ్యాప్తంగా 144 మంది ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. సమస్యాత్మక పరీక్షా కేంద్రాల వద్ద సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించారు. చీఫ్ సూపరింటెండెంట్ గదిలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులు, సిబ్బంది మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకురావడాన్ని నిషేధించారు. ఈ ఏడాది నుంచి పదో తరగతి ప్రశ్నాపత్రాలపై క్యూఆర్ కోడ్ ఉంటుంది. విద్యార్థులకు 24 పేజీల బుక్‌లెట్‌ను సమాధానాలు రాసేందుకు ఇస్తారు.

## ఫ్యూచర్ సిటీలో తైవాన్ పారిశ్రామిక పార్క్

- రూ. 2 వేల కోట్లతో ఏర్పాటు : ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తైవాన్‌కు చెందిన అగ్రశ్రేణి పారిశ్రామికవేత్తల సమూహం హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో రూ.2 వేల కోట్లతో పారిశ్రామిక పార్క్ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. తైవాన్‌లో పర్యటిస్తున్న రాష్ట్ర ప్రతినిధి బృందంతో గురువారం ఆ దేశానికి చెందిన 11 కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాయని ఒక ప్రకటనలో మంత్రి తెలిపారు. ఐటీఐపీకి రాష్ట్ర ప్రభుత్వం కొంగరకలాన్‌లోని ఎలక్ట్రానిక్స్ పార్కులో ఇప్పటికే 15 ఎకరాల భూమిని అందజేసిందనీ, పూర్తి స్థాయిలో పరిశ్రమల ఏర్పాటుకు మరో 250 ఎకరాలను కేటాయించాలని తైవాన్ కంపెనీలు అభ్యర్థించాయని వివరించారు. 'భూ కేటాయింపులు పూర్తయిన వెంటనే పారిశ్రామిక వాడ అభివృద్ధి పనులు మొదలు పెడతామని తైవాన్ ప్రతినిధులు స్పష్టం చేశారు. రానున్న మూడేండ్లలో మొదటి దశలో రూ.2,000 కోట్ల పెట్టుబడితో పరిశ్రమల నిర్మాణం పూర్తయి, ఉత్పాదన ప్రారంభమవుతుంది. దీనివల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా 10 వేల మందికి ఉద్యోగాలు దొరుకుతాయి. ఈ టెక్నాలజీ, ఇండస్ట్రియల్ పార్కులో ఎలక్ట్రానిక్స్, సౌర పలకల పరిశ్రమల లాంటి ఉన్నత స్థాయి సాంకేతిక ఉత్పత్తులు తయారవుతాయి. దేశీయ అవసరాలతో పాటు భారీ పరిమాణంలో ఎగుమతులు జరుగుతాయి. ఇక్కడ ఏర్పాటయ్యే పరిశ్రమలకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ద్వారా నిపుణులను అందుబాటులో ఉంచుతాం' అని మంత్రి తెలిపారు.

## ఈనెల 24న పార్లమెంటు ముట్టడి

- పోస్టర్ ఆవిష్కరించిన ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు వెంకటస్వామి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన యూజీసీ బిల్లును వెనక్కి తీసుకోవాలని కోరుతూ ఈనెల 24న పార్లమెంట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు వెంకటస్వామి చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో దానికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం యూజీసీని తన ఆధీనంలోకి తీసుకోవాలనే ప్రయత్నాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రం నుంచి 400 మంది విద్యార్థులు బయలుదేరుతున్నారు.

**ప్రజాహిత బడ్జెట్ :టీపీసీసీ అధికార ప్రతినిధి రవళిరెడ్డి**

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రజాహితమైందనీ, ప్రజాసంక్షేమాన్ని కోరుతున్నదని టీపీసీసీ అధికార ప్రతినిధి రవళిరెడ్డి చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో అధికార ప్రతినిధి శ్రీరంగం సత్యంతో కలిసి ఆమె విలేకర్లతో మాట్లాడారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా బడ్జెట్ రూపకల్పన చేసినట్టు తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ఇప్పటికే 150 కోట్ల మంది మహిళలు ప్రయాణించారని గుర్తు చేశారు. మహిళా సంఘాలకు వడ్డీ మాఫీ కోసం బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. విద్యారంగానికి బడ్జెట్ పెద్దపీట వేసిందని చెప్పారు. యువ వికాసం కాంగ్రెస్ కార్యకర్తల కోసం పెట్టిన పథకం కాదనీ, అర్హతలను బట్టి రాజీవ్ యువ వికాసాన్ని అమలు చేస్తామని ఆమె తెలిపారు.

## నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్

- 17,162 మెగావాట్లకు చేరిన సరఫరా : ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలో విద్యుత్ సరఫరా 17,162 మెగావాట్ల గరిష్ట డిమాండ్‌కు చేరినా కూడా నిరంతరాయంగా సరఫరా చేస్తున్నామని ఉపముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక విద్యుత్ శాఖ మాత్యులు భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఎక్కడా చిన్న ఇబ్బంది లేకుండా ప్రజా ప్రభుత్వం నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నదని గుర్తు చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 17,162 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్‌కు చేరడంతో రాష్ట్ర చరిత్రలో కొత్త రికార్డు నెలకొందని అభిప్రాయపడ్డారు. 2023-24లో (2024 మార్చి 8న) గరిష్టంగా 15,623 మెగావాట్ల డిమాండ్ మాత్రమే నమోదు కాగా, 2025 మార్చి 20న సాయంత్రం 4:39 గంటలకు 17,162 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్‌కు చేరిందన్నారు. 2023 డిసెంబర్ నుంచి ప్రజాప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు, చర్యల ఫలితంగా వేసవి కాలంలో మరింత పెరిగే విద్యుత్ డిమాండ్‌ను తీర్చేందుకు ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు రూపొందించామన్నారు. విద్యుత్ ఉత్పత్తి పెంచడం, ప్రసార, పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడం వంటి చర్యలు చేపట్టిందన్నారు. పారిశ్రామిక, వాణిజ్య, ఐటీ కార్యాలయాల కార్యకలాపాలు పెరగడంతో గత కొన్ని సంవత్సరాలతో పోలిస్తే ఈ వేసవిలో డిమాండ్ భారీగా పెరిగిందన్నారు. అయినా, ప్రభుత్వం అన్ని తరగతుల వినియోగదారులతోపాటు వ్యవసాయానికి కూడా నిరంతరంగా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామన్నారు. ఉద్యోగుల నిరంతర సహకారానికి అభినందనలు చెప్పారు. భవిష్యత్తులో కూడా ఇది కొనసాగిస్తూ వినియోగదారులకు నిరంతర, విశ్వసనీయ విద్యుత్ సరఫరా అందించడానికి మరింత అంకితభావంతో పని చేయాలని పిలుపునిచ్చారు.

## అనుమతి లేకుండా మెడికల్ షాప్

- డీసీఏ దాడి...మందుల స్వాధీనం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జగిత్యాల పట్టణంలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న మెడికల్ షాపులో డ్రగ్ కంట్రోల్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అరవింద్‌నగర్లో జె.రవి కుమార్ డ్రగ్ లైసెన్స్ లేకుండా నిల్వ ఉంచిన రూ.43 వేల విలువైన 30 రకాల మందులను స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా సంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో వివిధ రోగాలకు చికిత్సకంటూ తప్పుదోవ పట్టిస్తున్న మందులను స్వాధీనం చేసుకున్నారు. రుతుస్రావ రుగ్మతల చికిత్సకంటూ అమ్ముతున్న ఆయుర్వేదిక్ మెడిసిన్ మిస్త్రెల్ పౌడర్‌ను సంగారెడ్డిలో గుర్తించారు. దీనిని ఉత్తరాఖండ్ లోని ఎ అండ్ ఎ ఆయుర్వేదిక్ తయారు చేస్తున్నది. అదే విధంగా అదే విధంగా లైంగిక సమస్యలకు చికిత్సకంటూ అమ్ముతున్న ఆయుర్వేదిక్ మెడిసిన్ టెస్టోరెక్స్ ఫోర్టె ను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉప్పల్‌లో గుర్తించారు. దీనిని ముంబయికి చెందిన ధారా ఫార్మాస్యూటికల్స్ తయారు చేస్తున్నది. వీటిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## త్వరలో అన్ని ఆస్పత్రుల్లో సరిపడా సిబ్బంది

- మంత్రి దామోదర రాజనర్సింహ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అన్ని ఆస్పత్రిల్లో సరిపడా డాక్టర్లు, నర్సింగ్ సిబ్బందిని త్వరలో నియామకాలు చేబడతామని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యవిధాన పరిషత్‌ను డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్‌గా మార్చనున్నట్టు తెలిపారు. ప్రభుత్వాస్పత్రుల్లో ఆధునాతన సౌకర్యాల కల్పనకు సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్తున్నట్టు తెలిపారు. ఆస్పత్రుల్లో సరిపడా హెచ్ఆర్, పరికరాలు, సదుపాయాలు, ఔషధాలు, పారిశుధ్యంపై శ్రద్ధ పెట్టాలని అధికారులను ఆదేశించారు. అన్ని రకాల రోగ నిర్ధారణ సేవలు పేదలకు అందుబాటులో ఉండేలా సమగ్ర ప్రణాళికను రూపొందిస్తున్నట్టు చెప్పారు. టూల్స్ అండ్ ప్లాంట్స్ నిర్వహణ కోసం అన్ని హాస్పిటళ్ల సూపరింటెండెంట్లకు నిధుల కేటాయించాలని అధికారులను ఆదేశించారు. గత సంవత్సర కాలంలో ప్రభుత్వ ఆసుపత్రులలో ఐపీ, ఓపీ, ఇతర సర్జరీల సంఖ్య పెరిగిందని మంత్రి తెలిపారు. రిఫరల్ సిస్టమ్ ద్వారానే టీచింగ్ హాస్పిటళ్లకు పేషెంట్లను అనుమతించడం ద్వారా గాంధీ, ఉస్మానియా, నిమ్స్ వంటి హాస్పిటళ్లపై ఒత్తిడి తగ్గిస్తామని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని వేళల్లో డాక్టర్లు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో వైద్యారోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టీనా జడ్ చొంగ్తూ, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆర్వీ కర్ణన్, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ హేమంత్, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీందర్ నాయక్, టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్‌లు పాల్గొన్నారు.